

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**దాయాదులైన కౌరవలు పాండవులు రాజ్యాధికారం కోసం కురుక్షేత్రంలో యుద్ధానికి సన్నద్ధమయ్యారు. ఇరుపక్షాల వీరులు యుద్ధానికి శంఖాలు పూరించారు. అర్జునుడి కోరిక ప్రకారం అతని రధసారధి అయిన శ్రీకృష్ణుడు రధాన్ని ఇరుపక్షాల మధ్యలో నిలిపాడు.**

ఇరుపక్షాలలో ఉన్న బంధువులను, గురువులను, స్నేహితులను చూసి అర్జునుడి హృదయం వికలమైంది. రాజ్యం కోసం బంధు మిత్రులను చంపుకోవడం సమంజసం కాదనిపించింది. నాకు విజయమూ వద్దు, రాజ్య సుఖమూ వద్దు అని ధనుర్బాణాలను వదిలి రధం వెనుకభాగంలో చతికిలబడ్డాడు.

అటువంటి పరిస్థితిలో కర్తవ్య విముఖుడైన అర్జునుడికి జ్ఞానం బోధించి, కర్తవ్యంవైపు నడిపించడం అనేది భగవద్గీత యొక్క ప్రధాన లక్ష్యం. అయితే అర్జునుడు ఒక పట్టాన యుద్ధం చెయ్యడానికి అంగీకరించక అనేక ప్రశ్నలు అడిగాడు. శిష్యునిపై వాత్సల్యంతో శ్రీకృష్ణుడు అతనికి నిగూఢమైన జ్ఞానాన్ని బోధించాడు. అలా అర్జునునికి శ్రీకృష్ణునికి మధ్య జరిగిన సంవాదమే భగవద్గీత. భగవద్గీత మహాభారతంలో భీష్మపర్వములో 25వ అధ్యాయము నుండి 42వ అధ్యాయం వరకు ఉంది.


మహాభారతయుద్ధంలో పదవరోజున భీష్ముడు కూలిపోయాడు. సంజయుడు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లి ఆ విషయం చెప్పాడు. ధృతరాష్ట్రుడు చాలా బాధపడి యుద్ధం మొదలైనప్పటి నుండి అప్పటివరకు జరిగిన వృత్తాంతమంతా వివరించమని అడిగాడు. కురుక్షేత్రంలో ఇరుపక్షాలు యుద్ధానికి మోహరించడం దగ్గరనుండి వివరించిన సంజయుడు కర్తవ్య విముఖుడైన అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీత బోధించడం కూడా వివరించాడు.

## భగవద్గీత కర్తవ్యనిర్వహణ

ఒక తల్లి ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకును తీసుకొని దేవాలయ ఆవరణలో జరుగుతున్న గీతా ప్రవచనాలు వినడానికి వెళ్ళింది. ప్రవచనం ముగిసిన తర్వాత ప్రసంగించిన స్వామీజీ వద్దకు వెళ్లి "స్వామీ! నా కొడుకు చేత కూడా భగవద్గీత చదించాలని కోరికగా వుంది. కాని భగవద్గీత చదివిన తర్వాత లోకం మీద విరక్తి పెంచుకొని, సన్యాసిగా మారిపోతాడేమోనని భయంగా వుంది. అలా మారిపోయే అవకాశం ఉందా?" అని అడిగింది.

స్వామీజీ చిన్నగా నవ్వి "భగవద్గీత చదివిన వాళ్ళందరికీ ప్రపంచం పట్ల, సంసారం పట్ల విరక్తి, వైరాగ్యాలు కలిగేట్లయితే ఈప్రపంచం ఎంతో బాగుండేది. అర్జునుడు తన కర్తవ్యమైన యుద్ధం చెయ్యడం నుండి వెనుకంజ వేసినప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడుకి గీతను బోధించాడు. అవునా?" అని అడిగాడు

"అవును స్వామి"




"గీతను స్వయంగా భగవంతుడి నుండి వినిన అర్జునుడు వైరాగ్యాన్ని పొంది సాధువుగా మారాడా? లేక తన కర్తవ్యాన్ని నిర్వర్తించి యుద్ధం చేసాడా?"

"యుద్ధమే చేసాడు స్వామి"

"కురుక్షేత్ర యుద్ధంలో విజయం తర్వాత అర్జునుడు రాజ్యపాలనలో ధర్మరాజుకు చేదోడు వాదోడుగా ఉంటూ సంసారజీవితం గడిపాడా? లేక సాధువుగా మారాడా?"

"సాధువుగా మారలేదు స్వామి"

"భగవద్గీత మనం మన కర్తవ్యాలను చక్కగా నిర్వర్తించేలా చేస్తుంది. ఎవ్వరినీ సాధువులుగా మార్చదు. కాబట్టి నీ కుమారుడితో భగవద్గీత చదివించు" స్వామీజీ చెప్పాడు.

✦ ✦ ✦

భగవద్గీతలో ఎన్నో గొప్ప వ్యక్తిత్వవికాస సూత్రాలు, విజయ సూత్రాలు వున్నాయి. అందుకే బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో, మోటివేషనల్ స్పీచ్‌లలో, మోరల్ వాల్యూస్ చర్చల్లో భగవద్గీత ప్రస్తావన తప్పకుండా వస్తుంటుంది.

కర్తవ్య నిర్వహణలో అనేకసార్లు నిరాశ, నిస్పృహలు, సందేహాలు మనల్ని చుట్టుముడతాయి. ఏమి నిర్ణయం తీసుకోవాలో, ఏమి చెయ్యాలో తోచదు. అటువంటి పరిస్థితుల్లో భగవద్గీత ఉత్తమమైన మార్గాన్ని చూపిస్తుంది. ఈ విషయం గురించి మన జాతిపిత గాంధీ గారు చెప్పిన మాటలు ఒకసారి గుర్తుచేసు కుందాం.

"నిరాశ, సందేహములు నన్ను చుట్టుముట్టినపుడు, ఆశాకిరణములు గోచరించనప్పుడు నేను భగవద్గీతను తెరవగానే నన్ను ఓదార్చే శ్లోకము ఒకటి కనిపిస్తుంది. ఆ దుఃఖంలో కూడా నాలో చిరునవ్వులు ఉదయిస్తాయి. భగవద్గీతను మననం చేసేవారు ప్రతిదినమూ దానినుండి క్రొత్త అర్థాలు గ్రహించి ఆనందిస్తారు" – మహాత్మా గాంధీ

అటువంటి భగవద్గీత నుండి నేటి యువతకు కర్తవ్యనిర్వహణలో ఉపయోగపడే విజయ సూత్రాలను పరిశీలిద్దాము. ✦



-మొండెపు ప్రసాద్

2

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## అర్జున విషాదయోగం

### (1) పోటీదారుల శక్తిసామర్థ్యాలు తెలుసుకొని పోటీకి దిగాలి

శ్లోకం : యావదేతాన్నిరీక్షేహం యోద్ధుకామానవస్థితాన్ ।
కైర్మయా సహ యోద్ధవ్యమస్మిన్ రణసముద్యమే ॥1-22॥

**భావం:** కృష్ణా! నేను ఎవరితో యుద్ధం చెయ్యాలో ఆ యోధులను ఎక్కడినుండి చక్కగా చూడగలనో అక్కడ రధమును ఆపు.

**వివరణ:** దాయాదులైన కౌరవులు పాండవులు రాజ్యాధికారం కోసం యుద్ధానికి సన్నద్ధమయ్యారు. ఇరుపక్షాల వీరులు యుద్ధానికి శంఖాలు పూరించారు. యుద్ధం ప్రారంభించడానికి ముందు అర్జునుడు తాను ఎవరితో యుద్ధం చెయ్యాలో వారినందరినీ ఒకసారి పరిశీలనగా చూడాలనుకున్నాడు. తన రథసారథి అయిన కృష్ణుడితో కౌరవపక్షంలోని యోధులను చక్కగా చూడగలిగే చోట రథాన్ని నిలపమని చెప్పాడు.

పోటీకి దిగడానికి ముందు పోటీదారుల శక్తిసామర్థ్యాలు తెలుసుకోవడం వలన వారిని జయించడానికి సరైన వ్యూహాన్ని తయారు చేసుకోగలుగుతాము. క్రికెట్లో మ్యాచ్‌కు ముందు ప్రత్యర్థి టీము అంతకుముందు ఆడిన మ్యాచ్‌ల వీడియోలు చూసి ప్రత్యర్థి టీములోని బౌలర్ల మరియు బ్యాట్స్‌మెన్ల శక్తిసామర్థ్యాలను తెలుసుకొని తగిన వ్యూహాలు పన్నుతారు. మిగిలిన



క్రీడలలో కూడా ప్రత్యర్థులు ఆడిన మ్యాచ్‌ల వీడియోలు చూసి ప్రత్యర్థి టీములోని ఆటగాళ్ళ శక్తిసామర్థ్యాలను తెలుసుకొని తగిన వ్యూహాలను రచిస్తారు.

క్రికెట్లో బౌలర్ బంతి వేయకముందు బ్యాట్స్‌మేన్ గ్రౌండులో ఫీల్డర్స్ ఎక్కడెక్కడ ఉన్నారో బాగా చూస్తాడు. అందువలన ఫీల్డరుకి దొరకకుండా బంతిని ఎటువైపు కొట్టాలో అవగాహన వస్తుంది. అలాగే ఏదైనా పరీక్షకు ప్రిపేరయ్యేముందు పాత సంవత్సరాల పరీక్ష పత్రాలను పరిశీలించి రాయబోయే పరీక్ష ఎలా ఉండబోతోందో తెలుసుకొని తగినవిధంగా ప్రిపేరయితే పరీక్షలో విజయం సాధించవచ్చు.

ఆవిధంగా పోటీదారుల శక్తిసామర్థ్యాలను తెలుసుకొని, తదనుగుణంగా వ్యూహాన్ని రచించి పోటీకి దిగడం విజయం సాధించడానికి చాలా అవసరమని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

### (2) ఎదుటివారు చెప్పేది పూర్తిగా విని జవాబివ్వాలి:

భగవద్గీత అర్జునవిషాదయోగముతో ప్రారంభం అవుతుంది. అర్జునవిషాదయోగములో 28వ శ్లోకం నుండి 47వ శ్లోకం వరకు అర్జునుడు తాను యుద్ధం చేయకూడదనుకోడానికి కారణాలు చెప్పాడు. యుద్ధానికి సిద్ధపడిన స్వజనులను చూసి నా శరీరము వణుకుతోంది, గాండీవము చేతినుండి జారిపోతోంది, స్వజనులను చంపడం మంచిదికాదు, నాకు రాజ్యం గాని రాజభోగం గాని వద్దు, కౌరవులను చంపడం వలన మనకు పాపం



కలుగుతుంది, యుద్ధం వలన వంశనాశనం జరుగుతుంది వంటి ఎన్నో కారణాలను చెప్పాడు.

అర్జునుడు ఒకటి రెండు కారణాలు చెప్పగానే కృష్ణుడు మధ్యలోనే కలగజేసుకుని యుద్ధభూమిలోకి వచ్చాక, యుద్ధశంఖాలు పూరించాక ఇప్పుడు యుద్ధం చెయ్యనంటే ఎలా? అని మందలించలేదు. అర్జునుడు చెప్పాలనుకున్నది పూర్తిగా చెప్పనిచ్చాడు. ఆ తర్వాత సమగ్రమైన జవాబుగా భగవద్గీత చెప్పాడు. ఫలితంగా అర్జునుడు తన కర్తవ్యాన్ని తెలుసుకుని యుద్ధం చేసి దుష్టులను శిక్షించాడు, ధర్మాన్ని గెలిపించాడు. కాబట్టి ఎదుటివారు చెప్పేది పూర్తిగా విని సమాధానం చెప్పాలి. ఈ విషయం అర్థం చేసుకోడానికి కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం.

**వివరణ:** ఒక క్విజ్ పోటీలో క్విజ్ మాస్టర్ "మన దేశపు తొలి ప్రధాని..." అని అడుగుతున్న ప్రశ్నని పూర్తిగా వినకుండానే క్విజ్‌లో పాల్గొన్న ఒక యువకుడు "జవహర్ లాల్ నెహ్రూ" అని సమాధానం చెప్పేసాడు. కాని "పుట్టినరోజుని ఏరోజుగా జరుపు కుంటాము?" అని క్విజ్ మాస్టర్ ప్రశ్న అడగటం పూర్తి




చేసాడు.

ఇందాక సమాధానం చెప్పిన విద్యార్థి నాలుక కరచుకుని "బాలల దినోత్సవం" అని సరైన సమాధానం చెప్పాడు. కాని ముందు చెప్పిన జవాబుని పరిగణలోకి తీసుకున్న క్విజ్ మాస్టర్ అతనికి మార్కులు ఇవ్వలేదు. ఫలితంగా ఆ విద్యార్థి క్విజ్ పోటీలో విజయం సాధించలేకపోయాడు.

✦ ✦ ✦

ప్రశ్నాపత్రంలో "మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసిన కారణాలు పునరావృతం కాకూడదని ప్రపంచశాంతిని నెలకొల్పాలని ఏర్పాటుచేసిన లీగ్ ఆఫ్ నేషన్స్ ముఖ్య ఉద్దేశ్యాలను వివరించండి?" అనే ప్రశ్న ఉంది.

పరీక్ష రాస్తున్న విద్యార్థి "మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసిన కారణాలు ..." వరకు మాత్రమే చదివి మొదటి ప్రపంచయుద్ధానికి దారితీసిన కారణాలను వివరంగా రాశాడు. పరీక్షహాలు నుండి బయటకు వచ్చాక స్నేహితులతో చర్చించినప్పుడు ప్రశ్న పూర్తిగా చదవ కుండా జవాబు రాయడం వలన తాను ఎన్ని మార్కులు కోల్పోయాడో అర్థమై బాధపడ్డాడు.

✦ ✦ ✦

ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలని పూర్తిగా వినకుండా సమాధానాలు చెప్తే ఆ సమాధానాలు తప్పయ్యే అవకాశాలు ఎక్కువ అవుతాయి. అంతేకాకుండా అలా వాళ్ళు అడిగే ప్రశ్నలను పూర్తిగా వినకుండా సమాధానాలు చెప్పడం వలన వారికి మీ వ్యక్తిత్వం మీద సదభిప్రాయం కలగదు. ఫలితంగా మీరు ఇంటర్వ్యూలో ఫెయిల్ అయ్యే అవకాశాలు పెరుగుతాయి.

✦ ✦ ✦

ఎదుటివారి మాటలను శ్రద్ధగా వినేవారు వెళ్ళిన ప్రతీచోటా పలుకుబడి పెంచుకుంటారు. అంతేకాదు ప్రతీక్షణం ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటూ గొప్ప లాభాలు పొందుతారు.

మనం చెప్పేది పూర్తిగా వినకుండా మన మాట పూర్తికాకుండానే మాట్లాడేసే వ్యక్తులతో మాట్లాడాలంటే మన అందరికీ చికాకు కలుగుతుంది. అలాగే ఎదుటివారు చెప్పేది పూర్తిగా వినకుండా వారు మాట్లాడుతుండగానే మనం మాట్లాడటం మొదలుపెడితే వాళ్ళు కూడా మనల్ని అసహ్యించుకుంటారు.

అవతలివారు చెప్పేది / అడిగేది పూర్తిగా వినకుండా జవాబివ్వడంపైన చెప్పినటువంటి అనర్థాలకు దారితీస్తుంది. ఎదుటివారు చెప్పేది / అడిగేది పూర్తిగా విని జవాబివ్వడం విజయం సాధించడానికి చాలా అవసరమని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

3

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## సాంఖ్యయోగం

**(1) కర్తవ్యనిర్వహణలో పిరికితనానికి లోనుకావద్దు**

**శ్లోకం : క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥ 2-3 ॥**

భావం: అర్జునా! పిరికితనానికి లోనుకావద్దు. ఈ పిరికితనం నీకు తగదు. ఈ మానసిక దౌర్బల్యాన్ని వదిలి నీ కర్తవ్యాన్ని నిర్వహించు.

**వివరణ:** ఇరుపక్షాలలో ఉన్న బంధువులను, గురువులను, స్నేహితులను చూసి అర్జునుడి హృదయం వికలమైంది. రాజ్యం కోసం బంధుమిత్రులను చంపుకోవడం సమంజసం కాదనిపించింది. నాకు విజయమూ వద్దు, రాజ్య సుఖమూ వద్దు అని ధనుర్బాణములను వదిలి రథం వెనుకభాగంలో చతికిల బడ్డాడు. అటువంటి క్లిష్టసమయంలో శ్రీకృష్ణుడు పిరికితనాన్ని వదిలి ధైర్యంగా కర్తవ్యాన్ని నిర్వర్తించమని అర్జునుడికి బోధించాడు.

పిరికితనం మాలిన్యం లాంటిది. శరీరానికి అంటుకున్న మలినం శాశ్వతంగా ఉండిపోదు, సబ్బు ఉపయోగించి నీటితో స్నానం చేస్తే పోతుంది. అలాగే మనసులో ప్రవేశించిన పిరికితనం కూడా శాశ్వతంగా ఉండిపోదు, జ్ఞానముతో కూడిన ధైర్యవచనాలతో పోతుంది.

ఏ రంగంలోనైనా ప్రతిభకు గుర్తింపు రావాలంటే ధైర్యం చాలా అవసరం. ధైర్యం అంటే భయాన్ని జయించడమే గాని భయం లేకపోవడం కాదు. చెట్ల కొమ్మలు విరిగిపోయినా అవి మళ్ళీ చిగురిస్తాయి. అలాగే ధైర్యవంతులు కష్టాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని విజయాలు సాధిస్తారు. పిరికితనాన్ని జయించడం విజయానికి మొదటి అడుగు.

✦ ✦ ✦

కర్తవ్య నిర్వహణలో సమస్యలు, కష్టాలు ఎదురైనప్పుడు పిరికివారు కర్తవ్యాన్ని వదిలి వెళ్ళిపోతారు. కాని ధైర్యవంతులు కర్తవ్య నిర్వహణలో సమస్యలు, కష్టాలు, అవరోధాలు ఎదురైనా భయపడకుండా వాటిని ఎదుర్కొని తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారు.

1865లో పట్టుపురుగులకు సోకిన అంటు వ్యాధి వలన పట్టుపరిశ్రమ దారుణంగా దెబ్బ తినింది. పట్టుపురుగులకు సోకిన అంటువ్యాధి మీద పరిశోధనలు చేసి, నివారణకు కావలసిన మందును కనిపెట్టమని ప్రభుత్వం లూయిస్ పాశ్చర్‌ను కోరింది. లూయిస్ పాశ్చర్ ఆ పరిశోధనలు చేస్తుండగా అతని ముగ్గురు పిల్లలు వరుసగా చనిపోయారు. అయినా పాశ్చర్ తన ప్రయత్నాన్ని విరమించకుండా పరిశోధనలు

కొనసాగించాడు.

"ముగ్గురు పిల్లలు చనిపోయినా కూడా పరి శోధనలు కొనసాగించడానికి చాలా ధైర్యం కావాలి" అని ఒక స్నేహితుడు అన్న ప్పుడు "నాకు ధైర్యం గురించి తెలియదు. నా కర్తవ్యాన్ని నిర్వర్తించడం మాత్రమే నాకు తెలుసు" అని పాశ్చర్ జవాబిచ్చాడు.

✦ ✦ ✦

ధైర్యం అంటే, కష్టాలకు, సమస్యలకు, పరాజయాలకు భయపడకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించడం.

ధైర్యం లేకపోతే పరాజయం పాలవుతాననే భయం కలుగుతుంది. పరాజయ భయం వలన పోటీలో పాల్గొనే ప్రయత్నమే చెయ్యము. ఒకవేళ ప్రయత్నం చేసినా పిరికితనం /భయం వలన మనకున్న శక్తిసామర్థ్యాలను, సాధ నాలను సమర్థవంతంగా ఉపయోగించలేక పోతాము. ఫలితంగా మనకు పరాజయం కలుగుతుంది. ధైర్యవంతుని వద్ద సాధనాలు తక్కువగా ఉన్నా, వాటినే సమర్థవంతంగా ఉపయోగించి పోరాడి విజయం సాధిస్తాడు.

విదురనీతిలో "భయపడేవారు ఏకార్యాన్నీ సాధించలేరు. నిర్భయంగా రంగంలోకి దూకి ఆత్మవిశ్వాసంతో కార్యాన్ని సాధించాలి" అని చెప్పబడింది.

ధైర్యం అంటే చావడానికి సిద్ధపడటం కాదు, కష్టాలను ఎదుర్కొని జీవించడమని



తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

అడవిలో కుందేళ్ళు అన్నీ ఒకచోట సమావేశమై తమ సమస్యలను గురించి చర్చిస్తున్నాయి. ఒక కుందేలు లేచి "బ్రహ్మదేవుడు మనల్ని చిన్నగా చేతగాని ప్రాణులుగా సృష్టించాడు. ఇతర పెద్ద జంతువుల బారినుండి మనల్ని మనం రక్షించుకోడానికి మనకు కొమ్ములు గాని వాడిగోళ్ళు గాని ఇవ్వకుండా మన జాతికి చాలా అన్యాయం చేసాడు. మనం స్వేచ్ఛగా, ధైర్యంగా అడవిలో తిరుగుతూ మనకు కావలిసిన ఆహారాన్ని తినలేము. ఏ జంతువు కంటా పడకుండా పొదలచాటున నక్కినక్కి తిరగాలి. ఏ జంతువైనా మనమీద దాడిచేస్తే పారిపోవడమే తప్ప ఎదురు తిరగ లేము. జీవితం మీద విరక్తిగా ఉంది" అని చెప్పింది.

మరో కుందేలు లేచి "ఈ కష్టాలు, భయాందోళనలు నాకొద్దు. నేను ఏ చెరువులోనో దూకి చచ్చిపోవాలని అనుకుంటున్నాను" అని చెప్పింది.

మరికొన్ని కుందేళ్ళు కూడా చచ్చిపోవాలని అనుకుంటున్నామని చెప్పాయి. చివరికి కుందేళ్ళన్నీ కలిసి ఒకేసారి చచ్చిపోవాలని నిర్ణయించుకొని దగ్గరలోని చెరువు వద్దకు బయల్దేరాయి. చెరువు గట్టుమీద విశ్రాంతి తీసుకుంటున్న కప్పలు కుందేళ్ళ అడుగుల చప్పుడు విని భయంతో గుంపులు గుంపులుగా చెరువులోకి దూకేశాయి.

అలా కప్పలు చెరువులోకి దూకేయడం గమనించిన ఒక కుందేలు "ఈలోకంలో మన కంటే అల్పమైన ప్రాణులు, మనల్ని చూసి భయపడే ప్రాణులు కూడా ఉన్నాయి. అవి ఆత్మహత్యలు చేసుకోకుండా సంతోషంగా

బ్రతుకుతున్నాయి. అలాంటప్పుడు మన మెందుకు చావాలి? మనం ఆత్మహత్య చేసుకో నవసరం లేదు. దేవుడు మనకులాంటి చిన్న ప్రాణులకు పెద్ద జంతువులను చంపే శక్తి ఇవ్వకపోయినా, వాటినుండి తప్పించుకోగల శక్తిసామర్థ్యాలు ఇచ్చాడు. రండి ఆనందంగా, నిర్భయంగా బ్రతుకుదాం" అని చెప్పింది.

ఆ మాటల్లోని సత్యాన్ని అర్థంచేసుకున్న కుందేళ్ళు ఆత్మహత్య చేసుకోకుండా వెను తిరిగాయి.

✦ ✦ ✦

పిరికితనానికి, నిరుత్సాహానికి లోను కాకుండా తెలివిగా ఆలోచించి కర్తవ్యాన్ని నిర్వ ర్తించాలని తెలియజేసే ఒక కథను గుర్తు చేసుకుందాము.

ఒక ముసలి గాడిద నీళ్ళులేని పాడుబడిన బావిలో పడిపోయింది. ఎంత ప్రయత్నించినా పైకి రాలేక గట్టిగా అరవడం మొదలుపెట్టింది. ఆ అరుపులకి దాని యజమానితో పాటు చుట్టుపక్కలవాళ్ళు కూడా వచ్చారు. ఈరోజు గాడిద పడినట్లు రేపు ఎప్పుడైనా మనుష్యులు కూడా ఈ పాడుబడిన బావిలో పడవచ్చు. కాబట్టి గాడిదని పైకి లాగి బావిని శాశ్వతంగా పూడ్చేయాలని నిర్ణయించుకున్నారు.

గంటసేపు ప్రయత్నించినా గాడిదను పైకి లాగాలేకపోయారు. ముసలి గాడిద ఎలాగూ పనేమీ చెయ్యలేదు. దాణా ఖర్చులు కూడా అనవసరం. కాబట్టి ముసలి గాడిదను బావి లోనే వుంచి బావిని పూడ్చేద్దామని నిర్ణయించు కొని పారలతో మట్టి గమేళాలలోకి ఎత్తి బావిలో పోయడం మొదలుపెట్టారు.

వాళ్ళేమి చేస్తున్నారో గాడిదకు అర్థ



మయ్యింది. భయపడింది. కాని బావినుండి బయటపడటానికి ఇంకా ఏదైనా మార్గముందా అని ఆలోచించడం మొదలుపెట్టింది.

కొంతమట్టి పోశాక లోతెంత పూడిందో చూద్దామని కొందరు గ్రామస్తులు బావిలోకి తొంగి చూసి ఆశ్చర్యపోయారు. బావిలో పడిన మట్టిని తన కాళ్ళతో చదును చేస్తూ గాడిద పైకి వస్తోంది. గ్రామస్తులు గాడిద తెలివికి ఆశ్చర్యపోయి మరింత ఉత్సాహంగా మట్టిని బావిలోకి పోశారు. ఆ మట్టిని కూడా గాడిద తన కాళ్ళతో చదును చేస్తూ పైకి వచ్చేసింది.

✦ ✦ ✦

ధైర్యం గెలవగలననే / సాధించగలననే నమ్మకాన్ని ఇస్తుంది. ధైర్యంగా ఉండటమే సగం గెలుపు. అలాగే ఉత్సాహం లేకపోవ డాన్ని మించిన పేదరికం లేదు. ఒక వ్యక్తి తన సర్వస్వాన్ని కోల్పోయినా ఉత్సాహం ఉంటే కోల్పోయిన అన్నింటినీ తిరిగి సంపా దించుకోగలుగుతాడు. అందువలన ఎట్టి పరిస్థితులలోనూ ఉత్సాహాన్ని చల్లారనివ్వ కూడదు.

కాబట్టి కర్తవ్యనిర్వహణలో ఎట్టి పరి స్థితుల్లోనూ ధైర్యాన్ని, ఉత్సాహాన్ని కోల్పోకూడ దని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు
ప్రసాద్

4

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## ఆప్తులను అడగండి

**శ్లోకం: కార్పణ్యదోషోపహతస్వభావః**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**
**శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్**
**॥2-7 ॥**

భావం: కృష్ణా! పిరికితనానికి లోనై ఆలోచనను కోల్పోయి నా కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేక నిన్ను అడుగుతున్నాను. నేను నీకు శిష్యుడను, నిన్ను శరణువేడినవాడిని. నా కర్తవ్యం ఏమిటో, నాకు ఏది శ్రేయస్కరమో తెలియజేయి.

వివరణ: కురుక్షేత్ర యుద్ధభూమిలో ఇరు పక్షాలలో ఉన్న బంధువులను, గురువులను, స్నేహితులను చూసి అర్జునుడి హృదయం వికలమైంది. రాజ్యం కోసం యుద్ధం చేసి బంధుమిత్రులను చంపడం సమంజసమేనా? పోనీ యుద్ధం మాని వెళ్ళిపోతే పిరికివాడనే అవమానాలు, అపకీర్తి కలుగుతాయి. అటువంటి కలవర పరిస్థితిలో కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేక అర్జునుడు శ్రీకృష్ణుడిని సలహా అడిగాడు.



జీవితంలో అందరికీ ఏదో ఒక సమయంలో సులభంగా నిర్ణయాలు తీసుకోలేని జటిలమైన సమస్యలు ఎదురవుతాయి. తీసుకోబోతున్న నిర్ణయం మంచిదేనా అనే అనుమానం కలిగే పరిస్థితులు ఎదురవుతాయి. వెళ్ళబోతున్న మార్గం సరైనదా? కాదా? అని నిర్ణయించుకోలేని పరిస్థితులు ఎదురవుతాయి. అనుమానం తీర్చుకోకుండా ముందుకువెళ్తే వెళ్తున్న మార్గం సరైనదనే నమ్మకం లేక పూర్తి శక్తిసామర్థ్యాలను ఉపయోగించకుండా ప్రయత్నిస్తారు. ఫలితంగా విజయావకాశాలు తగ్గుతాయి. సరైన మార్గమేదో తెలుసుకుని, ఆ మార్గంలో వెళ్ళేవారు తాము వెళ్ళే మార్గం సరైనదనే నమ్మకంతో తమ పూర్తి శక్తి సామర్థ్యాలను ఉపయోగిస్తారు. ఫలితంగా విజయావకాశాలు పెరుగుతాయి. కాబట్టి పిరికితనానికి లోనైనప్పుడు, కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేకపోతున్నప్పుడు ఆప్తులను, మిత్రులను సలహా అడగండి.

సలహా ఇవ్వగలిగిన వ్యక్తులు మీకు అందుబాటులో లేకపోతే, మిమ్మల్ని అర్జునుడుగా ఊహించుకొని భగవద్గీత పుస్తకాన్ని శ్రీకృష్ణుడిగా భావించి చదవండి. మీకు సరైన మార్గమేదో తెలుస్తుంది.

పిరికితనానికి లోనైనప్పుడు, కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేకపోతున్నప్పుడు ఆప్తులను, మిత్రులను సలహా అడగాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

## మరణభయంతో కర్తవ్యాన్ని వదలద్దు

**శ్లోకం: దేహినోస్మిన్యథా దేహే కౌమారం యౌవనం జరా।**

**తథా దేహాన్తరప్రాప్తిర్ధీరస్తత్ర న ముహ్యతి**

**॥ 2-13 ॥**

భావం: జీవాత్మకు ఈ దేహమునందు కౌమారము, యౌవనము, వార్ధక్యము ఉన్నట్లే మరియొక దేహప్రాప్తి కూడా కలుగుతుంది. ఈ విషయమున ధీరుడైనవాడు మోహమునకు గురికాడు.

**శ్లోకం: వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరోపరాణి।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా-**
**న్యన్యాని సంయాతి నవాని దేహీ**

**॥ 2-22 ॥**

**భావం:** మానవుడు పాత వస్త్రములను వదిలి, కొత్త వస్త్రాలు ధరించునట్లు, జీవాత్మ పాత శరీరాన్ని వదిలి వదిలి క్రొత్త శరీరమును పొందుతుంది.

**శ్లోకం: జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య ।**



**తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి**

**॥ 2-27 ॥**

**భావం:** పుట్టినవానికి మరణం తప్పదు. మరణించిన వానికి పునర్జన్మ తప్పదు. అనివార్యమైన ఈ విషయముల గురించి శోకించ కూడదు.

**వివరణ:** కురుక్షేత్రంలో యుద్ధం చెయ్యడానికి మోహరించి ఉన్న ఇరుపక్షాలను పరిశీలించిన అర్జునుడికి యుద్ధం జరిగితే ఎవరు గెలిచినా ఇరుపక్షాలలో ఉన్న బంధువులు, మిత్రులు చనిపోతారని బాధ కలిగింది. యుద్ధం చెయ్యనని ధనుర్బాణాలను వదిలి రథం వెనుకభాగంలో చతికిలబడ్డాడు. బంధుమిత్రులు చనిపోతారనే భయం వలన అర్జునుడు తన కర్తవ్యాన్ని నిర్వహించడం మానేసాడు. అటువంటి విపత్కర పరిస్థితుల్లో శ్రీకృష్ణుడు – జరుగుతున్న యుద్ధం వ్యక్తుల మధ్య కాదు, ధర్మానికి – అధర్మానికి మధ్య అని, చనిపోయేది శరీరము మాత్రమే కాని ఆత్మ కాదని ఉపదేశించాడు. పుట్టిన ప్రతీ జీవికి మరణం తప్పదు కాబట్టి మరణం గురించి భయపడకూడదని వివరించి ఆర్జునుడిని కర్తవ్యనిర్వహణకు ప్రోత్సహించాడు. ✦



-మొండెపు ప్రసాద్

5

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## మరణం ఆపని కర్తవ్య దీక్ష

**రామాయణంలోని అరణ్యకాండలో రావణుడు సీతని ఎత్తుకుని వెళ్తున్నపుడు జటాయువు అనే పక్షి అతనితో వీరోచితంగా పోరాడి రెక్కలు పోగొట్టుకుంటాడు. శ్రీరాముడు సీతను వెదుకుతూ జటాయువు రెక్కలు తెగి పడివున్న చోటుకు వస్తాడు. రెక్కలు తెగిన జటాయువును ఒడిలో పెట్టుకొని శ్రీరాముడు రావణుడు మహాబలవంతుడు, దుర్మార్గుడు అని తెలిసి కూడా నువ్వు వానితో యుద్ధానికి ఎందుకు తలపడ్డావని అడిగాడు.**

జటాయువు కన్నులవెంట ఆనంద భాష్పాలు రాలుస్తూ "రామా! ఏదోఒకరోజు, ఏదోఒకరూపంలో తప్పని మృత్యువు కోసం భయపడుతూ పిరికివాడిలా బ్రతకడం ఎందుకు?" అని చెప్పి రాముని ఒడిలో కన్నులు మూసాడు.

✦ ✦ ✦

జాతక కథలలో చెప్పినట్లు ప్రపంచంలో మనిషి ఎంత ఎదిగినా ఐదు విషయాలు మాత్రం తెలియదు. అవి - జీవించే వయసు, రోగాలు, చావు రాకడ, శరీర పతనావస్థలు, మరణించాక జరిగే సంగతులు.

మృత్యువు దేవుడు పంపిన ఆహ్వానం. కాబట్టి మృత్యువును చూసి భయపడకూడదు పుట్టిన ప్రతి మనిషికీ మరణం తప్పదని అందరికీ తెలుసు. అయినా మరణం అంటే అందరూ భయపడతారు. ఎందుకు?

ఈ ప్రశ్నని ముందుగా ఆధ్యాత్మిక కోణంలో పరిశీలిద్దాము.

స్వార్థప్రయోజనాల కోసం దురాశతో అన్యాయాలు, అక్రమాలు, అధర్మాలు, దుర్మార్గాలు చేస్తూ జీవించిన వ్యక్తులు మరణం సమీపించే సమయంలో "నేను జీవితమంతా పాపాలు చేసాను కాబట్టి చనిపోయాక నరకానికి వెళ్తాను. అక్కడ నాకు కఠినమైన శిక్షలు విధిస్తారు." అని భయపడతారు. మరికొందరు "నేను జీవితమంతా నా స్వార్థం కోసమే బ్రతికాను. ఎవ్వరికీ ఎటువంటి ఉపకారం, దానం చెయ్యలేదు. భగవన్నామస్మరణ చెయ్యలేదు. నాకు చనిపోయాక మోక్షం రాదు. మరో జన్మలో ఏ జంతువుగానో పుడతానేమో." అని భయపడతారు. మరికొందరు "ఈజన్మలో నేను పుణ్యకార్యాలు చెయ్యలేదు. దేవుడా! దయచేసి మరోసారి మానవజన్మ ఇస్తే పుణ్యకార్యాలు చేసి మోక్షం పొందుతాను" అని బాధపడతారు.

మనుషులందరూ చావుకు భయపడతారు. చావునుండి తప్పించుకోవాలని ప్రయత్నిస్తారు. కాని మరణం నుండి తప్పించుకోవడం ఎవ్వరికీ సాధ్యం కాదు. పుట్టిన ప్రతీ వ్యక్తీ చనిపోవలసిందే. కాని మరణం నుండి తప్పించుకోలేకపోయినా మరణభయం నుండి తప్పించుకోవచ్చు.

అధర్మమార్గమును వదిలి ధర్మమార్గంలో జీవించడం వలన ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది. ఆధ్యాత్మికజ్ఞానం వలన నేను అంటే ఈ శరీరం కాదని, శరీరంలోని ఆత్మ అని తెలుస్తుంది. ఫలితంగా మరణభయం నుండి విముక్తి పొందుతారు.

క్లుప్తంగా చెప్పాలంటే ఎన్నో జన్మల తర్వాత లభించిన మానవజన్మను పుణ్యకార్యాలు చేసి మోక్షం పొందటానికి సద్వినియోగం చేయని వాళ్ళు మరణం వచ్చినప్పుడు భయపడతారు.

✦ ✦ ✦

ఇప్పుడు మరణం అంటే ఎందుకు భయపడతారనే ప్రశ్నని భౌతిక కోణంలో పరిశీలిద్దాము.

మంచి మనుషులు, ధర్మపరులు కూడా మృత్యువు నుండి తప్పించుకోలేరు. కాని ధృవనక్షత్రంలా చిరకాలం నిలచివుండే వారి పేరు ప్రఖ్యాతులను, కీర్తిప్రతిష్టలను మృత్యువు ఏమీ చెయ్యలేదు.

పరీక్షలకు సరిగ్గా చదవని విద్యార్థులు మాత్రమే పరీక్షలకు భయపడతారు. అలాగే జీవితాన్ని సంపూర్ణంగా గడపనివాళ్ళు మాత్రమే మృత్యువుకు భయపడతారు.

ఏ వ్యక్తి అయినా ఎలా మరణించాడన్నది కాదు ఎలా జీవించాడు అన్నదే ముఖ్యం. నిమిషాలలో ముగిసే మరణం కంటే సుదీర్ఘమైన జీవితమే ముఖ్యమైనది. మీ జీవితానికి సంవత్సరాలు చేర్చడం ముఖ్యం కాదు. సంవత్సరాలకు జీవితాన్ని చేర్చడం ముఖ్యం. ఎన్నాళ్ళు బ్రతికామన్నది కాదు బ్రతికుండగా ఏమి సాధించామన్నది ముఖ్యం.



జీవితం ఎంతో చిన్నదని బాధపడుతూ సమయాన్ని వృథాగా గడిపి చిన్న జీవితాన్ని మరింత చిన్నది చేసుకోకుండా ఒక ఉన్నత లక్ష్యం కోసం ఆదర్శవంతంగా జీవించడం వలన జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. మరణం ఎప్పటికైనా తప్పదు. ఒక ఆదర్శం ఏర్పరుచుకుని, దానికోసం పాటుపడి, దాని కోసమే చనిపోవడమే ఆదర్శవంతమైన మరణం.

ప్రతిరోజూ మీ జీవితంలో అదే చివరి రోజైతే ఏ పనులు చేస్తారో ఆ పనులు చెయ్యండి, ఏ పనులు చెయ్యరో ఆ పనులు చెయ్యద్దు. మీ కుటుంబ సభ్యులతో, బంధువులతో, స్నేహితులతో ఎలా ప్రవర్తిస్తారో అలా ప్రవర్తించండి. అప్పుడు మీరు జీవితాన్ని ఆదర్శంగా, అద్భుతంగా, ఆనందంగా జీవించగలుగుతారు.

✦ ✦ ✦

పుట్టిన ప్రతీ జీవి ఏదో ఒక రోజు చనిపోక తప్పదు. ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియని మరణానికి భయపడి కర్తవ్యాన్ని నిర్వహించడాన్ని మానకూడదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

సెల్: **99520 65867**



-మొండెపు ప్రసాద్

6

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## జయాపజయాలు

**శ్లోకం: మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణసుఖదుఃఖదాః।**
**ఆగమాపాయినో నిత్యాస్తాంస్తితిక్షస్వ భారత ॥2-14॥**

భావం: కౌంతేయా! విషయేంద్రియ సంయోగం వలన శీతోష్ణములు, సుఖ దుఃఖాలు కలుగుతున్నాయి. అవి అనిత్యాలు. కాబట్టి వాటిని సహించు (ఓర్చుకోనుము)

**శ్లోకం: యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ।**
**సమదుఃఖసుఖం ధీరం సోమృతత్వాయ కల్పతే ॥ 2-15 ॥**

భావం: సుఖదుఃఖాలను సమానంగా చూసే వ్యక్తిని ఇంద్రియాలు వశపరచుకోలేవు. అటువంటి వ్యక్తి మోక్షమునకు



అర్హుడు.

**శ్లోకం: యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 2-48 ॥**

భావం: అర్జునా! నువ్వు యోగానిష్ఠయందు ఉండి కార్యము ఫలించినా ఫలించకపోయినా సమానముగా భావించేవాడివై నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు.

**శ్లోకం: బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్॥ 2-50 ॥**

భావం: (కార్యము ఫలించినా ఫలించక పోయినా సమభావం కలిగివుండే) సమత్వ బుద్ధి కలవాడు పుణ్యపాపములను రెండింటినీ ఈ జన్మయందే త్యజిస్తాడు. అటువంటి వ్యక్తికి కర్మల పాపపుణ్యాలు అంటవు. అర్జునా! నీవు అటువంటి సమత్వ బుద్ధి పొందటానికి సాధన చెయ్యి

**శ్లోకం: దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే॥ 2-56 ॥**

భావం: దుఃఖాలకు కృంగిపోనివాడు సుఖాలకు పొంగిపోనివాడు, భయము

మరియు కోపములను వదిలిపెట్టినవాడు స్థితప్రజ్ఞుడు

శ్లోకం: యః సర్వత్రానభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్।

నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥ 2-57॥

భావం: శుభములు కలిగినప్పుడు సంతోషము, అశుభములు కలిగినప్పుడు ద్వేషము పొందకుండా స్థిరమైన మనసుతో ఉండేవాడు స్థితప్రజ్ఞుడు

వివరణ: కురుక్షేత్రంలో యుద్ధం చెయ్యడానికి సిద్ధంగా ఉన్న కౌరవ, పాండవ సైన్యాలను చూసి అర్జునుడు యుద్ధంలో ఎవరు గెలుస్తారో తెలియదు, ఎవరు గెలిచినా ఇరు వైపులా ఉన్న బంధుమిత్రులు చాలామంది చనిపోతారు కాబట్టి యుద్ధం చెయ్యనని కృష్ణుడికి చెప్పాడు.

బంధుమిత్రులు చనిపోవడం అనే బాధ కలుగుతుందని, విజయం రాకపోవడం అనే కష్టం వస్తుందని కర్తవ్యనిర్వహణ నుండి వెనుదిరిగిన అర్జునుడికి శ్రీకృష్ణుడు జయాపజయాలను, కష్టసుఖాలను సమానంగా భావించి కర్తవ్యాన్ని నిర్వహించాలని చెప్పి కర్తవ్యాన్ని నిర్వహించడానికి ప్రోత్సహించాడు.

వెలుగునీడలు ఎల్లప్పుడూ వెన్నంటి ఉన్నట్లే మనిషి జీవితంలో సుఖాలను కష్టాలు, సంతోషాలను బాధలు, విజయాలను పరాజయాలు వెన్నంటే ఉంటాయి. అయినా మనిషి సుఖసంతోషాలతో జీవించాలంటే జీవితంలో విజయాలు, సుఖాలు, సంతోషాలు మాత్రమే కాకుండా అపజయాలు, కష్టాలు, బాధలు కూడా కలుగుతాయనే అవగాహన ఉండాలి.

కష్టసుఖాల పట్ల సమదృష్టి ఎలా ఉండాలో, ఎందుకు ఉండాలో తెలియజేసే ఒక కథ చదువుదాము.

ధర్మన్న అనే వ్యాపారి గొప్ప ఆధ్యాత్మిక పరుడు. ఒకరోజు మధ్యాహ్నం ధర్మన్న తన ఫ్యాక్టరీలో ఉండగా అతని భార్య ఫోన్ చేసి "బజార్లో నా మెడలోని వజ్రాలహారాన్ని ఎవరో దొంగిలించారు" అని బాధగా చెప్పింది.

ధర్మన్న కొంచెం కూడా కోపం తెచ్చుకోకుండా ప్రశాంతంగా "ఏమి జరిగినా మన మంచికే" అన్నాడు.

సాయంత్రం వ్యాపారి భార్య మళ్ళీ ఫోన్ చేసి "వజ్రాలహారం దొరికింది. పోలీసులు దొంగను పట్టుకున్నారు" అని చెప్పింది.

ధర్మన్న కొంచెం సంతోషం కూడా వ్యక్తపరచకుండా "ఏమి జరిగినా మన మంచికే" అన్నాడు

అది గమనించిన ధర్మన్న సెక్రటరీ "సార్! మంచి జరిగినప్పుడు మన మంచికే అనుకోవడం సహజం కాబట్టి హారం దొరికినప్పుడు మన మంచికే అనడం బాగుంది. కాని చెడు జరిగినప్పుడు మన మంచికి ఎలా అవుతుంది? హారం పోయినప్పుడు మన మంచికే అని ఎందుకన్నారు" అని అడిగాడు

"నువ్వు చెప్పినట్లు పోయినహారం దొరకడం సంతోషకరమైన విషయం కాబట్టి మన మంచికే అన్నాను. హారం పోవడం చెడ్డ విషయమే. కాని దానిని చెడుగా భావించి హారంతో పాటు మనశ్శాంతిని కూడా పోగొట్టుకోవడం ఎందుకు? అందుకే మన మంచికే

అన్నాను. అయినా శివుడి ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదు. కాబట్టి ఏమి జరిగినా మన మంచికే అని భావించాలి" ధర్మన్న చెప్పాడు.

✦ ✦ ✦

జయాపజయాలను సుఖదుఃఖాలను సమంగా భావిస్తూ జరిగినదంతా మన మంచికే అని భావించడంలోని ప్రయోజనం తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

మహారాజు తనకిష్టమైన చెరకుగడలను తానే ముక్కలుగా కోసుకొని తినాలని చేసిన ప్రయత్నంలో కత్తి చేతిమీద పడి రాజుగారి చేతివ్రేలు తెగిపోయింది. అక్కడ ఉన్న అందరూ సానుభూతి వ్యక్తం చేసారు మంత్రి మాత్రం "ఇది మీ మంచికే" అన్నాడు. రాజుకి పట్ట రాని కోపం వచ్చి "నా చేతివ్రేలు తెగిపోవడం నా మంచికి ఎలా అవుతుంది. నాకు హాని జరగాలని కోరుకునే నీకు శిక్ష తప్పదు" అని మంత్రిని మందలించి భటులను పిలిచి మంత్రిని చెరశాలలో బంధించమని ఆదేశించాడు. మంత్రి చెరశాలకు వెళ్తూ "ఇది నా మంచి కోసమే" అన్నాడు.

నాలుగురోజుల తర్వాత రాజు కొంత మంది భటులతో కలిసి వేటకోసం అడవికి వెళ్ళాడు. వేటాడుతూ భటులనుండి విడిపోయి దట్టమైన అడవిలోకి వెళ్ళిపోయాడు. అలసి పోయి ఒక చెట్టు నీడలో నిద్రపోయాడు. తమ దేవతకు నరబలి ఇవ్వడానికి అనువైన మనిషి కోసం వెదుకుతున్న ఆటవికులు చెట్టునీడలో నిద్రపోతున్న రాజును చూసి, త్రాళ్ళతో బంధించి తమ గూడానికి తీసుకెళ్ళారు. స్నానం చేయించి రాజును బలి ఇవ్వడానికి తయారుచేసారు. బలి ఇచ్చేముందు రాజు



చేతికి ఒక వ్రేలు లేకపోవడం గమనించిన పూజారి అవయవలోపం ఉన్నవాళ్ళు బలి ఇవ్వ డానికి పనికిరారని చెప్పడంతో ఆటవికులు రాజును వదిలేసారు.

తన రాజ్యానికి వెళ్ళిన రాజు చెరశాలలో ఉన్న మంత్రిని పిలిపించి జరిగిన విషయం చెప్పి "నువ్వు చెప్పినట్లే ఆరోజు నా చేతివ్రేలు తెగడం నా మంచికే జరిగింది. కాని నిన్ను చెరశాలకు పంపడం నీ మంచికే అని ఎలా అన గలం?" అని అడిగాడు.

మంత్రి ప్రశాంతంగా, వినయంగా "మహా రాజా! మీరు నన్ను చెరశాలకు పంపకపోయి వుంటే, మీతో వేటకు నేనుకూడా వచ్చివుండే వాడిని. భటులు వెనుకబడిపోయినా నేను మాత్రం మీతోటే వచ్చివుండేవాడిని. ఆటవి కులు మీతోపాటు నన్నుకూడా తీసుకెళ్ళి ఉండేవారు. చేతివ్రేలు లేదని మిమ్మల్ని వది లేసిన ఆటవికులు అన్ని అవయాలు సరిగ్గా వున్న నన్ను బలి ఇచ్చివుండేవారు. కాబట్టి మీరు నన్ను చెరశాలకు పంపడం కూడా నా మంచికే మహారాజా" అని వివరించాడు.

రాజు మంత్రి గొప్పతనాన్ని తెలుసుకుని అతడిని తిరిగి మంత్రిగా నియమించాడు.

✦



-మొండెపు ప్రసాద్

7

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## అదృష్టమో దురదృష్టమో

**అనుకున్న విధంగా పనులు జరగక పోయినప్పుడు, కష్టాలు, వచ్చినప్పుడు, మనం దురదృష్టం అనుకుంటాము. కానిఅంతా ఈశ్వరేచ్ఛే అనుకుంటే కొంత కాలం తర్వాత జరిగినది మన మంచికే అని అర్ధమవుతుంది. ఈ విషయాన్ని తెలియ జేసేఒక కథను గుర్తు చేసుకుందాము.**

రామయ్య అనే రైతు యొక్క ఆవు తప్పి పోయింది. చుట్టుపక్కలవాళ్ళు వచ్చి "అయ్యో! ఎంత దురదృష్టం?" అని సాను భూతి తెలియజేసారు. రామయ్య "అదృష్టమో దురదృష్టమో ఎవరికి తెలుసు అంతా ఈశ్వరేచ్ఛ" అన్నాడు.

మరునాడు తప్పిపోయిన ఆవు వెతుక్కుంటూ ఇంటికి వచ్చింది. వస్తూ తనతో మరో ఆవును కూడా తీసుకొచ్చింది. చుట్టుపక్కలవాళ్ళు వచ్చి "ఆహా! ఏమి అదృష్టం?" అన్నారు. రామయ్య "అదృష్టమో దుర దృష్టమో ఎవరికి తెలుసు అంతా ఈశ్వరేచ్ఛ" అన్నాడు.

మరునాడు పాలు పితుకుతుండగా క్రొత్తగా వచ్చిన ఆవు కాలితో తన్నడం వలన రామయ్య కొడుకు కాలు విరిగింది. చుట్టుపక్కలవాళ్ళు వచ్చి "అయ్యో! ఎంత దురదృష్టం?" అని సానుభూతి తెలియ జేసారు. రామయ్య "అదృష్టమో దుర దృష్టమో ఎవరికి తెలుసు అంతా ఈశ్వరేచ్ఛ" అన్నాడు.

మరునాడు రాబోయే యుద్ధం కోసం రాజ్యంలోని యువకులందరూ సైన్యంలో చేరాలని రాజుగారు చాటింపు వేసారు. చుట్టుపక్కలవాళ్ళు వచ్చి "ఆహా! ఏమి అదృష్టం? కాలు విరిగినందువలన నీ కొడుకు సైన్యంలో చేరవలసిన అవసరంలేదు." అన్నారు. రామయ్య "అదృష్టమో దురదృష్టమో ఎవరికీ తెలుసు అంతా ఈశ్వరేచ్ఛ" అన్నాడు.

✦ ✦ ✦

ఎవరైతే దేవుడి ఆజ్ఞతోనే అన్నీ జరుగుతాయని నమ్ముతారో వారు తమకు కలిగిన కష్టాలను, సుఖాలను, దురదృష్టాలను, అదృష్టాలను దేవుని ప్రసాదంగా భావిస్తారు. తమకు ఎప్పుడు, ఏమి ఇవ్వాలో దేవుడికి తెలుసనే భావంతో తమకు జరిగినదంతా దేవుడి ఆజ్ఞ ప్రకారమే జరుగుతోందని నమ్మి దానినే తమ ఇష్టంగా మార్చుకుంటారు. దేవుడి ఇష్టమే తమ ఇష్టంగా మార్చుకున్నందువలన వారిలో అహంకారం, మమకారం నాశనమవుతాయి. అందువలన మంచి జరిగినా, చెడు జరిగినా, కష్టం కలిగినా, సుఖం కలిగినా వాటి సంబంధిత బాధ గాని, ఆనందం

గాని వారి మనసులను తాకలేవు.

జయాపజయాలను, సుఖదుఃఖాలను దేవుడిప్రసాదాలుగా భావించి సమంగా చూడాలనిభగవద్గీతనుండి మనం నేర్చు కోవచ్చు.

## కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి భయపడవద్దు

**శ్లోకం: స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితుమర్హసి।**

**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోన్యత్క్షత్రియస్య న విద్యతే ॥ 2-31 ॥**

**భావం:** కర్తవ్యాన్ని చూసి భయపడవద్దు. రాజులకు ధర్మయుద్ధాన్ని మించిన గొప్ప కర్తవ్యం లేదు.

**వివరణ:** యుద్ధం చేస్తే బంధుమిత్రులను చంపవలసి వస్తుందనే భయంతో యుద్ధం చెయ్యకూడదని నిర్ణయించుకున్న అర్జునుడికి శ్రీకృష్ణుడుసమస్యలు, కష్టాలు, పరాజయాలు ఎదురవుతాయనికర్తవ్యాన్నినిర్వహించడానికి భయపడవద్దని, కర్తవ్యనిర్వహణని మించిన ధర్మం లేదని చెప్పి తన కర్తవ్యాన్ని నిర్వ హించేలా ప్రోత్సహించాడు.

మనిషి తాను ఎంచుకున్న వృత్తికి సంబం ధించిన ఏపని చెయ్యడానికైనా సిగ్గుతో గాని, అవమానంతో గాని, భయంతో గాని వెనుకాడ కూడదు. తాను చేస్తున్న వృత్తిని అంటీ అంట నట్లుగా, అన్యమనస్కంగా, అయిష్టంగా నిర్వ హించే వ్యక్తికి ఏదోఒకనాడు ఆ వృత్తి అంద కుండా దూరమైపోతుంది.



మనిషి ఎప్పుడూ దేనికీ భయపడ కూడదు. ఏ విషయాన్ని గురించైనా తెలియని తనమే భయాన్ని కలిగిస్తుంది. విషయాన్ని గురించి పూర్తిగా తెలుసుకుని అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకుంటే భయం దూరమవు తుంది. అందుకే సిలబస్ పూర్తిగా చదవని విద్యార్థికి పరీక్షలంటే భయం ఉంటుంది. సిల బస్ మొత్తం చదివిన విద్యార్థికి భయం ఉండదు.

కష్టాలలో కూరుకుపోతున్నప్పుడు, వ్యక్తులు మనకు శత్రువులుగా మారు తున్నప్పుడు, పరిస్థితులు ప్రతికూలంగా, దుర్భరంగా పరిణమిస్తున్నప్పుడు, భరించలేని బాధలు చుట్టుముట్టిప్పుడు, ఓటమి అంచున నిలబడినప్పుడు సైతం ఓటమిని అంగీక రించకుండా, నిరాశతో ప్రయత్నం మానేయ కుండా గెలుస్తాననే నమ్మకంతో, ఆత్మ విశ్వాసంతో ప్రయత్నం కొనసాగిస్తూ ఓర్పుతో వేచివుంటే ఊహించని రీతిలో పరిస్థితులు అనుకూలంగా మారి విజయం లభిస్తుంది.

భయం మనిషిలోని శక్తిసామర్థ్యాలను క్షీణింపచేస్తుంది. మనిషి క్షణక్షణం భయ



పడుతూ సాధించేది ఏదీ ఉండదు. పైగా అలా ప్రతీదానికీ భయపడుతూ వెనుకంజ వేసే మనిషి భగవంతుడిని కూడా మరచి పోయేటంతటి బలహీనస్థితికి చేరు కుంటాడు. పిరికివారు మరణానికి ముందు ఎన్నోసార్లు చస్తూ బ్రతుకుతారు. కాని ధైర్య సాహసాలు కలవారు జీవితంలో ఒకే ఒక్కసారి మరణిస్తారు.

ప్రతీ మనిషి తాను చేసే పని పట్ల బాధ్యత, గౌరవం కలిగి ఉండాలి. ఆ గౌర వాన్ని ఎప్పటికప్పుడు నిలుపుకొంటూ ఉండాలి. బాధ్యత వలనే తనకు గౌరవం వస్తోందనే సత్యాన్ని మర్చిపోకుండా తన బాధ్యతను నిర్వర్తించాలి.

పురాణాలు, ఇతిహాసాలు, గొప్ప కథలు, సినిమాలు – వీటన్నింటిలో ప్రస్ఫుటంగా కనిపించే ఒక సత్యం – కర్తవ్యదీక్షతో ధైర్య సాహసాలతో తన కర్తవ్యాన్ని నిర్వర్తించేవారికి విజయం తప్పక లభిస్తుంది.

✦ ✦ ✦

తమ మనసు యొక్క శక్తిసామర్థ్యాలు తమ చుట్టూ ఉన్న పరిస్థితుల కంటే చాలా శక్తివంతమైనవని నమ్మి ఆ ఆత్మవిశ్వాసంతో కృషి చేసేవాళ్ళు అద్భుతమైన విజయాలు సాధిస్తారు.

కరోనా (కొవిడ్–19) వైరస్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం 21 రోజుల పాటు దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ విధించినప్పుడుఅన్ని రకాల రవాణా సౌకర్యాలను నిలిపివేశారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన దిగ్విజయ్ శర్మ అనే వ్యక్తి మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు న్నాడు. లాక్‌డౌన్ కారణంగా అతను ఉత్తర ప్రదేశ్‌లోని తన స్వగ్రామంలో ఉండి పోయాడు. తన పరిస్థితి గురించి ఉన్నత అధికారులకు ఫోన్ ద్వారా తెలియ జేయడంతో రవాణా సౌకర్యాలు లేని కార ణంగా వారు దిగ్విజయ్‌ని ఇంట్లోనే ఉండా లని సూచించారు.

కాని అటువంటి పరీక్షా సమయంలో విధుల్లో చేరితన కర్తవ్యం నిర్వర్తించాలని నిర్ణయించుకుని దిగ్విజయ్ శర్మ 450 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణం చేసి దాదాపు 20 గంటల పాటు నడుచుకుంటూ రాజ్‌ఘర్‌కువెళ్లి విధుల్లో చేరాడు. దాదాపు ఒక రోజంతా తినేందుకు ఎటువంటి ఆహారం దొరకలేదు. విధి నిర్వహణ పట్ల దిగ్విజయ్ శర్మ చూపిన నిబద్ధతను అతని పై అధికారులు అభినందించారు.

కాబట్టి కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను, కష్టాలను చూసి భయపడకుండా నిబద్ధతతో కర్తవ్యాన్ని నిర్వర్తిస్తే గొప్ప విజ యాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు
ప్రసాద్

8

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కర్తవ్యాన్ని వదిలి పారిపోతే అపకీర్తి

శ్లోకం: అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి।

తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥ 2-33 ॥

భావం: అర్జునా! నీవు ఈ యుద్ధం చేయకపోతే, నీ కర్తవ్యం నుండి పారిపోయిన వాడివి అవుతావు. ఫలితంగా నీ కీర్తిని పోగొట్టు కుంటావు, పాపం చేసినవాడివి అవుతావు

శ్లోకం: అకీర్తిం చాపి భూతాని కథ యిష్యన్తి తేవ్యయామ్ం

సమ్భావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే ॥ 2-34 ॥

**భావం:** లోకమంతా కర్తవ్యం నుండి పారిపోయిన నీ అపకీర్తి గురించి కలకాలం చెప్పుకుంటారు. అపకీర్తి మరణం కంటే బాధాకరమైనది.

శ్లోకం: భయాద్రణాదుపరతం మంస్యన్తే త్వాం మహారథాః।

యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 2-35 ॥

భావం: మహారథుల దృష్టిలో నీవు గొప్ప వీరుడివి. వారు నిన్ను భయం వలన యుద్ధం వదిలి పారిపోయిన పిరికివాడిగా చూస్తారు.

శ్లోకం: అవాచ్యవాదాంశ్చ బహూన్వ దిష్యన్తి తవాహితాః।

నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరంను కిమ్ ॥ 2-36 ॥

భావం: నీ శత్రువులు (పోటీదారులు) నీ శక్తిసామర్థ్యాలను శంకించి, నీగురించి చుల కనగా మాట్లాడతారు. అంతకంటే బాధ ఏముంటుంది?

శ్లోకం: హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్।

తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృత నిశ్చయః ॥ 2-37 ॥

భావం: అర్జునా! నీవు నీ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ యుద్ధంలో మరణిస్తే వీరస్వర్గాన్ని పొందుతావు. యుద్ధంలో విజయం సాధిస్తే రాజ్యాన్ని పొందుతావు. కాబట్టి కృత నిశ్చయంతో నీ కర్తవ్యనిర్వహణకు బయల్దేరు.

వివరణ: అర్జునుడు తాను యుద్ధం చేయకూడదనుకోడానికి కారణాలు చెప్పాడు. యుద్ధానికి సిద్ధపడిన స్వజనులను చూసి నా శరీరము వణుకుతోంది, గాండీవము చేతి నుండి జారిపోతున్నది, స్వజనులను చంపడం మంచిదికాదు, నాకు రాజ్యం గాని రాజభోగం గాని వద్దు, కౌరవులను చంపడం వలన


మనకు పాపం కలుగుతుంది, యుద్ధం వలన వంశనాశనం జరుగుతుంది వంటి ఎన్నో కారణాలను చెప్పాడు.

అలా కర్తవ్యనిర్వహణ నుండి వెనుతిరిగిన అర్జునుడికి – కర్తవ్యాన్ని నిర్వహిస్తే విజయం రావచ్చు, రాకపోవచ్చు కాని కర్తవ్యం నుండి పారిపోతే కీర్తిప్రతిష్టలు పోగొట్టుకొని లోకం దృష్టిలో పిరికివాడిగా మిగిలిపోతావని చెప్పి కృష్ణుడు అర్జునుడిని కర్తవ్యనిర్వహణ వైపు నడిపించాడు.

ప్రయత్నం చేసి ఓడిపోయిన వాళ్ళని లోకం గౌరవంగానే చూస్తుంది, కాని ఓడి పోతామనే భయంతోగాని, మరో కారణం వలన గాని ప్రయత్నం విడిచి వెళ్ళిపోయిన వాళ్ళని లోకం పిరికివాళ్ళుగా చూస్తుంది.

కొంతమందికి నీళ్ళంటే భయం, కొంత మందికి విమానప్రయాణాలంటే భయం, కొంతమందికి గొడవలంటే భయం, కొంత మందికి చనిపోతామేమోనని భయం. అయితే అన్నింటికంటే భయంకరమైన భయం మాత్రం పరాజయభయం. పరాజయభయం ఉన్నవారు ఓడిపోతామేమో, విజయం సాధించలేమేమో అనే భయంతో ప్రయత్నమే చెయ్యరు, ఏపనీ మొదలుపెట్టరు.

నేను భయపడుతున్నాననే భయమే అత్యంత భయంకరమైనది. రెండు సన్నని ఇనుపకమ్మీలను నేలమీద ప్రక్కప్రక్కన పెట్టి కాళ్ళు నేలను తాకకుండా వాటిపై నడవట మంటే అందరూ సులభంగా నడుస్తారు. కాని



అవే ఇనుపకమ్మీలను రెండు ఎత్తైన బిల్డింగుల పిట్టగోడలను కలుపుతూ పెట్టి వాటిమీద నడవ మంటే వెనక్కి జంకుతారు. అలా జంకడానికి కారణం కాలుజారి క్రిందపడితే తలపగిలి చస్తా మేమోననే భయం మనసులో ప్రవేశించడమే.

విజయం సాధించలేకపోయిన వారిని నిశితంగా పరిశీలిస్తే లక్ష్యసాధనలో విజయం సాధించలేమోనన్న అపనమ్మకం వారిలో మొదటినుండీ ఉండి ఉంటుంది. విజయం సాధించలేమోనన్న అపనమ్మకం నుండి పరా జయభయం పుడుతుంది. పరాజయభయం వలన లక్ష్యసాధనలో పొరపాట్లు చేస్తారు. తమ శక్తిసామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించ లేకపోతారు. ఫలితంగా తమ అపనమ్మకానికి తగ్గట్టే విజయం సాధించడంలో విఫలమవు తారు.

ఓడిపోతామేమో అనే భయం ఉన్నవారు తమకు తెలియకుండానే విజయం సాధించ డానికి కాకుండా, ఓటమి నుండి తప్పించు కోడానికే ఎక్కువ ప్రయత్నిస్తారు. ఓటమి

నుండి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూనే తరచుగా ఓటమి పాలవుతుంటారు.

✦ ✦ ✦

విజయం కోసం చేసే పోరాటంలో ప్రత్యామ్నాయానికి ఆస్కారం ఉండకూడదని తెలియజేసే కథ చదువుదాము.

ఒక రాజు తన సైనికులతో కలిసి శత్రు రాజ్యంపై యుద్ధానికి వెళ్ళాడు. శత్రురాజ్యాన్ని చేరడానికి ఒక పెద్ద నదిని దాటవలసి వచ్చింది. రాజు తన సైన్యంతో పడవలలో నదిని దాటి శత్రురాజ్యాన్ని చేరాడు. సైనికులు తాము నదిని దాటడానికి ఉపయోగించిన పడవలను ఒడ్డున కట్టే ప్రయత్నం చేస్తుండగా రాజు ఆ పడవలన్నింటినీ తగలబెట్టమని ఆజ్ఞాపించాడు. రాజు మాటకు ఎదురుచెప్పలేక సైనికులు పడవలను తగలబెట్టేశారు.

అప్పుడు రాజు సైనికులను ఉద్దేశించి "వీరసైనికులారా! మనమిప్పుడు బలమైన శత్రువుపై యుద్ధానికి వెళ్తున్నాము. యుద్ధంలో మనం గెలవచ్చు లేదా ఓడిపోవచ్చు. పడవలను తగలబెట్టేశాం కాబట్టి ఓడిపోతే పారిపోడానికి మనకు దారిలేదు. కనుక మనకున్న ఏకైక మార్గం విజయం సాధించడం ఒక్కటే." అని చెప్పాడు.

శక్తిసామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించి గెలవడం కోసం పోరాడటం తప్ప మరో మార్గం లేదని సైనికులకు అర్థమయ్యింది. వారు విజయం సాధించారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

✦ ✦ ✦

కర్తవ్యనిర్వహణలో విజయం కోసం సన్నద్ధమవ్వాలే కాని అపజయం ఎదురైతే ఏమి చెయ్యాలనే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించకూడదు.

"విజయం సాధించకపోతే బంధువులు, స్నేహితులు, ఇతర పరిచయస్తులు నా శక్తి సామర్థ్యాల గురించి తక్కువగా అంచనా వేస్తారేమో, వాళ్ళు నన్ను చులకనగా చూస్తారేమో, నన్ను పనికిరానివాడిగా భావిస్తారేమో" వంటి ఆలోచనల వలన ఓటమి పాలవుతానేమో అనే భయం కలుగుతుంది.

కాని అది వాస్తవం కాదు. లోకంలోని మనుషులందరికీ మీ ఓటమి గురించి మాట్లాడుకొని నవ్వుకోవడం తప్ప మరోపనేమీ ఉండదని భ్రమపడద్దు. ఈ జెట్ స్పీడ్ యుగంలో ఎవ్వరికీ సమయం సరిపోవడం లేదు. ఎవరి పనులలో వారు మునిగితేలుతున్నారు. ప్రక్కవారి గురించి ఆలోచించే తీరిక ఎవ్వరికీ ఉండటంలేదు. కాబట్టి అందరూ మీ ఓటమి గురించే చర్చించుకుంటారని అపోహపడద్దు.

ఏ వ్యక్తీ అన్నిసార్లూ విజయం సాధించలేదు. అబ్రహాం లింకన్ వంటి గొప్ప రాజకీయ నాయకులు, థామస్ ఆల్వా ఎడిసన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలు కూడా గొప్ప విజయాలు సాధించకముందు భయంకరమైన పరాజయాలను చవిచూశారు. కాబట్టి ఓడిపోతానేమో అనే భయాన్ని ప్రక్కనపెట్టి విజయం

సాధిస్తాననే నమ్మకంతో ప్రయత్నం చెయ్యాలి.

ఏదైనా సమున్నత లక్ష్యాన్ని సాధించ డానికి ప్రయత్నించేడప్పుడు ఎంతోకొంత పరాజయభయం అందరికీ కలుగుతుంది. కొందరు ఆ పరాజయభయాన్ని భూతద్దంలో చూసి తాము ఓడిపోతామని నమ్మి గెలవ డానికి కృషి చెయ్యరు. ఫలితంగా వారు నిజంగానే ఓడిపోతారు. కాని విజయం సాధించేవారు ఓడిపోకూడదనే పట్టుదలతో మరింత ఎక్కువగా కృషి చేస్తారు. పరాజయం కలిగే అవకాశాలున్న దారులన్నీ మూసేస్తారు. మరింత ఏకాగ్రతతో విజయం వైపే గురి పెడతారు. విజయం సాధిస్తారు.


పరీక్షలో ఫెయిల్ అయితే? అని భయ పడుతూ కూర్చోవడం వలన పాసవ్వరు. అలా భయపడే సమయాన్ని బాగా చదవడానికి ఉపయోగిస్తే ప్యాసవుతారు. తామేంటో నిరూ పించుకోగలుగుతారు.

భవిష్యత్తు గురించి జాగ్రత్తపడాలి కాని భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు ఎదురవు తాయో, ఎటువంటి పరాజయాలు ఎదురవు తాయో అని భయపడుతూ బ్రతికితే జీవితం లోని ఆనందాన్ని కోల్పోతారు.

లక్ష్యం చేరేదాకా ఓటమి అనే భావాన్ని మనసులోకి రానీయకుండా విజయాన్ని సాధించి తీరాలనే కృతనిశ్చయంతో ముందు కుసాగాలి, కర్తవ్యాన్ని నిర్వహించాలి.

✦ ✦ ✦

మొదలుపెట్టిన మంచిపనిని చివరివరకూ కొనసాగించకుండా మధ్యలోనే వదిలేసి



వెనుదిరగడానికి కారణం భయం కాదు నెపం మాత్రమే. మనం ఏదైనా పని చెయ్యాలను కుంటే పని చెయ్యడానికి మార్గాలు అన్వే షిస్తాము. ఫలితంగా ఏదోఒక మార్గం తప్ప కుండా దొరుకుతుంది. కాని పని చెయ్య కుండా తప్పించుకోవాలనుకుంటే మనం పని చేసే మార్గాలను అన్వేషించకుండా సులభంగా దొరికే నెపాలను వెతుకుతాం.

కర్తవ్యాన్ని నిర్వహిస్తే విజయం సాధించ వచ్చు, సాధించలేకపోవచ్చు. కాని కర్తవ్యం నుండి పారిపోవడం వలన కలిగే అపకీర్తి మరణం కంటే భయంకరమైనది. కాబట్టి కారణం ఏదైనా ఎట్టి పరిస్థితుల్లోనూ కర్తవ్యాన్ని వదిలి పారిపోకూడదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

9

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## ఆందోళన వలన సరిగ్గా పని చెయ్యలేవు

**శ్లోకం: సుఖదుఃఖే సమే కృత్వా లాభా లాభౌ జయాజయౌ।**

**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి । 2-38 ॥**

భావం: జయాపజయాలను, లాభనష్టాలను, సుఖదుఃఖాలను సమానంగా భావించి యుద్ధానికి సిద్ధపడు. అలా చెయ్యడం వలన నీకు ఎటువంటి పాపమూ అంటదు.

వివరణ: స్వజనులను చంపడం మంచిది కాదు, బంధుమిత్రులను చంపడం వలన పాపం కలుగుతుందని కారణాలు చెప్పి అర్జునుడు యుద్ధం చేయనన్నాడు. అటువంటి సమయంలో కృష్ణుడు జయాపజయాలను, సుఖదుఃఖాలను సమానంగా భావించి కర్తవ్యాన్ని నిర్వహించడం వలన ఎటువంటి పాపమూ అంటదని చెప్పి అర్జునుడు తన కర్తవ్యాన్ని నిర్వహించేలా చేసాడు.



జయాపజయాలను సమానంగా చూడటం అలవాటు చేసుకుంటే గెలుస్తామా? ఓడిపోతామా? అనే ఆందోళన వుండదు. ఫలితంగా పరాజయభయం వుండదు. గెలుస్తామా? ఓడిపోతామా? అనే ఆందోళన ఉన్నప్పుడు మనలో ఉన్న శక్తిసామర్థ్యాలను, ఆయుధాలను, వనరులను సమర్థవంతంగా ఉపయోగించలేకపోతాము. గెలుపు, ఓటములను సమానంగా చూసే అలవాటు ఉన్న వాళ్ళకు గెలుస్తామా? ఓడిపోతామా? అనే ఆందోళన ఉండదు. మనసులో ఆందోళన లేకపోవడం వలన మనలో ఉన్న శక్తి సామర్థ్యాలను, ఆయుధాలను, వనరులను సమర్థవంతంగా ఉపయోగించి గొప్ప విజయాలు సాధించగలుగుతాము.

మనసులో ఆందోళన పెట్టుకుని బ్రతకడం అంటే నిదానంగా ఆత్మహత్య చేసుకోవడమే. మనసులో ఆందోళన లేనప్పుడు జబ్బులను కూడా జయించవచ్చని తెలియజేసే కథ చదువుదాము.

విజయవాడలో కలిసి వ్యాపారం చేస్తున్న నలుగు స్నేహితులు కొత్త స్టాకు కొనడం కోసం

ముంబాయి వెళ్లి కోవిడ్-19 కట్టడి చేయడం కోసం విధించిన లాక్ డౌన్ వలన ముంబయిలో చిక్కుకుపోయారు. పదిరోజులు గడిచేసరికి వారికి కూడా కోవిడ్-19 సోకింది. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడి డాక్టరు "మీరు ఆందోళన చెందకుండా మానసికంగా ధృడంగా ఉండి, మేమిచ్చే బలవర్ధకమైన ఆహారం తిని, మందులు వాడి, చిన్న బ్రీథింగ్ ఎక్సర్సైజులు చేసి, వీలైనంత ఎక్కువగా నిద్రపోతే త్వరగానే కోలుకుంటారు" అని చెప్పాడు.

మొదటి స్నేహితుడు రోజంతా "అయ్యో! నేను చనిపోతే నా కుటుంబాన్ని ఎవరు చూస్తారు? ఇంకా పిల్లల చదువులు కూడా పూర్తికాలేదు." అని బాధపడుతూ తిండి సరిగ్గా తినలేదు, ఎక్సర్‌సైజులు చెయ్యలేదు, అస్సలు నిద్ర పోలేదు.

రెండవ స్నేహితుడు కూడా రోజంతా "అయ్యో! ఆస్తిపాస్తుల వివరాలు, వ్యాపార వివరాలు నాకు తప్ప కుటుంబంలో ఎవ్వరికీ తెలియదు. ఇన్సూరెన్సు పేపర్లు ఎక్కడ ఉన్నాయో కూడా కుటుంబంలో ఎవ్వరికీ తెలియదు. నేను చనిపోతే నా కుటుంబం రోడ్డున పడుతుంది" అని బాధపడుతూ తిండి సరిగ్గా తినలేదు, ఎక్సర్‌సైజులు చెయ్యలేదు, అస్సలు నిద్రపోలేదు. అందువలన ఇమ్యూనిటీ బాగా తగ్గిపోయి వాళ్ళిద్దరూ రెండురోజుల తర్వాత చనిపోయారు.

మూడవ స్నేహితుడు తన కుటుంబ సభ్యులందరితో ఒక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి ఆస్తిపాస్తుల వివరాలు, వ్యాపార వివరాలు,



బ్యాంకు అకౌంట్ల వివరాలు, బ్యాంకు లాకర్ల వివరాలు, ఇన్సూరెన్సు వివరాలు, ఆడిటర్ పేరు మొబైల్ నెంబరు దానిలో పోస్ట్ చేసాడు. "ఇప్పుడు నేను చనిపోయినా నా కుటుంబం రోడ్డున పడదు. నా కుటుంబం కోసం నేను ధైర్యంగా ఉండి డాక్టరు సలహాలను పాటించి ఈ జబ్బును జయించాలి'' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

అలాగే డాక్టరు సలహాలను పాటించి కోవిడ్-19 నుండి కోలుకుని కొన్ని రోజుల తర్వాత విజయవాడలోని కుటుంబసభ్యులను చేరాడు.

✦ ✦ ✦

జయాపజయాల గురించి ఆందోళన చెందకుండా పూర్తి శక్తిసామర్థ్యాలతో కర్తవ్యాన్ని నిర్వహిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

10

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## బలమైన సంకల్పంతో కర్తవ్యాన్ని నిర్వహించాలి

శ్లోకం: వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునన్దన।

బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయో వ్యవసాయినామ్ ॥ 2-41 ॥

భావం: నిష్కామ కర్మయోగంలో వివేకవంతుడికి స్థిర సంకల్పం ఒక్కటే ఉంటుంది. కాని వివేకహీనుల బుద్ధి చంచలమై అనేక కోరికల వెంట పరుగులు తీస్తుంది.

**వివరణ:** కొన్ని నిమిషాల్లో యుద్ధం ప్రారంభించవలసిన సమయంలో, దుష్టశిక్షణ, ధర్మరక్షణ చేయవలసిన ముఖ్య సమయంలో అర్జునుడు స్వజనులను చంపడం మంచిది కాదు, నాకు రాజ్యం గాని రాజభోగం గాని వద్దు, కౌరవులను చంపడం వలన మనకు పాపం కలుగుతుంది, యుద్ధం వలన వంశ నాశనం జరుగుతుంది వంటి ఎన్నో కారణాలను చెప్పి యుద్ధం చెయ్యనని అన్నాడు.

అటువంటి క్లిష్ట సమయంలో కృష్ణుడు సంకల్పం బలంగా లేనప్పుడు మనసు కర్తవ్యాన్ని వదిలి అనవసరమైన ఆలోచనలు చేస్తుంది. కాని సంకల్పం బలంగా ఉంటే మనసు ఇతర ఆకర్షణల వైపు పోకుండా కర్తవ్యం మీద మాత్రమే కేంద్రీకృతమై ఉంటుందని చెప్పి అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని చేసాడు.

త్రికరణశుద్ధిగా సాధించాలనుకున్న విషయాలను మనిషి తప్పకుండా సాధించగలుగుతాడు. దృఢసంకల్పం ఒక కంచుకోటలాంటిది. అది ఆ వ్యక్తిని ప్రలోభాలకు, బలహీనతలకు లోనుకాకుండా కాపాడుతుంది. లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే ఎలాగైనా ఆ లక్ష్యాన్ని సాధించవచ్చు. నిర్దిష్టమైన లక్ష్యం / సంకల్పం లేకుండా జీవితంలో ఎవ్వరూ విజయాలు సాధించలేరు.

ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకోకుండా ఎవరైనా రైలు గాని, బస్సు గాని, విమానం గాని ఎక్కుతారా? అలాగే ఎక్కబోతున్న రైలు లేక బస్సు లేక విమానం ఎక్కడికి వెళ్తోందో ఎక్కడికి లేక ఎటువైపు వెళ్తోందో తెలుసుకోకుండా ఎవరైనా ఎక్కుతారా? ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకుంటే అక్కడికి వెళ్ళడానికి ఏ రైలు లేక బస్సు లేక విమానం ఎక్కాలో తెలుసుకొని దానిని ఎక్కి వెళ్ళచ్చు.

అలాగే జీవితంలో కూడా ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే ఆ లక్ష్యాన్ని చేరడానికి ప్రణాళిక తయారుచేసుకుని, అవసరమైన సాధనాలు సమకూర్చుకొని లక్ష్యాన్ని చేరుకోవచ్చు, విజయాన్ని సాధించవచ్చు.



నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధించ లేకపోతే అవమానానికి గురికావలసి వస్తుందే మోనని భయపడి కొంతమంది లక్ష్యాన్ని నిర్ణయించుకోరు, ప్రయత్నం చెయ్యరు.

మనం ఒక లక్ష్యం కోసం ప్రయత్నాలు చెయ్యడం ప్రారంభించేంతవరకు మనలో అంతర్లీనంగా దాగివున్న శక్తిసామర్థ్యాల గురించి మనకు తెలియదు. లక్ష్యం సాధించడానికి ప్రయత్నం చేసి విఫలం అవ్వడం అవమానకరం కాదు. ఎటువంటి లక్ష్యం లేకపోవడమే అత్యంత అవమానకరం. జీవితంలో ఎటువంటి లక్ష్యం లేకుండా కాలాన్ని గడిపేవారు చివరకు ఏమీ సాధించలేకపోయామనే నిరాశ, నిస్పృహలతో జీవితం చాలించవలసి వస్తుంది.

ఏదైనా లక్ష్యాన్ని ఎంచుకున్న తర్వాత మీ ఆలోచనలు మొత్తం ఆ లక్ష్యం పైనే కేంద్రీకరించాలి. మీరు ఎక్కడ ఉన్నా , ఎవరితో మాట్లాడుతున్నా, ఏమి చేస్తున్నా మీ ఆలోచనలు మాత్రం ఆ లక్ష్యం చుట్టే తిరుగుతూ ఉండాలి. మీ కుటుంబసభ్యులతో, స్నేహితులతో ఆ లక్ష్యం గురించే ఎక్కువగా మాట్లాడాలి.

ఎవరైనా మీరు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడం చాలా కష్టమని చెప్తే నిరుత్సాహపడకుండా దానికి వారు చెప్పే కారణాలు అడిగి తెలుసుకోండి. ఇంటర్నెట్లో, పుస్తకాలలో వెతికి గాని, అనుభవం ఉన్న వారిని అడిగి గాని ఆ కారణాలను అధిగమించే మార్గాలను తెలుసుకొని ప్రయత్నించండి.

చదువులోగాని. వృత్తిలో గాని, వ్యాపారంలో గాని, లక్ష్యమేదైనా సరే విజయం సాధించాలంటే బలమైన సంకల్పం, సాధించగలమనే నమ్మకం, సాధించాలనే పట్టుదల, విజయం లభించేవరకు విసుగు విరామం లేకుండా కృషి చేయగల ఓర్పు అవసరం. సంకల్పం బలంగా ఉంటే అసాధ్యాలను సుసాధ్యం చెయ్యవచ్చని ప్రేరణనిచ్చే కథను ఒకసారి గుర్తుచేసు



కుందాము.

సముద్రతీరాన వున్న చెట్టు మీద ఒక పక్షుల జంట నివసించేది. ఆడపక్షి గుడ్లు పెట్టే సమయం వచ్చింది. ఆ పక్షులు నివసిస్తున్న చెట్టుకి కొమ్మలు లేకపోవడంతో గుడ్లు ఎక్కడ పెట్టాలా అని ఆలోచించాయి. సముద్రము ఒడ్డున వున్న ఇసుకలో పెట్టమని మగపక్షి సలహా ఇచ్చింది. సముద్రం అలలలో కొట్టుకు పోతాయేమోనని ఆడపక్షి భయపడింది. ఒడ్డుకు కొంచెం దూరంగా స్థలం చూపించి "ఇక్కడ ఇసుకలో పెట్టు. సముద్రం ఇంత దూరం రాలేదు" అని మగపక్షి చెప్పింది. ఆ మాటలు వినిన సముద్రుడికి కోపం వచ్చింది. ఆడపక్షి గుడ్లు పెట్టగానే బాగా ముందుకి వచ్చి ఆ గుడ్లను సముద్రంలోకి లాక్కొని పోయాడు. ఆ పక్షులకు సముద్రం మీద కోపం వచ్చింది. సముద్రంలోని నీటిని తోడివేసి తమ గుడ్లను తీసుకోవాలని నిర్ణయించాయి. అంత పెద్ద సముద్రంలోని నీటిని తాము తోడలేమని ఏమాత్రమూ భయపడలేదు. తోడివేయగలమనే నమ్మకంతో తమ ముక్కులతో సముద్రంలోని నీటిని తోడి ఒడ్డున దూరంగా పోయసాగాయి. ఆ పక్షుల పట్టుదలకు ముచ్చటపడిన గరుత్మంతుడు ప్రత్యక్షమై ఆ పక్షులకు సాయం చెయ్యడం కోసం సముద్రుడి మీద దాడి చేసాడు. సముద్రుడు భయపడి తనలో దాచుకున్న గుడ్లను ఆ పక్షులకు తిరిగి ఇచ్చేసాడు. ఆ విధంగా ఆ పక్షులు పట్టుదలతో అసాధ్యమైన విజయం సాధించాయి.

✦ ✦ ✦

సంకల్పం బలంగా ఉంటే ఎంతటి గొప్ప లక్ష్యాలనైనా సాధించవచ్చని, బలమైన సంకల్పంతో కర్తవ్యాలను నిర్వహించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

11

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।**

**మా కర్మఫలహేతుర్భూర్మా తే సఙ్గోస్త్వకర్మణి ॥ 2-47 ॥**

భావం: కర్తవ్యం నిర్వహించడం మాత్రమే నీ బాధ్యత, దాని ఫలితానికి నీవు హేతువు కారాదు. కర్తవ్యాలను నిర్వర్తించడం ఎప్పుడూ మానకూడదు.

వివరణ: యుద్ధం చేయడం అర్జునుడి కర్తవ్యం. కాని యుద్ధం చేయడం వలన ఇరు పక్షాలలోని బంధుమిత్రులు చనిపోతారని, వంశనాశనం జరుగుతుందని, కౌరవులను చంపడం వలన పాపం కలుగుతుందని ఎన్నో కారణాలను చెప్పి అర్జునుడు యుద్ధం చెయ్యన్నన్నాడు. అప్పుడు కృష్ణుడు ఫలితం ఎలా ఉండబోతోందో అని అలోచించి కర్తవ్యాన్ని నిర్వహించడం మానకూడదు. ఫలితం గురించి ఆందోళన చెందకుండా కర్తవ్యాన్ని నిర్వహించమని బోధించి అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని చేసాడు.

## ఫలితం గురించి భయపడకుండా కర్తవ్యాన్ని నిర్వహించాలి

జీవితం యొక్క చివరి అంకం మరణం. ఏ పనీ చెయ్యకపోయినా ఏదోఒక రోజు చనిపోతాము. ఏదోఒక రోజు చనిపోతామని తెలుసు కాబట్టి బ్రతకడం మానేస్తున్నామా? అలాగే కష్టాలు, సమస్యలు, అపజయాలు ఎదురవ్వచ్చునే భయం వలన కర్తవ్యాలను నిర్వహించడం మానకూడదు.

కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే కష్టాలకు, ఆటంకాలకు, సమస్యలకు భయపడి కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి వెనకాడకూడదని తెలియజేసే మహాభారతములోని కథను గుర్తుచేసుకుందాము.

దేవశిల్పి అయిన విశ్వకర్మచేత నిర్మించబడిన ఇంద్రప్రస్థములో ఉన్న ద్రౌపది మరియు పాండవుల వద్దకు నారదుడు వచ్చి సంసార జీవితంలో వారు పాటించవలసిన నియమాలను వివరిస్తూ "పాండవులారా! ద్రౌపది ఎవరి అంతఃపురంలో ఉందో వారికి తెలియకుండా వేరేవారు ఎవరైనా ఆ అంతఃపురంలోకి వెళితే ప్రాయశ్చిత్తముగా ఒక సంవత్సరం కఠిన వ్రతనియమాలు పాటించి తీర్థయాత్రలు చెయ్యాలి" అని చెప్పాడు. పాండవులందరూ నారదుడు చెప్పిన నియమాలను పాటించాలని నిశ్చయించుకున్నారు.

ఒక రోజు ఒక బ్రాహ్మణుడు దొంగలు తన హోమధేనువును ఎత్తుకెళ్ళిపోయారని బిగ్గరగా ఏడుస్తున్నాడు. ఆ విప్రుని ఆర్తనాదం విన్న అర్జునుడు అతడ్ని అడిగి ఏమి జరిగినదో

తెలుసుకున్నాడు. అర్జునుడి ధనుస్సు ధర్మ రాజు అంతఃపురంలోని ఆయుధ శాలలో ఉంది. ఆ సంవత్సరం ద్రౌపది ధర్మరాజు అంతఃపురములో ఉంది. ధనుస్సు కోసం ధర్మరాజు అంతఃపురంలోకి వెళ్తే నారదుడు విధించిన నియమం భంగమవుతుందని తెలి సినా వీరాధివీరుడైన అర్జునుడు ఆర్తరక్షణకై ధర్మరాజు అంతఃపురంలో ఉన్న ఆయుధ గారంలో ప్రవేశించి తన ధనుస్సు తీసుకుని ఆ దొంగలను వెంబడించాడు. దుష్టులైన దొంగలను శిక్షించి విప్రుని హోమధేనువును తెచ్చి అతనికి తిరిగి ఇచ్చాడు.

తర్వాత అర్జునుడు ధర్మరాజు వద్దకువెళ్ళి జరిగినది చెప్పి తనకు తీర్థయాత్రలు చేసి ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశం ఇవ్వమని కోరాడు. ధర్మరాజు "సోదరా! విప్రుని హోమ ధేనువును అపహరించిన ఆ దొంగలను శిక్షించి నువ్వు ధర్మమే చేశావు. అందువలన నియమం భంగమైనదని నువ్వు బాధపడనక్కర లేదు. ధర్మరక్షణ కోసం చేశావు కాబట్టి నువ్వు తీర్థయాత్రలకు వెళ్ళనవసరం లేదు" అని చెప్పాడు.

అప్పుడు అర్జునుడు "అన్నయ్యా! ప్రజా రక్షణ అనే వంకతో ప్రాయశ్చిత్తం చేయక పోవడం మంచిదికాదు. నాకు తీర్థయాత్రలు చెయ్యడానికి అనుమతి ఇవ్వండి" అని అడి గాడు. తమ్ముడి ధర్మబుద్ధికి సంతోషించి ధర్మ రాజు ఆర్జునుడిని తీర్థయాత్రలకు పంపిం చాడు.

ధర్మరాజు అంతఃపురంలోకి వెళ్లి ధనుస్సు తీసుకుంటే రాజభోగాలు వదిలి తీర్థయాత్రలు చేయాలని తెలిసినా భయపడకుండా



అర్జునుడు తన కర్తవ్యాన్ని పాటించడానికి ధర్మరాజు అంతఃపురంలోని ఆయుధగారం లోకి వెళ్ళి ధనుస్సు తీసుకుని దుష్టశిక్షణ చేశాడు.

✦ ✦ ✦

కర్మఫలాలు అంటుకుంటాయనే భయంతో కర్మలు చెయ్యడం మానేయడం అపజయం కలగవచ్చనే భయంతో ప్రయత్నం చెయ్యడం వంటిది. విజయం సాధించాలనే పట్టుదలతో ప్రయత్నించడం వేరు, విజయం వస్తుందా రాదా అనే ఆందోళనతో ప్రయత్నించడం వేరు. విజయం సాధించాలనే పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సాధించే అవకాశాలు పెరుగుతాయి. కాని విజయం వస్తుందా రాదా అనే ఆందోళనతో ప్రయత్నిస్తే, ఆందోళన వలన ఉన్న శక్తిసామర్థ్యాలను సమర్థవంతంగా ఉపయోగించలేక విజయం సాధించే అవకా శాలు తగ్గుతాయి. కాబట్టి ఫలితం గురించి ఆందోళన చెందకుండా కర్తవ్యాలను నిర్వ హించాలి. ఫలితం ఎలా ఉండబోతోందో అని అలో చించి కర్తవ్యాన్ని నిర్వహించడం మాన కూడదు. ఫలితం గురించి ఆందోళన చెంద కుండా ప్రయత్నం చెయ్యాలి, కర్తవ్యాన్ని నిర్వ హించాలి అని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

12

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కర్తవ్యనిర్వహణలో ఆకర్షణలకు లోనుకావద్దు


శ్లోకం: యదా సంహరతే చాయం కూర్మో జ్ఞానీవ సర్వశః।
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 2-58 ॥

భావం: తాబేలు తన అంగములను అన్ని వైపుల నుండి లోపలికి ముడుచుకొన్నట్లు ఇంద్రియాలను ఆకర్షణలనుండి ఉపసంహరించుకోవాలి.

శ్లోకం: యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః।
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః ॥2-60॥

భావం: ఇంద్రియాలు చాలా శక్తివంతమైనవి. ఆసక్తి నశించనంతవరకూ అవి మనిషి మనసును ఆకర్షణల వైపు బలవంతంగా లాగుతూనే ఉంటాయి.

శ్లోకం: తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః।



వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతి ష్ఠితా ॥ 2-61 ॥

భావం: కాబట్టి సాధకుడు ఇంద్రియాలను నియంత్రణలో ఉంచుకోవాలి. ఇంద్రియాలను నియంత్రణలో ఉంచుకున్నవారి బుద్ధి స్థిరంగా వుంటుంది.

శ్లోకం: నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయు క్తస్య భావనా।

న చాభావయతః శాన్తిరశాన్తస్య కుతః సుఖమ్ ॥ 2-66 ॥

భావం: ఇంద్రియాలను, మనస్సును నియంత్రణలో ఉంచుకోనివారి బుద్ధి స్థిరంగా వుండదు. వారికి మంచి ఆలోచనలు కలగవు. మంచి ఆలోచనలు లేనివానికి శాంతి లభిం చదు.

శ్లోకం: ఇన్ద్రియాణాం హి చరతాం యన్మనోనువిధీయతే।

తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమి వామ్భసి ॥ 2-67 ॥

భావం: నీటిపై తేలుతున్న పడవను గాలి నెట్టివేసేడట్లు, వ్యక్తి యొక్క మనసు ఒక్క ఇంద్రియానికి వశమైపోయినా అది ఆ వ్యక్తి యొక్క విచక్షణాశక్తిని నాశనం చేస్తుంది.

శ్లోకం: తస్మాద్యస్య మహాబాహో నిగృ హీతాని సర్వశః।

ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతి ష్ఠితా ॥ 2-68 ॥

భావం: ఇంద్రియాలను నిగ్రహించిన వారి బుద్ధి స్థిరంగా ఉంటుంది.

వివరణ: యుద్ధానికి సిద్ధంగా ఇరు పక్షా లలో ఉన్న బంధువులను, గురువులను, స్నేహి తులను చూసి అర్జునుడి హృదయం వికల మైంది. రాజ్యం కోసం బంధుమిత్రులను చంపుకోవడం సమంజసం కాదనిపించింది. కౌరవులను చంపడం వలన పాపం కలుగు తుందని అనిపించింది. నేను యుద్ధం చెయ్యను. నాకు విజయమూ వద్దు, రాజ్య సుఖమూ వద్దు అని ధనుర్బాణములను వదిలి రథం వెనుక భాగంలో చతికిలబడ్డాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు ఇంద్రియాలు చాలా శక్తివంతమైనవి, అవి మనిషి మనసును ఆకర్షణల వైపు బలవంతంగా లాగుతుం టాయి. ఇంద్రియాలను, మనస్సును నియం త్రణలో ఉంచుకోనివారి బుద్ధి స్థిరంగా వుండదు. వారికి మంచి ఆలోచనలు కలగవు. ఇంద్రి యాలను నియంత్రణలో ఉంచుకున్నవారి బుద్ధి స్థిరంగా వుంటుంది. కాబట్టి ఇంద్రియా లను నియంత్రణలో ఉంచుకొని కర్తవ్యాలను నిర్వర్తించాలని అర్జునుడికి బోధించాడు.

ఇంద్రియాలు, ఆకర్షణలు, వ్యామోహాలు చాలా బలమైనవి. ఒక్కసారి వాటికి లొంగితే బయటపడటం అంత సులభం కాదు. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథను చదువు దాము.

ఇండస్ట్రియలిస్ట్ ప్రకాష్ ఫైవ్‌స్టార్ హోటల్లో ఏర్పాటు చేసిన ఒక పెళ్లి ఫంక్షనుకి వెళ్ళాడు. తన కారు డ్రైవరుని కూడా అక్కడే భోజనం చెయ్యమని చెప్పాడు. విందు భోజనంలోని డ్రై ఫ్రూట్ బర్ఫీ, క్యారెట్ హల్వా, బిర్యానీ వంటి ఐటమ్స్ డ్రైవరుకి బాగా నచ్చాయి.

మరునాడు డ్రైవరు ప్రకాష్‌ని అడిగి రెండు వేలు రూపాలలు అప్పుగా తీసుకున్నాడు. రెండురోజుల తర్వాత మరో రెండువేలు అప్పు తీసుకున్నాడు. రెండురోజుల కొకసారి రెండు వేలు చొప్పున ఇరవైవేలు అప్పుతీసుకున్నాడు. ప్రకాష్ కారణం అడగకుండా అప్పిచ్చాడు. పదకొండవరోజు డ్రైవరు భార్య ప్రకాష్ వద్దకు వచ్చి "సార్! ఫైవ్ స్టార్ హొటల్లో తినిన పెళ్ళి భోజనంలోని డ్రై ఫ్రూట్ బర్ఫీ, క్యారెట్ హల్వా, బిర్యానీ వంటి ఐటమ్స్ నా భర్తకి బాగా నచ్చాయి. రెండు రోజులకొకసారి మీవద్ద నుండి అప్పు తీసుకొని ఆ డబ్బులతో ఆ ఐటమ్స్ కొని తెచ్చుకొని తినేస్తున్నాడు. ఎంత చెప్పినా వినడంలేదు. దయచేసి ఇకమీదట అప్పు ఇవ్వకండి సార్" అని చెప్పింది.

✦ ✦ ✦

ఇంద్రియాలను, ఆకర్షణలను, కోరికలను బుద్ధితో జయించాలని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

గ్రుడ్డివాడు, కుంటివాడు మంచి స్నేహితులు. గుడ్డివాడు కుంటివాడిని తన భుజాల మీద ఎక్కుంచుకొని అతను చెప్పిన దారి గుండా నడుస్తున్నాడు. కొంతదూరం వెళ్ళాక ఒక ఊరి పొలిమేరలో చాలా దోసకాయలు ఉన్న దోసపాదు కనిపించింది.

కుంటివాడు గ్రుడ్డివాడితో "ఎడమప్రక్కన దోసకాయలతో నిండిన దోసపాదు ఉంది. మనం కొద్దిసేపు ఇక్కడ ఆగి దోసకాయలు తింటే మన ఆకలి, దప్పిక రెండూ తీరుతాయి" అన్నాడు.

గ్రుడ్డివాడు "దోసపాదు చుట్టూ కంచె



ఉందా?" అని అడిగాడు

"లేదు" కుంటివాడు సమాధానం చెప్పాడు.

"కాపలావాడు ఉన్నాడా?"

"ఎవ్వరూ కాపలా లేరు"

"అయితే అవి తినడానికి పనికిరాని చేదు దోసకాయలు అయ్యివుంటాయి. తినడానికి పనికివచ్చే దోసకాయలైతే కాపలావాడు ఉండేవాడు. కనీసం కంచె అయినా ఉండేది. కాబట్టి మన దారిన మనం పోదాం" గ్రుడ్డివాడు చెప్పాడు.

కుంటివాడు కనిపెట్టలేని విషయాలను గ్రుడ్డివాడు తన బుద్ధితో కనిపెట్టాడు. అలాగే ఇంద్రియాలను బుద్ధితో జయించాలి.

✦ ✦ ✦

కాబట్టి ఇంద్రియాలను నియంత్రణలో ఉంచుకొని, ఆకర్షణలకు లోనుకాకుండా కర్తవ్యాలను నిర్వర్తించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

13

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కోరికలు – కోపం – వివేకము – కర్తవ్యము

**శ్లోకం: యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।**

**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 2-69 ॥**

**భావం:** సుఖముల గురించి ఎక్కువగా ఆలోచించే వ్యక్తికి వాటియందు ఆసక్తి ఏర్పడుతుంది. ఆసక్తి వలన వాటిని పొందాలనే కోరికలు కలుగుతాయి. ఆ కోరికలు తీరకపోతే కోపం వస్తుంది.

**శ్లోకం: క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతివిభ్రమః।**

**స్మృతిభ్రంశాద్ బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥ 2-63 ॥**

**భావం:** కోపం వలన ఆలోచనాశక్తి, బుద్ధి నశించి మనిషి పతనమవుతాడు.

**వివరణ:** కురుక్షేత్రంలో జరగబోతున్న యుద్ధంలో కౌరవపక్షాన్ని ఓడించి ధర్మరక్షణ చేయడం అర్జునుడి కర్తవ్యం. కాని అర్జునుడు యుద్ధం జరిగితే ఇరుపక్షాలలోని బంధు మిత్రులు మరణిస్తారు. వంశ నాశనం జరుగుతుంది, బంధుమిత్రులను, గురువులను చంపిన పాపం అంటుకుంటుంది అంటూ యుద్ధం చెయ్యడం వలన కలిగే కష్టనష్టాలను గురించి కృష్ణుడికి చెప్పి తాను యుద్ధం చెయ్యనని అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు సుఖాల గురించి ఆలోచించకుండా కర్తవ్యాన్ని నిర్వహించాలని బోధించి అర్జునుడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించేలా ప్రోత్సహించాడు.

మనిషి దేనిగురించి ఎక్కువగా ఆలోచిస్తాడో దానిని పొందాలనే కోరిక కలుగుతుంది. కోరిక పెరగడం వలన దానిని పొందడానికి ప్రయత్నం చేస్తాడు. ప్రయత్నం విఫలమై దానిని పొందలేక పోతే కోపం వస్తుంది. కోపం వలన వివేకం నశిస్తుంది. వివేకము నశిస్తే కర్తవ్యాలను సమర్ధవంతంగా నిర్వహించలేము.

ఈ సందర్భంలో మహాభారతంలో భీష్ముడు ధర్మరాజుకు కోపం వలన సంయమనము, నిగ్రహము, వివేకము మరియు విచక్షణలను కోల్పోతారని తెలియజేస్తూ చెప్పిన కథను గుర్తుచేసుకుందాము

పూర్వము మేధాతిథి అనే కోపిష్టి ముని ఉండేవాడు. అతని కొడుకు చిరకారి యుక్త వయసు వచ్చేసరికి సకలశాస్త్రాలు చదివి గొప్ప పాండిత్యాన్ని సంపాదించాడు. అతనెప్పుడూ తొందరపడేవాడు కాదు, కోపాన్ని ప్రదర్శించేవాడు కాదు. ఏపనైనా బాగా అలోచించి చేసేవాడు.

ఒకరోజు మేధాతిథికి భార్యమీద చాలా కోపం వచ్చింది. ఆమెను చంపెయ్యమని చిరకారిని ఆజ్ఞాపించి బయటకు వెళ్ళిపోయాడు.

"తల్లిని మించిన దైవం లేదంటారు. నవ మాసాలూ మోసి పెంచిన తల్లిని చంపడం కంటే

పాపం ఉంటుందా?" అని చిరకారి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

బయటకు వెళ్ళిన మేధాతిథికి కొంతసేపటికి కోపం తగ్గిపోయింది. కోపం తగ్గగానే తన ఆజ్ఞ ప్రకారం కొడుకు తల్లిని చంపేసి ఉంటాడా? అనే ఆలోచన కలిగింది. వెంటనే వేగంగా ఆశ్రమానికి తిరిగి వెళ్ళాడు.

చిరకారి తండ్రి కాళ్ళమీద పడి ఆయన ఆజ్ఞ పాటించనందుకు క్షమించమని అడిగాడు. భార్య కూడా మేధాతిథికి నమస్కరించింది.

మేధాతిథి కన్నీళ్ళతో వాళ్ళిద్దరినీ పైకి లేవదీసి "కోపం వలన సంయమనము, నిగ్రహము, వివేకము మరియు విచక్షణలను కోల్పోతారని తెలిసొచ్చింది" అని చెప్పాడు.

✦ ✦ ✦

కోరికలను జయించిన వ్యక్తి కోపాన్ని కూడా జయించగలడని తెలియజేసే ఒక కథను గుర్తు చేసుకుందాము.

తిరుక్కురళ్ రచించిన తిరువళ్ళువర్ వృత్తి రీత్యా నేతగాడు. తాను నేసిన చీరను అమ్మడానికి బజారుకు తీసుకెళ్ళాడు. ఇతరులను అగౌరవ పరచి, అపహాస్యం చేసి, అవమానించి ఆనందించే ఆకతాయి యువకుడు తిరువళ్ళువర్‌ను అవమానపరిచే ఉద్దేశ్యంతో చీర ఖరీదు ఎంతని అడిగాడు. నాలుగురూపాయిలని తిరువళ్ళువర్ చెప్పాడు.

ఆ యువకుడు చీరను తన చేతిలోకి తీసుకొని సగానికి రెండు ముక్కలుగా చింపి ఒక ముక్కను చూపించి "దీని ఖరీదు ఎంత?" అని అడిగాడు.

తిరువళ్ళువర్ కొంచెం కూడా కోపం తెచ్చుకోకుండా "ఇది చీరలో సగం ముక్క కాబట్టి దీని ఖరీదు రెండు రూపాయలు" అని చెప్పాడు.

ఆ యువకుడు రెండు ముక్కలను నాలుగు ముక్కలుగా చింపి ఒక ముక్కను చూపించి



"ఇప్పుడు దీని ఖరీదు ఎంత?" అని వెటకారంగా నవ్వుతూ అడిగాడు

తిరువళ్ళువర్ శాంతంగా "ఒక రూపాయి" అని చెప్పాడు.

అమ్ముకోడానికి తెచ్చిన క్రొత్తచీరను ముక్కలుగా చేసినా తిరువళ్ళువర్ కొంచెం కూడా కోపగించుకోకుండా శాంతంగా మాట్లాడటం గమనించిన ఆ యువకుడు తిరువళ్ళువర్ గొప్పజ్ఞాని అని గ్రహించి తిరువళ్ళువర్ కు నమస్కరించి, క్షమాపణలు కోరి చీర ఖరీదు చెల్లించాడు.

✦ ✦ ✦

సంతృప్తిని మించిన సంపద లేదు. సంతృప్తి అనే ఆనకట్ట పగిలిపోతే మనిషి జీవితంలో కోరికల ప్రవాహానికి అడ్డూ, అదుపూ ఉండదు.

కోరికలు తీర్చుకోవడం వలన కలిగే సంతోషం తాత్కాలికమైనది. కోరికలు తీరగానే కొత్త కోరికలు పుడతాయి. వాటిని తీర్చుకోవడానికి కొత్త ప్రయత్నాలు చేసే ప్రక్రియలో అంతకుముందు కలిగిన ఆనందం దూరమవుతుంది. ప్రయత్నం విఫలమై కొత్త కోరికలు తీరకపోతే కోపం వస్తుంది. కోపం వలన వివేకం నశిస్తుంది. వివేకం నశిస్తే కర్తవ్యాలను సమర్ధవంతంగా నిర్వహించలేము. కాబట్టి సుఖాల గురించి ఆలోచించకుండా కర్తవ్యాన్ని నిర్వహించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు
ప్రసాద్

14

# యువతకు భగవద్గీత చూపించిన దారి



# ప్రశాంతత – స్థిరబుద్ధి

**శ్లోకం: ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే।**

**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే॥ 2-65 ॥**

భావం: మనసు ప్రశాంతంగా వుంచుకుంటే దుఃఖాలన్నీ తొలగిపోతాయి. మనసు ప్రశాంతంగా వుంటే బుద్ధి స్థిరంగా వుంటుంది.

వివరణ: యుద్ధానికి సిద్ధపడిన ఇరు పక్షాల లోని బంధువులను, గురువులను, స్నేహితులను చూసిన అర్జునుడి శరీరం వణికింది. యుద్ధం జరిగితే ఇరు పక్షాలలో ఉన్న బంధుమిత్రులు చాలామంది చనిపోతారని బాధ కలిగి కృష్ణుడితో నేను యుద్ధం చేయలేను, ఇంతమంది బంధు మిత్రులను, గురువులను చంపి పొందే రాజ్యం గాని రాజభోగం గాని నాకు వద్దు అని చెప్పాడు.



బంధుమిత్రులు చనిపోతారనే బాధ వలన ప్రశాంతత కోల్పోయి యుద్ధం చేయకూడదని నిర్ణయించుకున్న అర్జునుడి మనసును కర్తవ్యం వైపు మళ్లించడానికి కృష్ణుడు మనసు ప్రశాంతంగా వుంచుకుంటే దుఃఖాలన్నీ తొలగిపోతాయి. మనసు ప్రశాంతంగా వుంటే బుద్ధి కూడా స్థిరంగా వుంటుందని చెప్పాడు. బుద్ధి స్థిరంగా ఉంటే కర్తవ్యాలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతాము.

మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే దుఃఖం, బాధ అనేవి ఉండవని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

ఒక గృహిణి స్వామీజీ వద్దకు వెళ్లి “స్వామీ! నాకు ఖరీదైన పట్టుచీరలు, బంగారు నగలు, కారు కావాలని కోరికలు ఉన్నాయి. ఆ కోరికలు తీరే మార్గంలేక మనసు చికాకుగా ఉంటోంది. చికాకు వలన నా కోపాన్ని అందరి మీదా ప్రదర్శిస్తున్నాను. చికాకు లేకుండా ప్రశాం


36 ✦ సహరి

తంగా ఉండే మార్గాన్ని ఉపదేశించండి" అని అడిగింది.

"అమ్మా! నేను నా శక్తిని ఉపయోగించి నీకు ఖరీదైన పట్టుచీరలు, బంగారు నగలు, కారు బహుమతిగా ఇస్తే నీకు ఎలా ఉంటుంది?" స్వామీజీ అడిగాడు.

"చాలా సంతోషం కలుగుతుంది." ఆమె జవాబిచ్చింది.

"కాని ఆ వెంటనే మీ కుటుంబసభ్యులలో ఎవరైనా ఒకరు మరణిస్తే నేనిచ్చిన ఖరీదైన పట్టుచీరలు, బంగారు నగలు, కారు నీకు ఆనందాన్ని కలిగిస్తాయా?"

"ఇవ్వవు"

"ఎందుకు?"

"కుటుంబ సభ్యుల మరణం వలన"

"కాని నీకు ఆనందాన్ని కలిగించే ఖరీదైన పట్టుచీరలు, బంగారు నగలు నీ దగ్గర ఉన్నాయి కదా! అవి నీదగ్గర వున్నప్పుడు నీకు ఆనందం కలగాలి గాని దుఃఖం కలగకూడదు కదా?"

"బాధాకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు దుఃఖం కలుగుతుంది కదా స్వామీ!"

"అంటే నీకు సుఖదుఃఖాలను కలిగించేది పరిస్థితులే గాని, ఖరీదైన పట్టుచీరలు, బంగారు నగలు, కారు ఉండటం, లేకపోవడం కాదన్న మాట"

"అవును స్వామి"

"పరిస్థితుల వలన సుఖదుఃఖాలు ఎక్కడ కలుగుతున్నాయి?"

"మనసులో స్వామీ!"



"నీలోని ఆ మనసును తీసేస్తే నీకు సుఖ దుఃఖాల అనుభవం కలుగుతుందా?"

"మనసు లేకపోతే సుఖదుఃఖాల అనుభవం కలగదు స్వామీ!"

"నేను నాలో నుండి ఆ మనసును తీసే సాను. అందుకే నేను ఎల్లప్పుడూ దుఃఖం లేని సమత్వ స్థితిలో ప్రశాంతంగా ఉంటాను"

"మనసుని ఎలా తీసెయ్యాలి స్వామి?"

"దైవభక్తి, నిష్కామ సేవ దానికి మార్గాలు." స్వామీజీ చెప్పాడు.

✦ ✦ ✦

మనసు ఎంతో శక్తివంతమైనది. స్వర్గాన్ని నరకంగా, నరకాన్ని స్వర్గంగా మార్చగల శక్తి మనసుకు ఉంది. ఏ విషయాన్నైనా రూపకల్పన చేయగలదు, విశ్వసించగలదు, సాధ్యం చేసుకో గలదు.

కాబట్టి దుఃఖాలకు, బాధలకు చలించకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకొని స్థిరమైన బుద్ధితో కర్తవ్యనిర్వహణ చేయాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

15

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: విహాయ కామాన్యః సర్వాన్పు మాంశ్చరతి నిఃస్పృహః।**


**నిర్మమో నిరహ్కారః స శాన్తిమధిగచ్ఛతి॥ 2-71 ॥**

భావం: కోరికలన్నింటినీ త్యజించి, అహంకారాన్ని వదిలిపెట్టి ప్రవర్తించే వ్యక్తి శాంతిని పొందుతాడు.

**వివరణ:** అష్టైశ్వర్యాలు ఉన్నా ఇంకా ఏదో కావాలనే కోరిక ఉంటే మనశ్శాంతి దూరమవుతుంది. మనసులో శాంతి లేనప్పుడు మన ఆలోచనలను, శక్తిసామర్థ్యాలను కర్తవ్యనిర్వహణ మీద కేంద్రీకరించలేక పోతాము.

తమకున్న ఐశ్వర్యాన్ని, శక్తిసామర్థ్యాలను, పాండిత్యాన్ని చూసుకొని గర్వపడకుండా, ఇది కావాలి, అది కావాలి అనే కోరికలను వదిలి జీవించేవారు శాంతిని పొందుతారు. మనసులో శాంతి ఉన్నప్పుడు మన ఆలోచ నలను,

## కోరికలను అహంకారాన్ని వదిలిపెట్టాలి



శక్తిసామర్థ్యాలను కర్తవ్యనిర్వహణ మీద పూర్తిస్థాయిలో కేంద్రీకరించగలుగు తాము. ఫలితంగా గొప్ప విజయాలు సాధించ గలుగుతాము.

ఈ సందర్భంలో ఆశ మంచిదికాదని, కోరికని జయించాలని తెలియజేస్తూ నారదుడు ధర్మరాజుకు చెప్పిన కథ గుర్తుచేసుకుందాం.

వేటకు వెళ్ళిన సుమిత్రమహారాజు ఋష భుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఋషభుడు అలసి పోయి వచ్చిన రాజుకు చల్లటి నీళ్ళు, పళ్ళు ఇచ్చి "రాజా అడవిలోకి ఒక్కడివే ఎందుకు వచ్చావు?" అని అడిగాడు.

రాజు "మునీంద్రా! వేటకోసం వచ్చాను.



నా బాణం తగిలిన మృగం తప్పించుకుని పారి పోయింది. ఎలాగైనా ఆ మృగాన్ని పట్టు కోవాలనే ఆశతో ఇంతదూరం వచ్చాను. కాని ఆ మృగం దొరకలేదు" అని నిరాశగా చెప్పాడు.

ఋషభుడు "రాజా! వీరద్యుమ్నుడు అనే రాజు బదరికాశ్రమంలోని దనుడనే మునివద్దకు వెళ్లి మునీంద్రా ఆటల మీద మక్కువతో అడవిలోకి వెళ్ళిన నా ఒక్కగానొక్క కొడుకు ఇంతవరకు తిరిగిరాలేదు. ఎంత వెతికినా కొడకు జాడ తెలియలేదు. మీ సహాయం కోరి వచ్చాను అని చెప్పాడు. దనుడు రాజా! పరి స్థితులకు లొంగక ధైర్యంగా నిలబడేవారికి ఏదీ దుర్లభం కాదు. ఎవరైనా ఏదైనా ఇస్తానంటే ఆశ కలుగుతుంది. ఉచితంగా వచ్చేదాన్ని పొందాలనే కోరిక మనిషిని నిలబడనీయదు. అవతలి వ్యక్తి ఇవ్వకుండా ఎన్నాళ్ళు తప్పించు కున్నా ఆశ చావదు. కోరికలను వదిలేస్తేనే మనిషి సంతోషాన్ని పొందుతాడు. ఎవరైనా ఏదైనా అడిగితే లేదనకుండా ఉన్నంతలో ఇచ్చి అడిగినవారిని సంతృప్తి పరచి పంపడమే ఉత్తమ మానవ ధర్మం అని బోధించి తన తపశ్శక్తితో రాజు కుమారుడిని రప్పించి రాజుకు అప్పగించాడు. కాబట్టి తప్పించుకున్న మృగాన్ని వెంటాడి సాధించాలనే ఆశను వదిలి ప్రశాంతంగా జీవితం గడుపు" అని చెప్పాడు.

కోరికలను, అహంకారాన్ని వదిలిపెట్టి కర్తవ్యాలను నిర్వహిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు.



-మొండెపు ప్రసాద్

16

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కృషి చేస్తే ఫలితం

**శ్లోకం: న హి కశ్చిత్క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః॥ 3-5 ॥**

భావం: ఏవ్యక్తీ క్షణం కూడా ఏపనీ చెయ్యకుండా ఉండలేడు. మనుష్యులందరూ ప్రకృతి గుణములకు లోబడి కర్మలను చేస్తుంటారు.

వివరణ: బంధుమిత్రులను చంపడానికి ఇష్టపడక యుద్ధం చెయ్యనని చెప్పిన అర్జునుడకి శ్రీకృష్ణుడు సాంఖ్యయోగము బోధించాడు. అది వినిన అర్జునుడు కర్మ కంటే జ్ఞానమే శ్రేష్టమైనదైతే నన్ను భయంకరమైన యుద్ధం (కర్మ) చెయ్యమని ఎందుకు చెప్తున్నావని కృష్ణుడిని అడిగాడు. అప్పుడు కృష్ణుడు కర్మలను చేయనంత మాత్రాన ఎవ్వరూ సాంఖ్యయోగ స్థితిని పొందలేరు. కర్మలు చేయకుండా ఉండటం కంటే కర్మలు చెయ్యడం వలనే మంచి ఫలితాలు కలుగుతాయని, ప్రతి ఒక్కరూ తమ కర్తవ్య కర్మలను నిర్వర్తించాలని చెప్పి అర్జునుడు తన కర్తవ్యమైన యుద్ధం చేసేలా ప్రోత్సహించాడు.

చాలామంది లక్ష్యాన్ని నిర్ణయించుకుంటారు. ఆ లక్ష్యాన్ని సాధించడానికి అద్భుతమైన ప్రణాళిక కూడా సిద్ధం చేసుకుంటారు. కాని ఆ ప్రణాళిక ప్రకారం పనిచెయ్యరు. పనిచెయ్యక పోవడం వలన వారి లక్ష్యాలు, ప్రణాళికలు ఆలో చనలుగానే మిగిలిపోతాయి. గొప్ప ఆలోచనలు, తెలివితేటలు, ప్రణాళికలు ఉన్నంత మాత్రాన విజయం సాధించలేరు. వాటిని ఉపయోగించి ప్రయత్నం చేస్తేనే విజయం సాధించ గలుగుతారు.

ప్రయత్నం చేస్తే గెలవచ్చు, ఓడిపోవచ్చు. కాని ప్రయత్నమే చెయ్యకపోతే నిశ్చయంగా ఓడిపోయినట్టే. రైలు ప్లాట్ ఫారం మీదకి వచ్చినట్లు ఏదో ఒక రోజు అదృష్టం తమ కాళ్ళదగ్గరకి వస్తుందని కొంతమంది నమ్ముతారు. కాని రైలు ప్లాట్ ఫారం మీదకు వచ్చేసరికి మీరు ప్లాట్ ఫారం మీదకు వెళ్లి రైలు ఎక్కడానికి తయారుగా ఉంటేనే మీరు ప్లాట్ ఫారం మీదకు వచ్చిన రైలు ఎక్కి మీ గమ్యాన్ని చేరగలుగుతారు. ఆపాటి ప్రయత్నం మీరు చెయ్యాలి. కాని మీరు ఆ ప్రయత్నం కూడా చెయ్యకుండా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ కూర్చుంటే రైలు ప్లాట్ ఫారం మీదకు వచ్చి వెళ్ళిపోతుంది. మీరు రైలు ఎక్కలేరు, మీ గమ్యం చేరలేరు.

విజయం సాధించినవారికంటే తెలివైనవారు విజయం సాధించలేకపోయినవారిలో కొందరు

ఉన్నారనేది పచ్చి నిజం. మరి తెలివితేటలు ఉండి కూడా వారు విజయం ఎందుకు సాధించ లేకపోయారు?

ఏ పరీక్షలోనైనా, ఏ పనిలోనైనా, ఏ రంగంలోనైనా విజయం సాధించడానికి తెలివి ఒక్కటే సరిపోదు. కష్టపడి పనిచేస్తేనే విజయం లభిస్తుంది. ప్రపంచంలోని గొప్ప విజయాలను విశ్లేషిస్తే తెలివితేటల వలన సాధించిన విజయాలకంటే కష్టపడి పనిచేయడం వలన సాధించిన విజయాలే ఎక్కువని పలు సందర్భాలలో నిరూపితమయ్యింది.

అందుకే రెండువేలకు పైచిలుకు నూతన యంత్రాలను సృష్టించి అసామాన్య ప్రతిభాశాలిగా పేరుపొందిన థామస్ ఆల్వా ఎడిసన్ "ఆవిష్కారాలు ఆకస్మికం కావు. అవి అవిశ్రాంత పరిశ్రమకు లభించే ఫలాలు. ప్రతిభలో తెలివితేటలు ఒకవంతు మాత్రమె. తక్కిన తొంభై తొమ్మిది పాళ్ళు నిరంతర శ్రమ ఉంటుంది." అన్నాడు.

కష్టపడకుండా, పనిచెయ్యకుండా విజయం రావాలనుకోవడం సముద్రం ఒడ్డున నిలబడి కెరటాలు ఆగిన తర్వాత స్నానం చేద్దామని ఎదురుచూడటం వంటింది. కష్టపడి పనిచెయ్యకపోతే ఏ విజయసూత్రాలూ విజయాన్ని అందించలేవు. కష్టపడి పనిచేసేవారికి కాస్త ముందువెనుకలుగా అయినా విజయాలు తప్పకుండా లభిస్తాయి.

సులభమైన పనికి తక్కువ కాలం పడితే, కష్టమైన పనికి ఎక్కువ కాలం పడుతుంది, అసాధ్యమనిపించే పనికి మరింత ఎక్కువ కాలం పడుతుంది. అంతేకాని కష్టపడి పనిచేస్తే అసాధ్యమైనదేదీ ఉండదు.



ఈ పోటీ ప్రపంచంలో మిమ్మల్ని దాటి లక్ష్యాన్ని చేరుకోడానికి, విజయాన్ని సాధించడానికి లక్షలమంది అహోరాత్రులూ కృషి చేస్తుంటారు. అటువంటి తీవ్రమైన పోటీ పరిస్థితులలో విజయం సాధించాలంటే వారికంటే ఎక్కువగా, అదనంగా, ఏకాగ్రతతో, ఉత్సాహంతో, పట్టుదలతో కష్టపడి పనిచెయ్యాలి, విజయాన్ని సాధించాలి.

తోటివారు ఆదమరచి నిద్రిస్తుంటే నిశి రాత్రిలో ఎవరైతే రేపటి విజయాల కోసం కష్టపడి పనిచేస్తారో, వారినే అద్భుతమైన విజయాలు వరిస్తాయి. ప్రయత్నిస్తేనే ఊహలు నిజాలవుతాయి. మనం చేసే ప్రయత్నం బట్టే ఫలితాలు మనకందుతాయి.

మనం చేసిన పనుల ద్వారా నిరూపించగలిగితేనే మన ప్రతిభ గురించి, శక్తిసామర్థ్యాల గురించి, మంచితనం గురించి ఇతరులకు తెలుస్తుంది. కష్టపడి పనిచెయ్యడం వలన విజయాలు లభించడమే కాక మరో ముఖ్యమైన ప్రయోజనం కూడా ఉంది. పనిలో నిమగ్నమవ్వడం మూడు చెడులను దూరం చేస్తుంది – చెడు ఆలోచనలు, చెడు అలవాట్లు, విసుగు కాబట్టి కష్టపడి కృషిచేస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు.

**(ఇంకావుంది)**



-మొండెపు ప్రసాద్

17

# యువతకు భగవద్గీత చూపించిన దారి



శ్లోకం: కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్।

ఇన్ద్రియార్థాన్విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥ 3-6 ॥

భావం: బయటకు ఇంద్రియాలను నియంత్రించినట్లు ప్రవర్తిస్తూనే మనసులో ఇంద్రియ విషయాలను గురించే ఆలోచించడం వలన ప్రయోజనం ఉండదు.

### వివరణ

ఇంద్రియాలను అదుపులో ఉంచుకున్న

## మిమ్మల్ని మీరు మోసం చేసుకోవద్దు

మనిషి బుద్ధి స్థిరంగా ఉంటుంది. అతడిని మించిన విద్వాంసుడు, పండితుడు మరెవ్వరూ ఉండరు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలంటే ముందుగా మనసును జయించాలి. మనసుని జయించలేనివాళ్ళు ఎప్పటికీ ఇంద్రియాలకు దాసుడిగా ఉండిపోతారు. కాని కొంతమంది పైకి ఇంద్రియాలను జయించినట్లుగా ప్రవర్తిస్తూ, మాట్లాడుతూ లోపల మాత్రం ఇంద్రియసుఖాల గురించే ఆలోచిస్తుంటారు. అటువంటివారు కర్తవ్యాన్ని నిర్వహించకుండా నిర్వహిస్తున్నట్లుగా నటిస్తూ లోపల మాత్రం ఇంద్రియసుఖాల గురించి ఆలోచిస్తుంటారు. ఫలితంగా కర్తవ్యాలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతారు.

ఈ విషయాన్ని తెలియజేసే శిఖిధ్వజుడి కథను గుర్తుచేసుకుందాము.

శిఖిధ్వజుడనే రాజు భోగభాగ్యాల మీద, ఐహికసుఖాల మీద విరక్తి కలిగి రాజ్యాన్ని వదిలి తపస్సు చేసుకోడానికి అడవికి వెళ్ళిపోయాడు. అతని భార్య చూడాలకు కూడా వైరాగ్యభావం కలిగింది గాని ఆమె తన వైరాగ్య భావాన్ని బాహ్యచర్యలలో చూపించకుండా వస్తువుల పట్ల అభిమానాన్ని పూర్తిగా వదిలిపెట్టి ఏదీ నాదికాదు అనే భావనతో జీవించేది.

కొన్నాళ్ళ తర్వాత తన భర్త తపస్సు ఎలా సాగుతోందో తెలుసుకోడానికి చూడాల కాషాయ వస్త్రాలతో పురుష వేషం ధరించి అడవిలోని భర్త వద్దకు వెళ్లి "మీరు ఎవరు? దేనికోసం ఇక్కడ తపస్సు చేస్తున్నారు?" అని అడిగింది.

భార్యను గుర్తుపట్టలేకపోయిన శిఖిధ్వజుడు "నేను ఈ దేశాన్ని పరిపాలించే రాజును. శాశ్వత శాంతి కోసం రాజ్యాన్ని సకల సంపదలను వదిలి ఇక్కడకు వచ్చి తపస్సు చేసుకుంటున్నాను. అయినా నేను ఆశించిన శాంతి లభించలేదు" అని చెప్పాడు

చూడాల "సిరిసంపదలను వదిలినంత మాత్రాన సరిపోదు. వాటిపట్ల అభిమానాన్ని పూర్తిగా వదిలేయాలి. నువ్వింకా నారాజ్యం, నా

సంపదలు, నేను వాటిని వదిలేసాను అంటు న్నావు. అవి నావి, వాటిని నేను వదిలేసాను అనే భావన ముందు వదిలిపెట్టు. అది నిజమైన వైరాగ్యం. అప్పుడే నీకు శాశ్వతమైన శాంతి లభిస్తుంది." అని చెప్పింది.

✦ ✦ ✦

ఇంద్రియాలను జయించడం వలన కలిగే ఉపయోగం ఇంద్రియాలను జయించినవారికే గాని ఇతరులకు కాదు. కాబట్టి ఇంద్రియాలను జయించినట్లు నటించడం వలన ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. అలా ఇంద్రియాలను జయించినట్లు నటించడం వలన ఇంద్రియాలను జయించేసేమనే భ్రమలో ఉండి ఇంద్రియాలను జయించే ప్రయత్నం కూడా చెయ్యరు. ఫలితంగా ఎప్పటికీ ఇంద్రియాలను జయించలేక శాస్వతంగా నష్టపోతారు.

అదేవిధంగా కొంతమంది విద్యార్థులు మొబైల్ ఫోన్లో చాట్ చేస్తూ లేక కంప్యూటర్లో సినిమాలు చూస్తూ తల్లిదండ్రులు రాగానే ఆన్ లైన్ క్లాసులు వింటున్నట్లు ప్రవర్తిస్తారు. తల్లి





దండ్రులు తమ అబ్బాయి/అమ్మాయి బాగా చదువుతున్నాడని పొంగిపోయి అక్కడినుండి వెళ్ళిపోతారు. వారు వెళ్ళిపోగానే అబ్బాయి/ అమ్మాయి తల్లిదండ్రులను బాగా మోసం చెయ్య గలిగామని ఆనందపడిపోయి మళ్ళీ చాట్ చెయ్యడం / సినిమా చూడటం కొనసాగిస్తారు.

పిల్లలు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే తల్లిదండ్రులకు కలిగేది సంతోషం మాత్రమే. నిజమైన ప్రయోజనం కలిగేది పిల్ల లకే. చాట్ చేస్తూ / సినిమాలు చూస్తూ చదువు తున్నట్లుగా నటించడం వలన పరీక్షలలో మార్కులు తక్కువ వచ్చి నష్టం కలిగేది కూడా పిల్లలకే. కాబట్టి చదువుతున్నట్లుగా నటించి మిమ్మల్ని మీరు మోసం చేసుకోకండి.

కాబట్టి ఇంద్రియాలను జయించకుండానే జయించినట్లుగా నటిస్తూ, చదవకుండా చదువు తున్నట్లుగా నటిస్తూ, కర్తవ్యాన్ని నిర్వహించ కుండా నిర్వహిస్తున్నట్లుగా నటిస్తూ మనల్ని మనం మోసం చేసుకోకూడదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్



18

# యువతకు భగవద్గీత చూపించిన దారి

శ్లోకం: నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః।

శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేద కర్మణః ॥ 3-8 ॥

భావం: నీ కర్తవ్యములైన కర్మలు తప్పక చెయ్యి. కర్మలు చెయ్యకుండా వుండటం కంటే చెయ్యడమే ఉత్తమం. కర్మలు చెయ్యకపోతే శరీరనిర్వహణ కూడా సాధ్యం కాదు.

వివరణ: కురుక్షేత్రంలో యుద్ధం చెయ్యడానికి సిద్ధంగా ఉన్న కౌరవ, పాండవ సైన్యాలను చూసి అర్జునుడు యుద్ధంలో ఎవరు గెలుస్తారో తెలియదు, ఎవరు గెలిచినా ఇరు వైపులా ఉన్న బంధుమిత్రులు చాలామంది చనిపోతారు కాబట్టి యుద్ధం చెయ్యనని కృష్ణుడికి చెప్పాడు. అర్జునుడుకి శ్రీకృష్ణుడు సాంఖ్యయోగము బోధించాడు. అది వినిన అర్జునుడు కర్మ కంటే జ్ఞానమే శ్రేష్ఠమైనదైతే నన్ను భయంకరమైన యుద్ధం (కర్మ) చెయ్యమని ఎందుకు చెప్తున్నావని కృష్ణుడిని అడిగాడు. అప్పుడు కృష్ణుడు కర్మలను చేయనంత మాత్రాన ఎవ్వరూ సాంఖ్యయోగ స్థితిని పొందలేరు. కర్మలు చేయకుండా ఉండటం కంటే కర్మలు చెయ్యడం వలనే మంచి ఫలితాలు కలుగుతాయని, ప్రతీ ఒక్కరూ తమ కర్తవ్య కర్మలను తప్పకుండా నిర్వర్తించాలని చెప్పి అర్జునుడు తన కర్తవ్యమైన యుద్ధం చేసేలా ప్రోత్సహించాడు.

## పరాజయ భయంతో కర్తవ్యనిర్వహణ మానదు



గొప్ప పనులు చెయ్యడానికి, గొప్ప విజయాలు సాధించడానికి కావలిసింది శక్తి కాదు, పట్టుదల మాత్రమే. విజయానికి, పరాజయానికి మధ్య దూరం చాలా తక్కువ. చాలా విజయాలు తృటిలో తప్పిపోతుంటాయి. చాలామంది విజయం చేతికందేంత దూరంలో ఉండగా ప్రయత్నాన్ని విరమించుకొని విజయాన్ని శాశ్వతంగా చేజార్చుకుంటారు. ఎప్పుడూ, ఎట్టి పరిస్థితులలోనూ ప్రయత్నాన్ని విరమించకండి. మరునిమిషంలో మీకు విజయం ప్రాప్తించవచ్చేమో ఎవరికి తెలుసు?

పరుగుపందెంలో ఫినిషింగ్ లైన్ వైపు వేసే చివరి అడుగే విజయం. ప్రయత్నంలోని చిట్ట చివరి దశే విజయం. కాని ఆ చివరి దశ వచ్చే సరికి చాలామందికి ఓపిక నశిస్తుంది, అసహనం కలుగుతుంది. విజయం సాధించ లేనేమో అని అవిశ్వాసం కలిగి ప్రయత్నం విరమిస్తారు. అటువంటి వాళ్లకి విజయం ఎప్పటికీ అందదు.

కొందరు చేపట్టిన పని పూర్తికావడంలో కొంచెం ఆలస్యం జరిగినా సహించలేరు. చేస్తున్న పనిని అమాంతంగా ఆపేస్తారు. చేపట్టిన పనిని మధ్యలోనే ఆపెయ్యడం వలన అప్పటివరకు వెచ్చించిన వనరులు, శక్తిసామర్థ్యాలు, సమయం వృథా అవుతాయనే ఆలోచన వాళ్లకి ఉండదు.

ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

వేసవి తీవ్రత వలన గ్రామంలోని బావులన్నీ ఎండిపోయి గ్రామస్థులు మంచినీటికి విలవిలలాడుతున్నారు. కొత్తగా బావులు తవ్వాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గ్రామంలోని ఇద్దరు యువకులు తమకున్న పరిజ్ఞానాన్ని ఉపయోగించి నీరు పడే అవకాశమున్న ప్రదేశాన్ని ఎంపికచేసి బావి త్రవ్వడం మొదలుపెట్టారు. అంతకుముందు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవ్వడం వలన ఆ యువకులు చేసే ప్రయత్నం మీద నమ్మకం లేక గ్రామస్థులు ఆ యువకులకు సహాయం చెయ్యడానికి ముందుకురాలేదు. అందువలన ఆ యువకులు ఇద్దరే బావి త్రవ్వుతున్నారు.




ఎంతలోతు త్రవ్వినా నీటిజాడ కనిపించలేదు. అయినా నీరు పడుతుందనే ఆశతో త్రవ్వడం కొనసాగించారు. అలా త్రవ్వుతుండగా వారి చేతిలోని పలుగుకి పెద్ద బండరాయి తగిలింది. బండరాయి తగలడంతో ఇంక నీరు పడదనే నిరాశతో ఒక యువకుడు చేతిలోని పలుగును క్రింద పడేసి రెండో యువకుడితో త్రవ్వడం ఆపేద్దామన్నాడు. రెండో యువకుడు మరికొంతసేపు త్రవ్వి చూద్దామని చెప్పినా వినకుండా వెళ్ళిపోయాడు. రెండో యువకుడు మాత్రం పట్టువదలకుండా తన శక్తినంతా కూడదీసి బండరాయి మీద పలుమార్లు గట్టిగా పొడిచాడు. బండరాయి రెండు ముక్కలై పెద్ద శబ్దం చేస్తూ నీళ్ళు ఒక్కసారిగా పైకి ఎగజిమ్మాయి. నీటిని చూసిన ఉత్సాహంతో బండరాయిమీద మరో దెబ్బ గట్టిగా వేశాడు. నీరు లావాలా పైకి పొందింది. గ్రామస్తులందరూ అక్కడికి వచ్చి ఆ యువకుడిని అభినందనలతో ముంచెత్తారు.

కొన్ని నిమిషాల క్రితం నిరాశతో ప్రయత్నం ఆపి వెళ్ళిపోయిన మొదటి యువకుడు దూరంగా నిలబడి “మరికొన్ని నిమిషాలు ఓపికగా ప్రయత్నించివుంటే ఈ విజయంలో నాకు కూడా భాగం ఉండేది కదా!” అనుకొని బాధపడ్డాడు. ✦



19

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్



## పరాజయ భయంతో కర్తవ్యనిర్వహణ మానద్దు:2

**ప్రతికూల పరిస్థితులలో నిరాశ చెందకుండా ఉండటం, లక్ష్యాన్ని చేరుకొనేవరకు, విజయం సాధించేవరకు ప్రయత్నాన్ని విరమించకపోవడం విజయం సాధించడానికి చాలా అవసరం. ప్రయత్నం విరమించనంతవరకు విజయం సాధించకపోవడం పరాజయం కాదు.**

ప్రయత్నం మానేసినప్పుడు మాత్రమే విజయం సాధించకపోవడం పరాజయంగా మారుతుంది. లక్ష్యసాధనలో ఎదురయ్యే తాత్కాలిక ఓటములు మీ ప్రయత్నంలోనో, మీ ప్రణాళికలోనో మార్పులు అవసరమని తెలియజేసే అనుభవాలు మాత్రమే కాని శాశ్వత పరాజయాలు కావు.

విజయం సాధించేవారు విజయం సాధించే వరకు చేపట్టిన పనిని వదిలిపెట్టరు. చేపట్టిన పనిని మధ్యలోనే వదిలిపెట్టేసేవారు ఎప్పటికీ విజయం సాధించలేరు. ప్రపంచంలోని అతి గొప్ప విజయాలు ఎంతమాత్రం విజయావకాశాలు లేవని అనిపించిన సమయంలో కూడా పట్టువదలకుండా ప్రయత్నించడం వలనే లభించాయి.

థామస్ ఆల్వా ఎడిసన్ ఎలక్ట్రిక్ బల్బు కనిపెట్టడానికి కార్బన్ వంటి ఎన్నో లోహాలను ఉపయోగించాడు. కాని ఆశించిన ఫలితాలు రాలేదు. అయినా పట్టువదలకుండా ప్రయత్నించడం వలనే టంగస్టన్‌ని ఉపయోగించి ఎలక్ట్రిక్ బల్బుని తయారుచెయ్యగలిగాడు.

దేవదానవులు అమృతం కోసం పాల సముద్రాన్ని మదించినప్పుడు కాలకూట విషం వచ్చిందని ప్రయత్నం వదిలేయలేదు. అమృతం లభించేవరకు పట్టువదలకుండా ప్రయత్నం కొనసాగించారు.

ప్రతికూల పరిస్థితుల వలన గాని, తాత్కాలిక ఓటమిల వలన గాని, విజయం ఇంకా లభించలేదని గాని నిరుత్సాహం కలిగి ప్రయత్నం విరమించాలనే ఆలోచన కలిగినప్పుడు విజయం సాధిస్తే కలిగే సంతోషాన్ని ఊహించుకోండి. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలుపుతున్నప్పుడు కలిగే ఆనందాన్ని ఊహించుకోండి. అప్పుడు ఆ ఊహలను నిజం చేసుకోడానికి మరింత ఉత్సాహంతో ప్రయత్నించగలుగుతారు.

ఆశించిన ఫలితం / విజయం ఇంకా రాలేదని నిరుత్సాహంతో ప్రయత్నం విరమించకుండా కొనసాగిస్తే విజయం సాధించవచ్చని తెలియజేసే ఒక కథ చదువుదాము.


హిమాలయాలకు వెళ్లి పది సంవత్సరాలు తపస్సు చేసినా భగవదానుభూతి కలగక పోవడంతో శివయ్య సన్యాసం వదిలేసి సంసార

జీవితం గడపాలని నిర్ణయించుకొని తన సొంత ఊరికి బయల్దేరాడు. దారిలో రాజధాని నగరంలోని ఒక సత్రంలో బసచేసాడు. కొన్నాళ్ళు రాజధానిలోనే ఉండి ఉద్యోగమేదైనా సంపాదిస్తే పెళ్లి చేసుకోవడం, సంసారజీవితం గడపడం సులభమవుతుందని అనుకున్నాడు.

ఆరోజు సత్రంలో మయూరి నాట్యప్రదర్శన జరిగింది. ప్రేక్షకులు, నిర్వాహకులు ఆమె నాట్యాన్ని గొప్పగా మెచ్చుకొని ఆమెను ఘనంగా సన్మానించారు. మరో కళాసమితి వారు వచ్చి మరునాడు వారి నాట్యశాలలో కూడా ప్రదర్శన ఇవ్వమని అడిగారు. మయూరి ఒప్పుకోలేదు. కారణం అడిగిన తల్లితో “పది సంవత్సరాలుగా ఎన్నో నాట్యప్రదర్శనలు ఇచ్చాను. ఎన్నో సన్మానాలు, బహుమతులు పొందాను. కాని రాజు గారి సభలో నాట్యం చేసే అవకాశం రాలేదు. కళాకారులకి ప్రభుత్వ గుర్తింపుని మించిన సంతృప్తి ఇంకేమి ఉంటుంది? ఎంతగా సాధన చేసినా, ఎన్ని గొప్ప ప్రదర్శనలిచ్చినా నాకా అదృష్టం కలగట్లేదు. ఇకమీదట నేను ప్రదర్శనలు ఇవ్వను” అని నిరాశగా చెప్పింది.

ఆమె మాటలు విన్న శివయ్య అమెది కూడా తనకిలాంటి పరిస్థితే అనుకున్నాడు.

మయూరి తల్లి “నువ్వు చాలాకాలం పట్టు వదలకుండా ప్రయత్నం చేసావు. నువ్వు ఆశించిన ఫలితం ఎప్పుడైనా రావచ్చు. అది రేపు కావచ్చు, మరికొన్ని రోజుల తర్వాత కావచ్చు. కొంతమంది విజయానికి చాలా దగ్గరకు వచ్చి ఆవిషయం తెలుసుకోలేక ప్రయత్నం వదిలేసి పరాజయులుగా మిగిలిపోతారు. నువ్వు అలా చెయ్యకుండా ఇంకొంతకాలం పట్టువదలకుండా ప్రయత్నం కొనసాగించు. రాజాస్థానం నుండి పిలుపు తప్పకుండా వస్తుంది” అని



సలహా ఇచ్చింది.

తల్లి సలహా ప్రకారం మరునాడు నాట్య ప్రదర్శన ఇవ్వడానికి ఒప్పుకుంది. శివయ్య మరునాటి ప్రదర్శనకి కూడా వెళ్ళాడు. ప్రదర్శన పూర్తవ్వగానే ఇద్దరు రాజభటులు వచ్చి మహారాజుగారు రాజాస్థానంలో ప్రదర్శన ఇవ్వడానికి మయూరిని పిలిచారని కబురు చెప్పారు.

అది చూసిన శివయ్యకు ప్రయత్నం వదిలేసి తాను చేసిన తప్పు, మయూరి తల్లి సలహాలోని సత్యము అర్థమై ఆధ్యాత్మిక సాధన కొనసాగించడానికి హిమాలయాలకు తిరిగి ప్రయాణమయ్యాడు.

✦ ✦ ✦

కాబట్టి ఎన్ని ఆటంకాలు అడ్డుతగిలినా, ఎన్ని కష్టాలు కలిగినా, ఎన్ని సమస్యలు సతమతం చేసినా, పరాజయం ఎదురవుతుందని అనిపించినా కర్తవ్యాన్ని నిర్వర్తించడం ఆపకూడదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

20

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## ఆకర్షణలకు లోనై కర్తవ్యాన్ని విస్మరించద్దు

**శ్లోకం: ఏవం ప్రవర్తితం చక్రం నాను వర్తయతీహయః**

**అఘాయురిన్ద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 3-16 ॥**

భావం: ఇంద్రియసుఖాలకు బానిసై తన కర్తవ్యాన్ని నిర్వర్తించనివారి జీవితం వ్యర్థము.

వివరణ: బంధుమిత్రులను చంపి సాధించుకునే రాజ్యం గాని రాజభోగం గాని నాకు వద్దు, కౌరవులను చంపడం వలన మనకు పాపం కలుగుతుంది, యుద్ధం వలన వంశ నాశనం జరుగుతుంది - వంటి ఎన్నో కారణాలను చెప్పి యుద్ధం చేయనని చెప్పిన అర్జునుడికి మనసును మళ్ళించే ఆకర్షణలకు లోనై కర్తవ్య నిర్వహణను విస్మరించకూడదని శ్రీకృష్ణుడు బోధించాడు.

వారం రోజులలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఉండగా మీ అభిమాన హీరో సినిమా రిలీజయ్యింది. వెళ్లాలని మనసు లాగుతుంది. మీరేమి చేస్తారు? సినిమాకి వెళ్ళడం వలన మీ ప్రేపరేషన్‌లో కంటిన్యుటీ దెబ్బతిని పరీక్షలో ఫెయిల్ అయితే, ఇన్నాళ్ళ శ్రమ అంతా వృథా అవుతుంది. అవకాశం కోసం మరో సంవత్సరం ఎదురుచూడాలి. కాని అభిమాన హీరో సినిమా రిలీజయిన వెంటనే చూడాలనే కోరికను నియంత్రించుకుని పరీక్షకు ప్రిపేర్ అయితే, అభిమాన హీరో సినిమా పరీక్ష రాసిన తర్వాత కూడా థియేటర్లో వుంటే థియేటర్లో చూడచ్చు, పరీక్ష అయ్యేసరికి థియేటర్లో లేకపోతే రెండు నెలల తర్వాత టివిలో వేసినప్పుడు చూడచ్చు.

✦ ✦ ✦

అర్థశాస్త్రంలో కౌటిల్యుడు - విజయం సాధించడానికి కామము, క్రోధము, లోభము, గర్వము వంటి గుణాలను త్యజించి ఇంద్రియాలను అదుపులోకి తెచ్చుకోవాలని చెప్పాడు.

గమ్యం / లక్ష్యం చేరే దారిలో మనసును మళ్ళించే ఆకర్షణలకు లోనవ్వడం వలన లక్ష్యం చేరుకోలేకపోతామని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

అనేక పరుగు పందాలలో విజయం సాధించిన గొప్ప అందగత్తె అయిన ఒక రాజకుమారి పరుగు పందెంలో తనను ఓడించిన వారిని వివాహం చేసుకుంటానని ప్రకటించింది. ఆమెను పెళ్లి చేసుకోవాలనే ఆశతో వచ్చిన చాలామంది రాజకుమారులు పరుగు పందెంలో ఓడి నిరాశతో వెనక్కి వెళ్ళిపోయారు.

రాజకుమారికి బంగారు గాజులంటే చాలా ఇష్టమని తెలుసుకున్న విజయ్ అనే యువకుడు ఆమెను ఓడించడానికి ఒక పథకం వేశాడు. రకరకాల బంగారు గాజులు పోగుజేసి తన

జేబులో వేసుకొని పరుగు పందెంలో పాల్గొన్నాడు. పరుగెత్తేడప్పుడు తన జేబులోని గాజులను తీసి రాజకుమారికి కనబడేలా దారిలో జారవిడుస్తూ పరుగెత్తాడు. బంగారు గాజుల మీద గల వ్యామోహంతో రాజకుమారి ఆ బంగారు గాజులను ఏరుకుంటూ పరుగెత్తింది. గాజులను ఏరుకోవడం కోసం సమయం వెచ్చించడం వలన రాజకుమారి పందెంలో ఓడిపోయింది.

ఆవిధంగా గమ్యం చేరే దారిలో మనసును మళ్ళించే ఆకర్షణకు లోనవ్వడం వలన రాజకుమారి పందెం ఓడిపోయింది.

✦ ✦ ✦

సుందరకాండలో – ఇక్ష్వాకు వంశీయులైన సగరుల వలన వృద్ధి పొందిన సాగరుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన శ్రీరాముని కార్యం మీద వెళ్తున్న హనుమంతునికి సహాయపడి తన కృతజ్ఞతను చాటుకోవాలనుకొని తనలో మునిగి వున్న మైనాకుడిని పిలిచి హనుమంతుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన శ్రీరాముని కార్యం మీద వెళ్తున్నాడు. నువ్వు సముద్రంలో నుండి పైకి లేచి నిలబడితే అతను కొంతసేపు విశ్రాంతి తీసుకొని వెళ్తాడని చెప్పాడు.

మైనాకుడు సముద్రములోనుండి పైకిలేచి హనుమంతుడితో "సాగరుడు తన కృతజ్ఞత తెలుపుకోడానికి నన్ను పంపాడు. ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యడం ధర్మం. నా సానువుల మీద ఉన్న మధురమైన కందమూల ఫలాలు ఆరగించి విశ్రాంతి తీసుకొని వెళ్ళు." అని చెప్పాడు.

బదులుగా హనుమంతుడు "మైనాకా! నీ ఆదర వచనాలు నాకు చాలా సంతోషాన్ని కలిగించాయి. ఇప్పుడు నేను ఆగడానికి వీలు



లేదు. సూర్యాస్తమయానికి ముందే ఆవలి తీరం చేరాలి. మరోవిధంగా భావించకు. అతిథి సత్కారం అందినట్లే భావించు." అని మృదువుగా చెప్పి తన చేతితో గిరి శిఖరాన్ని స్పృశించి ముందుకు సాగాడు.

సుదూరమైన నూరు యోజనాల ప్రయాణం. అవకాశం దొరికితే కొంతసేపు విశ్రాంతి తీసుకొని, ఫలహారాలు తిని తిరిగి శక్తిని పుంజుకుని వెళ్ళాలనిపించటం సహజం. కాని హనుమంతుడు అటువంటి ఆకర్షణకు లోను కాకుండా మైనాకుడి ఆతిధ్యాన్ని తిరస్కరించాడు. రామబాణంలా ఎక్కడా ఆగకుండా లంకకు వెళ్తానని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాడు.

✦ ✦ ✦

ఆవిధంగా కర్తవ్య నిర్వహణలో / లక్ష్య సాధనలో మనసును మళ్ళించే ఆకర్షణలకు లోనవ్వకుండా ఏకాగ్రతతో ప్రయత్నిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦

21

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్

**శ్లోకం: తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।**

**అసక్తో హ్యాచరన్కర్మ పరమాప్నోతి పూరుషః ॥ 3-19 ॥**

భావం: ఆసక్తిరహితుడవై నీ కర్తవ్యాలను నిర్వర్తించు. ఆసక్తిని వదిలి కర్మలను ఆచరించేవాళ్లకు గొప్ప ఫలితాలు లభిస్తాయి.

వివరణ: యుద్ధం జరిగితే ఎవరు గెలుస్తారో తెలియదు, ఇరుపక్షాలలోని బంధుమిత్రులు చాలామంది మరణిస్తారు, బంధుమిత్రులను చంపడం వలన పాపం కలుగుతుంది, యుద్ధం వలన వంశ నాశనం జరుగుతుంది- వంటి యుద్ధం చెయ్యడం వలన కలిగే ఫలితాల గురించి ఆందోళనతో యుద్ధం చేయనని చెప్పిన అర్జునుడికి శ్రీకృష్ణుడు

## ఫలితం గురించి ఆందోళన పడకుండా కర్తవ్యాన్ని నిర్వహించాలి



ఫలితం గురించి ఆందోళన చెందకుండా కర్తవ్యాలను నిర్వహించాలని బోధించాడు.

ఫలితం ఎలా ఉండబోతోందో అనే ఆందోళన వలన మనసు ఒకచోట నిల బడదు, దేనిమీదా లగ్నం కాదు, ఆలోచన తిన్నగా సాగదు. ఫలితంగా నిర్ణయం తీసుకునే శక్తి నశిస్తుంది. కాబట్టి ఆందోళనను తగ్గించుకుని ప్రశాంతమైన మనసుతో కర్తవ్యాన్ని నిర్వ ర్తించాలి.

ఫలితం ఎలా ఉండబోతోందో అని ఆందోళన చెందకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి ఉపయోగపడే మూడు మార్గాలను పరిశీలిద్దాము.

మీరు ఆశించిన ఫలితం రాకపోతే జరిగే అతిపెద్ద నష్టం / అనర్థం ఏమిటి? అని ఆలోచించండి. ఆ నష్టాన్ని / అనర్థాన్ని ఒప్పుకోడానికి మానసికంగా సిద్ధపడండి. అలా సిద్ధపడడం వలన మీ ఆందోళన దూరమై మనసుకు ప్రశాంతత కలుగుతుంది. ప్రశాంతమైన మనసుతో మీరు మానసికంగా అంగీకరించిన నష్టాన్ని / అనర్థాన్ని తగ్గించడానికి మార్గాలు అన్వేషించి తగిన చర్యలు తీసుకోండి.

✦ ✦ ✦

ఏదైనా సమస్య గురించి ఆందోళన చెందుతున్నప్పుడు ఈ క్రింది ప్రశ్నలను ఒక కాగితం



మీద రాసి వాటికి సమాధానాలు ఆలోచించండి.

సమస్య ఏమిటి?

సమస్యకు కారణాలు ఏమిటి?

సమస్యకు పరిష్కారాలు ఏమిటి?

వాటిలో ఉత్తమమైన పరిష్కారం ఏమిటి?

అలా ఆలోచించాక ఉత్తమమైన పరిష్కా రాన్ని అమలుచేయండి.

✦ ✦ ✦

నిర్ణయం తీసుకోడానికి తగిన డేటా (వివరాలు) తమ వద్ద లేనప్పుడు సమస్య చాలా పెద్దదిగా, అత్యంత జటిలంగా కనిపిస్తుంది. అందువలన ఆందోళన పెరుగుతుంది.

కాబట్టి ఏదైనా సమస్య గురించి ఆందోళన చెందుతున్నప్పుడు పరిష్కారం గురించి ఆందోళన చెందటం మానేసి ఆ సమస్యకు సంబంధించిన అన్ని వాస్తవాలను (ఫేక్ట్స్), పూర్తి సమాచారాన్ని (డేటా) సేకరించండి. అలా సేక రించేడప్పుడు మీకు నచ్చిన లేక మీకు అనుకూ లించేవాటిని మాత్రమే కాక ప్రతీ వాస్తవాన్ని, ప్రతీ డేటాను సేకరించండి. నిర్ణయం తీసు కోవలసి వచ్చినప్పుడు అలా సేకరించిన వాస్త వాలను / డేటాను పరిశీలించండి. మీరు నిర్భ యంగా, సులభంగా సరైన నిర్ణయం తీసుకో గలుగుతారు.

✦ ✦ ✦

కాబట్టి ఫలితం ఎలా ఉండబోతోందో అని ఆందోళన చెందకుండా కర్తవ్యాన్ని నిర్వహిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

22

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః।**

**లోకసంగ్రహమేవాపి సమ్పశ్యన్కర్తు మర్హసి॥ 3-20 ॥**

భావం: జనకుడి వంటి గొప్ప జ్ఞానులు ఆసక్తిరహితంగా కర్తవ్యాలను నిర్వర్తించడం ద్వారా గొప్ప ఫలితాలను పొందారు.


శ్లోకం: యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః।

స యత్ప్రమాణం కురుతే లోకస్తదను వర్తతే ॥ 3-21 ॥

భావం: గొప్పవారి ప్రవర్తనలను, మార్గాలను ఇతరులు అనుసరిస్తారు.


వివరణ: ఫలితం ఎలా ఉండబోతోందో అనే ఆందోళన, ఆసక్తి వదిలిపెట్టి కర్తవ్యాన్ని నిర్వహించాలని అర్జునుడికి బోధిస్తూ శ్రీకృష్ణుడు జనకుడి వంటి గొప్ప జ్ఞానులు ఫలితం మీద ఆసక్తిని వదిలి కర్తవ్యాలను నిర్వర్తించడం ద్వారా గొప్ప ఫలితాలను పొందారు, అటువంటి గొప్ప వారి మార్గాలను అనుసరించాలని చెప్పాడు.


## గొప్పవారి ఆత్మకథలు చదవండి




మనిషిని మంచి మార్గంలోకి మళ్ళించడానికి, విజయంవైపు మళ్ళించడానికి, ఉత్సాహపరచడానికి కావలిసింది ఊకదంపుడు ఉపన్యాసాలు కాదు, ఉదాహరణలు. ఉదాహరణలు విజయాలు సాధించిన వ్యక్తుల అనుభవాల నుండి లభిస్తాయి.

గొప్పవ్యక్తుల జీవితచరిత్రలను చదవడం వలన వారు లక్ష్యసాధనలో ఎదురైన కష్టాలను, అవాంతరాలను, అవరోధాలను, అవమానాలను, బాధలను ఎలా అధిగమించి విజయాలు సాధించారో తెలుస్తుంది. మీరు గాంధీ, అబ్రహాం లింకన్, చర్చిల్ వంటి గొప్ప వ్యక్తుల చరిత్రలు చదివితే వారు మీకు దూరంలో ఉన్న




మార్గదర్శకులుగా మారతారు.

మీకేదైనా సమస్య లేక అవరోధం లేక కష్టం ఎదురైనప్పుడు అటువంటి పరిస్థితులలో మీ మార్గదర్శకులు (మీరు ఏ గొప్పవ్యక్తుల జీవిత చరిత్రలు చదివారో వారు) ఎలా ఆలోచించే వారు? ఏమి నిర్ణయం తీసుకొనివుండేవారు? అని ఆలోచిస్తే మీకు సరైన మార్గం / పరిష్కారం తెలుస్తుంది.

మీరు ఏ రంగంలో విజయం సాధించాలనుకుంటే ఆ రంగంలో గొప్ప విజయాలు సాధించినవారి జీవితచరిత్రలు చదవండి.

ఉదాహరణకి మీరు క్రికెట్ ఆటలో ఫాస్ట్ బౌలర్ అవ్వాలనుకుంటే ఫాస్ట్ బౌలరుగా గొప్ప విజయాలు సాధించినవారి జీవితచరిత్రలు చదవండి. అందువలన ఎటువంటి బ్యాట్స్‌మెన్‌కు ఎటువంటి బంతులు వెయ్యాలి? పిచ్ ఫాస్ట్ బౌలింగుకి అనుకూలంగా లేనప్పుడు ఎటువంటి బంతులు వెయ్యాలి? ఎంత ప్రయత్నించినా వికెట్ పడకపోతే ఏమి చెయ్యాలి? కెరియర్‌లో ఎప్పుడూ ఫామ్ కోల్పోకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలి? ఫామ్ కోల్పోతే తిరిగి ఫామ్ లోకి రాడానికి ఏమి చెయ్యాలి? అనే ఎన్నో ఉపయోగకరమైన విషయాలు తెలుస్తాయి. మీరు కూడా ఆ టెక్నిక్‌లని ఉపయోగించి గొప్ప ఫాస్ట్ బౌలర్ కాగలుగుతారు.

ఆవిధంగా గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలు చదివి వారి అడుగుజాడలలో నడిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

23

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు క్చిన।**

**నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 3-22 ॥**

భావం: అర్జునా! ముల్లోకాలలో నాకు కర్తవ్యం అనేది లేదు. నేను పొందనిది ఏదీ లేదు, నేను పొందవలసినది ఏదీ లేదు. అయినా నేను కర్మలు చేస్తూనే వున్నాను.

శ్లోకం: యది హ్యహం న వర్తేయం జాతు చెలరేగే అల్లకల్లోలాకు, ప్రజానష్టాలకు నేను కారకుడినవుతాను.

వివరణ: నాకు రాజ్యము వద్దు, రాజ్య భోగమూ వద్దని తన కర్తవ్యమైన యుద్ధం చెయ్యడానికి నిరాకరించిన అర్జునుడితో శ్రీకృష్ణుడు - నాకు ప్రత్యేకంగా నిర్దేశించబడిన కర్తవ్యం అంటూ ఏదీ లేదు. అయినా నేను కర్మలు చేస్తూనే ఉన్నాను. ఎందుకంటే దేవ దేవుడినైన నేను కర్మలు చెయ్యడం మానేస్తే

## నాయకుడు కూడా పనిచెయ్యాలి

కర్మణ్యతన్ద్రితః।

మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥ 3-23 ॥

భావం: నేను కర్మలను చెయ్యడం మానేస్తే లోకానికి చాలా హాని కలుగుతుంది. ఎందుకంటే మనుష్యులందరూ నా మార్గాన్నే అనుసరిస్తారు, కర్మలను చెయ్యడం మానేస్తారు.

శ్లోకం: ఉత్సీదేయురిమే లోకాన కుర్యాం కర్మ చేదహమ్।

స్కరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః ॥ 3-24 ॥

భావం: నేను కర్మలను ఆచరించడం మానేస్తే లోకాలన్నీ నశిస్తాయి. లోకములలో మనుష్యులు నన్ను అనుసరించి కర్మలు చెయ్యడం మానేస్తారు. ఫలితంగా లోకానికి నష్టం కలుగుతుంది. కాబట్టి నువ్వు కూడా నీ కర్తవ్య కర్మ అయిన యుద్ధం చేయమని బోధించాడు. కాబట్టి నాయకుడు కూడా తన కర్తవ్యాన్ని నిర్వహించి అనుచరులకు ఆదర్శంగా ఉండాలి, ప్రేరణ కలిగించాలి.

ఏ పని చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్పాక యజమాని "మీరు వెళ్లి చెయ్యండి" అంటాడు, నాయకుడు "పదండి వెళ్లి చేద్దాం" అంటాడు. కొన్ని పనులను ఇతరులకు అప్పగించాలి. కాని మనం స్వయంగా చేయవలసిన సమయం వచ్చినప్పుడు పనిచెయ్యడానికి ముందుకు



రావాలి.

ఇతరులచేత చేయించాలనుకున్న పనిని ముందుగా తాను చేసి చూపిస్తే ప్రచారం లేకుండానే ఇతరులు కూడా అనుసరిస్తారు. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథను గుర్తు చేసుకుందాము.

ఒక జమిందారు అడవిలో ఉన్న ఆనంద స్వామి ఆశ్రమానికి బయల్దేరాడు. కొంత దూరం ప్రయాణం చేసాక దారికిరువైపుల అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లకొమ్మలని కొడ వలితో కోస్తూ దారి చదునుచేస్తున్న కొంత మంది కనబడ్డారు. వారిలో పెద్ద వయసున్న వ్యక్తిని "ఆశ్రమం ఎంత దూరంలో ఉంది? స్వామిజీ ఆశ్రమంలోనే ఉన్నారా?" అని అడి గాడు.

ఆ వ్యక్తి "ఆశ్రమం కిలోమీటరు దూరంలో ఉంది. మీరు వెళ్లి ఆశ్రమంలో ఉన్న విశ్రాంతి మందిరంలో వేచి ఉండండి స్వామి ఒక గంటలో వస్తారు" అని చెప్పాడు.

జమిందారు ఆశ్రమానికి వెళ్లి విశ్రాంతి మందిరంలో వేచి ఉన్నాడు. గంట తర్వాత స్వామిజీ నుండి పిలుపు రావడంతో జమిందారు స్వామీజీ మందిరానికి వెళ్ళాడు. తనకు ఆశ్రమానికి దారి చెప్పిన వ్యక్తే స్వామీజీ అని పోల్చుకొని "స్వామీ! చెట్లకొమ్మలని కోయడం, దారి చదునుచేయడం వంటి పనులు మీ శిష్యులతో పాటూ మీరు కూడా ఎందుకు చేస్తున్నారు? మీకు చాలామంది శిష్యులు ఉన్నారు. వారికి చెప్తే వారు చేస్తారు కదా?" అని అడిగాడు.

"గురువు చేస్తున్నప్పుడు చూసి శిష్యులు పనిలోని మెళకువలు నేర్చుకుంటారు. గురువు తమతో కలిసి పనిచేస్తే శిష్యులు మరింత ఉత్సాహంగా, జాగ్రత్తగా పనిచేస్తారు. కాబట్టి గరువు కూడా పని చెయ్యాలి, సాధన చెయ్యాలి. శిష్యులకు ఆదర్శంగా ఉండాలి." ఆనంద స్వామి వివరించాడు.

✦ ✦ ✦

నాయకుడు అనుచరులను శాసించడం




ద్వారా మంచి ఫలితాలు సాధించలేడు. ఉపాధ్యాయుడు విద్యార్థులను భుజం తట్టి ప్రోత్సహించినట్లుగా నాయకుడు తన అనుచరులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. నాయకుడిలో మోటివేట్ చేసే (ఉత్సాహపరచే) నేర్పు లేనప్పుడు అనుచరులను / ఉద్యోగస్తులను మార్చడం వలన ప్రయోజనం ఉండదు.

నాయకత్వ లక్షణాలు లేకుండా విజయం సాధించడం అసాధ్యం. గొప్ప లక్ష్యాలను సాధించేక్రమంలో నాయకత్వ లక్షణాలు చాలా అవసరం. నాయకులు తమ అనుచరులను మోటివేట్ చేసి (ప్రోత్సహించి) పని చేయించాలి. కాని ఎవరు దేనికి మోటివేట్ అవుతారో తెలుసుకొని ఎవరికి తగినట్లు వారిని మోటివేట్ చెయ్యాలి. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాం.

ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక ఆవుదూడను పశువులకొట్టం లోపలి తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ళిద్దరూ కష్టపడి దూడను ఒక అడుగు కొట్టం వైపు లాగితే, అది రెండు అడుగులు వెనక్కి లాగుతోంది. పదేళ్ళ బాలుడు వారి అవస్థ చూసి నేను ప్రయత్నిస్తానని చెప్పి వారి చేతిలోని పలుపుతాడు తీసుకున్నాడు. దూడ తల మీద, మెడ మీద ప్రేమగా నిమిరి, అంబా అని ఆవులా శబ్దం చేస్తూ పశువుల కొట్టంలోకి నడిచాడు. దూడ మంత్రం వేసి నట్లు ఆ బాలుడి వెనకే కొట్టంలోకి వెళ్ళింది.

కాబట్టి ఎవరు దేనికి మోటివేట్ అవుతారో తెలుసుకొని దానికి తగినట్లు వారిని మోటి వేట్ చేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించ వచ్చు.

✦ ✦ ✦

నాయకుడు / మేనేజర్ / యజమాని కేవలం ఆర్డర్లు / సూచనలు ఇవ్వడం మాత్రమే కానుండా పని కూడా చేసి అనుచరులకు, క్రింది ఉద్యోగస్తులకు ఆదర్శంగా నిలబడి, ప్రేరణనిస్తే ఆ టీము అద్భుతమైన విజయాలు సాధిస్తుందని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

24

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కర్తవ్యమే దైవం – కర్తవ్యనిర్వహణే పూజ

**శ్లోకం: మయి సర్వాణి కర్మాణి సంన్యస్యా ధ్యాత్మచేతసా।**

**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 3-30 ॥**

భావం: నీ మనసును పరమాత్మనైన నాయందే లగ్నం చేసి, చేసే కర్మలను నాకే అర్పించి ఆశ మరియు మమతలను విడిచి పెట్టి నీ కర్తవ్యమైన యుద్ధం చెయ్యి.

వివరణ: కర్మ కంటే జ్ఞానమే శ్రేష్ఠమైనదైతే నన్ను భయంకరమైన యుద్ధం (కర్మ) చెయ్యమని ఎందుకు చెప్తున్నావని అడిగిన అర్జునుడికి శ్రీకృష్ణుడు కర్తవ్యాన్ని దైవంగా, కర్తవ్య నిర్వహణని పూజగా భావించి కర్తవ్యాన్ని నిర్వహించమని చెప్పాడు.

కర్తవ్యాన్ని దైవంగా భావించి పనిచేస్తే విజయం తప్పక లభిస్తుంది. కర్తవ్యమే దైవం, కర్తవ్యనిర్వహణే పూజ అని తెలియజేసే రెండు కథలు చదువుదాము.

✦ ✦ ✦

చెప్పులు కుట్టి వచ్చిన సంపాదనతో జీవించే రైదాస్ వృత్తిని దైవంగా, పని చెయ్యడాన్ని దైవపూజగా భావించి తన పని చేసేవాడు. ఒక పర్వదినాన ఒక సాధువు గంగా స్నానానికి వెళ్తూ రైదాస్‌ను కూడా రమ్మని పిలిచాడు.



“కుట్ట వలసిన చెప్పులు కొన్ని ఉన్నాయి. ఇస్తానన్న సమయానికి చెప్పులు కుట్టి ఇవ్వకపోతే చెప్పులు ఇచ్చినవారికి ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి రాలేను. గంగానది స్నానం చేసే భాగ్యం నాకు ఇంకా కలగలేదు. ఈ డబ్బులు గంగా మాతకు సమర్పించండి స్వామి” అని చెప్పి రైదాస్ కొన్ని పైసలు సాధువుకు ఇచ్చాడు.

సాధువు గంగానదిలో స్నానం చేసి తిరిగి వచ్చే సమయంలో రైదాస్ ఇచ్చిన పైసలు గంగలో వేశాడు. రెండు అందమైన దివ్య హస్తాలు నీటిలోనుండి పైకి వచ్చి ఆ పైసలను స్వీకరించాయి. సాధువు ఆశ్చర్యపోయాడు.

రైదాస్ వద్దకు వచ్చి “గంగామాత

స్వయంగా చేతులు చాచి నీవిచ్చిన పైసలు తీసుకుందంటే నువ్వు చాలా గొప్ప పూజలు చేసి ఉంటావు. ఆ పూజలు ఏమిటో నాకు కూడా చెప్పు" అని అడిగాడు

"స్వామీ! అది నా కర్తవ్యనిర్వహణ యొక్క ప్రతిఫలం మాత్రమే. నేను ఎటువంటి ప్రత్యేక మైన పూజలు చేయలేదు. కర్తవ్యాన్ని దైవంగా, కర్తవ్యనిర్వహణని పూజగా భావించి నా కర్త వ్యాలను నిర్వహించాను." అని వివరించాడు.

✦ ✦ ✦

మరోకథ చదువుదాము...

"... కాబట్టి దేవుడి అనుగ్రహం సంపాదించ డానికి ఆయన్ని స్తుతించడం కంటే ఆయన మనకి నిర్దేశించిన కర్తవ్యాన్ని శ్రద్ధగా చేయడమే ఉత్తమమార్గం" అని చెప్పి స్వామీజీ ప్రవచనం ముగించాడు

కోటేశ్వరరావు అనే భక్తుడు స్వామీజీ వద్దకు వెళ్లి "స్వామీ! కలియుగంలో దైవనామస్మరణని మించిన పూజ లేదని కొంతమంది చెప్పగా విన్నాను. మీరేమో కర్తవ్యమే దైవం, కర్తవ్యనిర్వ హణే గొప్ప పూజ అని చెప్పారు. వీటిలో దేనిని నమ్మాలో నాకు తెలియడంలేదు" అని అడి గాడు.

"నువ్వు ఆఫీసులో నీ క్రింది ఉద్యోగుల వార్షిక పనితీరు నివేదికలు (ఇయర్లీ పెర్ఫార్మెన్స్ రిపోర్ట్) రాస్తావా?" స్వామీజీ అడిగాడు

"రాస్తాను స్వామీ"

"ఒక ఉద్యోగి ప్రతీరోజూ పని లేక పోయినా నీ చాంబర్లోకి వచ్చి నీ అంతటి ప్రతిభావంతుడైన అధికారి లేడని పొగుడు తాడు, పండుగలప్పుడు మీ ఇంటికి పండ్లు, స్వీట్లు తీసుకొస్తాడు, కాని పని మాత్రం సక్ర మంగా చెయ్యడు. రెండో ఉద్యోగి అటువంటి వేమీ చెయ్యడు కాని పని మాత్రం శ్రద్ధగా, సక్రమంగా చేస్తాడు. వార్షిక పనితీరు నివే దికలో వారిద్దరిలో ఎవరికి ఎక్కువ పాయింట్లు ఇస్తావు?"

"రెండో ఉద్యోగికి స్వామి"

"నీ థీరీ ప్రకారం రోజూ నీ నామస్మరణ చేసే మొదటి ఉద్యోగికి ఎక్కువ పాయింట్లు ఇవ్వాలికదా?"

"పొగడ్తలకు, బహుమతులకు లొంగి పోయి వార్షిక పనితీరు నివేదికలో ఎక్కువ పాయింట్లు ఇచ్చేవాడు మంచి అధికారి కాడు. చేసిన పనిని చూసి పాయింట్లు ఇచ్చేవాడే మంచి అధికారి. పొగడ్తలకు, బహుమతులకు లొంగిపోయి ఎక్కువ పాయింట్లు ఇస్తే, అలా పాయింట్లు తెచ్చుకున్న ఉద్యోగి కూడా ఆ అధికారిని గౌరవంగా చూడడు. ఎదురుగా కృతజ్ఞత ప్రకటించినా వెనకాల ఈ అధికారి పొగడ్తలకు, బహుమతులకు పడిపోయే చెత్త మనస్తత్వం గలవాడని ప్రచారం చేస్తాడు." కోటేశ్వరరావు కారణం చెప్పాడు.

స్వామీజీ చిన్నగా నవ్వి "నువ్వే ఇంత గొప్పగా ఆలోచించగలిగినప్పుడు మన అందరికంటే ఎంతో గొప్పవాడైన దేవుడు కర్త వ్యాలను సక్రమంగా నిర్వహించినవారిని ప్రక్కన పెట్టి, కర్తవ్యాలు నిర్వహించకుండా కేవలం తన నామస్మరణ చేసేవాళ్ళని అను గ్రహిస్తాడని ఎలా



అనుకుంటావు?" అన్నాడు.

✦ ✦ ✦

భక్తి, వైరాగ్యం అంటే కుటుంబాన్ని వదిలేసి అడవులకు పోయి తపస్సు చేసు కోవడం, కర్తవ్యాలను, బాధ్యతలను వదిలేసి రోజంతా పూజలు చేస్తూ గడపటం కాదు. దైవం మనకు ప్రసాదించిన కర్తవ్యాన్ని నిజా యితీగా, ఫలితం ఆశించకుండా నిర్వర్తిం చడమే అత్యంత గొప్ప దైవపూజ.

దేవుడు తమ కర్తవ్యాలను నిర్వర్తించని వారికి సహాయం చెయ్యడని, కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించేవారికే సహాయం చేస్తా డని తెలియజేసే ఒక కథ చదువుదాము.

ఒక సంగీతం మాష్టారు విద్యార్థుల ఇళ్ళకి వెళ్లి సంగీతం నేర్పి వారిచ్చిన డబ్బులతో జీవితం గడిపేవాడు. ఒకరోజు సంగీతం నేర్పి ఆలశ్యంగా ఇంటికి వచ్చాడు.

అతని భార్య "బావి దగ్గరకు వెళ్లి తొందరగా స్నానం చేసిరండి. ఈలోపు అన్నం వడ్డిస్తాను" అని చెప్పింది.

తొందరగా స్నానం చేసే ప్రయత్నంలో చేద బావిలో పడిపోయింది. సంగీతం మాష్టారు బావిలోని చేదను పైకితీసే ప్రయత్నం చెయ్య కుండా "రామా! భారము నీదే రామా!" అని పాడసాగాడు.

అంతలో అతని భార్య వచ్చి బావిలో పడిపోయిన వస్తువులను పైకి తీసే గాలాన్ని బావిలోకి వేసి బావిలో పడిపోయిన చేదను పైకి తీసి "మన ప్రయత్నం మనం చెయ్య కుండా భారం నీదే రామా! అని పాటలు పాడితే పనులు జరగవు" అని చెప్పింది.

✦ ✦ ✦

కర్తవ్యాన్ని దైవంగా , కర్తవ్యనిర్వహణని పూజగా భావించి కర్తవ్యాన్ని నిర్వహిస్తే అద్భు తమైన విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

25

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కోరికల వలన కర్తవ్యనిర్వహణలో తప్పులు

**శ్లోకం: అర్జున ఉవాచ।**

**అథ కేన ప్రయుక్తోయం పాపం చరతి పూరుషః।**

**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥3-36 ॥**

భావం: కృష్ణా! మానవుడు తనకు ఇష్టం లేకపోయినా దేని ప్రభావం వలన ఎవరో బలవంతం చేసినట్లుగా ప్రేరేపితుడై పాపపు పనులు చేస్తాడు?

శ్లోకం: ధూమేనావ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ।

యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్ ॥ 3-38 ॥



భావం: పొగచే అగ్ని, ధూళిచే అద్దము, మావిచే గర్భము కప్పివేయబడి ఉండునట్లు కామముచే జ్ఞానము కప్పబడి ఉంటుంది.

శ్లోకం: ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా।

కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణానలేన చ ॥ 3-39 ॥

భావం: అర్జునా! కామము అగ్ని వంటిది. అది ఎప్పటికీ చల్లారదు. అది జ్ఞానమును కప్పివేస్తుంది.

శ్లోకం: ఇన్ద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠాన ముచ్యతే।

ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥3-40 ॥

భావం: ఇంద్రియాలు, మనసు మరియు బుద్ధి కామానికి నివాస స్థానాలు. కామము జ్ఞానమును కప్పివేసి జీవాత్మను మోహితునిగా చేస్తుంది.

శ్లోకం: తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।

పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్ ॥ 3-41 ॥

భావం: అర్జునా! కామం మొదట ఇంద్రియాలను వశపరచుకొని, తర్వాత జ్ఞానమును, బుద్ధిని నాశనం చేస్తుంది. కాబట్టి గట్టిగా ప్రయత్నం చేసి కామాన్ని రూపుమాపాలి.

శ్లోకం: ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్॥ 3-43 ॥

భావం: బుద్ధి ద్వారా మనసును వశ పరచుకొని దుర్జయమైన కామమనే శత్రువును నిర్మూలించు.

వివరణ: మనుష్యులు దేని ప్రభావం వలన తప్పులు, పాపాలు చేస్తారని అర్జునుడు అడిగాడు. కోరికలు ఇంద్రియాలను వశ పరచుకొని, జ్ఞానమును, బుద్ధిని నాశనం చేసి కర్తవ్యనిర్వహణలో తప్పులు, మోసాలు, పాపాలు చేయిస్తాయి. కాబట్టి గట్టిగా ప్రయత్నం చేసి బుద్ధి ద్వారా మనసును నియంత్రణలో ఉంచుకొని కోరికలను జయించాలని కృష్ణుడు బోధించాడు.

వందరూపాయల కోసం మొదలైన కోరిక వంద లభించాక వెయ్యికి పెరుగుతుంది. వెయ్యి లభించాక లక్షకు, లక్ష లభించాక కోటికి, కోటి లభించాక మరిన్ని కోట్లకు పెరుగుతుంది. కోట్లు లభించాక సమాజంలో పలుకుబడి కావాలని కోరిక కలుగుతుంది. అలా కోరికలు తీర్చుకుంటూ పోయేకొలదీ కొత్త కోరికలు పుడుతూనే ఉంటాయి. కాబట్టి కోరికలను పెంచుకోకుండా ఉన్నదానితో తృప్తిచెందటం అలవాటు చేసుకోవాలి.

ఈ విషయాన్ని తెలియజేసే యయాతి కథను గుర్తుచేసుకుందాం.

పాండవుల పూర్వీకులలో ఒకరైన యయాతి మహారాజు గొప్ప పరాక్రమ వంతుడు. శుక్రాచార్యుని కుమార్తె దేవ



యానిని పెళ్లిచేసుకున్నాడు. కొంతకాలం తర్వాత వృషపర్వుడి కుమార్తె శర్మిష్ఠ మీద మోహం కలిగి దేవయానికి చెప్పకుండా ఆమెను కూడా పెళ్లిచేసుకున్నాడు. విషయం తెలిసిన దేవయాని తండ్రికి చెప్పింది. కోపంతో శుక్రాచార్యుడు నీకు తక్షణమే ముసలితనం వస్తుందని యయాతిని శపించాడు. యయాతి మామగారిని క్షమించమని వేడుకున్నాడు. శుక్రాచార్యుడు "ఎవరైనా యువకుడు నీ ముసలితనాన్ని తీసుకోడానికి ఒప్పుకుంటే వారి యవ్వనం నీకు వస్తుంది" అని పరి ష్కారం చెప్పాడు.

యయాతి తన ఐదుగురు కొడుకులను పిలిచి తన ముసలితనం తీసుకోడానికి ఒప్పు కున్నవారికి రాజ్యాన్ని అప్పగిస్తానని చెప్పాడు. నలుగురు కొడుకులు ఒప్పుకోలేదు. ఐదవ కొడుకైన పూరుడు ఒప్పుకున్నాడు. యయాతి పూరుడి యవ్వనాన్ని తీసుకున్నాడు. పూరుడు యయాతి ముసలితనాన్ని తీసుకుని రాజ్య భారం వహించి చాలాకాలం ప్రజారంజ కముగా వరిపాలించి గొప్ప కీర్తిప్రతిష్టలు సంపాదించాడు.

కుమారుడిచ్చిన యవ్వనంతో యయాతి సర్వసుఖాలూ అనుభవించాడు. అయినా తృప్తి కలగలేదు. పూరుడి వద్దకు వచ్చి "కుమారా! కోరికలు ఎప్పటికీ తీరవు. ఒక కోరిక తీరితే మరొక కోరిక పుడుతూనే ఉంటుంది. ఎన్ని కోరికలు తీర్చుకున్నా తృప్తి కలగదు. కోరికలను జయించడం వలనే శాంతి కలుగుతుందని తెలుసుకున్నాను. నా ముసలితనం నాకు ఇచ్చేసి, నీ యవ్వనం నువ్వు తీసుకుని జనరంజ



కంగా రాజ్యాన్ని పాలించు" అని తన ముసలి తనం తాను తీసుకొని అడవికి వెళ్లి చాలాకాలం తపస్సు చేసి స్వర్గానికి వెళ్ళాడు.

✦ ✦ ✦

మనం ఎటువంటి వ్యామోహాలు, కోరికలు లేని ప్రపంచంలో జీవించాలని దేవుడు భావించి వుంటే అటువంటి ప్రపంచాన్నే సృష్టించి వుండేవాడు. మనం వ్యామోహాలను, కోరికలను జయించి ఆయను చేరాలని భగవంతుడు భావించాడు కాబట్టే వ్యామోహాలు, కోరికలు మభ్యపెట్టే ప్రపంచాన్ని సృష్టించాడు.

కోరికలు ఎప్పటికీ తీరవు. ఒక కోరిక తీరితే మరొక కోరిక పుడుతూనే ఉంటుంది. కోరికలు తీర్చుకోడానికి మనుష్యులు తప్పులు, మోసాలు చేస్తుంటారు. కాబట్టి మనసును నియంత్రణలో ఉంచుకొని కోరికలను జయించాలని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

26

# యువతకు భగవద్గీత చూపించిన దారి



### అధర్మము చెయ్యద్దు

**శ్లోకం: యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**

**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 4-7 ॥**

భావం: అర్జునా! ధర్మమునకు హాని కలిగినప్పుడు, అధర్మము పెరిగిపోయినప్పుడు నేను సాకార రూపముతో ఈలోకంలో అవతరిస్తాను.

ఈ యుగంలో జన్మించిన నువ్వు సృష్టి మొదట్లో జన్మించిన సూర్యుడికి ఎలా బోధించ గలిగావని అర్జునుడు అడిగాడు.

ధర్మానికి హాని కలిగినప్పుడు, అధర్మం పెరిగిపోయినప్పుడు నేను ప్రతీయుగంలో భూమి మీద అవతరించి దుష్ట శిక్షణ చేసి, ధర్మ రక్షణ చేస్తానని కృష్ణుడు సమాధానం చెప్పాడు. తప్పులు, మోసాలు, అధర్మాలు చేసినవారికి శిక్ష తప్పదు కాబట్టి తప్పులు, మోసాలు, అధర్మాలు

## జ్ఞాన, కర్మ, సన్యాస యోగము

శ్లోకం: పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్‌ఎ

ధర్మసంస్థాపనార్థాయ సమ్భవామి యుగే యుగే ॥ 4-8 ॥

దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు ధర్మమును సుస్థిరపరుచుటకు నేను ప్రతీ యుగములో అవతరిస్తాను.

వివరణ: సాంఖ్య, కర్మ యోగాలను అర్జునుడికి బోధించిన శ్రీకృష్ణుడు తాను ఈ యోగాలను మొదట సూర్యుడికి బోధించానని, సూర్యుడు తన కుమారుడైన వైవస్వత మనువుకు, మనువు తన కుమారుడు, భూమండలానికి తొలి రాజైన ఇక్ష్వాకునకు బోధించారని చెప్పాడు.

చెయ్యకుండా కర్తవ్యాలను నిర్వహించాలి.

భగవంతుడే ఎందుకు అవతరించాలి? అని సందేహం కలిగేవారి కోసం ఒక చిన్న కథ:

అక్బరు చక్రవర్తి ఒకసారి సభలో "దుష్ట శిక్షణ కోసం, శిష్టరక్షణ కోసం భగవంతుడు భూమిపై అవతరిస్తాడనే సిద్ధాంతం మీద నాకు నమ్మకం లేదు. భగవంతుడే ఎందుకు అవతరించాలి. వేరే దేవతల ద్వారా ఆపని చేయించవచ్చు కదా?" అని ప్రశ్నించాడు.

సభలో ఉన్న వారెవ్వరూ సమాధానం చెప్పలేదు. తాన్సేన్ లేచి వారం రోజులు గడువిస్తే సమాధానం చెప్తానన్నాడు. అక్బర్ ఒప్పుకున్నాడు.

నాలుగు రోజుల తర్వాత అక్బర్ తన పరివారంతో నౌకావిహారం చేస్తున్నాడు. నౌకలో తాన్సేన్ కూడా ఉన్నాడు. కొంతసమయం తర్వాత తాన్సేన్ తనవెంట రహస్యంగా తెచ్చిన యువరాజును పోలిన బొమ్మను నీటిలోకి విసిరి "అయ్యో! యువరాజు నదిలో పడిపోయాడు. కాపాడండి" అంటూ కేకలు పెట్టాడు. ఆ కేకలు వినగానే అక్బర్ తన కొడుకును రక్షించడానికి నదిలోకి దూకాడు. యువరాజు నౌకలోనే ఉన్నాడని మిగిలినవాళ్ళు చెప్పడంతో అక్బర్ నౌకలోకి వచ్చాడు.

తాన్సేన్ అక్బర్ వద్దకు వెళ్లి "ప్రభూ! నౌకలో చాలామంది భటులు ఉన్నారు. యువరాజును రక్షించమని భటులను ఆజ్ఞాపించకుండా స్వయంగా మీరే ఎందుకు నదిలోకి దూకారు?" అని అడిగాడు.

"నా కొడుకు మీద నాకున్న ప్రేమ వలన" అక్బర్ జవాబిచ్చాడు.

"భగవంతుడికి కూడా ధర్మపరుల పట్ల, తన భక్తుల పట్ల అంతులేని ప్రేమ. అందుకే దుష్ట శిక్షణ కోసం, శిష్టరక్షణ కోసం భగవంతుడు స్వయంగా భూమిపై అవతరిస్తాడు. ఈ విషయం మీకు తెలియజేయడానికి చిన్న నాటకం ఆడాను క్షమించండి" అని తాన్సేన్ చెప్పాడు.

✦ ✦ ✦

నవ్వుతూ చేసే తప్పుల ఫలితం ఏడుస్తూ అనుభవించవలసి వస్తుంది. కొంతమంది కుటుంబసభ్యుల కోసం, బంధువుల కోసం, స్నేహితుల కోసం తప్పులు చేస్తుంటారు. వాళ్ళు గుర్తించుకోవలసిన విషయం - మనిషి ఒంటరిగా జన్మిస్తాడు, ఒంటరిగా మరణిస్తాడు.



చేసిన తప్పుల, అధర్మాల ప్రతిఫలం కూడా ఒక్కడే ఒంటరిగా అనుభవిస్తాడు. ఎవరికోసం లేక ఎవరికి తోడుగా ఉండటం కోసం తప్పులు చేసాడో వాళ్ళు ఆ తప్పుల ప్రతిఫలం అనుభవించడానికి తోడు రారు.

ఈ సందర్భంలో అధర్మం వైపు నిలబడిన అన్న మరియు కొడుకులను కాదని ధర్మం వైపు నిలబడిన విభీషణుడి గురించి గుర్తు చేసుకుందాము.

రామ-రావణ యుద్ధంలో ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు మరణించిన తర్వాత ఒక రాక్షసవీరుడు యుద్ధానికి వచ్చి వానరులను ఊచకోత కోయసాగాడు. విభీషణుడు ఆ రాక్షసుడితో తలపడ్డాడు. ఇద్దరి మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. చివరికి విభీషణుడు వేసిన బాణాలకు రాక్షస వీరుడి తల తెగిపడింది. రాక్షసులు హాహాకారాలు చేస్తూ లంకలోకి పరుగెత్తారు. వానరులు ఆనం

దంతో గెంతులు వేశారు.

విభీషణుడు నెమ్మదిగా రథం దిగి మరణించిన ఆ రాక్షసవీరుడి శవం వద్దకు వెళ్లి "అయ్యో! కుమారా!" అని ఏడవసాగాడు.

అది గమనించిన శ్రీరాముడు "అతను నీ కొడుకని నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు?" అని విభీషణుడిని అడిగాడు.

విభీషణుడు "అధర్మపరుడు అన్నయినా కొడుకైనా ఒకటే కదా" అని జవాబిచ్చాడు.

✦ ✦ ✦

చేసిన అధర్మం / పాపం చిన్నదే అయినా శిక్ష తప్పదని తెలియజేసే ఒక కథను గుర్తు చేసుకుందాము.

దొంగతనం చేసిన సొమ్ముతో పారిపోతున్న దొంగలను రాజభటులు వెంబడిస్తున్నారు. దొంగలు ఊరి బయట ఉన్న అడవిలోని మాండవ్య మహాముని ఆశ్రమంలో దూరి దొంగిలించిన సొమ్మును ఒక మూల దాచి మరోమూల దాక్కున్నారు. ఆశ్రమం ముందు కళ్ళు మూసుకుని తపస్సు చేసుకుంటున్న ముని దొంగలు ఆశ్రమంలో దూరడం గమనించలేదు. దొంగలను తరుముతూ వచ్చిన భటులు మునిని ఇటుగా దొంగలు రావడం గమనించారా అని అడిగాడు. ముని తాను గమనించలేదని చెప్పాడు. కొందరు భటులు ఆశ్రమంలోకి వెళ్లి వెదికారు. దొంగలతో పాటు దొంగిలించిన సొమ్ము కూడా ఆశ్రమంలో దొరికింది.

మాండవ్యుడే దొంగల నాయకుడని మునిలా వేషం వేసుకొని తమని బోల్తా కొట్టించడానికి ప్రయత్నం చేసాడని భావించి రాజభటులు దొంగలతో పాటు మాండవ్యుడిని కూడా బంధించి తీసుకెళ్ళి జరిగిన విషయం రాజుకి చెప్పారు. రాజు కపటమునిని శూలానికి గుచ్చి వ్రేలాడదీయమని ఆజ్ఞాపించాడు.

ధ్యానంలో ఉన్నందువలన శూలానికి గుచ్చి వ్రేలాడదీసినా మాండవ్యముని ప్రాణం పోలేదు. జరిగిన విషయం తెలిసి, అడవిలో తపస్సు చేసుకుంటున్న ఇతర మునులు వచ్చి మాండవ్య మునిని ఎందుకిలా జరిగిందని అడిగారు. మాండవ్యుడు ఎవ్వరినీ తప్పుపట్టకుండా ఎవరి ధర్మం వాళ్ళు చేసారని చెప్పాడు.

శూలానికి గుచ్చి వ్రేలాడదీసిన దొంగల నాయకుడు ఆహారం, నీళ్ళు లేకపోయినా బ్రతికే ఉన్నాడని తెలుసుకున్న రాజు ఆయన నిజంగానే మహాముని అని అర్థంచేసుకుని భటులతో ఆయనను క్రిందికి దింపించి, ఆయన కాళ్ళ మీద పడి క్షమించమని వేడుకున్నాడు.

మాండవ్యుడు రాజుమీద కొంచెం కూడా కోపం తెచ్చుకోలేదు. తిన్నగా యమధర్మరాజు వద్దకు వెళ్లి "స్వామీ! నాకు ఇంతటి కఠినమైన శిక్ష ఎందుకు విధించారు? అని అడిగాడు.

యమధర్మరాజు "మహామునీ! నువ్వు చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు పక్షులను, తుమ్మెదలను హింసించావు. చేసిన పాపం చిన్నదే అయినా అనుభవించవలసిన ఫలితం మాత్రం ఎక్కువగానే ఉంటుంది" అని చెప్పాడు.

మాండవ్యముని కోపంగా "చిన్నవయసులో తెలియక చేసిన తప్పుకి ఇంత పెద్ద శిక్ష విధిస్తావా? నువ్వు భూలోకంలో మానవుడవై



జన్మించు'' అని యమధర్మరాజుని శపించాడు.

ఆ శాపఫలితంగా యమధర్మరాజు అంబాలిక వద్ద పనిచేసే దాసి కడుపున విదురుడుగా పుట్టాడు.

✦ ✦ ✦

పుణ్యఫలాలు కోరే మానవులు చాలా అరుదుగా పుణ్యకార్యాలు చేస్తారు. పాపఫలాలను ఎవ్వరూ కోరుకోరు. కాని పాపం చేస్తే శిక్ష అనుభవించక తప్పదని తెలిసి కూడా పాపకార్యాలు చేస్తారు. మానవుడు తన తెలివితో ఆలోచించి కష్టాలు రాకుండా ఉండేలా అన్ని విషయాలలో ప్రవర్తిస్తాడు కాని పాపం చేయడం విషయంలో మాత్రం అలా ఆలోచించి ప్రవర్తించడు - అని యోగవాశిష్టంలో చెప్పబడింది.

మనిషి చేసిన పాపాల ఫలితమే బాధలు, రోగాలు, వేదనలు. నేడు చేసే పాపకార్యాల ఫలితం ఏదోఒక రోజు కష్టాలు మరియు రోగాలు రూపంలో అనుభవించవలసి వస్తుంది. భవిష్యత్తులో కష్టాలు మరియు రోగాలు రాకుండా ఉండాలంటే నేడు పాపకార్యాలు చేయకుండా ఉండాలి.

అధర్మపరులను శిక్షించి ధర్మరక్షణ చేస్తానని దేవదేవుడైన శ్రీకృష్ణుడే స్వయంగా చెప్పాడు కాబట్టి అన్యాయాలు, మోసాలు, పాపాలు చేసిన వారికి ఏదో ఒక రూపంలో శిక్ష తప్పదు. ఆవిధంగా అన్యాయాలు, మోసాలు, పాపాలు చెయ్యకుండా కర్తవ్యాలను నిర్వహించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

27

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।**


**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః ॥4-34॥**

భావం: పరమాత్మ తత్వమును తెలుసుకున్న జ్ఞానులే నీకు తత్వజ్ఞానమును ఉపదేశించగలరు. వినయవిధేయతలతో మరియు భక్తిశ్రద్ధలతో వారిని ప్రశ్నించడం ద్వారా నువ్వు ఆ తత్వజ్ఞానమును తెలుసుకో.

వివరణ: యజ్ఞము కంటే జ్ఞానమే గొప్పదని అర్జునుడికి చెప్పి శ్రీకృష్ణుడు అట్టి జ్ఞానాన్ని పరమాత్మ తత్వాన్ని తెలుసుకున్న జ్ఞానులను అడిగి తెలుసుకోవాలని చెప్పాడు.

పరమాత్మ తత్వమును తెలుసుకున్న జ్ఞానులు మాత్రమే ఇతరులకు తత్వజ్ఞానాన్ని బోధించగలరు. అలాగే ఏ రంగంలోనైనా విజయం సాధించినవారే ఇతరులకు ఆ రంగంలో విజయాలు సాధించే మార్గాలను

## విజయం సాధించినవాళ్ళని సలహా అడగండి



వివరించగలరు.

కాబట్టి మీరు సొంతంగా ఏదైనా వ్యాపారం చెయ్యాలనుకుంటే, అదే రకమైన వ్యాపారం చేసి విజయం సాధించినవాళ్ళని సలహా అడగండి. మీరు సివిల్ సర్వీసెస్, CAT, IIT JEE, NEET, GRE, GMAT వంటి కష్టమైన పోటీపరీక్షలు వ్రాస్తుంటే ఆ పరీక్షలు అంతకుముందే వ్రాసి విజయం సాధించిన వాళ్ళని సలహా అడగండి. వాళ్ళు సాధించిన విజయాలు మీకు విజయం సాధించడానికి కావలిసిన ఉత్సాహాన్ని, ప్రేరణను అందిస్తాయి. వాళ్ళ సలహాలు మీకు లక్ష్యాన్ని సాధించడానికి, లక్ష్యసాధనలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించడానికి అనువైన ప్రణాళికలను తయారు చెయ్యడానికి ఉపయోగపడతాయి.




వినయవిధేయతలతో మరియు భక్తిశ్రద్ధలతో పరమాత్మ తత్వమును తెలుసుకున్న జ్ఞానులను ప్రశ్నించడం ద్వారా తత్వజ్ఞానాన్ని తెలుసుకోమని శ్రీకృష్ణుడు చెప్పాడు.

కాబట్టి మీరు కృషి చేస్తున్న రంగంలో విజయాలు సాధించినవారిని సలహాలు అడగడానికి సంకోచించకండి. తెలియని విషయాలను తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రశ్నలడిగేవారు కొన్ని నిమిషాలు మాత్రమే తెలివి తక్కువ వారిగా పరిగణించబడతారు. కాని ప్రశ్నలే అడగక తెలియని విషయాలు తెలుసుకోనివారు జీవితాంతం తెలివితక్కువ వారుగా మిగిలిపోతారు.

ఎవరైనా మిమ్మల్ని సలహా అడిగితే మీకు ఆ రంగం గురించి క్షుణ్ణంగా తెలిస్తేనే, ఉపయోగపడే మంచి సలహా ఇవ్వగలిగితేనే ఇవ్వండి. మన దగ్గరకి సలహాల కోసం వచ్చే వారికి తమ సమస్యలకు పరిష్కారాలు తెలియవని కాదు. తమకు తెలిసిన వాటికంటే మెరుగైన పరిష్కారాలు మనం చెప్పగలమేమో అనే ఆశతో వస్తారు. మీకు ఆ రంగం గురించి తెలియకపోయినా, సలహా ఇవ్వగలిగినంతటి సామర్థ్యం, అనుభవం లేకపోయినా సలహా ఇవ్వలేనని నిజాయితీగా చెప్పండి. అంతేగాని అడిగారు కదా అని ఏదోఒక సలహా ఇచ్చి వారి సమస్యను మరింత జటిలం చేయకండి.

ఆవిధంగా మీరు కృషి చేస్తున్న రంగంలో విజయాలు సాధించినవారిని సలహాలు అడిగి ప్రయత్నిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

28

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## పశ్చాత్తాపంతో ప్రాయశ్చిత్తం

**శ్లోకం: అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః।**

**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి ॥ 4-36 ॥**

భావం: నువ్వు పాపాత్ములందరికంటే ఎక్కువ పాపాలు చేసినా జ్ఞాననౌక ద్వారా పాపసముద్రమును పూర్తిగా దాటగలవు.

శ్లోకం: యథైధాంసి సమిద్ధోగ్నిర్భస్మ సాత్కురుతేర్జున।

జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥ 4-37 ॥

భావం: మండుతున్న అగ్ని కట్టెలను భస్మం చేసినట్లు జ్ఞానమనే అగ్ని అన్ని కర్మలను భస్మం చేస్తుంది.

వివరణ:

జ్ఞానం వలన ఏది తప్పు ఏది ఒప్పు, ఏది ధర్మం ఏది అధర్మం, ఏది పాపం ఏది పుణ్యం, ఏది నీతి ఏది అవినీతి అనే విషయు అవగాహన కలుగుతుంది. కాబట్టి మనం తెలిసో తెలియకో చేసిన తప్పులను గుర్తించ గలుగుతాము. చేసిన తప్పులను గుర్తించడం వలన పశ్చాత్తాపపడి చేసిన పాపాల నుండి విముక్తి పొందవచ్చు. పొరపాటు చేసానని ఒప్పుకోడానికి సిగ్గుపడకూడదు. తప్పు చేసానని ఒప్పుకోవడమంటే నిన్నటి కంటే ఈరోజు మనం తెలివిగా ప్రవర్తించినట్లు.

పశ్చాత్తాపం వలన చేసిన పాపం నుండి విముక్తి కలుగుతుంది. కాని పశ్చాత్తాపం అంటే "అయ్యో! తప్పు చేసాను" అని అనుకోవడం మాత్రమే కాదు. తెలియక గాని, వ్యామోహం వలన గాని చేసిన పాపం నుండి విముక్తులవ్వాలంటే మరోసారి అటువంటి పాపకార్యం చెయ్యనని గట్టి నిర్ణయం తీసుకుని అటువంటి పాపకార్యం చెయ్యకుండా జీవించాలి.

✦ ✦ ✦

పశ్చాత్తాపాన్ని మించిన శిక్ష లేదు. శిక్ష విధించేది మనిషిలో మంచి మార్పు తీసుకు రావడం కోసమే. అందుకే తప్పు చేసిన వ్యక్తి తన తప్పు తెలుసుకొని, క్షమాపణలు కోరి, మరొకసారి అటువంటి తప్పు చేయనని ప్రమాణం చేస్తే అటువంటి వ్యక్తిని ఎవ్వరూ శిక్షించరు. పశ్చాతాపం గురించి రెండు కథలను గుర్తుచేసుకుందాము:

✦ ✦ ✦

భోజన విరామ సమయంలో పాఠశాల ఆవరణలో వున్న చింతచెట్టు పైకి రాయి విసురుతున్న రామును చూసిన మాష్టారు "నువ్వు విసిరే రాయి ప్రహరీ గోడ అవతల పక్కన ఉన్న రహదారిలో వెళ్తున్న ఎవరికైనా తగిలితే ఎంతగాయం అవుతుందో తెలుసా?

అలా రాళ్ళు విసరకు” అని మందలించి వెళ్ళిపోయారు. మాష్టారు వెళ్ళిపోగానే రాము మళ్ళీ చింతచెట్టు మీదకి రాళ్ళు విసరడం మొదలు పెట్టాడు. ఒక రాయి గురితప్పి ప్రహరీ గోడ అవల ఉన్న రోడ్డులోనికి దూసుకు పోయింది. ఆ రోడ్డులో నుండి “అమ్మా” అన్న అరుపు వినిపించడంతో తాను విసిరిన రాయి ఎవరికో తగిలిందని ఊహించి భయపడి తన తరగతి గదిలోకి పరుగు తీసాడు.

సాయంత్రం యింటికి వెళ్లిన రాముకి తలకి కట్టుతో మంచం మీద పడుకున్న తండ్రి కనిపించాడు. దెబ్బ ఎలా తగిలిందని తండ్రిని అడిగాడు. “మధ్యాహ్నం మీ బడి ప్రక్క వీధిలోనుంచి వెళ్తుండగా మీ స్కూలు ఆవరణలోనుండి రాయి వచ్చి తగిలింది. ఎవరో అల్లరి పిల్లవాడు చింతకాయల కోసం చింతచెట్టు పైకి రాయి విసిరి ఉంటాడు. అది గురి తప్పి నాకు తగిలింది. ఆందోళన పడ వలసిందేమీ లేదు. గాయం చిన్నదే” అన్నాడు తండ్రి.

రాము కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తండ్రి కాళ్ళమీద పడి “క్షమించండి నాన్న గారు. ఆ రాయి విసిరింది నేనే. తప్పు చేసాను మరె ప్పుడూ అలా చేయను.” అన్నాడు

“ఏడవకు, నీ తప్పు నువ్వు తెలుసు కున్నావు. పశ్చాత్తాపాన్ని మించిన శిక్ష లేదు.” అని తండ్రి రాముని ఓదార్చాడు.

✦ ✦ ✦

మరో కథను గుర్తుచేసుకుందాము:

ఔరంగజేబు కుమార్తె జేబున్నిసా అపు రూపమైన అందగత్తె. ఆమె తండ్రి ఆమెకు పుట్టినరోజు కానుకగా ఒక అందమైన అద్ద మును బహూకరించాడు. ఒకరోజు ఉద్యా నవనములో కూర్చున్న జేబున్నిసా తన గదిలో ఉన్న అద్దమును తీసుకురమ్మని చెలికత్తెకు చెప్పింది. చెలికత్తె అద్దమును తెస్తుండగా చేయిజారి అద్దము క్రిందపడి ముక్కలై పోయింది. యజమానురాలికి ఆ అద్దమంటే ఎంత ఇష్టమో ఆ చెలికత్తెకు బాగా తెలుసు. అందువలన భయంతో ఆమె కాళ్ళు చేతులు వణికాయి. తనకి శిక్ష తప్పదని భయపడింది. అయినా నిజాయితీగా నిజమే చెప్పాలని నిర్ణ యించుకొని జేబున్నిసా పాదాల మీద పడి “అమ్మా! చేయిజారి అద్దం క్రిందపడి పగిలి పోయింది. నా వలన తప్పు జరిగింది. మీరు నాకు ఎటువంటి శిక్ష విధించినా స్వీకరి స్తాను” అని చెప్పింది.

జేబున్నిసా ఆమెను పైకి లేపి “పర్వాలేదు.. అద్దం ఉంటే దానిలో నా ప్రతిబింబాన్ని చూసు కొంటూ, నేనెంతో అందమైన దానినని గర్వ పడుతూ ఉంటాను. అందువలన అద్దం పగిలి పోవడం మంచికే జరిగింది. నాకు నీమీద కోపంలేదు” అని చెప్పి ఓదార్చింది.

✦ ✦ ✦

తప్పు చేసినప్పుడు ఆ తప్పును ఒప్పుకొని, క్షమాపణలు కోరి, మరొకసారి అటువంటి తప్పు చేయనని ప్రమాణం చెయ్యడమే ఉత్తమ మార్గమని గాంధీగారు, తన సొంత అనుభవం ద్వారా “ఆత్మకథ” (మొదటి భాగం – ఎనిమి దవ అధ్యాయం – దొంగతనం – ప్రాయ శ్చిత్తం)లో ఈ క్రింది విధంగా తెలియ జేశారు:

“మా అన్నయ్య ఇరవై రూపాయలు అప్పు పడ్డాడు. ఇంట్లో వాళ్ళకి తెలియనీకుండా అన్నయ్య చేతికి వున్న బంగారు మురుగు నుండి ఒక తులం ముక్క తీయించి ఆ అప్పు తీర్చేశాము. కాని ఆపని నాకు నచ్చలేదు. ఇకనుండి దొంగతనం చేయకూడదని నిర్ణ యించుకున్నాను. అయినా నా మనసు శాంతించలేదు. చేసిన తప్పు నాన్నగారికి

చెప్పాలని అనుకున్నాను. నాకు ఆయన ముందు నోరు తెరచి చేసిన చెడ్డపని గురించి చెప్పడానికి ధైర్యం చాలలేదు. కొడతారని భయం కాదు. ఎందుకంటే మా నాన్నగారు పిల్లలని కొట్టరు. బంగారు మురుగు విషయం చెప్తే మనస్తాపంతో కృంగిపోతారని భయం. ఏది ఏమైనా చేసిన తప్పు గురించి ఆయనకు చెప్పి క్షమాపణలు కోరితేనే మనశ్శాంతి కలుగుతుందని భావించాను.

చివరికి చేసిన తప్పంతా ఒక కాగితం మీద వ్రాసి నాన్నగారికి ఇచ్చాను. అంతటి తప్పు చేసినందుకు తగిన విధంగా శిక్షించ మని, మరోసారి దొంగతనం చెయ్యనని చెప్పాను.

రోగంతో బాధపడుతూ బల్లమీద పడు కొనివున్న నాన్నగారు నేను ఇచ్చిన కాగితం చదివారు. ఆయన కళ్ల నుండి కన్నీళ్లు కారాయి. ఒక నిముషం పాటు కళ్ళు మూసు కొని ఏదో ఆలోచించారు. తర్వాత ఆ కాగితం చింపేశారు. నాకు కూడా ఏడుపు వచ్చింది. ఆ దృశ్యం ఇప్పటికీ నాకళ్ళకు కట్టినట్లుగా కనబడుతోంది. నేను చిత్రకారుడినై వుంటే ఆ దృశ్యాన్ని ఈరోజు కూడా చిత్రించగలను. వారి ప్రేమాశ్రువులు నా హృదయాన్ని కడిగి వేశాయి. ఆ ప్రేమ అనుభవించిన వారికే అర్థమవుతుంది.

అంతటి శాంతం, ఓర్పు వాస్తవానికి మా నాన్నగారి స్వభావానికి విరుద్ధం ఆయన నన్ను తీవ్రంగా కోప్పడతారని, తిడతారని లేదా తల బద్దలు కొట్టుకొని బాధపడతారని భావించాను. కాని ఆయన ప్రదర్శించిన శాంతం మరియు ఓర్పు అద్భుతం. అందుకు కారణం నేను చేసిన తప్పును ఒప్పుకొని, మరోసారి తప్పు చెయ్యనని చెప్పడమే అని నా అభిప్రాయం. అలా చెయ్యడం వలన నాన్నగారికి నామీద విశ్వాసం మరియు వాత్సల్యం పెరిగాయి. అలా చేసిన తప్పును



ఒప్పుకొని మరో సారి అటువంటి తప్పు చెయ్యనని చెప్పడమే ప్రాయశ్చిత్తమని నా అభిప్రాయం."

✦ ✦ ✦

"పుస్తకాలలో, ప్రవచనాలలో చెప్పినట్లు చేసిన తప్పులను, పాపాలను భగవంతుడు క్షమిస్తాడా?" ఒక వ్యక్తి స్వామీజీని అడిగాడు

స్వామీజీ చిన్నగా నవ్వి "ఎన్నో తప్పులు చేసి తన తప్పులు తెలుసుకున్న కొడుకు "ఇంటికి వెళ్లి నాన్నకు క్షమాపణ చెప్తే నాన్న క్షమించకుండా శిక్షిస్తాడేమో" అని భయపడితే నాన్న ప్రేమను అనుమానించినట్లే. అలాగే "ఎన్నో పాపాలు చేసిన నన్ను దేవుడు క్షమించ డేమో" అని అనుమానపడితే దేవుడి ప్రేమను అనుమానించినట్లే" అని జవాబిచ్చాడు.

✦ ✦ ✦

ఎందుకు చేసానా? అని తరువాత విచారపడవలసి వచ్చే పని ఏదీ చెయ్యద్దు. ఒకవేళ చేస్తే అటువంటి పని మళ్ళీ చెయ్యకుండా జాగ్రత్తపడండి. చేసిన తప్పు మళ్ళీ చేయకుండా ఉండటమే నిజమైన పశ్చాత్తాపం. చేసిన తప్పులను పదేపదే గుర్తు చేసుకుంటూ కుమిలిపోతూ జీవితాన్ని దుర్భరం చేసుకోకుండా అటువంటి తప్పులు మరోసారి చెయ్యనని గట్టి నిర్ణయం తీసుకుని, అటువంటి తప్పులు చెయ్యకుండా జీవించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

29

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే।**

**తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి ॥4-38॥**

భావం: ప్రపంచంలో జ్ఞానముతో సమానముగా పవిత్రమైనది మరేదీ లేదు. దీర్ఘకాలం పాటు కర్మయోగము ఆచరించడం ద్వారా సాధకుడు స్వయంగా ఆ జ్ఞానమును పొందగలడు.

శ్లోకం: శ్రద్ధావాఉల్లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః।

జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిమచిరేణాధిగచ్ఛతి ॥4-39॥

భావం: జితేంద్రియుడు, సాధనపరాయణుడు, శ్రద్ధగలవాడు అయిన వానికి ఈ జ్ఞానము లభించును. ఆ జ్ఞానము కలిగిన వెంటనే అతడు భగవత్తత్వ రూపమైన పరమ శాంతిని పొందుతాడు.

వివరణ: జ్ఞానము చాలా గొప్పది. చాలా కాలం పాటు కర్మయోగము ఆచరించడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించవచ్చు. జ్ఞానము పొందితే శాంతి కలుగుతుంది. అని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు

చీకట్లో త్రాడును చూసి పామని భ్రమపడి భయపడతాము. కాని మన మొబైల్ ఫోనులోని లైట్ ఆన్ చేసి వెలుగులో చూస్తే అది పాము కాదు త్రాడని తెలుసుకుంటాము. అలా తెలుసుకోవడం వలన భ్రమతో పాటు భయం కూడా పోతుంది. అలాగే అజ్ఞానము వలన విషయపరిజ్ఞానము లేక తెలియని భ్రమలు, బలహీనతలు, భయాలు కలుగుతాయి. కాని జ్ఞానము వలన విషయపరిజ్ఞాము కలుగుతుంది, భ్రమలు, బలహీనతలు, భయాలు తొలగుతాయి. కర్తవ్యాలను నిర్వర్తించేడప్పుడు కూడా అనేక సందేహాలు, అనుమానాలు, భయాలు కలుగుతాయి. నాలెడ్జిని (విషయ పరిజ్ఞానాన్ని) పెంచుకొని సందేహాలను, అనుమానాలను, భయాలను తొలగించుకొని కర్తవ్యాలను నిర్వహిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చు.

## నాలెడ్జి పెంచుకోండి




అజ్ఞానం భయానికి తల్లిలాంటిది. తన కంటే ఎంతో చిన్నవాడైన మనుమడు ఇదేమిటి? అదేమిటి? ఇలా ఎందుకు? అలా



ఎందుకు? అంటూ ప్రశ్నలడగటం మొదలు పెట్టినప్పుడు మనిషికి తనకు తెలిసింది చాలా తక్కువని తెలుస్తుంది. విద్య యొక్క లక్ష్యం జ్ఞానం సంపాదించడం మాత్రమే కాదు. జీవి తంలో వెనుకడుగు వేయకుండా, ధైర్యంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించేలా విద్యార్థులను తీర్చిదిద్దడం కూడా. సందేహాలు సృజనాత్మక శక్తిని దెబ్బతీస్తాయి. కాబట్టి జ్ఞానం ద్వారా సందే హాలను తీర్చుకోవాలి.

జ్ఞానం వలన భ్రమలు బలహీనతలు తొలగి పోతాయని తెలియజేసే ఒక కథ చదువుదాము.

పుల్లారావుకు రాత్రుళ్ళు నిద్రపట్టక ఎంతోమంది డాక్టర్లకు చూపించుకున్నాడు, ఎన్నో రకాల మందులు వాడాడు. కాని ఫలితం లేకపోయింది. నిద్రపట్టకపోడానికి కారణం తానే కనుక్కోవాలని నిర్ణయించుకుని ఒక రోజంతా తన దినచర్యను పరిశీలించాడు.

మరునాడు ప్రక్కింటి రామయ్యను పిలిచి "నువ్వు పెంచుతున్న కోడి రాత్రంతా కూస్తూ ఉండటం వలన నాకు నిద్రపట్టడంలేదు" అని చెప్పాడు.

రామయ్య "అయ్యా! ఏ కోడీ రాత్రంతా కూయదు. తెల్లవారుజామున మాత్రమే కూస్తుంది. అదీ రెండుసార్లు మాత్రమే కూస్తుంది" అని చెప్పాడు.

"నువ్వు అబద్ధం చెప్తున్నావు. నీ కోడి రాత్రంతా కూస్తూనే ఉంటోంది. దాని కూత వలన నాకు నిద్రపట్టడంలేదు"

"అయ్యా! మాఇంట్లో ఉన్న కోడి రాత్రంతా కూస్తూవుంటే మాకు కూడా నిద్రపట్టదు కదా!"

"అంటే నేను అబద్ధం చెప్తున్నానంటావా?"

వారి సంభాషణ వినిన ఒక పెద్దమనిషి "చూడు పుల్లారావు! ఏ కోడీ రాత్రంతా కూయదు. తెల్లవారుజామున మాత్రమే కూస్తుంది. నువ్వు కోడి ఎప్పుడు కూస్తుందా అనే ఆలోచనతో పడు కుంటే కోడి కూసినట్లు భ్రమ కలిగి మెలుకవ వచ్చేస్తుంది. కళ్ళు తెరిచి ఇంకా తెల్లవారలేదని గ్రహించి మళ్ళీ కోడి ఎప్పుడు కూస్తుందా అనే ఆలోచనతో పడుకుంటే మళ్ళీ కోడి కూసినట్లు భ్రమ కలిగి మెలుకవ వచ్చేస్తుంది. నీ నిద్ర విషయంలో ఇదే జరిగి వుంటుంది. కోడికూత గురించి కాకుండా దేవుని గురించి ఆలోచిస్తూ పడుకో, నీ సమస్య తీరుతుంది" అని చెప్పాడు.

✦ ✦ ✦

నాలెడ్జి (విషయ పరిజ్ఞానము) వలన భ్రమలు, బలహీనతలు, భయాలు తొలగి పోయి ప్రశాంతత కలుగుతుంది. కాబట్టి నాలెడ్జిని (విషయ పరిజ్ఞానాన్ని) పెంచుకొని కర్తవ్యాలను నిర్వహిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

30

# యువతకు భగవద్గీత చూపించిన దారి



శ్లోకం: అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి।

నాయం లోకోస్తి న పరో న సుఖం సంశ యాత్మనః॥ 4-40 ॥

భావం: వివేకహీనుడు, శ్రద్ధలేనివాడు మరియు సంశయాత్ముడు భ్రష్టుడై నశిస్తాడు. సంశయాత్మునకు ఈ లోకంలో గాని పర లోకంలో గాని ఎటువంటి సుఖమూ ఉండదు.

వివరణ: వివేకము, శ్రద్ధ లేనివాడు భ్రష్టుడవుతాడని, వాడికి ఎటువంటి సుఖమూ ఉండదని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు.

ఉద్యోగపర్వములోని విదురనీతిలో వివేకం గురించి విదురుడు ధృతరాష్ట్రునికి ఈక్రింది విధంగా వివరించాడు -

"సంకల్ప వికల్పాలను జాగ్రత్తగా పరిశీలించి ఒక నిశ్చితాభిప్రాయాన్ని కలిగించే తెలివే బుద్ధి. అలాంటి బుద్ధిని కలిగి ఉండాలి. బుద్ధిని ఆధారంగా చేసుకొని చెయ్యవలసినపని ఏదో, చెయ్యకూడనిపని ఏదో నిర్ణయించి చేయాల్సిన దాన్ని చెయ్యాలి చెయ్య

## వివేకము



కూడనిదానిని వదిలిపెట్టాలి. మిత్రులను, శత్రువులను, తటస్థులను నాలుగు ఉపాయాలతో (సామ, దాన, భేద దండోపాయాలు) స్వాధీనం చేసుకోవాలి. మిత్రులను సామం చేత.. తటస్థులను దానం చేత.. శత్రువులను ఆ నాలుగింటి చేతా వశం చేసుకోవాలి. చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు అనే ఐదు ఇంద్రియాలు అవసరం లేనివాటిని మనలోకి పంపుతూ ఆపదలను కలిగిస్తుంటాయి. వాటికి బానిసలైతే అధోగతి చెందుతాం. కాబట్టి వాటిని వివేకంతో గెలవాలి. రాజనీతిలో ఉండే సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయాలను (ఇద్దరు రాజులు కలిసి రాజభోగాలు అనుభవించడానికి చేసుకునే ఒప్పందం సంధి. విగ్రహం అంటే యుద్ధం. యానం అంటే దండయాత్ర చేయడం. నిలకడగా ఉండడం ఆసనం. రెండు విధాలుగా ప్రవర్తించడం ద్వైధీభావం. పరులను ఆశ్రయించి



ఉండడం లేక శరణుజొచ్చుడం సమాశ్రయం) తెలుసుకోవడం. స్త్రీ వ్యసనం, జూదం, మద్యం తాగడం, వేట, పరుషంగా మాట్లాడటం, కఠినంగా దండించడం, సొమ్మును వృథాగా ఖర్చుచేయడం అనే ఏడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.”

అజ్ఞాని తన ఇంటిలో మాత్రమే గౌరవించబడతాడు, సంపన్నుడు తన గ్రామంలో కీర్తించబడతాడు, రాజు తన రాజ్యంలో కొలవబడతాడు, వివేకవంతుడు అన్నివేళలా, అన్ని ప్రదేశాలలో పూజించబడతాడు, గౌరవించబడతాడు అని ప్రాచీన సూక్తి.


తెలుసుకోవలసినదేదో, తెలుసుకోనవసరంలేనిదేదో తెలుసుకొని తెలుసుకోవలసినదానిని మాత్రమే తెలుసుకోవడం, చెయ్యవలసినదేదో, చెయ్యకూడనిదేదో తెలుసుకొని చెయ్యవలసినది మాత్రమే చెయ్యడం వివేకం.

వివేకం గురించి అర్థంచేసుకోడానికి రైన్ హూల్డ్ నైబుహోర్ ఎమర్సన్ చెప్పిన మాటలు బాగా ఉపకరిస్తాయి “భగవంతుడా! నేను మార్చలేని పరిస్థితులను స్వీకరించే మనస్సును, మార్చగలిగే పరిస్థితులను మార్చగలిగే ధైర్యాన్ని, ఈ రెండింటి మధ్య గల భేదాన్ని తెలుసుకోగల వివేకాన్ని నాకు ప్రసాదించు.”

విషయాన్ని తెలుసుకోవడం వివేకం కాదు. విషయాలు తెలిసినవాళ్ళు చాలామంది అవివేకులుగానే ప్రవర్తిస్తారు. తెలుసుకున్న విజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించడమే వివేకం. తెలివితేటలు కలిగివుండటానికి మరియు తెలివిగా ప్రవర్తించడానికి మధ్య

తేడాయే వివేకం. అనేక విషయాలు తెలిసి వుండటం జ్ఞానం. కాని ఆ జ్ఞానాన్ని ఉపయోగించి సరైన నిర్ణయం తీసుకోవడం వివేకం.

సుబ్బారావుకి గొంతులో మంటగా ఉంది, పొడిదగ్గు ఎక్కువగా వస్తోంది. కోవిడ్ లక్షణా లేవెూ ఒకసారి హాస్పిటలుకి వెళ్లి చూపించు కోమని భార్య చెప్పింది. నాలుగు రోజులు ఆగి తగ్గకపోతే వెళ్తానన్నాడు సుబ్బారావు.



"ఆలశ్యం అమృతం విషం అన్నారు పెద్దలు. త్వరగా వెళ్లి చూపించుకోండి" భార్య సలహా ఇచ్చింది.

"అన్నీ తెలిసినట్లుగా మాట్లాడకు. ఆ పెద్దలే నిదానమే ప్రదానం అన్నారు. నిదా నంగా నాలుగురోజుల తర్వాత వెళ్తాను" సుబ్బారావు జవాబిచ్చాడు.

మరునాటికి జ్వరం కూడా వచ్చింది. అయినా సుబ్బారావు నిదానమే ప్రధానమని హాస్పిటలుకి వెళ్ళలేదు. రెండోరోజుకి జ్వరం బాగా పెరిగి కదలలేనంత నీరసం వచ్చింది. సుబ్బారావు భార్య అంబులెన్స్‌ని పిలిచి సుబ్బారావుని హాస్పిటలుకి తీసుకెళ్ళింది.

డాక్టరు పరీక్ష చేసి కోవిడ్ పాజిటివ్ అని తేల్చి "రెండు రోజుల ముందు పరీక్ష చేసి ఉంటే హెూమ్ క్వారెంటైన్‌తో సరిపోయేది. ఇప్పుడు వ్యాధి ముదిరి ఊపిరితిత్తులకు సోకింది. కాబట్టి హాస్పిటల్లో ఉంచి ట్రీట్ చెయ్యాలి" అని చెప్పాడు.

✦ ✦ ✦

పెద్దలు తమ అనుభవంతో "ఆలశ్యం అమృతం విషం" అని "నిదానమే ప్రధానం" అని చెప్పారని తెలియడం సరిపోదు. ఏ సంద ర్భంలో దేనిని ఉపయోగించాలో తెలియడం వివేకం. వివేకం లేకపోతే పైన చెప్పిన సుబ్బా రావులా తప్పు నిర్ణయాలు తీసుకొని నష్ట పోతారు.

వివేకం కలిగి ఉంటే జీవితంలో సరైన మంచి నిర్ణయాలు తీతీసుకోగలుగుతామని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

31

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: యోగసంన్యస్తకర్మాణం జ్ఞానసఞ్ఛిన్న సంశయమ్।**

**ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనఞ్జయ॥ 4-41 ॥**

భావం: అర్జునా! కర్మఫలమును భగవంతుని అర్పిస్తూ విద్యుక్త కర్మలు చేసేవారిని, జ్ఞానము ద్వారా సంశయములను తొలగించుకొనేవారిని, మనస్సును నియంత్రణలో వుంచుకొనేవారిని కర్మలు బంధించవు.

## వివరణ

యుద్ధంలో కౌరవులను సంహరిస్తే పాపం కలుగుతుందని, వంశనాశనం జరుగుతుందని చెప్పి అర్జునుడు యుద్ధం చెయ్యలేనని కృష్ణుడికి చెప్పాడు. జ్ఞానము ద్వారా సందేహాలు తొలగించుకొని, చేసే కర్మల ఫలితాన్ని భగవంతునికి అర్పిస్తూ కర్తవ్యాలను నిర్వర్తించేవారిని కర్మలు బంధించవని కృష్ణుడు అర్జునుడికి బోధించాడు.

✦ ✦ ✦

## ఫలితాన్ని భగవంతునికి అర్పిస్తూ కర్తవ్యాలను నిర్వర్తించాలి



కర్తవ్యాలను నిర్వర్తించే సమయంలో కొన్ని సార్లు కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వస్తుంది. మనం తీసుకొనే నిర్ణయం సరైనదే అయినా దానివలన కొందరు వ్యక్తులకు నష్టం కలగవచ్చు. అటువంటప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడం వలన నాకు పాపం కలుగుతుందా? అని మనకు సందేహం కలగచ్చు.

ఉదాహరణకు మీక్రింది ఉద్యోగస్థుడి మీద వచ్చిన ఒక పిర్యాదును ఎంక్వయిరీ చెయ్యడానికి మీరు నియమించబడ్డారు. మీ ఎంక్వయిరీలో ఫిర్యాదులో ఉన్నది నిజమేనని తేలింది. ఆ విషయమే వ్రాసి మీరు రిపోర్టు ఇస్తే ఆ ఉద్యోగి సస్పెండ్ కావచ్చు. అటువంటప్పుడు మీకు ఆ ఉద్యోగి సస్పెండ్ కావడానికి కారణమైనందుకు నాకు పాపం కలుగుతుందా? అతని ఉసురు నాకు తగులుతుందా? అనే సందేహాలు కలగచ్చు.



మరో ఉదాహరణ చూద్దాము. అక్రమంగా కట్టిన ఒక బిల్డింగు కూల్చివేయడానికి సంబంధించిన ఫైలు మీ టేబుల్ మీదకు వచ్చింది. మీరు సంతకం చేస్తే బిల్డింగు కూల్చడం మొదలుపెడతారు. ఆ బిల్డింగు యజమాని వచ్చి "లక్షలు అప్పు చేసి ఈ బిల్డింగు కట్టాను. ఇంకా అప్పు తీర్చలేదు. మీరు బిల్డింగు కూల్చివేస్తే నాకు బిల్డింగు ఉండదు కాని తీర్చవలసిన అప్పు మాత్రం అలాగే ఉంటుంది. దయచేసి బిల్డింగుని కూల్చకండి" అని మీకు మొరపెట్టుకున్నాడు. రూల్ ప్రకారం ఆ అక్రమ బిల్డింగుని కూల్చివేయాలి. అటువంటప్పుడు "నేను సంతకం చేస్తే బిల్డింగు కూల్చేస్తారు. బిల్డింగు కూలిస్తే ఆ కుటుంబం రోడ్డున పడిపోతుంది. ఆ కుటుంబం ఉసురు నాకు తగులుతుందా? ఫలితంగా నా కుటుంబానికి కూడా ఏదైనా నష్టం కలుగుతుందా?" అనే సందేహాలు కలగవచ్చు.

కర్తవ్య నిర్వహణలో ఇటువంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు అనుభవజ్ఞులను అడిగి సందేహాలు తొలగించుకొని, చేసే పనుల లేక తీసుకునే నిర్ణయాల ఫలితాన్ని భగవంతునికి అర్పిస్తూ నిజాయితీగా నిబంధనల ప్రకారం కర్తవ్యాలను నిర్వర్తించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

32

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కర్మసన్న్యాస యోగము

**అందరిలో భగవంతుడున్నాడనే భావంతో కర్తవ్యాన్ని నిర్వహించాలి**

శ్లోకం: యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః।

సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 5-7 ॥

భావం: మనసును నియంత్రణలో ఉంచుకొనువాడు, జితేంద్రియుడు, అంతఃకరణ శుద్ధి కలవాడు, అన్ని ప్రాణులలో తనలో ఉన్న ఆత్మస్వరూపుడైన పరమాత్మను చూసేవాడు అయిన కర్మయోగి కర్మలను ఆచరిస్తున్నా ఆ కర్మలు వానిని అంటవు.

శ్లోకం: బ్రహ్మణ్యాధాయ కర్మాణి స్గం త్యక్త్వా కరోతి యః।

లిప్యతే న స పాపేన పద్మపత్రమి వామ్భసా ॥ 5-10 ॥

భావం: కర్మలను భగవంతునికి అర్పించి, ఆసక్తి రహితముగా కర్మలను ఆచరించే వారిని తామరాకుపై నీటిబిందువులవలె పాపములు అంటవు.

వివరణ: మనసును నియంత్రణలో ఉంచుకొని, తనలో ఆత్మస్వరూపుడై ఉన్న భగవంతుడే అందరిలో ఉన్నాడనే భావనతో కర్మలు నిర్వర్తిస్తే కర్మఫలాలు అంటుకోవని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు. ఈ విషయాన్ని తెలియ జేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

తిరుచనాపల్లి రాజధానిగా పరిపాలించిన విజయరంగ చొక్కప్రభువు తాయుమానవర్ అనే ఋషికి ఒక విలువైన శాలువా బహుకరించాడు. తీసుకోకపోతే రాజును అవమానించినట్లవుతుందనే భావనతో తాయుమానవర్ ఆ శాలువాను స్వీకరించి రాజును ఆశీర్వదించి తన ఆశ్రమానికి బయల్దేరాడు. దారిలో ఒక వృద్ధురాలు చలికి వణుకుతూ బాధపడుతూ ఉండటం చూసి శాలువాను ఆమెకిచ్చి ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

విషయం తెలిసిన మహారాజు తానిచ్చిన విలువైన శాలువాను వేరొకరికి ఇవ్వడం తనను అవమానించడంగా భావించి తన భటులను పంపి తాయుమానవర్ ను తన ఆస్థానానికి పిలిపించి "నేనిచ్చిన శాలువా ఎక్కడ?" అని కోపంగా అడిగాడు.

తాయుమానవర్ ప్రశాంతంగా "ప్రభూ ఆ శాలువాను నేను అఖిలాండేశ్వరీదేవికి సమర్పించాను. ఆమె ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉంటాయి" అని చెప్పాడు.

అందరిలోనూ జగన్మాతను దర్శించగల తాయుమానవర్ గొప్పదనాన్ని గుర్తించిన రాజు

అతనికి నమస్కరించి, క్షమించమని కోరాడు.

✦ ✦ ✦

సర్వం సృష్టించిన, సర్వం ఈయగల దైవానికి ఏవో కానుకలు ఇవ్వటం కాక, ఆయన సృష్టించిన జీవులన్నింటిలో ఆయన్ని దర్శించాలని తెలియజేసే కథ చదువుదాము.

ధనవంతుడైన రమణ తాను దైవస్వరూప మని నమ్మిన స్వామీజీకి బహుకరించడానికి వజ్రాల కిరీటాన్ని తీసుకొచ్చాడు. స్వామీజి మందిరం ముందున్న సేవకులు అతడిని లోపలికి వెళ్ళనీయకుండా అడ్డగించి "సర్వం సృష్టించిన దైవానికి కానుకలు ఇవ్వడం ఎందుకు?" అన్నారు

అంతలో స్వామి దర్శనం చేసుకొని వెళ్తున్న ఒక ముసలివాడు కళ్ళు తిరిగి పడి పోయాడు. రమణ పరుగున వెళ్ళి తన దగ్గర ఉన్న వాటర్ బాటిల్లోని నీళ్ళు వృద్ధుడి ముఖం మీద చిలికించాడు. అతడు కళ్ళు తెరిచాక కొన్ని నీళ్ళు పట్టాడు. వాటర్ బాటిల్ వృద్ధుడికి ఇచ్చి స్వామిజీ మందిరం దగ్గరకు మళ్ళీ వచ్చాడు. కాని వజ్రాల కిరీటాన్ని వృద్ధుడికి సేద తీర్చిన చోట మరచిపోయి వచ్చాడు.

ద్వారం దగ్గరకి వస్తున్న రమణను చూసి సేవకులు తలుపులు తెరచి అతడిని గౌరవంగా మందిరంలోకి పంపారు.

✦ ✦ ✦

మనలో ఆత్మస్వరూపుడై ఉన్న భగవంతుడే అందరిలో ఉన్నాడనే భావంతో జీవించేవారు ఎవ్వరినీ ద్వేషించరు, మోసం చెయ్యరు, ఆప దలో ఉన్నవారికి చెయ్యగలిగినంత సహాయం తప్పకుండా చేస్తారు. అటువంటి వ్యక్తులు కర్తవ్య నిర్వహణలో తప్పులు, మోసాలు, అన్యాయాలు చెయ్యరు. ఈ విషయాన్ని తెలియజేసే కథ



చదువుదాము.

ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులను మీరు ఇంటర్వ్యూ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో అభ్యర్థు లను సెలక్ట్ లేక రెజెక్ట్ చేసే నిర్ణయం మీదే. తర్వాతి అభ్యర్థి రమేష్‌ని ఇంటర్వ్యూ హాలులోకి పిలిచేముందు అతని బయోడేటా చదివిన మీకు అతను ఇరవై సంవత్సరాల క్రితం మీ కుటుం బాన్ని దారుణంగా మోసం చేసిన మోహనరావు కొడుకని తెలిసింది. రమేష్ ఇంటర్వ్యూలో అడి గిన ప్రశ్నలకు ఎంత బాగా సమాధానాలు చెప్పినా మీ పొజిషన్లో ఉన్న సాధారణ వ్యక్తు లెవ్వరూ అతడ్ని సెలెక్ట్ చెయ్యరు.

కాని మీరు మీలో ఆత్మస్వరూపుడై ఉన్న భగవంతుడే అందరిలో ఉన్నాడనే భావంతో జీవించేవారు అయితే రమేష్‌లో ఆత్మస్వరూపుడై ఉన్న భగవంతుడి మీద పగ సాధించాలని అనుకోరు. ఇంటర్వ్యూలో రమేష్ చూపించిన ప్రతిభను బట్టే నిర్ణయం తీసుకుంటారు.

✦ ✦ ✦

మనలో ఆత్మస్వరూపుడై ఉన్న భగవంతుడే అందరిలో ఉన్నాడనే భావనతో కర్తవ్యాన్ని నిర్వ హించాలని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

33

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## అదృష్టానికి పక్షపాతం ఉండదు

**శ్లోకం: నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః।**

**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥5-15॥**

భావం: భగవంతుడు ప్రాణుల పాపపుణ్య కార్యాలలో దేనికీ భాగస్వామి కాడు. అజ్ఞానముతో జ్ఞానము కప్పబడివుండటం వలన ప్రాణులు ఆవిధంగా మోహితులవుతారు.

వివరణ: జీవితంలో ఉన్నతస్థితికి వచ్చిన వాళ్ళని చూసి కొంతమంది వారిని అదృష్టం వరించిందనుకుంటారు. కాని అదృష్టం అన్ని విధాలా సిద్ధంగా ఉన్న వ్యక్తినే వరిస్తుంది. మనం ఎంత ఎక్కువగా కష్టపడితే అదృష్టం మనల్ని అంత ఎక్కువగా వరిస్తుంది. అవకాశాన్ని, సరైన సమయాన్ని గుర్తించి అవకాశం వలన కలిగే ప్రయోజనాలను ఎక్కువగా పొందగలగడమే అదృష్టం.

అదృష్టం అనేది ప్రయత్నంతో గెలుచుకోవలసిన బహుమతి. జయాపజయాలకు కారణాలను సరిగ్గా విశ్లేషించలేనివాళ్ళు తాము సరిగ్గా పనిచేయలేకపోవడాన్ని విధిరాత అని, దురదృష్టమని భ్రమపడతారు, మథ్యపడతారు. కాని అదృష్టమనేది కేవలం ఒక అవకాశం మాత్రమే. దానికోసం ఎదురు చూస్తూ కూర్చోకూడదు. ప్రయత్నంచేసి దానిని సాధించాలి.

బలహీనులు అదృష్టాన్ని నమ్ముకుంటారు. బలవంతులు కృషిని, పట్టుదలను నమ్ముతారు. అదృష్టం ఎప్పుడైనా ఒకసారి కొన్ని ఎక్కువ మార్కులు తేగలదేమో గాని ఎవ్వరినీ మేధావిని మాత్రం చెయ్యలేదు. అదృష్టం ఎప్పుడైనా ఒకసారి విజయం అందించగలదేమో గాని ఎవ్వరి శక్తిసామర్థ్యాలనూ పెంచలేదు. కాబట్టి అదృష్టాన్ని నమ్ముకోవద్దు.

✦ ✦ ✦

సూర్యుడి వెలుతురు అందరికీ సమానంగా లభించినట్లు దేవుడి కరుణ కూడా అందరికీ సమానంగా లభిస్తుంది. కాని సాక్షాత్తూ భగవంతుడే ప్రత్యక్షమైనా అతడిని భగవంతుడని నమ్మకపోతే భగవద్దర్శన ప్రయోజనం కలగదు. శ్రీకృష్ణుడు ఎదురుగానే ఉన్నా దుర్యోధనుడు అతడిని భగవంతుడిగా గుర్తించలేదు. పాండవులు కృష్ణుడిని భగవంతుడిగా గుర్తించారు. అందువలన పాండవులు పొందిన ప్రయోజనం కౌరవులు పొందలేకపోయారు.

భగవంతుడికి పక్షపాతం లేదు. భగవంతుడు అందరికీ అవకాశాలు కల్పిస్తాడు. కొందరు అవకాశాలను గుర్తించరు. మరికొందరు అవ

కాశాలను గుర్తించినా అవకాశాలను విజయాలుగా మార్చుకోడానికి కష్టపడకుండా భగవంతుడు విజయాలను వరాలుగా ఇవ్వలేదని బాధపడతారు. కొందరు మాత్రమే ధృఢ సంకల్పంతో, ఆత్మవిశ్వాసంతో కృషిచేసి అవకాశాలను విజయాలుగా మార్చుకుంటారు. అదృష్టం వస్తుందని, ఏదో కలిసివస్తుందని ఎదురుచూస్తూ సమయాన్ని వృథా చేసే వ్యక్తి తనకు వచ్చిన అద్భుతమైన అవకాశాలను గుర్తించలేకపోతాడు.



దేవుడు అవకాశాలను అందరికీ సమానంగానే ఇస్తాడు. కాని కొంతమంది వచ్చిన అవకాశాలను గుర్తించరని తెలియజేసే ఒక కథ చదువుదాము.

గోదావరి నదికి వరదలు వచ్చి లంక గ్రామాలు నీట మునిగాయి. ఆ గ్రామాలలోని ప్రజలు ఇళ్ళ కప్పులు ఎక్కి కూర్చొని సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారిలో ఒక భక్తుడు తనను రక్షించమని దేవుడ్ని ప్రార్థిస్తూ కూర్చున్నాడు. వరద పెరిగి నీటిమట్టం పెరుగుతోంది. అంతలో రెండు పడవలు వచ్చాయి. ఇళ్ళ కప్పుల మీద ఉన్న గ్రామస్థులు పడవల్లోకి ఎక్కారు. భక్తుడిని కూడా పడవలోకి రమ్మని పిలిచారు. కాని భక్తుడు దేవుడు నన్ను రక్షిస్తాడని చెప్పి నిరాకరించాడు. పడవలు వెళ్ళిపోయాయి. వరద పెరిగి నీటిమట్టం భక్తుడు ఉన్న ఇంటికప్పు వరకు చేరింది. అంతలో ఒక హెలికాప్టర్ వచ్చింది. దానిలోనుండి త్రాడు నిచ్చెనను జారవిడిచి దానిని పట్టుకొని హెలికాప్టర్లోకి రమ్మని భక్తుడికి చెప్పారు. కాని భక్తుడు దేవుడు నన్ను రక్షిస్తాడని చెప్పి నిరాకరించాడు. హెలికాప్టర్ వెళ్ళిపోయింది. వరద ఇంకా పెరిగి భక్తుడు నీటిలో మునిగి చనిపోయాడు.

చనిపోయిన భక్తుడు స్వర్గానికి వెళ్లి నీ భక్తుడినైన నన్ను రక్షించడానికి ఎందుకు రాలేదని దేవుడిని కోపంగా అడిగాడు. దేవుడు చిన్నగా నవ్వి "పిచ్చివాడా! పడవల్లో, హెలికాప్టర్లో వచ్చిన రక్షకదళాలు నేను పంపినవే. నువ్వు గుర్తించలేకపోయావు" అన్నాడు.

✦ ✦ ✦

అదృష్టం, దురదృష్టం అనేవి ఉండవు. భగవంతుడికి పక్షపాతం లేదు, అందరికీ అవకాశాలు కల్పిస్తాడు. కాని అవకాశాలను గుర్తించనివారు, గుర్తించినా అవకాశాలను విజయాలుగా మార్చుకోడానికి కష్టపడనివారు దురదృష్టం అనుకుంటారు. అవకాశాలను గుర్తించి పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో అవకాశాలను ఉపయోగించుకుంటే అదృష్టమని పిలవబడే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

34

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం:** న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్।
స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః ॥ 5-20 ॥

**భావం:** ప్రియములు పొందినప్పుడు పొంగిపోనివాడు, అప్రియములు పొందినప్పుడు ఉద్వేగమునకు లోనుకానివాడు, స్థిరమైన బుద్ధి కలవాడు, మోహవివశుడు కానివాడు అయిన బ్రహ్మవేత్త భగవంతునియందు ఏకీభావస్థితుడై ఉంటాడు. **వివరణ:** పొగడ్తలకు పొంగిపోతే మనకున్న శక్తిసామర్థ్యాలు చాలా ఎక్కువనే భ్రమ కలిగి, గర్వం పెరుగుతుంది. మనం ఏపని చేసినా, ఎలా చేసినా సునాయసంగా

## పొగడ్తలను, నిందలను సమానంగా చూడాలి

విజయం సాధించగలమనే అహంకారం పెరుగుతుంది. గెలుపు నాదే అనే అహంకారంతో శ్రద్ధ లేకుండా ప్రయత్నాలు చేస్తారు. ఫలితంగా అపజయాలు కలుగుతాయి.

నిందలకు కృంగిపోతే సాధించాలనే ఉత్సాహం తగ్గిపోతుంది, సాధించగల శక్తి సామర్థ్యాలు లేవనే అభిప్రాయం కలుగుతుంది. అందువలన సాధించగలననే నమ్మకం లేకుండా ప్రయత్నాలు చేస్తారు. ఫలితంగా అపజయాలు కలుగుతాయి. కాబట్టి పొగడ్తలకు పొంగిపోకూడదు, నిందలకు నిరాశపడకూడదు. రెండింటినీ సమచిత్తంతో స్వీకరించాలి. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ గుర్తుచేసు కుందాము.



గౌతమ బుద్ధుడు తన శిష్యులతో కలిసి దేశసంచారం చేస్తూ ప్రభోదాలు చేస్తూ ఒక గ్రామం చేరి గ్రామాధికారి ఇంటిముందు నిలబడి బిక్షమడిగాడు.

బుద్ధుడి పట్ల సదభిప్రాయం లేని ఆ గ్రామాధి కారి "నువ్వు సోమరిపోతులా పనీ పాటా చెయ్యకుండా బిక్షాటన చేసి బ్రతుకుతున్నావు. ఎంతోమంది యువకులను శిష్యులుగా చేర్చుకుని వారిని కూడా సోమరిపోతుల్లా తయారుచేస్తున్నావు. కష్టపడి పనిచేసి పొట్ట పోసుకోవడం నేర్చుకో" అని దూషించాడు.

బుద్ధుడు ప్రశాంతంగా "మీ ఇంటికి వచ్చిన అతిథికి మీరు పళ్ళు, పలహారాలు ఒక పళ్ళెంలో పెట్టి అందించారు. కాని ఆ అతిథి వాటిని స్వీక రించలేదు. అప్పుడా పళ్ళు, ఫలహారాలు ఎవరికి చెందుతాయి?" అని గ్రామాధికారిని అడిగాడు.

"నాకే చెందుతాయి" గ్రామాధికారి జవాబిచ్చాడు.

బుద్ధుడు చిరునవ్వుతో "నేను మిమ్మల్ని బిక్షమడిగాను. మీరు దూషణలనే బిక్ష పెట్టారు. నేను వాటిని స్వీకరించలేదు. మీరు చెప్పిన ప్రకారం ఆ దూషణలన్నీ మీకే చెందుతాయి" అని చెప్పాడు.

✦ ✦ ✦

పొగడ్తలకు పొంగిపోకుండా, నిందలకు నిరాశపడకుండా కర్తవ్యాలను నిర్వహించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

35

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కోపాన్ని, కోరికలను, ఇంద్రియాలను జయించాలి

**శ్లోకం: శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్।**

**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ 5-23 ॥**

భావం: శరీరమును విడువకముందే అనగా జీవించివుండగానే కామక్రోధములను, ఉద్వేగములను అదుపులో ఉంచుకోగల సాధకుడే నిజమైన యోగి.

**వివరణ:**

కామక్రోధాలను జయించినవారు ఆకర్షణలకు లోనుకాకుండా మనసును భగవంతుడిపై కేంద్రీకరించగలుగుతారు, మోక్షాన్ని పొందగలుగుతారు. అలాగే కోపాన్ని, కోరికలను, ఇంద్రియాలను జయించినవారు లక్ష్యం నుండి మనసును ప్రక్కకు మళ్ళించే ఆకర్షణలకు లోనుకాకుండా దృష్టినంతా లక్ష్యం మీదే కేంద్రీకరించి విజయం సాధిస్తారు.

జీవించి ఉండగానే, ముసలితనం రాకముందే కోపాన్ని, కోరికలను, ఇంద్రియాలను జయించినవాడే నిజమైన యోగి. సముద్రస్నానానికి వెళ్లి అలలను చూసి భయపడి అలలు ఆగాక స్నానం చేద్దామని వేచివుండేవాడు ఎంత మూర్ఖుడో, సంసార బాధ్యతలన్నీ పూర్తిచేసుకున్నాక మోక్షం కోసం ప్రయత్నిద్దామనుకొనేవాడు కూడా అంతే మూర్ఖుడు.

ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

అగస్త్యమహర్షికి ఒక రైతుమీద కరుణ కలిగి "నిన్ను వైకుంఠానికి తీసుకెళ్తాను నాతోరా" అని అడిగాడు. రైతు "చాలా సంతోషం స్వామీ! కాని నా కొడుకులు చాలా చిన్నవాళ్ళు. పది సంవత్సరాల తర్వాత తప్పకుండా వస్తాను" అని జవాబిచ్చాడు.

పది సంవత్సరాల తర్వాత అగస్త్యుడు మళ్ళీ రైతు వద్దకు వచ్చి "నువ్వడిగిన గడువు ముగిసింది. వైకుంఠానికి వెళ్దాం రా" అని అడిగాడు. రైతు "స్వామీ! ఈమధ్యనే నా పెద్ద కుమారుడి వివాహం చేసాను. మనవడు పుట్టాక వాడితో కొన్నాళ్ళు సంతోషంగా గడపాలని ఉంది. మరో పది సంవత్సరాల తర్వాత తప్పకుండా వస్తాను" అని జవాబిచ్చాడు.

మరో పది సంవత్సరాల తర్వాత అగస్త్యుడు మళ్ళీ రైతు ఇంటికి వచ్చాడు. ఇంట్లో రైతు లేడు. ఇంటిముందు ఒక కుక్క పడుకొని ఉంది. అగస్త్యుడు దివ్యదృష్టితో



రైతు చనిపోయి కుక్కగా పుట్టాడని తెలుసుకున్నాడు. తన శక్తితో కుక్కకు జ్ఞానం ప్రసాదించి "ఇప్పుడైనా వైకుంటానికి వస్తావా?" అని అడిగాడు. కుక్కగా జన్మించిన రైతు "స్వామీ! నాపిల్లలు పెద్దవాళ్ళయ్యారు కాని లోకజ్ఞానం తెలియదు. రాత్రి పూట దొంగలు రావచ్చు. నేను ఇంటికి కాపలా ఉండాలి. మరో పది సంవత్సరాల తర్వాత తప్పకుండా వస్తాను" అని జవాబిచ్చాడు.

మరో పది సంవత్సరాల తర్వాత అగస్త్యుడు మళ్ళీ రైతు ఇంటికి వచ్చాడు. ఇంటిముందు కుక్క లేదు. రైతు కుక్కగా చనిపోయి పాముగా పుట్టి ఇంటి వెనుక ఉన్న పుట్టలో ఉన్నాడని, ఆ పుట్ట క్రింద రైతు దాచిన ధనం ఉందని గ్రహించాడు. ఈసారి ఎలాగైనా ఆరైతుకు మోక్షం ప్రసాదించాలనే ఉద్దేశ్యంతో ఇంట్లోని వాళ్ళతో ఇంటి వెనుక ఉన్న పుట్ట క్రింద చాలా ధనం ఉందని చెప్పాడు. వెంటనే వాళ్ళు పుట్టను త్రవ్వడం మొదలుపెట్టారు. బయటకు వచ్చిన పామును కొట్టి చంపేశారు.

రైతు ఎవరికోసం ధనం దాచిపెట్టాడో, ఎవరి రక్షణ కోసం మోక్షాన్ని వాయిదా వేసుకున్నాడో వాళ్ళే అతన్ని చంపేశారు. దానితో రైతుకు 'నా' అనే వ్యామోహం పోయింది. అందువలన మోక్షం లభించింది.

✦ ✦ ✦

ముసలితనం రాకముందే కోపాన్ని, కోరికలను, ఇంద్రియాలను జయించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

36

# యువతకు భగవద్గీత చూపించిన దారి



### సెల్ఫ్ హెల్ప్ – బెస్ట్ హెల్ప్

శ్లోకం: ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవ సాదయేత్।

ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపు రాత్మనః ॥ 6–5 ॥

భావం: ప్రతీ వ్యక్తీ తనకు తానే బంధువు, తనకు తానే శత్రువు. అందువలన తనను తానే ఉద్ధరించుకోవాలి. తనను తాను అధో గతిలో పడేసుకోకూడదు.

## ఆత్మసంయమ యోగము

### వివరణ

"ఎవరో వస్తారని, ఏదో చేస్తారని
ఎదురు చూసి మోసపోకుమా
నిజము మరచి నిదురపోకుమా" అని భూమి కోసం (1974) సినిమా కోసం శ్రీశ్రీ రాసిన పాటలోలా ఎవరో వచ్చి మనకు సహాయం చేస్తారని ఎదురుచూసి మోసపో కూడదు. మనకు మనమే సహాయం (సెల్ఫ్ హెల్ప్) చేసుకోవాలి. సెల్ఫ్ హెల్ప్ చేసు కోవటం చిన్ననాటి నుండే పిల్లలకు అల వాటు చెయ్యాలి.

✦ ✦ ✦

మనం కష్టపడినట్లు మన పిల్లలు కష్ట పడకూడదనే అభిప్రాయంతో కొంతమంది తల్లిదండ్రులు – స్కూల్ షూ పాలిష్ చేసు కోవడం, బుక్ షెల్ఫులో పుస్తకాలు సక్రమంగా సర్దుకోవడం, స్నానానికి వేడినీళ్లు పెట్టుకోవడం వంటి పిల్లలు స్వయంగా చేసుకోగలిగిన చిన్న చిన్న పనులు కూడా చేసి పెడుతున్నారు. అందువలన పిల్లలకు వారి పనులు వారు చేసు కోవడం అలవాటు కావడంలేదు. ఫలితంగా పెద్దయాక కూడా వారికి వారి పనులు వారు స్వయంగా చేసుకోవడం రావడంలేదు. ఎవరి పనులు వారు చేసుకొనేవారిని అందరూ మెచ్చుకుంటారు. కాబట్టి తల్లిదండ్రులు పిల్ల లకు వారి పనులు వారు చేసుకోవడం అల వాటు చెయ్యాలి.

ఇదే విషయాన్ని గాంధీగారు "ఆత్మకథ (మూడవ భాగం – అధ్యాయం 17 – గోఖలే గారితో ఒక మాసం – 1)లో ఈక్రింది విధంగా తెలియజేశారు:

"నా పనులన్నీ స్వయంగా చేసుకోవడం నాకు అలవాటు. కనుక నాకోసం చేయ వలసినది ఏమీ లేదు. నా పనులు నేను చేసు కోవడం, నియమబద్ధమైన నడవడి, నా దుస్తుల తీరు ఇవన్నీ చూచి ఆయన (గోఖలే) విస్తు పోయారు. నన్ను ఎక్కువగా మెచ్చుకోవడం ప్రారంభించారు."

✦ ✦ ✦

కారు కొనుక్కొని డ్రైవింగ్ నేర్చుకోకపోతే నెలకి కనీసం పదిహేనువేల రూపాయిలు డ్రైవరు జీతం కోసం ఖర్చు చెయ్యాలి. మనం ముందుగా అనుకున్న టైముకి తయారై వున్నా డ్రైవరు ఆలశ్యంగా వస్తే మనం ఆలశ్యంగా బయల్దేరాల్సి వస్తుంది. తన ఇంటి నుండి డ్యూటీకి బయల్దేరిన డ్రైవరు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుంటే డ్రైవరు వచ్చేవరకు పడుగాపులు పడి ఎదురు చూడాలి. డ్రైవరు సెలవు పెడితే మన పనులని వాయిదా వేసుకోవాలి లేదా హాల్టింగ్ డ్రైవరుని ఏర్పాటు చేసుకోవాలి. ఆ విధంగా కారు కొనుక్కొని డ్రైవింగ్ నేర్చుకోక పోతే సమయం వృధా అవ్వడమే కాకుండా డబ్బు కూడా ఎక్కువ ఖర్చవుతుంది. కాని డ్రైవింగ్ నేర్చుకొని మన కారుని మనమే డ్రైవ్ చేసుకుంటే డ్రైవరు కోసం ఎదురు చూడ టంలో సమయం వృధా కాదు డబ్బు కూడా ఆదా అవుతుంది.

ఇదే విషయాన్ని గాంధీగారు "ఆత్మకథ" (మూడవ భాగం - అధ్యాయం 9 - మిత వ్యయం)లో ఈక్రింది విధంగా తెలియ జేశారు.

"చాకలి ఖర్చు విపరీతంగా పెరిగి పోయింది. కాలరు ధర ఎంతో, దానిని ఉతికించడానికి అంతా ఖర్చు అవుతోంది. దానికితోడు చాకలివాని కోసం పడుగాపులు పడవలసి వస్తోంది. ఈ కష్టాలు పడేకంటే నా బట్టలు నేనే ఉతుక్కోవడం మంచిదని భావించాను. నా పనులన్నీ నేనే చేసుకొని ఖర్చులు తగ్గించుకోవాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను."



✦ ✦ ✦

ఎవరి పనులు వారు చేసుకోవడం ఎంత ఉపయోగకరమో తెలియజేసే ఒక కథ చదువు దాము.

వందల ఎకరాల పొలాలు, కొబ్బరితోటలు, చేపల చెరువులు, రైస్ మిల్లులు ఉన్న భూస్వామి అకస్మాత్తుగా చనిపోయాడు. అతని ఒక్కగానొక్క కొడుకు రాము వ్యాపార వ్యవహారాలను బంధు వులకు, స్నేహితులకు అప్పగించి ఫ్రెండ్సుతో పార్టీలు చేసుకుంటూ గడిపేవాడు. వ్యాపార వ్యవహారాలను స్వయంగా చూసుకోమని తల్లి ఎంత చెప్పినా వినేవాడు కాదు.

ఒక సాయంత్రం రాము తనకు చిన్నప్పుడు చదువు చెప్పిన మాష్టారు ఇంటికి వెళ్ళాడు. మాష్టారు పిల్లలకి కథ చెప్తూ ఉ ండటంతో డిస్టర్బ్ చెయ్యకుండా నిలబడి కథ వినసాగాడు -



తోటమాలికి గుడివద్ద జరుగుతున్న సంబరాలు చూడాలనిపించింది. కాని తోట చూసుకోడానికి మరో మనిషి లేకపోవడంతో ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తూ చెట్లకి నీళ్ళు పోస్తున్నాడు. చెట్ల మీదున్న కోతులు కిందకి దిగి తోటమాలితో పాటు చెట్లకి నీళ్ళు పోశాయి. తోటమాలి కలుపు తీస్తుంటే అవి కూడా కలుపు తీసాయి, ఎండుటాకులు ఊడుస్తుంటే అవి కూడా ఊడ్చాయి. తోటమాలి సంతోషించి ఆ కోతులతో "నేను గుడివద్ద జరుగుతున్న సంబ రాలు చూసి వస్తాను. ఈలోపు మిగిలిన మొక్క లకి కూడా నీళ్ళు పోయండి'' అని చెప్పి సంబ రాలు చూడటానికి వెళ్ళాడు.

తోటమాలి సాయంత్రం తిరిగి వచ్చేసరికి మొక్కలన్నీ వ్రేళ్ళతో సహా పీకి ఉన్నాయి. తోటమాలి కోపంతో మొక్కలు ఎందుకలా పీకేసారని అడిగాడు. "పోసిన నీళ్ళు వ్రేళ్ళకి అందాలని మొక్కలను వ్రేళ్ళతో సహా పీకి నీళ్ళు పోసాము. ఇప్పుడు మళ్ళీ వాటిని వాటి స్థానాలలో నాటేస్తాం'' అని కోతులు జవాబిచ్చాయి. నాపని నేను చేసుకోకుండా కోతులకు అప్పజెప్పి తప్పు చేసానని తోటమాలి బాధపడ్డాడు.– మాష్టారు కథ చెప్పడం ముగించారు.

కథ వినిన రాము వ్యాపార వ్యవహారాలు ఇతరులకి అప్పజెప్పి తప్పు చేసానని తెలుసు కున్నాడు. వ్యాపార వ్యవహారాలు తానే స్వయంగా చూసుకోవాలని నిర్ణయించుకుని మాష్టారును కలవకుండా ఇంటికి వెళ్ళాడు.

✦ ✦ ✦

ఈ రోజుల్లో ప్రతీ రంగంలోనూ పోటీదార్లు, పోటీతత్వం బాగా పెరిగిపోయాయి. అందు వలన ఈ పోటీ ప్రపంచంలో విజయాలు సాధించడానికి కొత్త పథకాలు, కొత్త విజయ సూత్రాలు చాలా అవసరం. దానికి కొత్త ఆలో చనలు కావాలి. దానికి ఎవరినో సహాయం అడగకుండా కొత్త విజయసూత్రాలు నేర్చుకోడానికి, కొత్తగా ఆలోచించడం అలవాటు చేసుకోడానికి సంవత్సరంలో కనీసం రెండు సెల్ఫ్ హెల్ప్ పుస్తకాలు చదవండి.

✦ ✦ ✦

ఎవరో వచ్చి మనకు సహాయం చేస్తారని ఎదురుచూడకుండా మనకు మనమే సహాయం (సెల్ఫ్ హెల్ప్) చేసుకొని మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని, విజయాలు సాధించాలని, వృద్ధిలోకి రావాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦

37

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్



## సెల్ఫ్ కంట్రోల్ – సెల్ఫ్ డిసిప్లిన్

శ్లోకం: బన్ధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః।
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥ 6-6 ॥

భావం: మనస్సును, ఇంద్రియాలను జయించినవాడు తనకు తానే మిత్రుడు, జయించనివాడు తనకు తానే శత్రువు.

వివరణ: మనసును, ఇంద్రియాలను జయించిన వ్యక్తి తన శక్తిసామర్థ్యాలను, సమయాన్ని తన లక్ష్యసాధనకు పూర్తిగా ఉపయోగించగలుగుతాడు. మనసును, ఇంద్రియాలను జయించలేని వ్యక్తి ఆకర్షణలకు లోనై తన శక్తిసామర్థ్యాలను, సమయాన్ని లక్ష్యసాధన కోసం పూర్తిగా ఉపయోగించలేకపోతాడు.

ఇతరులను నియంత్రించే వ్యక్తి గొప్పవాడే కాని తనను తాను నియంత్రించుకోగలిగే వ్యక్తి అత్యంత గొప్పవాడు. విజయం సాధించడానికి అనువైన అద్భుతమైన ప్లాన్, ధృడమైన సంకల్పం ఉన్నా కూడా సెల్ఫ్ డిసిప్లిన్ (స్వీయ క్రమశిక్షణ) లేని వ్యక్తులు ఆ ప్లాన్ ప్రకారం పనిచెయ్యరు, విజయం సాధించలేరు.

చదువుకునే వయసులో స్కూల్లో టీచర్లు, కాలేజీలో లెక్చరర్లు, హాస్టల్లో వార్డెన్లు, ఇంట్లో తల్లిదండ్రులు మనం మన ప్లాన్ షెడ్యూల్ ప్రకారం చదివేలా చూస్తారు, మనం క్రమశిక్షణతో మెలిగేలా చూస్తారు. కాని ఆ తర్వాత మనల్ని క్రమశిక్షణతో నడిపించేవాళ్ళ మోనిటరింగ్ ఉండరు. కాబట్టి సెల్ఫ్ డిసిప్లిన్ లేని వ్యక్తులు ప్లాన్ షెడ్యూల్ ప్రకారం పనిచెయ్యకుండా (i) నేను ఈరోజు షెడ్యూల్ స్కిప్ చేసి సినిమాకి / పార్టీకి వెళ్తాను. (ii) ఈరోజు నా మూడ్ బాగోలేదు. ఈరోజు షెడ్యూల్ స్కిప్ చేస్తాను – అంటూ షెడ్యూల్ స్కిప్ చెయ్యడానికి నెపాలు వెతుకుతారు. ఫలితంగా షెడ్యూల్ ప్రకారం పనిచెయ్యక విజయాలు సాధించలేకపోతారు. విద్యార్థిదశలో అద్భుతమైన విజయాలు సాధించిన కొంతమంది ఆ తర్వాత అంతటి గొప్ప విజయాలు సాధించలేకపోడానికి వారికి స్వీయ క్రమశిక్షణ లేకపోవడం ఒక ముఖ్య కారణం.

ఎవ్వరూ చూడనప్పుడు, ఎవ్వరికీ తెలియదని నమ్మకం ఉన్నపుడు కూడా చెయ్యకూడని పనులు చేయ్యకపోవడం సెల్ఫ్ కంట్రోల్ (స్వీయ నియంత్రణ). నీకు నచ్చినా, నచ్చకపోయినా చెయ్యవలసిన పని చెయ్యడం,

చెయ్యక పోయినా ఎవ్వరూ అడగరని తెలిసినా చెయ్యవలసిన పని చెయ్యడం స్వీయ క్రమశిక్షణ (సెల్ఫ్ డిసిప్లిన్).

✦ ✦ ✦

సంక్రాంతి పండుగకు అత్తారింటికి వెళ్ళిన క్రొత్త అల్లుడుకి అత్తారింట్లో వండిన పిండి వంటలు బాగా నచ్చాయి. తన జిహ్వాచాపల్యాన్ని కంట్రోల్ చేసుకోలేక పీకలదాకా తిని భుక్తా యాసంతో మంచం మీద పడుకొని అప సోపాలు పడుతున్నాడు. అల్లుడి అవస్థ చూసిన అత్తగారు ఒక గ్లాసుతో నీళ్ళు, ఇనో ప్యాకెట్ ఇచ్చి, ఇనో కలుపుకొని త్రాగు, భుక్తాయాసం తగ్గుతుందని చెప్పింది. వాటిని తీసుకుని అల్లుడు "ఇంట్లో ఇనో ఉందని చెప్తే మరో రెండు బూరెలు తినేవాడిని కదా!" అన్నాడు.

✦ ✦ ✦

స్వీయ క్రమశిక్షణ లేని కొంతమంది ఉద్యో గస్తులు ఆఫీసుకి సమయానికి వెళ్లరు. బాస్ పదకొండు గంటలకు వస్తాడు. మనం పది గంటలకు ఆఫీసుకు వచ్చామో, రాలేదో బాసుకి తెలియదు కాబట్టి లేటుగా వెళ్ళినా బాసుకి తెలియదు అని అనుకుంటారు. కాని స్వీయ క్రమశిక్షణ గల ఉద్యోగులు ఆఫీసుకి సమ యానికి వెళ్ళేది బాసు కోసం కాదు, మన సంతృప్తి కోసం అని భావిస్తారు. ఉద్యోగం వలన లభిస్తున్న జీతం వలన మనం మన కుటుం బాన్ని పోషించుకుంటున్నాము, పిల్లలని చది వించుకుంటున్నాము. అటువంటి ఉద్యోగాన్ని సక్రమంగా చేస్తున్నామనే సంతృప్తి కోసం ఎవరు గమనించినా గమనించకపోయినా ఆఫీసుకి సమయానికి వెళ్తారు.



క్రమశిక్షణ స్వేచ్ఛను, ఆనందాన్ని దూరం చేస్తుందని కొంతమంది అభి ప్రాయం. నిజానికి క్రమశిక్షణతో పని చేయడం వలన పని వేళల్లో శ్రద్ధగా పనిచేసి మిగిలిన సమయంలో స్వేచ్ఛగా, సంతో షంగా గడపగలుగుతాము.

విజయసాధనకు శక్తిసామర్థ్యాల కంటే క్రమశిక్షణ ముఖ్యమని తెలియజేసే కుందేలు – తాబేలు పరుగుపందెం కథ క్లుప్తంగా గుర్తుచేసుకుందాం. వేగంగా పరుగెత్తగల సామర్థ్యం ఉన్న కుందేలు స్వీయ క్రమశిక్షణ లేక కొంత దూరం పరుగెత్తాక నిర్లక్ష్యంగా కాసేపు పడుకుంది. వేగంగా పరుగెత్తగల సామర్థ్యం లేకపోయినా స్వీయ క్రమశిక్షణ గల తాబేలు ఆగకుండా వెళ్లి పందెంలో విజయం సాధించింది.

✦ ✦ ✦

మనస్సును, ఇంద్రియాలను జయించిన వారికి సెల్ఫ్ కంట్రోల్ (స్వీయ నియంత్రణ), సెల్ఫ్ డిసిప్లిన్ (స్వీయ క్రమశిక్షణ) అలవడ తాయి. సెల్ఫ్ కంట్రోల్, సెల్ఫ్ డిసిప్లిన్ కల వారు అద్భుతమైన విజయాలు సాధించగల రని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

38

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: సుహృన్మిత్రార్యు దాసీనమధ్యస్థ ద్వేష్యబన్ధుషు।**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్వి శిష్యతే ॥ 6-9 ॥**

భావం: సహృదులయందు, మిత్రుల యందు, శత్రువులయండు, ఉదాసీనుల యందు, మధ్యస్థులయందు, ద్వేషింపదగిన వారియందు, బంధువులయందు, సత్పురుషులయందు మరియు పాపాత్ములయందు సమభావం కలిగినవారు మిక్కిలి శ్రేష్ఠులు.

## వ్యక్తులను వ్యక్తులుగా ట్రీట్ చెయ్యాలి

వివరణ: వ్యక్తులను వ్యక్తులుగానే చూడాలి గాని వారి ఆస్తిపాస్తులను బట్టి కాదు, వారు చేసే వృత్తులను బట్టి కాదు. ప్రతీ వ్యక్తికీ స్వాభిమానం, ఆత్మగౌరవం ఉంటాయి. కాబట్టి చిన్న ఉద్యోగస్తులైన డ్రైవర్లను, ప్యూనులను, పేదవారిని అరేయ్, ఒరేయ్ అని కాకుండా పేర్లతో పిలిచి వ్యక్తులుగా వాళ్ళని గౌరవించాలి. మంచిపనులను మెచ్చుకోవాలి, చెడుపనులను విమర్శించాలి కాని మంచి పనులు చేసినవారిని, చెడుపనులను చేసిన వారిని వ్యక్తులుగా సమభావంతో చూడాలి.



✦ ✦ ✦

రామలక్ష్మణులు రాక్షసులతో యుద్ధం చేస్తున్నప్పుడు లక్ష్మణుడు వేసిన బాణం ఒక రాక్షస గృహిణి చేయి పట్టుకొని నడుస్తున్న చిన్న బిడ్డకు తగిలి ఆ బిడ్డ చనిపోయింది. చనిపోయిన బిడ్డను అక్కడే వదిలేసి ఆ రాక్షసి తన ప్రాణాలు రక్షించుకోడానికి పరుగెట్టింది. అది చూసిన లక్ష్మణుడు రామునితో “అన్నయ్యా! సాధారణంగా బిడ్డ కోసం తల్లి తన ప్రాణాలను సైతం వదులుతుంది. కాని ఈ రాక్షసి బిడ్డను అక్కడే వదిలి తన ప్రాణాలు కాపాడుకోవటం కోసం పరుగెడుతోంది. ఇదే రాక్షస గుణం.” అన్నాడు. బదులుగా రాముడు “లక్ష్మణా! తొందరపడకు. ఆమె హృదయం పవిత్రమైనది. నా దర్శనం వలన ఆమె భావాలు కూడా పవిత్రంగా మారాయి. ఆమె సర్వసంగపరిత్యాగిగా మారింది. ఆ నిజాన్ని ఇప్పుడు నువ్వు



స్వయంగా తెలుసుకుంటావు" అని చెప్పి ఒక వానరుని పంపి ఆ రాక్షస స్త్రీని తీసుకురమ్మని చెప్పాడు.

రాక్షసి వచ్చాక రాముడు ఆమెను "నీ బిడ్డను వదిలేసి నీ ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగెత్తావా?" అని అడిగాడు. దానికా రాక్షసి "శ్రీరామా! ప్రాప్తి లేక నా బిడ్డ చనిపోయింది. నేను నా బిడ్డను వదిలి పరుగెట్టింది బిడ్డపై ప్రేమ లేక కాదు. నేను ప్రాణాలతో ఉంటే రాముడు రావణుని చంపి అయోధ్యకు తిరిగి వెళ్ళేడప్పుడు నేను కూడా వారితో అయోధ్యకు ఒక దాసిగా వెళ్ళి రాముని సేవ చేసుకోవచ్చు కదా అని నా ప్రాణాలు కాపాడుకోడానికి ప్రయత్నించానే గాని ప్రాణాల మీద తీపితో కాదు" అని జవాబిచ్చింది.

✦ ✦ ✦

మనిషి చెడ్డపనులు చేసినప్పుడు ఆ మనిషి చేసిన చెడ్డపనిని విమర్శించాలి గాని ఆ మనిషిని అసహ్యించుకోకూడదు. అదే మనిషి మంచి పని చేసినప్పుడు ఆ మనిషిని మెచ్చుకోవాలి.

ఇదే అభిప్రాయాన్ని గాంధీ గారు "ఆత్మకథ" (నాలుగవ భాగం – అధ్యాయం 9 – బల వంతులతో పోరు)లో– "మనిషి, అతను చేసే పనులు రెండూ వేరువేరు. మంచి పనుల యెడ ఆదరణ, చెడు పనుల యెడ నిరాదరణ అవ సరం. మంచి పనులు, చెడు పనులు చేసే వారి ద్దరి పట్లా ఆదరణ, దయ కలిగి వుండాలి. దీనిని తెలుసుకోవడం తేలికే. కాని ఆచరణలో పెట్టడం అంత తేలిక కాదు." అని తెలియ జేసారు.

✦ ✦ ✦

వ్యక్తులను వారి ఆస్తిపాస్తులను బట్టి, చేసే వృత్తులను బట్టి, చేసిన పనులను బట్టి ఎక్కువగా, తక్కువగా కాకుండా అందరినీ వ్యక్తులుగా గౌరవించాలని భగవద్గీత నుండి మనం నేర్చు కోవచ్చు.

✦



39

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్

**శ్లోకం: నాత్యశ్నతస్తు యోగోస్తి న చైకాన్త మనశ్నతః ।**

**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ 6-16 ॥**

భావం: అర్జునా! అతిగా తినేవారికి, ఏమాత్రం తిననివారికి, అతిగా నిద్రపోయే వారికి, ఏమాత్రం నిద్రపోనివారికి ఈ యోగ సిద్ధి కలగదు.

**వివరణ:**

అతి గర్వం వలన రావణుడు చంప బడ్డాడు, అతిగా దానం చెయ్యడం వలన బలి చక్రవర్తి పతనం చెందాడు. కాబట్టి దేనిలోనూ అతి పనికిరాదని చాణక్యుడు చెప్పాడు.

అతిగా తినడం అనర్ధదాయకమని తెలియ జేసే ఒక చిన్నకథ చదువుదాము.

ఇడ్లీలు తినే పోటీలో పాల్గొన్న భీమయ్య తన కెపాసిటీ కంటే మూడు రెట్లు ఎక్కువ ఇడ్లీలు తిని మొదటి బహుమతి ఐదువేలు గెలుచుకొని ఇంటికి వెళ్ళాడు.

తినగలిగిన దానికంటే చాలా ఎక్కువ

## అతి మంచిది కాదు





తినడం వలన రాత్రికి భరించలేని కడుపు నొప్పి, ఆయాసం వచ్చి హాస్పిటల్లో చేరాడు. హాస్పిటల్లో రెండురోజుల ట్రీట్మెంట్ తర్వాత ఆరువేల రూపాయలు బిల్లు చెల్లించి ఇంటికి వెళ్ళాడు.

✦ ✦ ✦

అత్యాశకు పోతే ఉన్నది కూడా పోతుందని తెలియజేసే మనం చిన్నప్పుడు చదువుకున్న బంగారుగుడ్లు పెట్టే బాతుకథ క్లుప్తంగా గుర్తు చేసుకుందాం.

ఆశారావు వద్ద ఉండే తెల్లటి బాతు రోజుకొక బంగారుగుడ్డును పెట్టేది. ఆశారావు ఆ గుడ్లను బంగారం వ్యాపారికి అమ్మి ఆ డబ్బుతో సుఖంగా జీవించేవాడు.

కొన్నాళ్ళకి ఆశారావుకి ఆశ ఎక్కువై "ఈబాతు పొట్టలో చాలా బంగారుగుడ్లు ఉండి ఉంటాయి. కాని ఇది రోజుకి ఒక గుడ్డును మాత్రమే పెడుతోంది. దీని పొట్ట కోసి లోపల ఉన్న బంగారు గుడ్లన్నింటినీ ఒకేసారి తీసుకుంటే గొప్ప ధనవం తుడినైపోవచ్చు" అని అలోచించి బాతుని అడ్డంగా కోసాడు. లోపల బంగారుగుడ్లు లేవు.

బాతు చనిపోవడంతో రోజూ లభించే ఒక బంగారుగుడ్డు కూడా లభించకుండా పోయింది.

✦ ✦ ✦

అతి ఏ విషయంలోనూ మంచిది కాదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



40

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్



**శ్లోకం: యతో యతో నిశ్చరతి మన శ్చఞ్చలమస్థిరమ్।**
**తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥6-26॥**

భావం: మనసు సహజంగా నిలకడలేనిది. అనవసమైన ప్రాపంచిక విషయాల వెంట తిరుగుతూ ఉంటుంది. అందువలన మన సును ఆయా విషయాల నుండి పదేపదే మరల్చి పరమాత్మయందు స్థిరంగా నిలిపి ఉంచాలి.

## మనసును నియంత్రణలో ఉంచుకోవాలి

వివరణ: కుటుంబసభ్యులు మాట్లాడు కుంటూ ఉండటం వలన, పక్కింటి నుండి వస్తున్న టివి శబ్దాల వలన, రోడ్డుమీద వెళ్తున్న వాహనాల శబ్దాల వలన చదవటానికి ఏకాగ్రత కుదరటంలేదని, చేసే పనిమీద ఏకాగ్రత కుదరటంలేదని కొందరు చెప్తుం టారు. కాని నిజానికి అటువంటివారికి ఏకా గ్రత కుదరకపోవడానికి కారణం వారి మనసు అవసరంలేని విషయాల గురించి ఆలోచిం చడం. ఈ విషయాన్ని తెలియజేసే భారతంలోని ఒక సంఘటనను క్లుప్తంగా గుర్తుచేసుకుందాము.

కురుపాండవుల విలువిద్యానైపుణ్యాన్ని పరీక్షించడానికి ద్రోణాచార్యుడు ఒక పరీక్ష పెట్టాడు. ఒక పిట్ట బొమ్మను చెట్టు చిటారు కొమ్మకు వ్రేలాడదీసి శిష్యులందరినీ పిలిచాడు.

ముందుగా ధర్మరాజును పిలిచి "చిటారు కొమ్మన ఉన్న పక్షి కనపడుతోందా?" అని అడిగాడు. ధర్మరాజు కనపడుతోందని చెప్పాడు. "చెట్టు కనపడుతోందా?" అని అడిగాడు. ధర్మ రాజు కనపడుతోందని చెప్పాడు. "నేను, నీ సోదరులు కనపడుతున్నామా?" అని అడిగాడు ధర్మరాజు కనపడుతున్నారని చెప్పాడు.

తర్వాత దుర్యోధనాదులందరినీ పిలిచి అవే ప్రశ్నలడిగాడు. అందరూ ధర్మరాజు చెప్పినట్లే సమాధానాలు చెప్పారు. చివరిగా అర్జునుడిని పిలిచి అడిగాడు. అర్జునుడు పక్షి తప్ప తనకు మరేమీ కనపడటంలేదని చెప్పాడు.

"పక్షి అవయవాలు ఎలా ఉన్నాయి?" ద్రోణుడు అడిగాడు

"పక్షి శిరస్సు తప్ప నాకు మరేమీ కన పడటంలేదు" అర్జునుడు చెప్పాడు.

"అయితే బాణంతో దాని శిరస్సు తెగ గొట్టు" ద్రోణుడు ఆజ్ఞాపించాడు.

వెంటనే అర్జునుడు బాణం వదిలాడు. బాణం తిన్నగా వెళ్లి పక్షి శిరస్సును తెగ గొట్టింది. పక్షి శిరస్సు క్రింద పడింది.



ఏకాగ్రత అంటే అవసరంలేని వాటిని చూడకుండా, అనవసరమైన ఆలోచనలు చెయ్యకుండా అలా ఉండాలి.

✦ ✦ ✦

మనసును నియంత్రణలో ఉంచుకుంటే ఎక్కడైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఏ సమయంలోనైనా ఏకాగ్రత కుదురుతుంది. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ చదువుదాము.

గురువు ఉపదేశించిన మంత్రాన్ని సాధన చెయ్యాలని తాతాజీ ఉదయం లేచి ఇంట్లోని హాల్లో కూర్చొని సాధన ప్రారంభించాడు. కొంత సేపటికి అతని భార్య లేచి ఇంటిపని, వంటపని చెయ్యడం మొదలుపెట్టింది. ఆ శబ్దాల వలన ఏకాగ్రత కుదరలేదు.

ఒక గంటసేపు వార్తాపత్రికలు చదివి మళ్ళీ సాధన మొదలుపెట్టాడు. అంతలో పిల్లలు లేచి ఇల్లంతా తిరగడం మొదలుబెట్టారు. ఆ శబ్దాల వలన ఏకాగ్రత కుదరలేదు.

ఇంట్లో సాధన చెయ్యడానికి కావలిసిన ప్రశాంతత దొరకదని భావించి నది ఒడ్డుకు వెళ్లి అక్కడున్న చెట్టుక్రింద కూర్చొని సాధన మొదలుపెట్టాడు. కొంతసేపటికి పక్షుల గుంపు వచ్చి చెట్టుమీద వాలి అరవసాగాయి. పక్షుల శబ్దాలకు అతని ఏకాగ్రత చెడింది. కళ్ళు తెరిచి చూసాడు. ప్రక్కనే ఉన్న మరో చెట్టుక్రింద ఒక సాధువు ఏకాగ్రతతో ధ్యానం చేస్తూ ఉండటం గమనించి ఆ సాధువు వద్దకు వెళ్లి జరిగి విషయం చెప్పి ఏకాగ్రత కుదిరే మార్గం తెలియ జేయమని అడిగాడు.

సాధువు “మనసు నియంత్రణలో ఉంటే ఏకాగ్రత ఎక్కడైనా కుదురుతుంది. మనసు నియంత్రణలో లేకపోతే హిమాలయాలలో కూడా ఏకాగ్రత కుదరదు. నేను గృహస్తు జీవితాన్ని త్యజించిన సాధువును కాబట్టి ఇక్కడ సాధన చేస్తున్నాను. నువ్వు గృహస్తుడవు. మనసు నియంత్రణలో ఉంచుకొని సాధన చేస్తే నీఇంట్లోనే నీకు ఏకాగ్రత కుదురుతుంది.” అని చెప్పాడు.

✦ ✦ ✦

మనసు నిలకడగా ఉండకుండా అనవసరమైన ఆకర్షణలకు లోనవ్వడం వలన, అవసరంలేని ఆలోచనలు చెయ్యడం వలన చేయవలసిన కర్తవ్యం మీద ఏకాగ్రత కుదరదు. మనసును నియంత్రణలో ఉంచుకోవడం వలన చేయవలసిన కర్తవ్యం మీద ఏకాగ్రత కుదిరి గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

41

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## భగవంతుడిని ఎలా చూడాలి?

**శ్లోకం: యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 6-30 ॥**

భావం: అన్ని ప్రాణులయందు ఆత్మ రూపంలో ఉన్న నన్ను చూస్తూ, అన్ని ప్రాణులనూ నాయందు చూసేవారికి నేను అదృశ్యుడను కాను, వారు నాకు అదృశ్యులు కారు.

**వివరణ:** ప్రాణులన్నింటిలో ఆత్మ స్వరూపంలో ఉన్న దేవుడిని చూసేవారికి దేవుడు ఏదోఒక రూపంలో తప్పకుండా దర్శనమిస్తాడు. భగవంతుడిని చూడాలనే బలమైన కోరిక గలవారికి దేవుడు ఏదోఒక రూపంలో తప్పకుండా కనబడతాడని తెలియజేసే ఒక కథ చదువుదాము.

చోళరాజుకు శ్రీరంగం వెళ్లి శ్రీరంగనాథుని దర్శించాలనే గట్టి కోరిక కలిగి రథం మీద శ్రీరంగం బయల్దేరాడు. దారిలో ఒక దివ్య పురుషుడు ఎదురయ్యాడు. రాజు రథం దిగి అతనికి నమస్కరించాడు. ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకున్నారు. మాటలలో పడిన రాజు తాను శ్రీరంగం వెళ్ళడానికి బయల్దేరిన విషయమే మర్చిపోయి రథం ఎక్కి రాజధానికి వెళ్ళిపోయాడు.

అలా రాజు చాలాసార్లు శ్రీరంగానికి బయల్దేరి, దివ్యపురుషుడితో మాట్లాడి వెనక్కి వచ్చేసాడు. ఒకరోజు రాత్రి నిద్రపోయేముందు "ఎన్ని సార్లు ప్రయత్నించినా శ్రీరంగనాథుడిని దర్శించుకోలేకపోతున్నాను. నాకు నా ఇష్ట దైవాన్ని దర్శించే భాగ్యం లేదా?" అని చాలా బాధపడ్డాడు.

ఆ రాత్రి కలలో శ్రీరంగనాథుడు కనబడి "అనవసరంగా ఎందుకు బాధపడతావు? నువ్వు నన్ను చూడటానికి బయల్దేరిన ప్రతీసారీ నీకు ఎదురొచ్చి నీతో మాట్లాడింది నేనే. అందరిలో నన్ను చూడగలిగే తత్వాన్ని అలవాటు చేసుకో" అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

భగవంతుడిని చూడాలనే తీవ్రమైన కోరిక గలవారికి భగవంతుడు ఏదోఒక రూపంలో దర్శనమిస్తాడు. కాని మనుష్యులు ఈ సత్యాన్ని గ్రహించలేక బాధపడతారు.

✦ ✦ ✦

పరోపకరాన్ని మించిన దైవప్రార్థన లేదని భగవంతుడిని దర్శించడానికి పరోపకారాన్ని మించిన సులభమైన మార్గం మరొకటి లేదని తెలియజేసే ఒక కథ గుర్తుచేసుకుందాము.

శివరాత్రి కావడంతో లక్షలాది ప్రజలు కాశీక్షేత్రానికి వచ్చారు.

పార్వతీదేవి శివుడిని "నాథా! కాశీకి వచ్చిన వాళ్ళందరూ పునర్జన్మ లేకుండా కైలా శానికి చేరతారని అంటారు కదా! వీరందరూ కైలాశానికి వస్తారా?" అని అడిగింది

శివుడు "కాశీకి వచ్చినవాళ్లందరూ కైలా శానికి రాలేరు. ఎటువంటివారు కైలాశానికి వస్తారో ప్రత్యక్షంగా చూపిస్తాను" అన్నాడు

పార్వతీ పరమేశ్వరులు వృద్ధజంటగా మారి విశ్వేశ్వరాలయం యొక్క సింహద్వారం వద్దకు చేరారు. ముసలమ్మగా మారిన పార్వతి ముసలి వాడుగా మారిన శివుడి తల తన ఒడిలో పెట్టు కుంది. చెంబులలో గంగాజలం తీసుకొని గుడి లోకి వెళ్ళే భక్తులను "నా భర్త ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. దాహంతో తపిస్తున్నాడు. ఏక్షణంలోనైనా ప్రాణం పోవచ్చు కాబట్టి నేను భర్తను వదిలి వెళ్లి గంగాజలం తేలేను. దయచేసి ఎవరైనా నా భర్త దాహం తీర్చడానికి కొంత గంగాజలం పోసి పుణ్యం కట్టుకోండి" అని దీనంగా అడగసాగింది.

కాని ఒక్క భక్తుడి మనసు కూడా కరగలేదు. ఎవ్వరూ గంగాజలం పొయ్యలేదు. రద్దీలో భక్తులవద్ద ఉన్న విలువైన వస్తువులు దొంగిలిద్దామని భక్తుడి వేషంలో అక్కడకు వచ్చిన దొంగ గంగాజలం పొయ్యడానికి సిద్ధ పడ్డాడు.

ముసలమ్మ రూపంలో ఉన్న పార్వతి "గంగాజలం నాభర్త నోట్లో పోసేముందు నువ్వు చేసిన పుణ్యకార్యం ఏదైనా చెప్పి ఆ తర్వాత పొయ్యి నాయనా! అసత్యం మాత్రం చెప్పద్దు" అని చెప్పింది.

రెండు క్షణాలు ఆలోచించి దొంగ "అమ్మా!



నేనొక దొంగను. నేనింతవరకూ ఒక్క పుణ్యకార్యం కూడా చెయ్యలేదు. ఇప్పుడు గంగాజలం పోసి ఈ వృద్ధుని దప్పిక తీర్చా లనుకున్నాను. ఇదొక్కటే నేను చేస్తున్న పుణ్య కార్యం" అని చెప్పి వృద్ధుని నోట్లో గంగా జలం పోసాడు.

వెంటనే శివపార్వతులు తమ నిజ స్వరూపాలతో దర్శనమిచ్చి "పరోపకారార్థమే మానవజీవితం. ఇప్పటివరకు నువ్వు ఎన్ని చెడ్డపనులు చేసినా ఆపదలో ఉన్నవారికి సహాయం చేసావు, సత్యం పలికావు. సత్యాన్ని మించిన ధర్మం లేదు. పరోప కారాన్ని మించిన దైవప్రార్థన లేదు. ఇకనుండి మంచిగా జీవించు" అని చెప్పి దీవించి అంతర్ధాన మయ్యారు.

✦ ✦ ✦

భగవంతుడు సర్వవ్యాపకుడని తెలియజేసే ఒక కథ చదువుదాము.

గురువు తన శిష్యులందరికీ ఒకొక్క అరటి పండు ఇచ్చి ఎవ్వరూ చూడకుండా తిని వెనక్కి వచ్చి అరటిపండు ఎలా తిన్నారో వివరించమని చెప్పారు.

కొంతమంది శిష్యులు తమ గదులలోకి వెళ్లి తలుపులు మూసి అరటిపండు తిన్నారు, కొందరు ఊరి చివర ఉన్న అడవిలోకి వెళ్లి తిన్నారు, మరికొందరు నది ఒడ్డుకు వెళ్లి తిన్నారు, ఇంకొందరు కొండమీదకు వెళ్లి తిన్నారు. కొంతసేపటి తర్వాత శిష్యులందరూ వచ్చి తాము అరటిపండు ఎవ్వరూ చూడకుండా ఎలా తిన్నామో వివరించారు.

ఒక శిష్యుడు అరటిపండు తినకుండా వెనక్కి తెచ్చి గురువుకు ఇచ్చి "విశ్వమంతా నిండి ఉన్న భగవంతుడు చూడకుండా తినడం నాకు సాధ్యం కాలేదు గురువుగారూ" అని చెప్పాడు.

✦ ✦ ✦

భగవంతుడి కోసం చేసే పూజలు, ఉపవాసాలు ఇతర పనులు కొంతమంది అదనపు భారంగా భావిస్తారు. కాని భగవంతుడు మన మనసులోనే ఉన్నాడని నమ్మితే ఆయన కోసం చేసే పూజలు, ఉపవాసాలు ఇతర పనులు అదనపు భారంగా అనిపించవు. ఈ విషయాన్ని సులభంగా అర్థంచేసుకోడానికి ఒక కథను గుర్తుచేసుకుందాము.

రామయ్య అడవిలోని కొండమీద వున్న కులదైవం గుడికి కాలినడకన బయల్దేరాడు. దారిలో తినడానికి అతని భార్య చపాతీలు, పులి హెూర మూటగట్టి ఇచ్చింది. భార్య ఇచ్చిన మూట నెత్తిమీద పెట్టుకుని బయల్దేరాడు. కొండ దగ్గరకి చేరేసరికి మిట్టమధ్యాహ్నమయ్యింది. ఎండలో నడవడం వలన బాగా చమటలు పట్టి అలసిపోయాడు. నెత్తిమీద ఉన్న ఆహారము మూటని కూడా మోయలేనంత నీరసం ఆవహించింది. అయినా కొండ ఎక్కడానికి ప్రయత్నించాడు. కాని ఎక్కలేకపోయాడు.

అంతటి నీరసంతో కొండ ఎక్కలేనని నిర్ణయించుకొని చెట్టుకింద కూర్చొని ఆహారము మూట విప్పి దానిలోని చపాతీలు పులిహోర తిన్నాడు. శరీరంలోకి శక్తి వచ్చింది. ఆహారము మూట ఖాళీ అవ్వడంతో మోయవలసిన బరువు కూడా తగ్గింది. అందువలన సునాయాసంగా కొండ ఎక్కి దేవుడి దర్శనం చేసుకున్నాడు.

ఆహారము మూట నెత్తిమీద ఉన్నంత వరకు బరువు మోస్తున్నట్లనిపించింది. కాని అదే ఆహారం కడుపులోకి వెళ్లేసరికి శరీరానికి శక్తి రావడమే కాక మోయవలసిన బరువు కూడా తగ్గింది. అలాగే భగవంతుడు బయటెక్కడో ఉన్నాడని కాకుండా మన మనసులోనే ఉన్నాడని భావిస్తే భగవతుడి కోసం చేసే ఏ పనీ అదనపు భారంగా అనిపించదు.

✦ ✦ ✦

ప్రాణులన్నింటిలో ఆత్మ స్వరూపంలో ఉన్న దేవుడిని చూసేవారికి దేవుడు ఏదోఒక రూపంలో తప్పకుండా దర్శనమిస్తాడని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



42

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్

**శ్లోకం: ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 6-32 ॥**

భావం: సమస్త ప్రాణులను తనతో సమానంగా చూస్తూ, సమానంగా భావించే యోగి పరమశ్రేష్ఠుడు.

**వివరణ:**

ఇతరులను మోసం చేస్తే కొన్నాళ్ళకు మనం కూడా మోసపోతాము. ఇతరులను అవమానిస్తే కొన్నాళ్ళకు మనం కూడా అవమానాల పాలవుతాము. ఇతరులు ఏమి చేస్తే మన మనసు నొచ్చుకుంటుందో అటువంటి పనులు మనం ఇతరుల పట్ల చెయ్యకుండా ఉండటమే ఉత్తమమైన ధర్మం. ఇతరులను మనతో సమానంగా చూడటం అలవాటు చేసుకుంటే మనకు బాధ కలిగించే పనులు ఇతరుల పట్ల చేయము.

మనం ఇతరుల పట్ల చేసిన తప్పులు, అవమానాలు, మోసాలు మనల్ని వెతు

## నీకు బాధకలిగించే పని ఇతరుల పట్ల చెయ్యొద్దు





క్కుంటూ వెనక్కి వస్తాయని తెలియజేసే ఒక కథ చదువుదాము.

భరద్వాజ మహాముని పుత్రుడు ద్రోణుడు, పాంచాల రాజు కుమారుడు ద్రుపదుడు చిన్నవయసులో కలిసి అస్త్రవిద్య నేర్చు కున్నారు. ఆ స్నేహం వలన తాను రాజుగా పట్టాభిషక్తుడవ్వగానే ద్రోణుడికి సగం రాజ్యం ఇస్తానని ద్రుపదుడు ద్రోణుడికి మాటిచ్చాడు.

కొంతకాలం తర్వాత ద్రుపదుడు పాంచాలరాజ్యానికి రాజయ్యాడు. తన చిన్న నాటి స్నేహితుడు రాజయ్యినందుకు చాలా సంతోషించిన ద్రోణుడు పాంచాలరాజ్యానికి వెళ్లి తనని ద్రుపదుడి చిన్ననాటి స్నేహితుడిగా పరిచయం చేసుకొని రాజాస్థానంలోకి వెళ్ళి ద్రుపదుడిని కలిసాడు. కాని ద్రుపదుడు ద్రోణుడిని గుర్తించనట్లుగా నటించి నువ్వెవరో నాకు తెలియదని చెప్పాడు. ద్రోణుడు అవమాన భారంతో వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత భీష్ముడు కౌరవులకు, పాండవులకు అస్త్రవిద్య నేర్పడానికి ద్రోణుడిని గురువుగా నియమించాడు. కౌరవ పాండవులకు అస్త్రవిద్య నేర్పిన తర్వాత ద్రోణుడు గురుదక్షిణగా ద్రుపదరాజును ప్రాణాలతో బంధించి తీసుకురమ్మని అడిగాడు. అర్జునుడు ద్రుపద రాజును అతని మంత్రిని బంధించి తీసుకొచ్చి ద్రోణుడి ముందు నిలబెట్టాడు.

భయంతో, అవమానంతో నిలబడిన ద్రుపదుడితో ద్రోణుడు "భయపడకు నేను నిన్ను చంపను. చిన్నతనంలో నాతో ఎంతో స్నేహంగా ఉన్న నువ్వు రాజు అవ్వగానే స్నేహానికి సమాన హెూదా ఉన్న వ్యక్తి కావాలని, రాజుని కానందున నేను స్నేహానికి తగనని నన్ను అవమానించావు. నేను మాత్రం నీతో స్నేహంగానే ఉండాలని కోరుకుంటున్నాను. నువ్వు చెప్పినట్లు నేను నీతో స్నేహం చెయ్యాలంటే నీకు కూడా రాజ్యం ఉండాలి. అందువలన నీ నుండి గెలుచుకున్న రాజ్యంలో సగం రాజ్యం నీకు ఇస్తున్నాను." అని చెప్పాడు.

ద్రుపదుడు అవమానంతో తల వంచుకున్నాడు. చేసిన అవమానం చాలని భావించిన ద్రోణుడు ద్రుపదుడిని సత్కరించి పంపించాడు.

✦ ✦ ✦

ఇతరులను మనతో సమానంగా చూస్తూ ఇతరులు మనతో ఎలా నడచుకోవాలని కోరుకుంటామో అదేవిధంగా వారితో మనం నడచుకోవాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

43

# యువతకు భగవద్గీత చూపించిన దారి



శ్లోకం: చ్చలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్ దృఢమ్।

తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥ 6-34 ॥

భావం: కృష్ణా! మనసు చాలా చంచలమైనది మరియు మిక్కిలి బలమైనది. కాబట్టి దానిని నియంత్రించడం చాలా కష్టమనిపిస్తోంది.

శ్లోకం: శ్రీభగవానువాచ।

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్।

అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 6-35 ॥

భావం: అర్జునా! నిస్సందేహంగా మనసు చంచలమైనదే, దానిని నియంత్రించటం కష్టమే. కాని అభ్యాస, వైరాగ్యముల ద్వారా దానిని నియంత్రించవచ్చు.

వివరణ: చంచలమైన మనసును నియంత్రించడం కష్టమని అర్జునుడు సందేహం వ్యక్తపరచినప్పుడు శ్రీకృష్ణుడు మనసును నియంత్రించడం కష్టమే గాని అభ్యాసం ద్వారా దానిని సాధించవచ్చని చెప్పాడు.

కేవలం సంకల్పంతో, భావోద్వేగంతో

## అభ్యాసము ద్వారా సాధించవచ్చు






విజయం లభించదు. నిరంతర అభ్యాసంతోనే విజయం సాధించగలుగుతాము. క్రమం తప్పకుండా అభ్యాసం చేస్తే ఎంతటి కష్టమైన కార్యమైనా సాధించవచ్చు.

సర్కస్‌లో, జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందిన ఆటగాళ్ళు చూపించే సాహసక్రీడలు కేవలం అభ్యాసం వలనే చెయ్యగలుగుతారు. మొదటి సారి జిమ్‌లో వ్యాయామం చేసినప్పుడు ఒళ్ళు నొప్పులతో, కీళ్ళ నొప్పులతో నాలుగైదు రోజులు చాలా బాధగా అనిపిస్తుంది. కాని ఆ బాధను సహించి వ్యాయామం చెయ్యడం అలవాటైపోతే వ్యాయామం చెయ్యడం హాయిగా అనిపిస్తుంది. కండరాలు మంచి షేపులోకి వస్తాయి.

అభ్యాసం అంటే ఒక పనిని పదేపదే చెయ్యడం. అలా ఒకే పనిని మళ్ళీమళ్ళీ చెయ్యడం వలన అది మన మనసుపైన, నాడీమండలం పైన చెరగని ముద్ర వేస్తుంది.

అభ్యాసంతో దేనినైనా సాధించవచ్చని తెలియజేసే ఒక కథ చదువుదాము.

సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు బిథోవన్ ఒకసారి కచేరి ముగించి లేచినప్పుడు ఒక మహిళ "దేవుడు నాకు కూడా మీ అంతటి అసాధారణ ప్రతిభను ఇచ్చివుంటే బాగుండేది." అంది

"నాలో ఉందని మీరనుకుంటున్న ప్రతిభను దేవుడు ఇచ్చాడనుకుంటున్నారా? కాదు. రోజుకు ఎనిమిది గంటలు చొప్పున నలభై సంవత్సరాలు అవిశ్రాంతంగా సాధన చేస్తే మీరు కూడా ఈ ప్రతిభను పొందవచ్చు" అని బిథోవన్ తన ప్రతిభ యొక్క రహస్యాన్ని తెలియజేసాడు.

✦ ✦ ✦

అభ్యాసం నుండి తప్పించుకోవడానికి మనసు ఎప్పుడూ ఏదోఒక ఉపాయాన్ని వెదుకుతూనే ఉంటుంది. ఏ కారణం చేతైనా ఒకరోజు అభ్యాసం తప్పితే మరునాటి నుండి మనసు అభ్యాసం నుండి తప్పించుకోవడానికి రకరకాల కారణాలను వెతుకుంది. కాని దృఢసంకల్పంతో మళ్ళీ అభ్యాసం మీదకు మళ్ళించి అభ్యాసం కొనసాగిస్తే ఎంతటి కష్టమైన లక్ష్యసాధనలోనైనా విజయం సాధించవచ్చు.

✦ ✦ ✦

అభ్యాసం ద్వారా చంచలమైన మనసును నియంత్రించవచ్చు. అలాగే క్రమం తప్పకుండా అభ్యాసం చేస్తే ఎంతటి కష్టమైన కార్యమైనా సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

44

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: అర్జున ఉవాచ।**

**అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః॥**

**అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥ 6-37 ॥**

భావం: కృష్ణా! శ్రద్ధగా యోగసాధన చేసి, అవసాన దశలో మనసు చలించి యోగసిద్ధి పొందకుండానే మరణించిన సాధకుని గతి ఏమవుతుంది?

శ్లోకం: శ్రీభగవానువాచ।

పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే।

న హి కల్యాణకృత్కశ్చిద్ దుర్గతిం తాత గచ్ఛతి ॥ 6-40 ॥

భావం: పార్థా! అటువంటి వ్యక్తి ఈ లోకమున గాని, పరలోకమున గాని అధోగతి పాల వ్వడు. ఎందుకంటే మంచిపనులు చేసే వాడు ఎప్పటికీ దుర్గతిపాలవ్వడు.

వివరణ: యోగసాధన చేసి యోగసిద్ధి పొందకుండానే మరణించిన వ్యక్తికి సాధన ఫలితం దక్కుతుందా? దక్కదా? అని అర్జునుడు

## చేసిన ప్రయత్నం, నేర్చుకున్న విద్య వృథా కావు






అడిగాడు. అటువంటి వారికి సాధన ఫలితం తప్పకుండా దక్కుతుందని, మంచిపనులు చేసినవాడికి ఎప్పటికీ దుర్గతి పట్టదని శ్రీకృష్ణుడు సమాధానం చెప్పాడు.

నేర్చుకున్న విద్య ఏదీ వృథా కాదని తెలియజేసే రెండు కథలు చదువుదాము.

పాశుపతాస్త్రము సంపాదించిన తర్వాత అర్జునుడు ఇంద్రుడి ఆహ్వానం మేరకు అమరావతికి వెళ్ళాడు. ధనుర్విద్యలో అర్జునుడు సాటిలేని వీరుడు. అటువంటి అర్జునుడు అమరావతిలో విలాసాలలో మునిగితేలకుండా గంధర్వుల దగ్గర నృత్యం నేర్చుకున్నాడు. కాని నృత్యంలో పూర్తి ప్రావీణ్యత సాధించలేదు.

అయినా అప్పుడు నేర్చుకున్న నృత్యం అజ్ఞాతవాసంలో అర్జునుడికి ఉపయోగపడింది. ఆ విద్య సహాయంతోనే విరాటరాజు కొలువులో ఆడపిల్లలకు నృత్యం నేర్పే బృహన్నలగా చేరాడు.

✦ ✦ ✦

మరోకథ చదువుదాము

తండ్రి తన కొడుకు రాజును తీసుకొని ఒక స్వామీజీ వద్దకు వెళ్ళి “స్వామీ! నా కొడుకు మూడు సంవత్సరాలుగా పోలీసు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు కాని చాతీ చిన్నగా ఉండటం వలన సెలక్ట్ కావడం లేదు. జిమ్‌కి వెళ్లి చాతీ పెంచుకోమంటే ప్రయత్నించడు. పోనీ వేరే ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నించమంటే పోలీసు ఉద్యోగమే కావాలంటాడు. లేదంటే సొంత వ్యాపారం చేస్తాను పెట్టుబడికి పది




లక్షలు ఇవ్వమంటాడు. నావద్ద అంత డబ్బు లేదు. ఏదైనా సలహా చెప్పండి" అని అడిగాడు.

స్వామీజీ రాజును దగ్గరకు పిలిచి "ఈ ఆశ్రమం వెనుక ఒక పెద్ద బండరాయి ఉంది. దానికింద చాలా విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆ బండరాయిని కదపగలిగితే ఆ సొమ్మంతా నీదే. దానితో సొంత వ్యాపారం పెట్టుకో. కానీ నువ్వు ఒక్కడివే ఎటువంటి పని ముట్లూ ఉపయోగించకుండా నీ చేతులను మాత్రమే ఉపయోగించి దానిని కదపాలి" అని చెప్పాడు.

రాజు రోజూ ఉదయం మరియు సాయంత్రం ఆశ్రమానికి వెళ్లి గంటలపాటు ఆ బండరాయిని కదపడానికి ప్రయత్నించేవాడు. అలా ప్రయ త్నించి మూడు నెలల తర్వాత ఆ బండరాయిని కదపగలిగాడు. కాని దానికింద బంగారు ఆభ రణాలు లేవు. నిరాశగా అదే విషయం స్వామీజీకి చెప్పి "నా మూడు నెలల శ్రమ వృథా అయి పోయింది స్వామీ." అన్నాడు

స్వామీజీ చిన్నగా నవ్వి "నీ ప్రయత్నం వృథా కాలేదు. నీ ఛాతీ, భుజాలు చూసుకో. రెట్టిపు సైజు అయ్యాయి. నువ్విప్పుడు పోలీసు ఉద్యో గానికి తప్పకుండా ఎంపికవుతావు" అన్నాడు.

స్వామీజీ చెప్పినట్లే రాజు పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

✦ ✦ ✦

కాబట్టి నేర్చుకున్న విద్య ఏదీ వృథా కాదు. మీరు కూడా ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా కొత్త కోర్సులు నేర్చుకోడానికి ప్రయత్నం చేయండి. ఇప్పుడు చాలా రకాల కోర్సులు ఆన్ లైన్ లో కూడా నేర్చుకోవచ్చు. కాబట్టి తీరిక సమయాన్ని వృథాగా గడపకుండా మీకు నచ్చిన కోర్సు ఏదైనా నేర్చుకోండి.

✦ ✦ ✦

నా స్నేహితుడొకడు సివిల్ సర్వీసెస్ పరీక్షలో మూడుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లి సెలక్ట్ కాలేకపోయాడు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించడానికి నా స్నేహితుడు చేసిన ప్రయత్నం వృథా కాలేదు. చేసిన ప్రయత్నం వృథా అయ్యిందని బాధపడకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షకు కోచింగ్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించాడు. ఆ ఇన్స్టిట్యూట్ నుండి ఎంతోమంది సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించారు.

కాబట్టి విజయం సాధించనంత మాత్రాన విజయం కోసం చేసిన ప్రయత్న ఏదీ వృథా కాదు. చేసిన ప్రయత్నం వలన లభించిన అనుభవం తప్పకుండా ఉపయోగపడుతుంది.

✦ ✦ ✦

చేసిన ప్రయత్నం, నేర్చుకున్న విద్య వృథా కావని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



45

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్

## జ్ఞాన విజ్ఞాన యోగము - ప్రయత్నం విడవద్దు

**శ్లోకం: మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే।**

**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 7-3 ॥**

భావం: వేలకొలది మనుష్యులలో ఎవరో ఒకరు మాత్రమే నన్ను గురించి తెలుసుకోడానికి ప్రయత్నిస్తాడు. అట్లు ప్రయత్నించినవారిలో ఒకానొకడు మాత్రమే ప్రయత్నం విడువకుండా నా యదార్థ స్వరూపమును తెలుసుకోగలుగుతాడు.

**వివరణ:**

అలాగే గొప్ప లక్ష్యాల కోసం కొంత మంది మాత్రమే ప్రయత్నిస్తారు. అలా ప్రయత్నించిన కొద్దిమందిలో, విజయం సాధించే వరకు పట్టువదలకుండా ప్రయత్నించే అతికొద్దిమంది మాత్రమే లక్ష్యాలను సాధిస్తారు.

పట్టువదలకుండా ప్రయత్నిస్తే చీమ కూడా వెయ్యి యోజనాల దూరం వెళ్ళగలుగుతుంది. కాని ప్రయత్నం చెయ్యకపోతే గరుత్మంతుడైనా ఒక్క అడుగు దూరం కూడా వెళ్ళలేడు. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ చదువుదాము.

కొన్ని సంవత్సరాలు ఆధ్యాత్మిక సాధన



చేసి ఫలితం కనపడలేదని మధ్యలోనే వది లేసిన సోమయ్య ఇంటికి వెళ్తూ దారిలో ఒక బావిదగ్గర ఆగి నీళ్ళు త్రాగాడు. బావి ప్రక్కన నీళ్ళబిందెలు పెట్టే రాయిమీద బిందెలు, కుండలు పెట్టడం వలన ఏర్పడిన గుంటను చూసాడు.

సున్నితమైన నీళ్ళ బిందెలు బండరాయిని అరగదీయగలిగినప్పుడు గట్టిగా ప్రయత్నిస్తే నేను కూడా ఆధ్యాత్మిక ప్రగతి సాధించగలుగు తాను అనుకొని తరిగి ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి వెళ్ళిపోయాడు.

✦ ✦ ✦

గొప్ప పనులు చెయ్యడానికి, గొప్ప విజయాలు సాధించడానికి కావలిసింది గొప్ప శక్తిసామర్థ్యాలు కాదు, ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకుండా విజయం సాధించేవరకు ప్రయత్నం కొనసాగించే పట్టుదల. చాలా విజయాలు తృటిలో తప్పిపోతుంటాయి. చాలామంది విజయం చేతికి అందేంత దూరంలో ఉండగా ప్రయత్నాన్ని విరమించి విజయాన్ని శాశ్వతంగా చేజార్చుకుంటారు. కాబట్టి, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని ఆటంకాలు అడ్డుతగిలినా ప్రయత్నాన్ని విరమించకండి. మరు నిమిషంలో మీకు విజయం ప్రాప్తించవచ్చేమో ఎవరికి తెలుసు?

పరుగు పందెంలో ఫినిషింగ్ లైన్ వైపు వేసే చివరి అడుగే విజయం. ప్రయత్నంలోని చిట్టచివరి దశే విజయం. కాని ఆ ఆఖరి దశకి వచ్చేసరికి కొంతమంది సహనం కోల్పోయి, ఓపిక నశించి, విజయం సాధించ లేనేమో అనే అవిశ్వాసం కలిగి ప్రయత్నం విరమిస్తారు. అటువంటి వారికి విజయం ఎప్పటికీ అందదు.

✦ ✦ ✦

ఎనిమిదవ తరగతి చదువుతున్న రమణ చదువు మీద ధ్యాస పెట్టకుండా అల్లరి చేస్తూ తిరుగుతుండేవాడు. యూనిట్ టెస్టులలో కూడా అన్ని సబ్జెకులలో ఫెయిలయ్యేవాడు. స్కూలు గ్రౌండులో ఉన్న మామిడి చెట్టు ఎక్కి కాయలు కోయబోతూ క్రిందపడటం వలన కాలికి గాయమయ్యింది. అందువలన ఆ రోజు స్కూలుకి వెళ్లలేదు. ఏమిచెయ్యాలో తోచక వీధి అరుగుమీద కూర్చున్నాడు.

ఒక ఈగ మాటిమాటికీ ఆ గాయం మీద వాలి చికాకు పెడుతోంది. ఎన్నిసార్లు తోలినా పోయినట్టే పోయి మళ్ళీ వచ్చి గాయం మీద వాలుతోంది. అంతలో అటుగా వెళ్తున్న లెక్కల మాష్టారు "గాయం ఎలా ఉంది?" అని అడి గాడు. రమణ ఈగ పెడుతున్న చికాకు గురించి చెప్పాడు.

మాష్టారు "అల్పజీవి అయినా ఈగకే తన లక్ష్యం మీద అంతటి పట్టుదల ఉంటే జీవు లన్నిటిలో తెలివైన మనిషి తన లక్ష్యం పట్ల ఎంతటి పట్టుదల ఉండాలో ఆలోచించు. తన లక్ష్యం పట్ల ఈగ చూపిస్తున్న పట్టుదల నువ్వు నీ చదువు పట్ల చూపిస్తే మంచి మార్కులతో ప్యాసవుతావు" అని చెప్పారు.

ఈగ చూపించిన పట్టుదల, మాష్టారు మాటలు రమణలో మార్పు తీసుకొచ్చాయి. పట్టుదలతో చదివి మంచి మార్కులతో ప్యాస య్యాడు.

✦ ✦ ✦

కొందరు తాము చేపట్టిన పని పూర్తి అవ్వడంలో కొంత ఆలశ్యం కలిగినా సహించరు. చేస్తున్న పనిని అమాంతంగా ఆపేస్తారు. చేపట్టిన పనిని మధ్యలోనే ఆపేయడం వలన అంతవరకు వెచ్చించిన వనరులు, శక్తి సామర్ధ్యాలు, సమయం వృథా అవుతాయనే ఆలోచన వారికి ఉండదు. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ చదువుదాము.

వేసవి తీవ్రతకు ఒక గ్రామంలోని బావులన్నీ ఎండిపోయి మంచినీళ్ళు లేక గ్రామస్థులు విలవిలలాడుతున్నారు. కొత్తగా బావులు త్రవ్వడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గ్రామంలోని ఇద్దరు యువకులు తమకున్న పరిజ్ఞానాన్ని ఉపయోగించి నీళ్ళు పడే అవకాశమున్న ప్రదేశాన్ని ఎంపిక చేసి బావి త్రవ్వడానికి పూనుకున్నారు. అంతకుముందు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవ్వడం వలన ఆ యువకులు చేస్తున్న ప్రయత్నం మీద నమ్మకం కలగక గ్రామస్థులు ఎవ్వరూ వాళ్లకి సహకరించడానికి ముందుకు రాలేదు. అందువలన ఆ యువకులిద్దరే బావి త్రవ్వడం మొదలుపెట్టారు.

ఎంత లోతు త్రవ్వినా నీటిజాడ కనబడలేదు. అయినా నీరు పడుతుందనే ఆశతో వాళ్ళిద్దరూ త్రవ్వడం కొనసాగించారు. అలా త్రవ్వుతుండగా వాళ్ళ చేతులలోని పలుగుకి పెద్ద బండరాయి తగిలింది. దానితో నీరు పడుతుందనే ఆశ చచ్చిపోయి ఒక యువకుడు తన చేతిలోని పలుగుని క్రింద పడేసి ఇంక త్రవ్వడం వలన ఉపయోగం ఉండదు, ఆపేద్దామని అన్నాడు. రెండో యువకుడు మరికొంతసేపు త్రవ్వి చూద్దామని చెప్పినా మొదటి యువకుడు వినకుండా ఇంటికి వెళ్ళిపోయాడు.



రెండవ యువకుడు పట్టువదలకుండా శక్తినంతా కూడదీసుకొని పలుగుతో బండరాయి మీద గట్టిగా పొడిచాడు. బండరాయి రెండు ముక్కలై పెద్ద శబ్దం చేస్తూ నీళ్ళు ఒక్కసారిగా పైకి ఎగజిమ్మాయి. నీటిని చూసిన ఉత్సాహంతో బండరాయి మీద మరో దెబ్బ వేసాడు. నీరు లావాలా పైకి పొంగింది. గ్రామస్తులందరూ అక్కడికి వచ్చి ఆ యువకుడిని అభినందనలతో ముంచెత్తారు.

కొద్ది నిమిషాల క్రితం ప్రయత్నం ఆపేసి వెనక్కి వెళ్ళిపోయిన మొదటి యువకుడు దూరంగా నిలబడి "మరికొన్ని నిమిషాలు ప్రయత్నం కొనసాగించి ఉంటే ఈ విజయంలో, అభినందనలలో నాకు కూడా భాగం లభించి ఉండేది కదా!" అనుకొని బాధపడ్డాడు.

✦ ✦ ✦




ప్రతికూల పరిస్థితుల్లో నిరాశ చెందకుండా లక్ష్యాన్ని సాధించేవరకు ప్రయత్నాన్ని విరమించకుండా కొనసాగించడం విజయం సాధించడానికి చాలా అవసరం. ప్రయత్నం విరమించనంతవరకు విజయం సాధించక పోవడం పరాజయం కాదు. ప్రయత్నం మానేసినప్పుడు మాత్రమే విజయం సాధించక పోవడం పరాజయం అవుతుంది. లక్ష్య సాధనలో ఎదురయ్యే తాత్కాలిక ఓటమిలు మీ ప్రణాళికలోనో, ప్రయత్నంలోనో మార్పులు అవసరమని తెలియజేసే అనుభవాలే కాని పరాజయాలు కావు. విజయం సాధించేవారు విజయం సాధించే వరకు చేపట్టిన పనిని వదిలిపెట్టరు. చేపట్టిన పనిని మధ్యలోనే వదిలిపెట్టేసేవారు ఎప్పటికీ విజయం సాధించలేరు.

ప్రపంచంలోని గొప్ప విజయాలు విజయావకాశాలు ఎంతమాత్రం లేవని అనిపించిన సమయంలో కూడా పట్టుదల వదలకుండా ప్రయత్నించడం వలనే లభించాయి.

థామస్ ఆల్వా ఎడిసన్ ఎలెక్ట్రిక్ బల్బు కనిపెట్టడానికి కార్బన్ వంటి ఎన్నో లోహాలను ఉపయోగించి ప్రయత్నాలు చేసాడు. కాని ఆశించిన ఫలితం రాలేదు. అయినా నిరుత్సాహపడకుండా, పట్టువదలకుండా ప్రయత్నం చెయ్యడం వలన టంగస్టన్ ఉపయోగించి ఎలెక్ట్రిక్ బల్బు తయారుచేయగలిగాడు.

దేవతలు అమృతం కోసం సముద్రాన్ని మధిస్తున్నప్పుడు వారు ఆశించిన అమృతం వెంటనే రాలేదు. మందుగా అనేక రత్నాలు వెలువడ్డాయి. వారు నిరాశ చెందకుండా ప్రయత్నం కొనసాగించారు. కాలకూట విషం వచ్చింది. అయినా అమృతం లభించే వరకు ప్రయత్నం ఆపలేదు.

✦ ✦ ✦

ప్రతికూల పరిస్థితుల వలన గాని, తాత్కాలిక ఓటమిల వలన గాని, విజయం లభించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అనిపించి గాని, విజయం ఇంకా రాలేదనే నిరాశ వలన గాని ప్రయత్నం విరమించాలనే ఆలోచన కలిగినప్పుడు విజయం సాధించినప్పుడు కలిగే సంతోషాన్ని ఊహించుకోండి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినంద నలు తెలుపుతున్నప్పుడు కలిగే ఆనందాన్ని ఊహించుకోండి. అప్పుడు ఆ ఊహలని నిజం చేసుకోవాలనే కోరికతో మరింత ఉత్సాహంగా ప్రయత్నాన్ని కొనసాగిస్తారు.

ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు విజయం సాధించలేమనే నిరాశతో ప్రయత్నం విరమించకుండా పట్టు వదలకుండా ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చనే విజయసూత్రాన్ని భగవద్గీత నుండి నేర్చుకోవచ్చు.

✦



-మొందెపు ప్రసాద్

46

# యువతకు భగవద్గీత చూపించిన దారి



### నిరంతర సాధనతో విజయం

**శ్లోకం: అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా।**

**పరమం పురుషం దివ్యం యాతి పార్థాను చిన్తయన్ ॥ 8-8 ॥**

భావం: మనసును ఎటూ పోనీయకుండా, వేరే ధ్యాస ఏమాత్రమూ లేకుండా పరమేశ్వరుని ధ్యానయోగ సాధనమందే నిమగ్నమయ్యేవారు పరమేశ్వరుడినే చేరుతారు.

**వివరణ:**


నిరంతరం పరమేశ్వరుని సాధనమందే నిమగ్నమయ్యేవారు పరమేశ్వరుడినే చేరుతారు. అలాగే నిరంతరం లక్ష్యసాధన కోసం ప్రయత్నం చేసేవారు లక్ష్యసాధనలో విజయం సాధిస్తారు.

ఏ రంగంలోనైనా గొప్ప విజయాలు సాధించాలంటే అద్భుతమైన నైపుణ్యాలు కావాలి. ఏ రంగంలో ఉన్నవారికైనా, ఏ స్థాయిలో ఉన్న వారికైనా నైపుణ్యాలను మెరుగుపరచుకోడానికి నిరంతర సాధన చాలా అవసరం. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సబ్జెక్టులపై

## అక్షరబ్రహ్మ యోగము







ఎంతటి అవగాహన ఉన్నా నిర్ణీత సమయంలో ఎక్కువ ప్రశ్నలు ఆన్సర్ చెయ్యడం అనే టెక్నిక్ మీద సాధన చెయ్యకపోతే పోటీపరీక్షలో విజయం సాధించలేరు. అందుకే ఐఐటి ఎంట్రన్స్, ఐఐఎం క్యాట్, గేట్, జి మ్యాట్, సివిల్ సర్వీసెస్ వంటి రకరకాల పోటీపరీక్షల కోసం అనేక కోచింగ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి.

ప్రపంచ ప్రఖ్యాత ఫుట్బాల్ క్రీడాకారుడు మారడోనా "నేను ఫుట్‌బాల్ నేర్చుకునే రోజుల్లో మా కోచ్ ప్రతీరోజూ ఏడెనిమిది గంటలపాటు ఆడించేవాడు. ఆడిన ఆటనే అంతసేపు ఆడు తుండటం అంత అవసరమా? అని అప్పట్లో అనుకొనేవాడిని. కాని ఆ సాధన వలనే ప్రత్య ర్థుల ఎత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోవడం నాకు తేలికయ్యింది" అని చెప్పాడు.

మీరు ఏ వృత్తిలో ఉన్నా, ఏ ఉద్యోగంలో ఉన్నా, ఏ వ్యాపారంలో ఉన్నా ఆ రంగంలో కొత్తగా కనిపెట్టబడిన లేక ప్రవేశపెట్టబడిన నూతన అంశాలను నేర్చుకోకపోతే మీరు మీ వృత్తి లేక ఉద్యోగం లేక వ్యాపారంలో ఇతరుల కంటే వెనుకబడిపోతారు. అలా కొత్తగా ప్రవేశ పెట్టబడిన నూతన అంశాలను నేర్చుకోడానికి శిక్షణ మరియు సాధన అవసరం. అందుకే శిక్షణ మరియు సాధన మన జీవితాలలో విడ దీయరాని భాగాలయ్యాయి. ట్రైనింగ్, రిట్రైనింగ్, మిడ్ కెరియర్ ట్రైనింగ్, కంటిన్యుయస్ ట్రైనింగ్ అనే రకరకాల ట్రైనింగ్ కాన్సెప్ట్‌లు పుట్టు కొచ్చాయి.

మనకున్న తెలివితేటలను, శక్తిసామర్థ్యాలను లక్ష్యసాధనలో విజయం సాధించడానికి కావలసిన రీతిలో మలచుకోడానికి తగిన శిక్షణ తీసుకుని సాధన చేసి ప్రయత్నిస్తే లక్ష్యసాధనలో తప్పకుండా విజయం సాధించవచ్చు.

✦

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్





**కోపాన్ని జయించడం చాలా కష్టం. కాని సాధన చేయడం ద్వారా కోపాన్ని కూడా జయించవచ్చని తెలియజేసే ఒక కథ చదువుదాము.**

శిష్యుడు తనకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించమని గురువును కోరాడు. గురువు శిష్యునికి ఒక మంత్రాన్ని ఉపదేశించి, నిశ్చలమైన మనసుతో, పరిపూర్ణ విశ్వాసంతో ఆ మంత్రాన్ని ఒక సంవత్సరం పాటు జపించి వస్తే బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తానని చెప్పాడు.

శిష్యుడు మంత్రాన్ని సంవత్సరం పాటు జపించి గురువుగారి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆశ్రమ ప్రాంగణాన్ని ఊడుస్తున్న స్త్రీ అతను రావడం గమనించక చేటలోకి ఎత్తిన



దుమ్మును అతనిపై పోసింది. శిష్యుడు కోపోద్రిక్తుడై ఆమెను తిట్టి లోపలికి వెళ్ళి గురువుగారికి నమస్కరించి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించమని కోరాడు. గురువు "తెలియక నీమీద దుమ్ము పోసిన వ్యక్తి మీద నువ్వు మిక్కిలి కోపం ప్రదర్శించావు. సహనంలేని వారికి బ్రహ్మజ్ఞానాన్ని పొందే అర్హత ఉండదు. నువ్వు ఆ మంత్రాన్ని ఇంకొక సంవత్సరం పాటు జపించి రా" అని చెప్పి శిష్యుడిని పంపించేసారు.

## కోపాన్ని జయించడం

శిష్యుడు మంత్రాన్ని ఇంకొక సంవత్సరం పాటు జపించి గురువుగారి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆశ్రమ ప్రాంగణాన్ని ఊడుస్తున్న స్త్రీ గురువు ఆజ్ఞ ప్రకారం దుమ్మంతా అతని మీద పడేలా ఊడ్చింది. అతను అత్యంత కోపంతో ఆమెను దూషించి లోపలికి వెళ్ళి గురువుగారికి నమస్కరించి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించమని కోరాడు. గురువు "నీకింకా బ్రహ్మజ్ఞానాన్ని పొందే అర్హత రాలేదు. మంత్రాన్ని మరొక సంవత్సరం పాటు జపించి రా" అని చెప్పి శిష్యుడిని పంపించేసారు.

శిష్యుడు మంత్రాన్ని మరొక సంవత్సరం పాటు జపించి గురువుగారి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆశ్రమ ప్రాంగణంలో కళ్లాబు



చల్లుతున్న స్త్రీ గురువు ఆజ్ఞ ప్రకారం మురికి నీటిని అతని మీద చల్లింది. శిష్యుడు ఆమెకు నమస్కరించి "అమ్మా! భగవదనుగ్రహానికి అవసరమైన శాంతాన్ని నాలో అభివృద్ధి చేసావు. నీమేలు ఎప్పటికీ మరువలేను" అని చెప్పి లోపలికి వెళ్లి గురువుగారికి నమస్కరించాడు.

గురువు శిష్యుడిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని "నువ్వు బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి అర్హత సంపాదించావు" అని చెప్పి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించాడు.

కొంతమంది జీవితమంతా ఆధ్యాత్మిక గ్రంథాలను చదవడంలో, ప్రవచనాలను వినడంతో గడిపేస్తారు గాని చదివిన, వినిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టరు. తెలుసుకున్న వాటిని ఆచరణలో పెట్టడమే సాధన.

శాస్త్రాలలో మరియు ప్రవచనాలలో భగవంతుడిని చేరే మార్గాలు మాత్రమే చెప్పబడతాయి. ఆ మార్గాలు తెలిసినంత మాత్రాన భగవంతుడిని చేరలేము. ఆ మార్గాలలో సాధన చేయడం ద్వారా మాత్రమే భగవంతుడిని చేరగలము.

అలాగే పుస్తకాలలో మరియు మోటివేషన్ క్లాసులలో విజయసూత్రాలు మాత్రమే చెప్పబడతాయి. ఆ సూత్రాలను చదివినంత మాత్రాన, వినినంత మాత్రాన విజయాలు సాధించలేము. ఆ సూత్రాలను ఉపయోగించి సాధన చేయడం ద్వారా మాత్రమే విజయాలు సాధించగలము.

నిరంతర సాధన వలన గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

48

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకము: అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః ।**

**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ 8-14 ॥**

భావము: నిరంతరము మనసు నాయందే లగ్నంచేసి నన్నే స్మరించు యోగికి నేను సులభంగానే లభిస్తాను.

వివరణ: దేవుడిమీద నిజంగా విశ్వాసం ఉన్నవాళ్ళకి దేవుడు అత్యంత సులభంగా లభిస్తాడని తెలియజేసే ఒక కథ చదువుదాము.

సరకులు పంపిన దేవుడు రేపు కూడా ఎవరోఒకరి ద్వారా పంపుతాడు. అలాగే నేను మరణించేవరకు పంపుతాడు.'' అని జవాబిచ్చాడు.

✦ ✦ ✦

దేవుడిమీద అచంచలమైన విశ్వాసం ఉంచి, మనసును ఎల్లప్పుడూ దేవుడిమీదే లగ్నంచేసి, దేవుడిని స్మరించే వాళ్ళకి దేవుడు అత్యంత సులభంగా లభిస్తాడని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

రాజవిద్యా రాజగుహ్య యోగము

## భగవంతుడు సులభుడు

భగవంతుడు సులభుడుఊరికి ఉత్తరాన ఉన్న అడవిలో ఒక యోగి తపస్సు చేసుకుంటున్నాడు. సుబ్బయ్య అనే వ్యాపారి అడవిలోని యోగి వద్దకు వెళ్లి తాను తీసుకొచ్చిన బియ్యం, కూరగాయలు, పళ్ళు ఆయనకు ఇచ్చాడు. యోగి వాటిలోనుండి ఒక రోజుకు సరిపడే సరకులు మాత్రమే తీసుకొని మిగిలినవి వెనక్కి ఇచ్చేసాడు.

సుబ్బయ్య "స్వామీ! అడివిలోకి ప్రజలు ఎప్పుడోగాని రారు. మీకు భోజనానికి ఇబ్బంది కలగకూడదని నేను వారం రోజులకు సరిపోయే సరకులు తీసుకొచ్చాను. దయచేసి మొత్తం సరకులు తీసుకోండి.'' అన్నాడు.

యోగి చిరునవ్వుతో "ఈరోజు నీద్వారా

నమ్మినవారిని భగవంతుడే రక్షిస్తాడు:

శ్లోకం: అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 9-22 ॥

భావము: అనన్య భక్తితో, నిష్కామ భావముతో నిరంతరము నన్నే సేవించేవారి యోగక్షేమాలను నేనే వహిస్తాను.

వివరణ: కష్టాలలో అందరూ దేవుడిని స్మరిస్తారు. సుఖాలలో చాలామందికి దేవుడు గుర్తురాడు. సుఖాలలో మునిగితేలుతున్నప్పుడు కూడా దేవుడిని స్మరించేవారికి దుఃఖమనేది కలుగదు.

భగవంతుడు ఎవ్వరినీ, ఎప్పుడూ మరువడు. తనను సేవించినవారిని తప్పక ఆదుకుంటాడు. అర్జునుడు కృష్ణుడిని హృదయపూర్వ



కంగా విశ్వసించి, ఆరాధించి, భక్తితో కొలిచాడు. కాబట్టి కృష్ణుడు అర్జునుడి వెంట ఉండి అతడికి విజయం అందించాడు.

దేవుడిని భక్తితో, నిష్కామభావముతో సేవించేవారి యోగక్షేమాలు దేవుడే చూస్తాడని తెలియజేసే ఒక కథ గుర్తుచేసుకుందాము..

ఒక సాయంత్రం అడవిలో అకస్మాత్తుగా దట్టమైన మేఘాలు అలముకొని అంధకారం వ్యాపించింది. తన గూటికి తిరిగి వెళ్తున్న మైనా చీకటిలో దారి కనబడక ఒక వేపచెట్టు మీద వ్రాలింది. ఆ వేపచెట్టుమీద వున్న కాకులతో "ఈ చీకటిలో నా గూటికి వెళ్ళలేను. పైగా పెద్ద వర్షం కూడా వచ్చేడట్లుంది. ఈ రాత్రికి నన్ను ఈ చెట్టుమీద తలదాచుకోనీయండి." అని అడిగింది.

కాకులు "ఈచెట్టు మాది. నువ్వు వెళ్ళిపో" అని గట్టిగా అరిచాయి. "చెట్లన్నీ మన అంధరినీ కాపాడే దేవుడివి. ఈ వర్షం నుండి ఆయన మనల్ని తప్పక కాపాడతాడు. ఈరాత్రికి నన్ను కూడా ఈ చెట్టుమీద ఉండనీయండి" అని మైనా బ్రతిమాలింది.

"వీల్లేదు. దేవుడే కాపాడతాడని అంటున్నావు కదా! ఆ దేవుడి మీద భారం వేసి వెళ్ళు. ఆయనే నిన్ను కాపాడతాడు" వెటకారంగా అని కాకులు మైనాను తరిమేసాయి.

మైనా తనను కాపాడమని దేవుడిని ప్రార్ధిస్తూ అక్కడినుండి వెళ్ళి దారిలో కనబడిన మామిడిచెట్టుమీద వాలింది. దేవుడి మీద భారం వేసి ఆరాత్రికి ఆ చెట్టుమీదే బస చేసింది.

కాసేపటికి బలమైన ఈదురుగాలులు వీచాయి. మామిడిచెట్టు కొమ్మ ఒకటి విరిగిపోయింది. విరిగినచోట ఒక తొర్ర ఏర్పడింది. మైనా దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకొని ఆ తొర్రలోపలికి వెళ్లి నిద్రపోయింది.

కాసేపటి తర్వాత పెద్ద వడగళ్ళ వాన పడింది. తొర్రలో వున్న మైనాకు వడగళ్ళ వలన ఎటువంటి అపాయం కలగలేదు. కాని వేపచెట్టు మీద వున్న కాకులు వడగళ్ళ దెబ్బలకు తాళలేక క్రిందపడిపోయాయి. అలా పడిపోయిన కాకులలో కొన్నింటికి గాయాలయ్యాయి, కొన్ని కాకులు చనిపోయాయి.

ఉదయం అయ్యేసరికి వర్షం ఆగిపోయింది. తొర్రలోనుండి బయటకు వచ్చిన మైనాకు జరిగిన విషయం అర్ధమయింది. తనను రక్షించినందుకు దేవుడికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుకొని తన గూటికి వెళ్ళిపోయింది.

✦



-మొండెపు ప్రసాద్

49

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**భక్తితో భగవంతుడిని సేవించేవారు తమ యోగక్షేమాల కోసం ఇతరుల మీద ఆధారపడ నవసరం లేదని తెలియజేసే కథ చదువుదాము.**


స్వామీజీ ప్రవచనం ముగించిన తర్వాత రమణ అనే భక్తుడు స్వామీజీ వద్దకు వెళ్లి తన కూతురి పెళ్ళికి ఏదైనా సహాయం చెయ్యమని కోరాడు. స్వామీజీని అటువంటి సహాయం అడగటం సమంజసం కాదని కొందరు భక్తులు రమణని మందలించారు.

స్వామీజీ కొంచెం కూడా కోపం తెచ్చుకోకుండా భగవద్గీత పుస్తకం ఒకటి రమణకి ఇచ్చి వారం రోజులపాటు దానిని బాగా చదివి ఎనిమిదోరోజు వచ్చి డబ్బులు తీసుకోమని చెప్పాడు.

పదిరోజులు గడచినా రమణ డబ్బులు తీసుకోడానికి రాకపోవడంతో స్వామీజీ తన శిష్యులను పంపి రమణని ఆశ్రమానికి పిలిపించి డబ్బు తీసుకోడానికి ఎందుకు రాలేదని అడిగారు.

రమణ స్వామీజీకి నమస్కారం చేసి “స్వామీ! మీరిచ్చిన భగవద్గీతను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకున్నాను. తొమ్మిదవ అధ్యా యంలోని ఇరవైరెండవ శ్లోకం చదివాక భగ వంతుడిని సేవించే నేను నా యోగక్షేమాల కోసం

## భక్తితో భగవంతుడిని సేవించేవారు



భగవంతుడిమీద తప్ప ఇతరుల మీద ఆధారపడటం అవివేకమని అర్ధమయ్యింది" అని చెప్పాడు.

స్వామీజీ చిన్నగా నవ్వి "నేను నీలో ఏ మార్పు రావాలని ఆశించి భగవద్గీత పుస్తకం ఇచ్చానో ఆ మార్పు వచ్చింది" అన్నారు.

✦ ✦ ✦

భక్తితో దేవుడిని సేవించేవారి అవసరాలు దేవుడే తీరుస్తాడని తెలియజేసే కథ చదువుదాము.

కోవిడ్-19 కారణంగా విధించిన లాక్ డౌన్ సమయంలో దానయ్య తన ఇంట్లో అన్నం కూరలు వండించి పొట్లాలు కట్టి రాజమహేంద్రవరంలోని వృద్ధాశ్రమాలలోని వృద్ధులకు ప్రతీ రోజూ ఇస్తున్నాడు.

ఒకరోజు ఆహారపు పొట్లాలు వృద్ధాశ్రమాలలో ఇచ్చి వచ్చాక తన కళ్ళజోడు కనబడ లేదు. కళ్ళుమూసుకొని ఎక్కడ మర్చిపోయాడో గుర్తుచేసుకోడానికి ప్రయత్నించాడు. పొట్లాలు కడుతున్నప్పుడు ఒక ఆహారం పోట్లంలో కళ్ళద్దాలు పడిపోయాయని, తీసి పక్కన పెడదామనుకొని పొట్లాలు కట్టే హడావిడిలో మర్చిపోయానని గుర్తువచ్చింది. "దేవుడా! మానవ సేవే మాధవసేవని నమ్మి అవసరంలో ఉన్న వృద్ధులకు ఆహారం అందిస్తున్న నాకు ఇలాంటి నష్టం కలిగించడం భావ్యమా? అయినా నువ్వు ఏమిచేసినా దానికి సరైన కారణం ఉంటుందిలే" అనుకొని బీరువాలో ఉన్న మరో కళ్ళజోడు తీసుకొని పెట్టుకున్నాడు.

దానయ్య వృద్ధాశ్రమాలకు ఆహారం



అందించడం అలాగే కొనసాగించాడు. రెండు రోజుల తర్వాత టివిలో వార్తలు చూస్తున్నాడు. వృద్ధాశ్రమాలలోని వృద్ధులను విలేఖరి ఇంటర్వ్యూ చేస్తున్నాడు. ఒక వృద్ధుడు మాట్లాడుతూ "నాలుగురోజుల క్రితం నా కళ్ళజోడు క్రిందపడి పగిలిపోయింది. కళ్ళజోడు లేకుండా లాక్ డౌన్ ముగిసేవరకూ ఎలా బ్రతకాలి దేవుడా అను కున్నాను. మరుసటిరోజు నాకు వచ్చిన ఆహారం పొట్లాన్ని విప్పితే దానిలో ఒక కళ్ళజోడు కూడా ఉంది. అది కళ్ళకి పెట్టి చూసుకున్నాను. అది నా కళ్ళ పవర్‌కి సరిగ్గా సరిపోయింది. ఆ కళ్ళజోడు పంపిన మహానుభావుడికి, ఆయన ద్వారా కళ్ళజోడు పంపిన దేవుడికి శతకోటి వందనాలు" అని చెప్పాడు.

✦



-మొండెపు ప్రసాద్

49

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## దేవుడ్ని నమ్మినవాళ్ళు చెడిపోరు

**దేవుడ్ని నమ్మినవాళ్ళు చెడిపోరని తెలియజేసే కపిలుడు సోమదర్శి అనే మునికి చెప్పిన కథ ఒక సారి గుర్తుచేసుకుందాం.**

యజ్ఞం చెయ్యడానికి కావలసిన ధనం కోసం ఒక బ్రాహ్మణుడు తపస్సు చేస్తున్నాడు. కుండధారుడు అనే దేవపరిచారకుడు అక్కడకు వచ్చి బ్రాహ్మణుడి కోరిక తెలుసుకొని తన ప్రాణస్నేహితుడైన మణిభద్రుడిని తలచుకున్నాడు. కుబేరుడి భృత్యువు అయిన మణిభద్రుడు వచ్చి యజ్ఞానికి కావలిసిన ధనం ఇస్తానని అన్నాడు. ధర్మమార్గములో నడిస్తే కావలిసిన సంపదలు వాటంతటఅవే లభిస్తాయని కుండధారుడు బ్రాహ్మణుడికి చెప్పాడు. కుండధారుడి మాటలమీద నమ్మకం కుదిరిన బ్రాహ్మణుడు మణిభద్రుడు ఇస్తానన్న ధనం వద్దని చెప్పి తపస్సు చెయ్యడానికి వెళ్ళాడు.

తపస్సు ఫలితంగా అనన్య భక్తితో, నిష్కామ భావముతో నిరంతరము భగవంతుడిని సేవించే వారి యోగక్షేమాలను భగవంతుడే వహిస్తాడని బ్రాహ్మణుడికి అర్ధమయ్యింది. కుండధారుడిని తలుచుకున్నాడు. ప్రత్యక్షమైన కుండధారుడికి సాష్టాంగ నమస్కారం చేసాడు. కుండధారుడు అతడిని పైకి లేపి "ధనము, కామము మంచి చెడుల విచక్షణ తెలుసుకోలేని వివేకహీనుడిని చేస్తాయి. ధనం సకల దోషాలకూ మూలం. దానివలన నా ధనం, నా ఇల్లు, నా బంధువులు అనే మమత కలుగుతుంది. ఆ మమకారం పోయి దేనిమీదా ఆశ లేని నిష్కామదృష్టి కలిగితేనే కోరికలు నశిస్తాయి. కోరికలను త్యజించినప్పుడు కలిగే ఆనందం ధనము, రాజ్యం కలిగినప్పుడు కలిగే సంతోషం కంటే చాలా గొప్పగా ఉంటుంది. కాబట్టి కోరికలను, మోహాలను వదిలి కోరికలను త్యజించే మార్గం ఇతరులకు బోధించు." అని దీవించి వెళ్ళిపోయాడు.

బ్రాహ్మణుడు కుండధారుడు బోధించినట్లు నిష్కామతత్వాన్ని ఉపదేశిస్తూ మోక్షాన్ని పొందాడు.

✦ ✦ ✦

భగవంతుడిని భక్తితో పూజించే వారి యోగక్షేమాలను భగవంతుడే చూసుకుంటాడని తెలియజేసే ఒక కథ చదువుదాము.



భగవంతుడిని సేవించేవారి యోగక్షేమాలను భగవంతుడే వహిస్తాడని నమ్మిన వేణు ఆరు నెలల్లో ఏడు ఉద్యోగాలు మారవలసివచ్చింది. ఉద్యోగం పోయిన ప్రతిసారీ స్నేహితులు దేవుడు నీకు అన్యాయం చేసాడనేవారు. కాని ఉద్యోగం పోయిన రెండురోజులలోనే కొత్త ఉద్యోగం దొరికేది. వెంటనే వేణు నా యోగక్షేమాలను భగవంతుడే చూస్తున్నాడనేవాడు.

ఏడవ ఉద్యోగం మొబైల్ ఫోనులు అమ్మే షాపులో చేస్తుండగా వేణు చేతినుండి ఒక ఖరీదైన మొబైల్ ఫోను పొరబాటున జారి క్రిందపడి పగిలిపోయింది. షాపులో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులు దేవుడు నీకు మళ్ళీ అన్యాయం చేశాడన్నారు. షాపు ఓనరు వచ్చి వేణుని గట్టిగా మందలించి "దీని ఖరీదు తీరే వరకు నీ జీతంలో నుండి నెలకు వెయ్యి రూపా యలు చొప్పున కట్ చేస్తాను" అని చెప్పి తన చాంబర్లోకి వెళ్ళిపోయాడు. ఓనరు వెళ్ళిపోయాక వేణు పగిలిపోయిన మొబైల్ ఫోను ఖరీదు చూసాడు. దాని ఖరీదు అరవై వేలు. వెంటనే సహోద్యోగులతో "దేవుడు నాకు ఈ ఉద్యోగాన్ని ఐదేళ్ళపాటు పర్మనెంట్ చేసాడు" అన్నాడు.

✦ ✦ ✦

భగవంతుడు ఎవ్వరినీ, ఎప్పుడూ మరువడు. భగవంతుడిని విశ్వసించి సేవించే వారి యోగక్షేమాలను భగవంతుడే చూస్తాడని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

50

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## ప్రార్థనలో మనసు ప్రధానం

**శ్లోకం: పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।**

**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥ 9-26 ॥**

భావం: నిర్మలబుద్ధితో, భక్తిబావముతో నాకు సమర్పించే ఫలమునుగాని, పత్రమునుగాని, పుష్పమునుగాని నేను ప్రీతితో స్వీకరిస్తాను.

**శ్లోకం: యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।**

**యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 9-27 ॥**

భావం: అర్జునా! నువ్వు చేసే కర్మలను, తినే ఆహారమును, హోమము చేయు హవ్యమును, చేసే దానమును, తపస్సును నాకే సమర్పించు.

### వివరణ

నిజమైన భక్తికి నిర్వచనం హనుమంతుడు. శ్రీరామ పట్టాభిషేకం జరిగాక రెండు మాసాల పాటు వానరవీరులందరూ అయోధ్యలోనే ఉండి తిరిగి వెళ్ళడానికి రాముడి దగ్గర సెలవు తీసుకొనే సందర్భంలో హనుమంతుడు రాముడితో "స్వామీ! నా మనసు ఎప్పుడూ నీమీదే లగ్నమై ఉండాలి. భూమిమీద రామకథ ఉన్నంతవరకు నా ప్రాణం నిలిచి వుండాలి. అప్సరసలు నిరంతరం నాకు రామకథ వినిపిస్తూ ఉండాలి. రామకథ వింటూ, రామనామము స్మరిస్తూ నీకు దూరంగా ఉన్నాననే బాధను మరచిపోయి బ్రతుకుతాను." అని చెప్పాడు.

హనుమంతుడి భక్తికి రాముడి మనసు పులకించిపోయింది. "నువ్వు కోరుకున్నట్లే జరుగుతుంది" అని చెప్పాడు. సింహాసనం దిగివచ్చి, హనుమంతుడిని కౌగిలించుకొని "హనుమా! నువ్వు నాకు చేసిన ప్రతీ ఒక్క ఉపకారానికీ నేను నా ప్రాణాలు ఇవ్వవలసిందే. కాని ఒక ఉపకారానికి బదులుగా ప్రాణాలు ఇచ్చిన తర్వాత మిగిలిన ఉపకారాలకి ఏమి ఇవ్వగలను? అయినా నువ్వు చేసిన ఉపకారాలకు ప్రత్యుపకారాలు చేసి బాకీ తీర్చేసుకోవాలనే ఆలోచనే నాకు భయంకరంగా అని

పిస్తోంది. ప్రత్యుపకారం చెయ్యాలనుకుంటన్నా నంటే నీకు కూడా ఆపదలు, సమస్యలు రావాలని నేను అంతర్లీనంగా కోరుకుంటున్నట్లే కదా! అందువలన నీకు ప్రత్యుపకారం చెయ్యాలనే ఆలోచనే నాకు రాకూడదని కోరుకుంటున్నాను. ఏ ఆపదలూ, సమస్యలూ లేకుండా నువ్వు సుఖసంతోషాలతో ఉండాలి." అని చెప్పాడు.

✦ ✦ ✦

దేవుడు మనసులోని భక్తిని చూస్తాడు గాని మనం సమర్పించే నైవేద్యం యొక్క ఖరీదు చూడడని తెలియజేసే కథ చదువుదాము.

ఒక సాధువు పూనుకొని గ్రామస్తులనుండి చందాలు వసూలుచేసి శిథిలమైపోయిన కృష్ణుడి ఆలయాన్ని పునఃనిర్మించాడు. ఒక శుభదినాన గ్రామస్తులందరి సమక్షంలో ఆలయాన్ని ప్రారంభించారు. ఆలయంలో మొదటిపూజ చేయించుకొనే భాగ్యం ఎవరికి దక్కుతుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఐదు లక్షలు విరాళంగా ఇచ్చిన భూస్వామి ఆ అవకాశం తనకే ఇస్తారని అనుకున్నాడు. దేవుడికి నగలు బహుకరించిన బంగారునగల వ్యాపారి కూడా ఆ అవకాశం తనకే ఇస్తారని అనుకున్నాడు.

పూజారి ఆ అవకాశం ఎవరికి ఇవ్వమంటారని సాధువును అడిగాడు.

సాధువు పొలంలో పనులు చేసుకొనే వాళ్లకి టీ అమ్మి వచ్చిన డబ్బుతో జీవించే ఒంటరి వృద్ధురాలైన తాయరమ్మ పేరును సూచించాడు.

సాధువు మీద ఉన్న గౌరవం వలన గ్రామస్తులెవ్వరూ అభ్యంతరం చెప్పలేదు గాని,



తాయారమ్మ ఎంత విరాళం ఇచ్చి ఉంటుందని గుసగుసలాడుకోవటం మొదలుపెట్టారు.

వారి గుసగుసలు వినిన సాధువు "తాయారమ్మ రోజు సంపాదన ఆమెకి ఆరోజు కడుపునిండా తినడానికి కూడా సరిపోదు. ఆలయనిర్మాణానికి తాను కూడా ఎంతో కొంత ఇవ్వాలనే అభిప్రాయంతో రోజుకి ఒకపూట మాత్రమే తిని డబ్బులు కూడబెట్టి వందరూపాయలు విరాళం ఇచ్చింది. ఆ వందరూపాయలు ఆమె సంపాదన సర్వస్వం. మిగిలినవాళ్లందరూ ఆమెకంటే ఎక్కువే ఇచ్చారు కాని అలా ఇచ్చినది వారి సంపాదన సర్వస్వం కాదు." అని వివరించాడు.

✦



-మొండెపు ప్రసాద్

51

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## భగవన్నామస్మరణ ఎన్నిసార్లు చెయ్యాలి?

**కొంతమంది "నేను రోజూ గంటసేపు పూజ చేస్తాను, ఉదయం, సాయంత్రం రెండు పూటలా పూజ చేస్తాను, వారానికి రెండు రోజులు ఉపవాసం ఉంటాను" అని గొప్పగా చెప్పుకోవడం మనమందరం వినే ఉంటాము.**


వారికి విభూది, కుంకుమ కూడా హోదాకి చిహ్నాలు. భగవన్నామస్మరణ ఎన్నిసార్లు చెయ్యాలి అనే ప్రశ్న అనవసరం. కర్తవ్యకర్మలు నిర్వర్తిస్తూ నిశ్చలభక్తితో ఏకాగ్రతతో ఒకటి రెండుసార్లు చేసినా భగవంతుడు కరుణిస్తాడని తెలియజేసే కథ చదువుదాము.

మాటల సందర్భంలో విష్ణుమూర్తి నారదుడితో భూలోకంలో నారదుడి కంటే గొప్ప భక్తుడైన ఒక రైతు ఉన్నాడని చెప్పాడు. నిరంతరం హరినామస్మరణ చేసే తనను మించిన భక్తుడు ఉన్నాడంటే నమ్మలేక నారదుడు మారువేషంలో భూలోకం వెళ్లి ఆ రైతు దినచర్య పరిశీలించాడు. రైతు ఉదయం లేవగానే ఒకసారి, మధ్యాహ్నం భోజనం చేసేముందు మరొకసారి, రాత్రి నిద్రపోయే ముందు ఇంకొకసారి చొప్పున ఒకరోజులో మూడుసార్లు మాత్రమే హరినామస్మరణ చేస్తుండటం గమనించిన నారదుడికి ఆరైతు ఏ విధంగా తనకంటే గొప్ప భక్తుడో అర్థం కాలేదు. వైకుంఠం వెళ్లి విష్ణుమూర్తిని అదే విషయం అడిగాడు.

విష్ణుమూర్తి సమాధానం చెప్పకుండా నారదుడి తలమీద నీళ్ళతో నింపిన ఐదు కుండలను ఒకదాని మీద ఒకటి చొప్పున పెట్టి నీళ్ళు ఒలగకుండా, కుండలు క్రింద పడకుండా తనచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చెయ్యమన్నాడు. నారదుడు ప్రదక్షిణలు పూర్తిచేసిన తర్వాత విష్ణుమూర్తి "నారదా! ప్రదక్షిణలు చేసిన సమయంలో నువ్వు నా నామాన్ని ఎన్నిసార్లు స్మరించావు?" అని అడిగాడు

"నా మనసంతా నీళ్ళు ఒలగకుండా, కుండలు క్రింద పడకుండా నడవడం మీదే ఉండటం వలన ఒక్కసారి కూడా మీ నామాన్ని స్మరించలేదు స్వామీ!"నారదుడు జవాబిచ్చాడు.

విష్ణుమూర్తి చిరునవ్వుతో "ఆ రైతు సంసారిక జీవితంలో రోజూ ఇంతకంటే ఎంతో కష్టమైన కర్తవ్యకర్మలు నిర్వర్తిస్తూ కూడా రోజుకు



మూడుసార్లు మనస్ఫూర్తిగా నన్ను స్మరిస్తున్నాడు. ఆ రైతు గొప్ప భక్తుడో కాడో ఇప్పుడు నువ్వే చెప్పు" అన్నాడు.

✦ ✦ ✦

దేవుడిని ఏదో ఇవ్వాలని ఆరాధించకూడదు. ఇచ్చినవాటికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఆరాధించాలి. కోరికలు తీర్చుకోవడానికి చేసే పూజ నిజమైన భక్తి కాదు. మనసును దేవుని యందు నిలపడానికి చేసే ప్రయత్నమే నిజమైన భక్తి.

ప్రార్థనలో మాటలు లేకపోయినా పర్లేదు, మనసు మాత్రం తప్పకుండా ఉండాలి. మనసు లేకుండా మాటలెన్ని ఉన్నా ప్రయోజనం ఉండదు. ప్రార్థనలో మనసు ప్రధానం కాని ఖరీదు కాదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

52

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## దేవుడుకి పక్షపాతం లేదు

శ్లోకం: సమ్మోహం సర్వభూతేషు న మే ద్వేష్యోస్తి న ప్రియః।
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥ 9-29 ॥

భావం: నేను అన్ని ప్రాణులయందు సమ భావముతో ఉంటాను. నాకు ప్రియమైనవారు గాని అప్రియమైనవారు గాని ఎవ్వరూ లేరు. కాని నన్ను భక్తితో పూజించేవాళ్ళు నాయందే ఉంటారు. నేను కూడా వారియందు ఉంటాను.

**వివరణ:** దేవుడుకి పక్షపాతం లేదు, అన్ని ప్రాణులయందు సమభావముతో ఉంటాడు. భగవంతుడు తనను పూజించని వారికి కూడా దర్శనమివ్వాలనే ప్రయత్నిస్తాడు. తనకు విషమిచ్చి చంపాలని ప్రయత్నించిన పూతనకు కూడా మోక్షమిచ్చాడు.

మనుష్యులందరిలో ఆత్మస్వరూపంలో ఉన్నది భగవంతుడే అయినప్పుడు భగవంతుడికి ఒకరంటే ప్రేమ మరోకరంటే ద్వేషం ఉండే అవకాశమే లేదు. జరిగే ప్రతీదీ భగవంతుడి ఆజ్ఞ ప్రకారం, భగవంతుడి ఇష్ట ప్రకారం జరుగుతున్నప్పుడు భగవంతుడికి ఎలాంటి భావాలూ ఉండే అవకాశమే లేదు. ఆయన ధర్మం పక్షాన మాత్రమే ఉంటాడు. కాని సామాన్య ప్రజలు మంచి జరిగితే భగవంతుడు తమ పక్షాన ఉన్నాడని, చెడు జరిగితే భగవంతుడు తమ పక్షాన లేడని అపోహ పడుతుంటారు. విజయం లభిస్తే భగవంతుడు కరుణించాడని, పరాజయం కలిగితే భగవంతుడు ఇంకా కరుణించలేదని అనుకుంటారు.

అలాగే కొంతమంది తమ పరాజయాలకు, తమకింకా విజయం రాకపోడానికి ఇతరులను, దురదృష్టాన్ని, శకునాలను నిందిస్తారు. తమ వైఫల్యాలకు ఇతరులు, దురదృష్టం, శకునాలు, దేవుడి కరుణ లేకపోవడం కారణాలని అనుకోవడం వలన మనసుకు తాత్కాలికంగా ఉపశమనం కలుగుతుంది. కాని అలా భావించడం వలన పరాజయాలకు అసలు కారణాలు తెలుసుకొనే ప్రయత్నాలు చెయ్యరు. ఫలితంగా మరోసారి కూడా ఇంతకుముందు ప్రయత్నించిన విధంగానే ప్రయత్నించి ఇంతకుముందులాగే పరాజయం పాలవుతారు.

అలా కాకుండా మన పరాజయానికి మన



ప్రయత్నలోపమే కారణమని నమ్మితే మనం చేసిన ప్రయత్నంలో లోపం ఎక్కడ ఉందో తెలుసుకొనే ప్రయత్నం చేస్తాము. ఆ లోపం మన ప్రణాళికలో గాని, ప్రణాళికను అమలు పరచడంలో గాని, పనిముట్లలో గాని ఎక్కడైనా ఉండచ్చు. లోపం ఎక్కడ ఉందో తెలిస్తే ఆ లోపాన్ని అధిగమించడానికి ప్రయత్నం చెయ్యవచ్చు. తరువాతి ప్రయత్నంలో విజయం సాధించవచ్చు.

విలువిద్య పోటీలో క్రీడాకారుడు లక్ష్య ఛేధనలో విఫలమైతే లక్ష్యాన్ని గాని, విల్లుని గాని, విలువిద్య నేర్పిన గురువును గాని నిందించడు. తానెందుకు లక్ష్యాన్ని ఛేదించ లేకపోయాడో విశ్లేషించి తెలుసుకుంటాడు. అందుకు అవసరమైతే గురువు సహాయం తీసుకుంటాడు. లోపం ఎక్కడుందో తెలుసుకొని దానిని అధిగమించడానికి కావలిసిన అభ్యాసం చేసి తర్వాతి ప్రయత్నంలో విజయం సాధిస్తాడు.

ఏ వ్యక్తి అయినా, ఎన్నిసార్లు విజయం సాధించలేకపోయినా పరాజయుడు కాడు. కాని ఎప్పుడైతే ఆ వ్యక్తి తన పరాజయానికి ఇతరులను, దురదృష్టాన్ని, శకునాలను నింది స్తాడో అప్పుడా వ్యక్తి పరాజయుడి కిందే లెక్క. ఎందుకంటే తన పరాజయానికి ఇతరులు, దురదృష్టం, శకునాలు కారణాలని నమ్మిన వ్యక్తి తన ప్రయత్నంలోని లోపాలను గుర్తించి సరిదిద్దుకొనే ప్రయత్నం చెయ్యడు. అందు వలన ఎప్పటికీ విజయం సాధించలేడు.

కాబట్టి పరాజయానికి ఇతరులను, దురదృష్టాన్ని, శకునాలను, దేవుడి కరుణ లేకపోవడాన్ని నిందించకుండా మన ప్రయ త్నంలోని లోపాలను గుర్తించి వాటిని సరి దిద్దుకొని మరోసారి ప్రయత్నిస్తే తప్పకుండా విజయం సాధించవచ్చు.

ప్రయత్నం చేసేవారినే దేవుడు కరుణి స్తాడని తెలియజేసే కథ వచ్చే వారం చదువుదాము.

✦



-మొండెపు ప్రసాద్

53

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## యువక్రీతుడు

**రైభ్యుడు, భరద్వాజుడు మంచి స్నేహి తులు. నదీతీరాన ప్రక్కప్రక్కనే ఆశ్రమాలు నిర్మించుకుని నివసిస్తుండేవారు. రైభ్యుడికి ఇద్దరు కొడుకులు - పరావసు, అర్వావసు. వాళ్ళిద్దరూ సకల విద్యలూ నేర్చుకుని గొప్ప పండితులుగా పేరు పొందారు. భరద్వాజునికి ఒక్కడే కొడుకు. అతని పేరు యువక్రీతుడు.**

యువక్రీతుడు కష్టపడి చదవకుండా పరావసు మరియు అర్వావసుల కంటే గొప్ప పండితుడు కావాలనే కోరికతో ఇంద్రుని గురించి తపస్సు చేసాడు. ఇంద్రుడు ప్రత్యక్షమై ఏమి కావాలని అడిగాడు. యువక్రీతుడు "నేను చాలా గొప్ప పండితుడిని కావాలి. దాని కోసం గురువు వద్దకు వెళ్లి ఆయనకు సేవలు చేయడం, కష్టపడి విద్యలు నేర్చుకోవడం నేను చెయ్యను. అవేమీ చెయ్యకుండా తక్షణమే నాకు విద్యలన్నీ వచ్చేయాలి, నేను గొప్ప పండితుడిని అయిపోవాలి" అని కోరాడు.

ఇంద్రుడు "అది కుదరదు. గురువును ఆశ్రయించి కష్టపడి నేర్చుకుంటేనే విద్య అబ్బుతుంది" అని చెప్పాడు.



యువక్రీతుడికి ఇంద్రుడి మాటలు నచ్చలేదు. మళ్ళీ తపస్సు చెయ్యడం ప్రారంభించాడు. ఇంద్రుడు మళ్ళీ ప్రత్యక్షమై "నీ తండ్రి గొప్ప పండితుడు. నువ్వు ఆయన దగ్గర విద్యలు నేర్చుకో" అని చెప్పాడు. యువక్రీతుడు అంగీకరించకుండా తపస్సు కొనసాగించాడు.

యువక్రీతుడు ఒకరోజు గంగానదిలో స్నానం చెయ్యడానికి వెళ్ళినప్పుడు ఒక ముసలివాడు నదిఒడ్డున కూర్చొని పిడికెడు పిడికెడు ఇసుక తీసి నదిలోకి విసురుతుండటం గమ



నించి ఏమి చేస్తున్నావని అతనిని అడిగాడు. గంగానదిని దాటడానికి వంతెన కడుతున్నానని ఆ ముసలివాడు జవాబిచ్చాడు. యువక్రీతుడు పెద్దగా నవ్వి "ఇలా ఇసుకతో వేగంగా వెళ్ళే ప్రవాహానికి అడ్డంగా కట్ట వేయడం కుదరదు. నదిని దాటడానికి వేరే మార్గం వెతుక్కో" అన్నాడు.

ముసలివాడు "గురువును ఆశ్రయించ కుండా, అసలు చదవకుండా, కొంచెం కూడా కష్టపడకుండా కొందరు పండితులు కావాలని ప్రయత్నిస్తున్నారు. వారిలాగే నేను కూడా గంగానది మీద ఇసుకతో వంతెన కట్టడానికి ప్రయత్నిస్తున్నాను." అని చెప్పాడు.

యువక్రీతుడికి ఆ ముసలివాడు ఇంద్రుడే అని అర్థమై ఆయన కాళ్ళమీద పడ్డాడు.

ఇంద్రుడు యువక్రీతుడిని పైకి లేపి "నీ తండ్రి వద్ద విద్యలు నేర్చుకో. అనతి కాలంలోనే నువ్వు గొప్ప పండితుడివి అవుతావు" అని ఆశీర్వదించాడు.

✦ ✦ ✦

దేవుడుకి పక్షపాతం లేదు, అన్ని ప్రాణుల యందు సమభావముతో ఉంటాడు. ఆయన ధర్మం పక్షాన ఉంటాడు, ప్రయత్నించిన వారికి తగిన ఫలితాన్ని ఇస్తాడని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

54

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## పశ్చాత్తాపంతో మార్పు

**శ్లోకం: అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్।**

**సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥ 9-30 ॥**

భావం: అత్యంత దురాచారుడు అనన్య భావముతో పూజిస్తే అతడిని సత్పురుషుడిగానే భావించాలి. ఎందుకంటే అతడు యదార్ధముగా నిశ్చయబుద్ధి కలవాడు.

**శ్లోకం: క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి।**

**కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 9-31 ॥**

భావం: అర్జునా! అతడు శ్రీఘ్రముగా ధర్మాత్ముడై శాస్వతమైన పరమశాంతిని పొందును. నా భక్తుడు ఎప్పుడూ నష్టానికి గురికాడని తెలు సుకో.

### వివరణ

ఎంతటి దుర్మార్గపు పనులు చేసినవాడైనా తన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాపడితే భక్తితో భగవంతుడిని పూజిస్తే సత్పురుషుడు అవుతాడు. కాని ఇంతకుముందు చేసిన చెడ్డపనులు చేస్తూ పూజిస్తే సత్పురుషుడుగా మారడు. చేసిన తప్పు పనులకు పశ్చాత్తాపం చెంది, మరోసారి అటువంటి చెడ్డపనులు చెయ్యనని నిర్ణయం తీసుకుని భగవంతుడిని పూజిస్తే సత్పురుషుడు అవుతాడు. అయితే, చేసిన చెడుపనులకు పశ్చాత్తాపం చెందడం చాలా ముఖ్యం.

ఇందుకు వాల్మీకి మహర్షి చరిత్ర సరైన ఉదాహరణ.

రత్నాకరుడు అనే బోయవాడు గజదొంగగా మారి అడవిలో దారి దోపిడీలు, దొంగతనాలు చేస్తూ జీవితం గడిపేవాడు. ఒకరోజు అడవి గుండా ప్రయాణం చేస్తున్న ఋషులను దోచుకోడానికి ప్రయత్నం చేసాడు. ఋషులు “దొంగతనాలు చెయ్యడం వలన కలిగిన పాపాల ఫలితాన్ని నువ్వు ఒక్కడివే అనుభవిస్తావా? నీ భార్య, పిల్లలు, తల్లిదండ్రులు కూడా ఆ పాప ఫలాన్ని పంచుకుంటారా?” అని రత్నాకరుడుని అడిగారు.

రత్నాకరుడు ఇంటికి వెళ్లి తన భార్య, పిల్లలు మరియు తల్లిదండ్రులను అదే ప్రశ్న అడిగాడు. వాళ్ళు “మమ్మల్ని పోషించటం నీ బాధ్యత. కాని అందుకు నువ్వు చేసే పాపాల



ఫలితాన్ని మేము పంచుకోలేము." అని చెప్పారు.

వారి సమాధానం వినిన రత్నాకరుడికి జ్ఞానోదయమయ్యింది. జీవనోపాధి కోసం పాపాలు చెయ్యకూడదని నిర్ణయించుకుని తిరిగి అడవిలోకి వెళ్లి ఋషులను కలిసి జరిగిన వృత్తాంతం చెప్పాడు. ఋషులు అతనికి రామనామ మంత్రాన్ని ఉప దేశించారు. రత్నాకరుడు రామనామ మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేసాడు. తపస్సు చేస్తున్న అతని చుట్టూ వల్మీకము (పుట్ట) పెరగటం వలన అందరూ అతడ్ని వాల్మీకి అని పిలవసాగారు.

కొన్నాళ్ళకు బ్రహ్మ ప్రత్యక్షమై అతని నాలుకపై బీజాక్షరాలు రాసి అంతర్ధాన మయ్యాడు. నారదుడు వాల్మీకి వద్దకు వచ్చి రామాయణ గాథ చెప్పి శ్రీమద్రామాయణ మహాకావ్యాన్ని వ్రాయమని బ్రహ్మదేవుని ఆదేశంగా చెప్పాడు. వాల్మీకి ఆది కావ్యమైన రామాయణాన్ని వ్రాసాడు.

✦ ✦ ✦

కర్తవ్యనిర్వహణలో గాని, జీవనోపాధికోసం గాని తప్పులు చేయకూడదు. ఒకవేళ తప్పులు చేస్తే పశ్చాత్తాపపడి మరోసారి అటువంటి తప్పులు చేయకుండా జీవించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొందెపు ప్రసాద్

55

# యువతకు భగవద్గీత చూపించిన దారి



### (1) ఎవ్వరినీ మోసం చెయ్యద్దు

**శ్లోకం: అహమాత్మా గుడాకేశ సర్వభూతా శయస్థితః ।**

**అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ ॥ 10-20 ॥**

భావము: అర్జునా! సమస్త ప్రాణుల హృదయముల యందున్న ఆత్మను నేనే. సకల ప్రాణుల ఆదియు, మధ్యస్థితి, అంతము నేనే. (అన్ని ప్రాణుల సృష్టి, స్థితి, లయములకు కారణము నేనే)

మందరం వినే వుంటాము. ఎదుటి వారిని మోసం చెయ్యాలని ప్రయత్నించిన వారు తామే మోసపోవడం మనమందరం ఏదోఒక సందర్భంలో వినే ఉంటాము. అటువంటి ఒక కథను గుర్తుచేసుకుందాము:

వీర్రాజు అనే జమీందారు వందెకరాల పండ్ల తోటలో వున్న తన ఫాంహౌస్ వ్యవహారాలు చూడటానికి రామయ్య, భీమయ్య అనే ఇద్దరు ఉద్యోగస్తులను నియమించాడు.

## విభూతి యోగము

**వివరణ:** అన్ని ప్రాణులలో ఉన్న ఆత్మను నేనే, అన్ని ప్రాణుల సృష్టి, స్థితి, లయములకు కారణము నేనే అని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు.

అన్ని ప్రాణులలో భగవంతుడే ఆత్మస్వరూపుడుగా ఉన్నాడు కాబట్టి ఏ ప్రాణిని హింసించినా ఆ ప్రాణిలో ఉన్న భగవంతుడిని హింసించినట్లే. అలాగే ఎవరిని మోసం చేసినా వారిలోని భగవంతుడిని మోసం చేసినట్లే. కాబట్టి ఏ ప్రాణినీ అనవసరంగా హింసించకూడదు, ఎవ్వరినీ మోసం చెయ్యకూడదు.

చెరపకురా చెడేవు - అనే సామెత మన

భీమయ్య కూలి వాళ్ళతో కలిసి పండ్లను దొంగతనంగా అమ్ముకొనేవాడు. కూలీలకు చెల్లించిన కూలి ఎక్కువగా చూపించి ఎక్కువగా రాసిన డబ్బులు తాను తీసుకొనేవాడు. నిజాయితీపరుడైన రామయ్యకు భీమయ్య చేసే మోసాలు నచ్చేవి కావు. తాను చేస్తున్న మోసాల గురించి రామయ్య యజమానికి చెప్తాడేమోనని భీమయ్య భయపడుతూ ఉండేవాడు. కాని మోసాలు చెయ్యడం మాత్రం ఆపేవాడు కాదు.

ఒకసారి జమీందారు స్నేహితుడు ఫాంహౌసుకి వచ్చాడు. అదే అవకాశంగా భీమయ్య తాను చేస్తున్న మోసాలన్నీ రామయ్య చేస్తున్నట్లుగా అతనికి చాడీలు చెప్పి, తనకు మచ్చి



కైన కొంతమంది కూలీలతో తప్పుడు సాక్ష్యం కూడా చెప్పించాడు. జమీందారు స్నేహితుడు అంతా విని విషయం జమిందారుకి చెప్తానని చెప్పాడు.

జమిందారు స్నేహితుడు వెళ్ళిన రెండు రోజులకే రామయ్యను అక్కడి నుంచి మరొక చోటుకి బదిలీ చేస్తూ ఉత్తర్వు వచ్చింది. రామయ్య వెళ్లిపోయాడు. భీమయ్య సంతోషంతో గంతులు వేశాడు. అయితే భీమయ్య సంతోషం ఎక్కువ రోజులు నిలువలేదు. రామయ్యను బదిలీ చేసిన యజమాని అతని స్థానంలో ఎవర్నీ నియమించలేదు. అందువలన ఇంతకాలం ఇద్దరు చేసిన పనిని భీమయ్య ఒక్కడే చెయ్యవలసి వచ్చింది. పైగా జమిందారు గారి వద్ద వుండే ఒక ఉద్యోగి ప్రతీవారం వచ్చి జమాఖర్చులు చూసేవాడు. అందువలన భీమయ్యకు మోసం చేసి డబ్బులు మిగుల్చుకొనే అవకాశం కూడా లేకుండాపోయింది. కొంత కాలానికి భీమయ్యకు ఎదుటి వారిని మోసం చెయ్యాలని ప్రయత్నిస్తే తానే మోసపోతానని అర్థమయ్యింది.

✦ ✦ ✦

ఇదే విషయాన్ని గాంధీగారు "ఆత్మకథ" (నాలుగవ భాగం – అధ్యాయం 40 – చిన్న సత్యాగ్రహం)లో – వాళ్ళు నన్ను మోసం చేస్తే చేయనీయండి చూద్దాం. ఒకరిని మోసం చేయాలనుకొనేవాడే చివరికి మోసంలో పడిపోతాడని ఎన్నోసార్లు మీకు చెప్పాను కదా! – అని తెలియజేసారు.

✦



-మొండెపు ప్రసాద్

56

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## విశ్వరూపదర్శన యోగము

### (1) కష్టపడి సాధిస్తేనే కీర్తి:

శ్లోకం: తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూన్ భుఙ్క్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥
11-33 ॥

భావం: సవ్యసాచీ! లెమ్ము. యుద్ధము చేసి శత్రువులను జయించి కీర్తి సంపాదించు రాజ్యమును పొందుము. వీరందరూ ఇంతకు ముందే నాచేత చంపబడ్డారు. నీవు కేవలం నిమిత్తమాత్రుడవు.

**వివరణ:** శ్రీకృష్ణుడు అర్జునుడికి తన విశ్వరూపాన్ని చూపించాడు. విశ్వరూపాన్ని చూసిన అర్జునుడు వినయంతో నమస్కరించి నీగురించిన వివరాలు తెలియజేయమని కృష్ణుడిని అడిగాడు.

నేను ధర్మరక్షణకు, దుష్ట శిక్షణకు పూనుకున్న కాలస్వరూపుడిని. నువ్వు యుద్ధం చేయకపోయినా శత్రుపక్షంలో ఉన్న వీరులెవ్వరూ జీవించి ఉండరు. నువ్వు కేవలం నిమిత్తమాత్రుడివి. యుద్ధం చేసి శత్రువులను జయించి రాజ్యమును, కీర్తిని సంపాదించమని శ్రీకృష్ణుడు అర్జునుడిని ప్రోత్సహించాడు.

ఆస్తిపాస్తులను, ఉద్యోగాలను ఎవరైనా ఉచితంగా పొందగలరేమో కాని విజయాలను, విజయాలు తెచ్చే కీర్తిని ఎవ్వరూ ఉచితంగా పొందలేరు, ఎవ్వరూ బహుమతిగా ఇవ్వలేరు.

ఈ సందర్భంలో శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద'లోని 'ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానం' లోని కథను ఒకసారి క్లుప్తంగా గుర్తు చేసుకుందాము.

పూర్వం ఖాండిక్యుడు, కేశిధ్వజుడు అనే ఇద్దరు రాజులు యుద్ధానికి దిగారు. ఖాండిక్యుడు యుద్ధంలో ఓడిపోయి తన రాజ్యాన్ని వదిలి అడవుల్లోకి పారిపోయి ఆధ్యాత్మిక చింతనతో కాలం గడుపుతున్నాడు. గెలిచిన కేశిధ్వజుడు ఉత్సాహంతో యజ్ఞం చేసి దానధర్మాలు చేయాలని తలపెట్టాడు. కాని అనుకోకుండా యాగధేనువు మరణించింది. అది అశుభ సూచన. యజ్ఞాన్ని ఎలా పూర్తిచేయాలో తెలియక కేశి ధ్వజుడు అయోమయంలో పడ్డాడు. పురోహితులను సంప్రదించాడు. ఆ ధర్మసూక్ష్మం తెలిసినవాడు ఓడిపోయిన ఖాండిక్యుడు ఒక్కడే అని



పురోహితులు చెప్పారు.

గెలిచిన కేశిధ్వజుడు ఏమాత్రం సందేహించకుండా ఓడిన ఖాండిక్యుడి వద్దకు వెళ్లి, యజ్ఞాన్ని పూర్తిచేయాడానికి సహకరించమని కోరాడు. ఖాండిక్యుడు నన్ను ఓడించి అడవుల పాలు చేసినవాడికి నేనెందుకు సహాయం చెయ్యాలని అనుకోకుండా యజ్ఞం పూర్తిచెయ్యడానికి సహకరించాడు.

యజ్ఞం పూర్తిచెయ్యడానికి సహకరించినందుకు గురుదక్షిణగా ఏది కోరుకుంటే అది ఇస్తానని కేశిధ్వజుడు ఖాండిక్యుడితో చెప్పాడు. ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని ఖాండిక్యుడు తాను కోల్పోయిన రాజ్యం తిరిగి గురుదక్షిణగా ఇవ్వమని అడిగినా కేశిధ్వజుడు ఇచ్చి ఉండేవాడు. కాని ఖాండిక్యుడు తనకు గురుదక్షిణగా బ్రహ్మజ్ఞానాన్ని బోధించమని అడిగాడు.

ఖాండిక్యుడి నిర్ణయానికి కేశిధ్వజుడు ఆశ్చర్యపోయి గురుదక్షిణగా రాజ్యం కావాలని ఎందుకు అడగలేదని అడిగాడు. అప్పుడు ఖాండిక్యుడు – 'రాజ్యభోగాలు కేవలం భౌతిక సంపదలు. వాటిని కష్టపడి శక్తిసామర్థ్యాలతో సంపాదించుకోవాలి గాని ఉచితంగా లభించాలని కోరుకోకూడదు. కష్టపడి సాధిస్తేనే, వాటి విలువ తెలుస్తుంది. నా కంటే బలవంతుడి చేతిలో ఓడిపోయాను. అందులో సిగ్గు పడాల్సింది ఏముంది? తిరిగి పుంజుకొని ధర్మమార్గంలో, శక్తిసామర్థ్యాలతో నా రాజ్యాన్ని నేను తిరిగి చేజిక్కించుకోవాలి. అంతేగాని దానంగా పొందడం సమంజసం కాదు." అని చెప్పాడు.

✦ ✦ ✦

విజయాలను, విజయాలు తెచ్చే కీర్తిని ఎవ్వరూ ఉచితంగా పొందలేరు, ఎవ్వరూ బహుమతిగా ఇవ్వలేరు. వాటికి ఎవరికివారు కష్టపడి సాధించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



57

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్



**శ్లోకం: మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః స్గవర్జితః।**

**నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాణ్డవ ॥ 11-55 ॥**

భావం: భగవదర్పణ భావంతో కర్తవ్యాలను నిర్వర్తించేవాడు, నాయందు భక్తి శ్రద్ధలు కలవాడు, ప్రాపంచిక విషయముల యందు ఆసక్తిలేనివాడు, ఏ ప్రాణియందూ వైరభావం లేనివాడు అయిన భక్తుడు నన్ను పొందగలడు.

## భగవదర్పణ భావంతో కర్తవ్యం నిర్వర్తించాలి

**వివరణ:** భగవద్గీత సారమంతా కర్తవ్య నిర్వహణతోనే పెనవేసుకుని ఉంది. అందుకే కర్తవ్య నిర్వహణ గురించి భగవద్గీతలో పదే పదే చెప్పబడింది.

ఒకసారి శుకమహర్షి జనకమహారాజుకు నిండుసభలో ప్రణామం చేశాడు. సర్వం త్యజించిన గొప్ప మహర్షి సంసారజీవితంలో ఉన్న మహారాజుకు ప్రణామం చెయ్యడం ఏమిటని సభలోని వారందరూ ఆశ్చర్యపోయారు. వారి ఆశ్చర్యాన్ని గమనించిన శుకమహర్షి "జనకమహారాజు తన జీవితాన్నే యోగమయం కావించుకున్న ధన్యుడు. చేసే ప్రతీ పనినీ భగవంతునికి సమర్పణ చేసే మహనీయుడు. కాబట్టి యోగులలోకెల్లా సర్వశ్రేష్టుడు." అని ప్రణామం చెయ్యడానికి కారణం వివరించాడు.

✦ ✦ ✦

కర్తవ్యాలను భగవంతుని ఆదేశాలుగా, భగవంతుని కోసం చేస్తున్న పనులుగా భావించి నిర్వర్తించడం వలన కర్తవ్యాలను యధాలాపంగా కాక భక్తిశ్రద్ధలతో నిర్వర్తిస్తాము. కర్తవ్య నిర్వహణలో తప్పులు, మోసాలు జరగకుండా జాగ్రత్తపడతాము. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ చదువుదాము.

పారిశ్రామికవేత్త రఘు తన కూతురు పెళ్లి కోసం డిజైనర్ నగలు చెయ్యమని బంగారు నగలు తయారుచేసే రాజుకి ఆర్డరు ఇచ్చాడు. రెండువారాల తర్వాత పని ఎంతవరకు అయ్యిందో కనుక్కుందామని రాజు మొబైల్ ఫోనుకి ఫోన్ చేశాడు. కానీ నాలుగుసార్లు ఫోన్ చేసినా రాజు ఫోన్ ఎత్తలేదు. రఘుకి కోపం వచ్చి తన డ్రైవరుని వెళ్ళి రాజును తీసుకురమ్మని చెప్పాడు.

గంట తర్వాత డ్రైవర్ ఫోనుచేసి "సార్! రాజు షాపు నుండి మాట్లాడుతున్నాను. రాజు లోపల పనిలో ఉన్నాడని నన్ను హాలులో వెయిట్ చెయ్య



మన్నారు. గంట గడిచినా వాడు బయటకి రాలేదు, వీళ్ళు నన్ను లోపలికి వెళ్లనివ్వడం లేదు" అని చెప్పాడు.

ఆ మాటలు వినిన రఘు కోపం మరింత పెరిగింది. "ఎంతసేపైనా సరే అక్కడే వెయిట్ చేసి వాడిని నా దగ్గరకు తీసుకురా" అని డ్రైవరుకి చెప్పాడు.

మరో రెండుగంటల తర్వాత డ్రైవరు రాజుని వెంటబెట్టుకొని వచ్చాడు.

రఘు కోపంగా "నగలు తయారుచెయ్యడం ఎంతవరకు అయ్యిందో తెలుసుకుందామని ఫోను చేస్తే ఫోను ఎత్తలేదు. డ్రైవరుని పంపిస్తే నువ్వేదో మినిస్టరులా వాడితో కనీసం మాట్లాడ లేదు. ఇదేమైనా బాగుందా?" అని అడిగాడు.

రాజు వినయంగా "అయ్యా! దైవాన్ని పూజించేటప్పుడు మనస్సుని దైవం మీదే కేంద్రీకరిస్తాము. అందువలన చుట్టుప్రక్కల జరిగే విషయాలేవీ మనకు వినపడవు, కనపడవు. నేను నాపనిని దైవంగా భావిస్తాను. అందువలన పనిచేసేడప్పుడు చుట్టుపక్కల జరిగే విషయాలను పట్టించుకోను. మనసంతా చేస్తున్న పనిమీద కేంద్రీకరించి ఏకాగ్రతతో పని చేస్తాను. అందువలన మీరు ఫోను చేసినప్పుడు మాట్లాడలేకపోయాను, మీ డ్రైవరు వచ్చిన వెంటనే అతనితో మాట్లాడలేక పోయాను. అలా ఏకాగ్రతతో పనిచేయడం వలన నాపనిలో లోపాలు జరగవు. మీరు ఆర్డరు ఇచ్చిన వాటిలో ఒక హారం చెయ్యడం పూర్తయ్యింది. ఎంత అందంగా వచ్చిందో చూడండి" అని హారం చేతికిచ్చాడు.

అద్భుతంగా తయారు చేసిన హారాన్ని చూసిన రఘు అతని పనితనాన్ని, పనిపట్ల అతని అంకితభావాన్ని మెచ్చుకున్నాడు.

✦ ✦ ✦

కర్తవ్యాలను భగవదర్పణ భావంతో భక్తిశ్రద్ధలతో నిర్వర్తించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

58

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**(1) మనసును నియంత్రించుకుని ప్రయత్నిస్తే విజయం:**

**శ్లోకము: యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే ।**

**సర్వత్రగమచిన్త్యఞ్చ కూటస్థమచలన్ధ్రువమ్ ॥ 12-3 ॥**

**సన్నియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।**

**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥12-4 ॥**

## భక్తియోగము

భావం: మనసును నియంత్రణలో వుంచుకొని, ఇంద్రియాలను నిగ్రహించుకొని, సర్వ ప్రాణులను సమభావంతో చూస్తూ, సర్వ ప్రాణుల హితము కోరుతూ నిరంతరం భగవంతుడిని ధ్యానం చేసేవారు భగవంతుడిని పొందుతారు.

వివరణ: మనలో చాలామందికి మనసు దేనిమీదా స్థిరంగా ఉండకుండా ఒక విషయం నుండి మరో విషయం మీదకి చంచలంగా మళ్ళిపోతూ ఉంటుంది. తరగతి గదిలో పాఠం వింటుండగా నచ్చిన సినిమాలోని సీన్ గుర్తొస్తుంది. పరీక్ష వ్రాస్తుండగా నచ్చిన పాట గుర్తొస్తుంది. అలా దేనిమీదా మనసు కేంద్రీకరించలేకపోవడం వలన వాళ్ళు ఎటువంటి విజయాలు సాధించలేకపోతారు.

✦ ✦ ✦

మనసు దేనిని కోరితే దానిని తిరస్కరిస్తూ జీవించడం వలన మనసు కోరికల వెంట వెళ్ళకుండా ఇంద్రియనిగ్రహం అలవడుతుందని తెలియజేసే కథ చదువుదాము.

అప్పారావు స్వామీజీ వద్దకు వెళ్లి "స్వామీ! రోజూ గంటలతరబడి ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి నాకు వీలు కుదరట్లేదు. మీరేదైనా మంత్రం ఉపదేశిస్తే అ మంత్రాన్ని జపిస్తూ సాధనచేస్తాను. లేదా మరేదైనా సులభమైన మార్గం సెలవివ్వండి" అని అడిగాడు

స్వామీజీ అరనిమిషం పాటు ఆలోచించి "నీకు చాలా సులభమైన మార్గం చెప్తాను. నీ మనసు దేనిని కోరితే దానిని తిరస్కరిస్తూ జీవించు. అప్పుడు నువ్వు చాలా సులభంగా ఆధ్యాత్మిక ప్రగతిని సాధిస్తావు" అని చెప్పారు.

అప్పారావు నిరాశతో "మీరు పంచాక్షరి వంటి మంత్రమేదైనా ఇస్తే నేను జపిస్తూ సులభంగా ఆధ్యాత్మిక సాధన చేసేవాడిని స్వామీ" అన్నాడు



స్వామీజీ చిన్నగా నవ్వి "మంత్రాన్ని పదేపదే జపించడం వలన మనసు కోరికల వెంట విహరించకుండా దేవుడిమీద లగ్నమవుతుంది. దానివలన ఇంద్రియనిగ్రహం సాధ్యపడుతుంది. ఇప్పుడు నేను చెప్పిన మార్గం కూడా ఇంద్రియ నిగ్రహం సాధించడానికే ఉపయోగపడుతుంది." అని చెప్పారు.

✦ ✦ ✦

మనసును కోరికలనుండి మళ్ళించడ మెలాగో తెలియజేసే కథ చదువుదాము.

ఒక సాధువు పల్లెటూరికి జట్కాబండిలో వెళ్తున్నాడు. గుర్రం మంచి వేగంగా పరుగెడు తోంది. లెవెల్ క్రాసింగ్ రాగానే జట్కా యజ మాని గుర్రాన్ని కొరడాతో కొట్టడం మొదలు పెట్టాడు. బండిలో కూర్చున్న సాధువు "గుర్రం వేగంగానే పరుగెడుతోంది కదా! అనవసరంగా దానిని ఎందుకు కొడుతున్నావు?" అని అడి గాడు.

బండి యజమాని "లెవెల్ క్రాసింగ్ దగ్గర పాతిన తెల్లని రాళ్ళను చూసి గుర్రం భయపడి ఆగిపోతుంది. అడుగు ముందుకు వెయ్య కుండా మొరాయిస్తుంది. నేను దానిని తెల్ల రాళ్ళ కంటే ఎక్కువ భయపెడితేనే అది ఆగకుండా ముందుకు కదులుతుంది. అందుకే లెవెల్ క్రాసింగ్ రాగానే కొరడాతో కొడతాను." కారణం చెప్పాడు.

అది విని సాధువు "మనసును కోరికల నుండి మళ్ళించడానికి ఒక విషయం వెనుక పరిగెడుతున్న మనసును మరొక బలమైన విషయం వైపు మరల్చాలి" అనుకున్నాడు.

✦ ✦ ✦

కర్తవ్య నిర్వహణకు అవసరంలేని విష యాల వెనుక పరుగెత్తే మనసును నియం త్రించుకుని ప్రయత్నిస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



59

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్

**శ్లోకం: అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**

**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥ 12-9 ॥**

భావం: అర్జునా! మనసును స్థిరంగా నాయందే నిలపడం సాధ్యం కాకపోతే అభ్యాసయోగం ద్వారా నన్ను పొందటానికి ప్రయత్నించు.

## అభ్యాసము ద్వారా మనసును నియంత్రించాలి

వివరణ: నాయందు మనసు లగ్నము చేసిన భక్తులను నేను సంసారసాగరము నుండి ఉద్ధరిస్తానని అర్జునుడికి చెప్పి శ్రీకృష్ణుడు మనసును స్థిరంగా నాయందు నిలపడాన్ని అభ్యాసము ద్వారా సాధించ వచ్చని వివరించాడు.

అభ్యాసం ద్వారా మనసును ఎలా స్వాధీనం చేసుకోవచ్చో తెలియజేసే ఒక కథ చదువుదాము.

రాజు ఒక వింత పందెం పెట్టాడు. తానిచ్చే మేకలను రెండునెలలపాటు బాగా పెంచి, రాజాస్థానానికి తీసుకురావాలి. ఆరోజు అక్కడ ఉంచే ఆకులను ఏ మేకలైతే తినవో ఆ మేకలను పెంచినవాళ్లకు పదివేల వరహాలు ఇస్తానని ప్రకటించాడు. వంద మంది ఉత్సాహవంతులు పందెంలో పాల్గొనడానికి ముందుకువచ్చి మేకలను తీసు కెళ్ళారు.

రెండునెలల తర్వాత మేకలను రాజ స్థానానికి తీసుకొచ్చారు. తొంభైతొమ్మిది మేకలు ఎదురుగా ఉన్న ఆకులను చూడగానే వెళ్లి ఆకులను తినడం ప్రారంభించాయి. ఆ మేకలను పెంచినవాళ్ళు "కడుపునిండా తిండి పెట్టి పెంచితే ఇక్కడ కనబడిన ఆకులను తినడానికి ఎగబడవనే అభిప్రాయంతో మేము వీటికి కడుపునిండా తిండిపెట్టి మేపాము. అయినా ఆకులను చూడగానే ఎందుకు ఎగబడ్డాయో తెలియడంలేదు మహారాజా!" అన్నారు

ఒక మేక మాత్రం తన యజమాని చేతిలోని కర్రవంక చూస్తూ నిలబడింది. రాజు దాని యజమానిని "ఆకులను తినడం మేక సహజ



గుణం. కాని నీ మేక ఆకులు ఎదురుగా ఉన్నా తినడానికి వెళ్ళకుండా నీచేతిలోని కర్రవంక చూస్తూ నిలబడింది. ఇది ఎలా సాధ్యపడింది?" అని అడిగాడు.

"మహారాజా! ప్రతీరోజూ ఆకులు తెచ్చి మేకముందు ఉంచేవాడిని. అది ఆకులను తినడానికి ప్రయత్నించగానే దాని మూతిమీద కర్రతో కొట్టేవాడిని. అది అలా ఎన్నిసార్లు ప్రయత్నిస్తే అన్నిసార్లు అలాగే కొట్టేవాడిని. అది ఆకులు తినడానికి ప్రయత్నించడం మానేస్తే వేరే ఆహారం పెట్టేవాడిని. కొన్నిరోజులు గడిచేసరికి  మేక ఆకులు తినడానికి ప్రయత్నించడం పూర్తిగా మానేసింది" అని వివరించాడు.

"మనసును అభ్యాసం ద్వారా ఎలా స్వాధీనం చేసుకోవచ్చో నువ్వు చక్కగా నిరూపించావు" అని రాజు అతడిని పొగిడి పదివేల వరహాలు ఇచ్చి పంపించాడు.

✦ ✦ ✦

కర్తవ్య నిర్వహణకు అవసరంలేని విషయాల వెంట పరుగెత్తే మనసును అభ్యాసము ద్వారా నియంత్రించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొుండెపు ప్రసాద్

60

# యువతకు భగవద్గీత చూపించిన దారి



శ్లోకం: అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।

నిర్మమో నిరహ్కారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 12-13 ॥

సన్తుష్టః సతతం యోగీ యతాత్మా దృఢ నిశ్చయః।

మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తః స మే ప్రియః ॥ 12-14 ॥

భావము: ఏ ప్రాణియందూ ద్వేషభావము లేనివాడు, సర్వ ప్రాణులయందు ప్రేమ, కరుణ కలవాడు అహంకారము లేనివాడు, సుఖము ప్రాప్తించినా, దుఃఖము ప్రాప్తించినా సమభావము కలిగివుండేవాడు, క్షమాగుణము కలవాడు,ఎల్లప్పుడూ సంతుష్టుడై ఉండేవాడు, శరీరమును, మనసును, ఇంద్రియములను నియంత్రణలో ఉంచుకోనేవాడు, నాయందు నిశ్చలమైన భక్తి కలవాడు నాకు ఇష్టుడు.

వివరణ: అందరిలోనూ భగవంతుడే

## ఎవ్వరినీ ద్వేషించవద్దు



ఉన్నాడు కాబట్టి ఎవరికి నమస్కారం చేసినా భగవంతుడికి చేసినట్లే, ఎవరికి సేవ చేసినా భగవంతుడికి సేవ చేసినట్లే, ఎవరికి సత్కారం చేసినా భగవంతుడికి చేసినట్లే, ఎవరికి పూజ చేసినా భగవంతుడికి చేసినట్లే.

అలాగే ఎవరిని తిరస్కరించినా భగవంతుడిని తిరస్కరించినట్లే, ఎవరిని దూషించినా భగవంతుడిని దూషించినట్లే.

కాబట్టి ఎవ్వరి పట్లా ద్వేషభావం లేకుండా సహృద్భావంతో మెలగాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

61

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః।**
**హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యః స చ మే ప్రియః ॥ 12-15 ॥**

భావం: ఎవ్వరికీ బాధ కలిగించనివాడు, ఎవ్వరి వలనా బాధకు గురికానివాడు, హర్షము, ఈర్ష్య, భయము, ఉద్వేగములకు గురికానివాడు అయిన భక్తుడు నాకు అత్యంత ఇష్టుడు.

వివరణ:

## ఈర్ష్య/అసూయ చేతకానితనానికి చిహ్నాలు

విదురనీతిలో "ఇతరులను చూసి అసూయ పడేవాడు, తృప్తి లేనివాడు, ఎక్కువ కోపం కలవాడు, ఎప్పుడూ అన్నింటినీ శంకించేవాడు, ఇతరుల సొమ్ము పై ఆధారపడి బ్రతికేవాడు – ఎప్పుడూ దుఃఖాన్నే అనుభవిస్తారు" అని విదురుడు చెప్పాడు.

మరొకచోట "ఇతరుల సంపద, అందం, గౌరవం, పరాక్రమం, వంశగౌరవం, సుఖసౌఖ్యాలు చూసి అసూయపడేవాడి రోగం అంతులేనిది." అని విదురుడు చెప్పాడు.

సమర్థుడికి అసమర్థుడు అందజేసే అభినందనలు – ఈర్ష్య, అసూయ. అసూయ పడటం చేతకానితనానికి చిహ్నం. ఇతరులను చూసి మనం అసూయ పడుతున్నామంటే వారికన్నా మనం తక్కువని మనకి మనమే ఒప్పుకొని బాధపడుతున్నామని అర్థం.

✦ ✦ ✦

ఇతరుల ఆస్తిపాస్తులు, ఆనందాలు, పరిస్థితులు వంటివాటిని చూసి కుళ్లుకోవడమే అసూయ. అసూయాపరులు ఇతరులకున్న వాటిని చూసి అసూయపడి వాటిని లాక్కోవాలని ప్రయత్నిస్తారు.

నెపోలియన్ బోనాపార్టే, జూలియస్ సీజర్, అలెగ్జాండర్ ది గ్రేట్ – వీరు ముగ్గురూ ఎవరో ఒకరిమీద అసూయపడినవాళ్లే. వాళ్లకు అధికారం, ఘనత ఉన్నా మనసుల్ని విషపూరితం చేసే అసూయ వారి గుండెల్లో గూడు కట్టుకుంది. "నెపోలియన్‌కు సీజర్ అంటే అసూయ, సీజర్‌కు అలెగ్జాండర్ అంటే అసూయ. నాకు తెలిసి అలెగ్జాండర్‌కు అసలు ఎప్పుడూ జీవించని హెర్క్యులస్ అంటే అసూయ" అని బెర్ట్రాండ్ రస్సెల్ అనే ఇంగ్లీష్ తత్వవేత్త రాశాడు.

దీనిని బట్టి ఒక వ్యక్తికి ఎన్ని సిరిసంపదలు ఉన్నా, ఎన్ని మంచి లక్షణాలు ఉన్నా, జీవితంలో ఎంత రాణించినా అసూయ వుంటే ఎప్పుడూ దుఃఖాన్నే అనుభవిస్తాడని తెలుస్తోంది.



తీవ్రమైన అసూయ కొన్నిసార్లు ద్వేషానికి, అన్యాయానికి, హత్యకు కూడా దారి తీయగలదు. కాబట్టి అసూయ చేతుల్లో కీలుబొమ్మలు కాకుండా ఉండేందుకు, మనం ఇతరులను చూసి అసూయపడకుండా ఉండేందుకు ఒక చిన్న చిట్కాను తెలుసుకుందాము.

మీలో వున్న పరమాత్మే అందరిలోనూ వున్నాడనే భావనతో జీవిస్తే ఎవ్వరి మీదా అసూయ కలగదు. పిల్లలకి ఏది మంచిదో ఏది మంచిది కాదో పిల్లలకంటే తల్లిదండ్రులకే బాగా తెలుసు. అందుకే తల్లిదండ్రులు పిల్లలు అడిగినవన్నీ వాళ్లకి ఇవ్వరు. పిల్లలకి ఏవి మంచివో అవే వాళ్లకి ఇస్తారు. అలాగే మనకు ఏది మంచిదో ఏది మంచిది కాదో మనకంటే దేవుడికే బాగా తెలుసు. మనం కోరుకున్నది మనకి దక్కలేదంటే అది మనకి మంచిది కాదని దేవుడి నిర్ణయమని భావించి ఉన్న దానితో తృప్తిగా జీవించడం అలవాటు చేసుకుంటే ఎవ్వరి మీదా అసూయ కలగదు.

✦ ✦ ✦

ఇతరులను చూసి అసూయపడుతున్నామంటే మన అల్పత్వాన్ని అంగీకరిస్తూ బాధపడుతున్నామని అర్థం. అసూయ పుట్టేది ఇతరులపై నమ్మకం లేక కాదు, సాధించగలననే ఆత్మవిశ్వాసం లేకపోవడం వలన. స్వచ్ఛమైన పోటీ ఆరోగ్యకరమైనదైతే అసూయ, ద్వేషాలతో కూడిన పోటీ ప్రాణాలు తీసే రోగం లాంటిది. అసూయ వలన ఉపయోగం ఏమీ ఉండదని తెలియజేసే ఒక కథను గుర్తుచేసుకుందాము.

ఇక్ష్వాకువంశానికి చెందిన మరుత్తుడు తాను చేయబోయే యాగానికి ఆధ్వర్యం వహించమని దేవగురువైన బృహస్పతిని కోరాడు. ఆ యాగం చేస్తే మరుత్తుడు దేవతల కంటే ఎక్కువ మహిమలు పొందుతాడనే భయం వలన బృహస్పతి ఆధ్వర్యం వహించ

డానికి నిరాకరించాడు. మరుత్తుడు బృహస్పతి సోదరుడైన సంవర్తుడుని యాగం జరిపించమని కోరాడు. సంవర్తుడు ఒప్పుకున్నాడు.

తాను నిర్వహించవలసిన యాగం నిర్వహిస్తున్న సంవర్తుడి మీద బృహస్పతికి అసూయ కలిగింది. అసూయ మనసులో పెట్టుకోవడం వలన బృహస్పతి చిక్కిశల్యమైపోయాడు. ఇంద్రుడు బృహస్పతిని మీరెందుకిలా చిక్కిపోతున్నారని అడిగాడు. సంవర్తుడు గొప్ప యాగం చెయ్యబోతున్నాడని తెలిసి నాలో అసూయ మరియు ఈర్ష్య కలిగాయి. అందువలనే నేను చిక్కిపోతున్నానని బృహస్పతి చెప్పాడు.

సంవర్తుడు ఎంత గొప్ప యాగం చేసినా దేవగురువైన మీకు పోటీ కాడు. మీరు అనవసరంగా అసూయపడి ఆరోగ్యం పాడుజేసుకోవద్దని ఇంద్రుడు సలహా ఇచ్చాడు.

"నీ శత్రువు శక్తి సామర్థ్యాలు సమకూర్చుకొంటుంటే నువ్వు చూస్తూ ఊరుకుంటావా? నేను కూడా అంతే. ఎలాగైనా ఆ యాగాన్ని ఆపించు." అని బృహస్పతి ఇంద్రుడిని కోరాడు.

ఇంద్రుడు అగ్నిదేవుడిని పిలిచి యాగాన్ని ఆపమని ఆజ్ఞాపించాడు. అగ్నిదేవుడు మరుత్తుడి వద్దకు వెళ్లి "సంవర్తుడుని పంపించేయి. యాగాన్ని నిర్వహించడానికి నేను బృహ స్పతిని తీసుకువస్తాను" అని చెప్పాడు. ఆ మాటలు వినిన సంవర్తుడు "అనవసరంగా జోక్యం చేసుకోకు. నాకు కోపం వస్తే నాకంటి జ్వాలతో నిన్ను నాశనం చెయ్యగలను" అని అగ్నిదేవుడిని హెచ్చరించాడు.

ఆ హెచ్చరికతో అగ్నిదేవుడు భయపడి ఇంద్రుడి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. ఇంద్రుడు ఒక గంధర్వుడిని పిలిచి యాగాన్ని భగ్నం చేసి రమ్మని పంపించాడు. గంధర్వుడు మరుత్తుడి వద్దకు వెళ్లి "రాజా! నువ్వు సంవర్తుడుని పంపించివేయకపోతే ఇంద్రుడు నిన్ను శత్రువుగా భావించి నీమీద కక్ష సాధిస్తాడు" అని హెచ్చరించాడు. మరుత్తుడు "మిత్రద్రోహం మహాపాపం. నేను సంవర్తుడుని వదిలిపెట్టను" అని జవాబిచ్చాడు. "ఇంద్రుడు కోపంతో నీమీద వజ్రాయుధం ప్రయోగిస్తే నిన్నెవరు కాపాడగలరు?" అని గంధర్వుడు మరింతగా హెచ్చరించాడు.

అంతలో మేఘాలు పెద్దగా శబ్దం చేసాయి. ఇంద్రుడు వజ్రాయుధం ప్రయోగించాడు. మరుత్తుడు సంవర్తుడుని శరణువేడాడు. సంవర్తుడు తన తపశ్శక్తితో వజ్రాయుధాన్ని నిలువరించాడు. ఇంద్రుడు తన తప్పు తెలుసుకొని శాంతించాడు. యాగానికి హాజరై హవిస్సులను స్వీకరించాడు.

ఆవిధంగా అసూయ వలన బృహస్పతికి ఏమీ ఒరగలేదు.

✦ ✦ ✦

కాబట్టి అసూయ లేనివాడు, మంచి పనులు చేసేవాడు గొప్ప సుఖాలను పొందుతాడు, అందరికీ ఇష్టుడవుతాడని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦




-మొండెపు
ప్రసాద్


62

# యువతకు భగవద్గీత చూపించిన దారి




శ్లోకం: తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సన్తుష్టో యేన కేనచిత్।
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నరః
॥ 12-19 ॥

భావం: నిందాస్తుతులను సమానంగా భావించేవాడు, ప్రాప్తించిన దానితో తృప్తిపడే వాడు, స్థిరమైనబుద్ధి కలవాడు అయిన భక్తుడు నాకు ఇష్టుడు.

వివరణ: సగటు మనుషులు తమ శక్తికి మించిన విషయాలన్నింటినీ సాధారణంగా విమర్శిస్తారు. అలాగే కొత్త ఆలోచనలను, కొత్త అభిప్రాయాలను ఎప్పుడూ అనుమానిస్తారు, విమర్శిస్తారు, వ్యతిరేకిస్తారు. అలా విమర్శించ డానికి ప్రత్యేకమైన కారణం ఏదీ ఉండదు. ఆ ఆలోచనలు, అభిప్రాయాలు అంతకు ముందు ప్రచారంలో లేవు కాబట్టి అనుమానిస్తారు, విమర్శిస్తారు.

ఐన్ స్టీన్ తన సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రచు రించినప్పుడు తోటి శాస్త్రజ్ఞులు కొందరు దానిని తెలివితక్కువ సిద్ధాంతంగా కొట్టి పారేశారు.

## ప్రశంసలను విమర్శలను సమానంగా తీసుకోవాలి



"వాళ్ళు మౌనంగా ఉన్నవాళ్ళని విమర్శి స్తారు. మాట్లాడేవారిని విమర్శిస్తారు. మిత భాషులను కూడా విమర్శిస్తారు. ఈ ప్రపంచంలో విమర్శకు గురికానివారు ఎవ్వరూ లేరు." అన్నాడు గౌతమ బుద్ధుడు

ఎవరైనా సమర్ధతతో విజయవంతంగా పనిచేస్తున్నప్పుడు వారిని విమర్శించడం కొంద రికి ఆనందం కలిగిస్తుంది. మేధావులుగా, తెలి వైనవారుగా పేరుబడ్డ కొందరు ఇతరులు చేసిన గొప్ప పనులను మెచ్చుకోవడం తమ అస మర్ధతను అంగీకరించడంగా భావిస్తారు. అందు వలన మంచి పనులను కూడా విమర్శిస్తారు.

"నా రచనలపై వచ్చిన విమర్శలను నేను చదవను. ఎందుకంటే విమర్శ అనేది ప్రజల

కోసం రాసింది. ప్రజల కోసం రాసింది నేనెం దుకు చదవాలి? ఇతరులకు వచ్చిన ఉత్తరాలను నేను చదువుతానా?" అన్నాడు ప్రముఖ రచయిత మేరియా రైక్.


ఎక్కువమంది తమకు అన్యాయం చేసే పొగడ్తలకు ప్రాధాన్యం ఇస్తారు గాని తమకు ఉపయోగపడే విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వరు. అందుకే గాంధీజీ "నా జీవితమంతా నేను లాభం పొందింది నన్ను విమర్శించేవాళ్ళ నుంచే గాని నన్ను అభిమానించేవాళ్ళ నుంచి కాదు. మరీ ముఖ్యంగా మృదువుగా, సాత్వికమైన భాషలో ఉన్న విమర్శల ద్వారా లాభం పొందాను." అన్నారు.

కాబట్టి మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే ఆ విమర్శ నిజం, నిర్మాణాత్మకం అయితే దానిని అంగీకరించి మీలోని లోటుపాట్లను సరిదిద్దు కొని ముందుకుసాగండి. కాని ఆ విమర్శ కేవలం విమర్శించడం కోసం మాత్రమే చేసి నదైతే దానిని పట్టించుకోకుండా మీ పనిని కొనసాగించండి. మీరు చేసినది మంచిపని అని మీరు నమ్మితే విమర్శల గురించి పట్టించుకో కండి.

విమర్శల వలన చనిపోయినవారు లేరు. పొగడ్తల వలన బ్రతికినవారు లేరు. విమర్శలను తిరిగి విమర్శలతో తిప్పికొట్టడం ద్వారా మీరు విమర్శకుల నోళ్ళు మూయించలేరు. మీ విమర్శకులని మీ స్నేహితులుగా చూడండి. మీరు వారిని గౌరవంతో చూస్తారన్న విషయం వారికి తెలిసినప్పుడు వారి విమర్శల పదును తగ్గి పోతుంది. ఈ విషయం తెలియజేసే ఒక కథ చదువుదాము.



ఒక పండితుడు ప్రవచనం చెప్పడానికి ప్రక్క ఊరు వెళ్తున్నాడు. దారిలో ప్రవచనాల మీద సదభిప్రాయంలేని ఒక వ్యక్తి అతడ్ని దూషిస్తూ, పరిహసిస్తూ అతని వెనుకే నడవ సాగాడు. పండితుడు ఏమాత్రం చలించ కుండా శాంతంగా నడవసాగాడు. కొంత సేపటికి ప్రవచనం చెప్పవలసిన ఊరు చేరాడు. గ్రామస్థులు ఎదురొచ్చి పండితుడిని సాదరంగా ఆహ్వానించారు. పండితుడు వారికి తనను దూషిస్తూ వచ్చిన వ్యక్తిని చూపించి "నాతో పాటు వచ్చిన ఇతను చాలా అలసిపోయాడు. ఇతనికి చల్లటి మజ్జిగ ఇవ్వండి." అని చెప్పాడు. ఆ వ్యక్తి "నేను మిమ్మల్ని ఎన్నో రకాలుగా దూషించాను. కాని మీరు నామీద ఇంత దయ చూపిస్తు న్నారు. ఇది ఎలా సాధ్యం?" అని పండి తుడిని అడిగాడు.



పండితుడు "నువ్వు దూషించినది నా దేహమునా? నాలోని ఆత్మనా?" అని అడి గాడు.

అతడు సమాధానం చెప్పలేదు.

పండితుడు చిరునవ్వుతో "నీలో, నాలో, అందరిలో ఆత్మస్వరూపంగా ఉన్న దేవుడు ఒక్కడే. కాబట్టి నువ్వు నాలోని ఆత్మను దూషించివుంటే నిన్ను నువ్వే దూషించుకున్నట్లు. నా దృష్టిలో నేను అంటే ఈ దేహం కాదు, ఈ శరీరంలోని ఆత్మను నేను. కాబట్టి నువ్వు నా దేహాన్ని దూషించివుంటే అవి నన్ను తాకవు." అని వివరించాడు.

✦ ✦ ✦

ఎక్కువమంది విమర్శిస్తారు, కొద్దిమంది ప్రశంసిస్తారు, బహుకొద్దిమంది ప్రోత్సహిస్తారు. మనం చాలా గొప్పపని చేసామని భావించి గొప్ప ప్రశంసలు వస్తాయని ఆశించినప్పుడు విమర్శలు ఎదురైతే బాధనిపిస్తుంది. కాని మనం ప్రశంసలు ఆశించకపోతే విమర్శలు వచ్చినా బాధపడము. కాబట్టి ఎంత గొప్పపని చేసినా ప్రశంసలు ఆశించకండి. అలాగని ఎవ్వరూ విమర్శించలేనంత గొప్పగా చేయగలిగేవరకు ఆగుదామని అందరూ భావిస్తే ప్రపంచంలో ఏ ఆవిష్కరణా జరిగి వుండేది కాదు. కాబట్టి విమర్శలు వస్తాయని భయపడి పనులు మొదలుపెట్టడం ఆపకండి.

విషయం పూర్తిగానూ, ఖచ్చితంగానూ తెలిసేంతవరకు ఎవ్వరినీ విమర్శించకూడదు, ఎవ్వరి గురించి చెడుగా మాట్లాడకూడదు. పూర్తిగానూ, ఖచ్చితంగానూ తెలిసిన తర్వాత కూడా అసలీ విషయం గురించి చెప్పడం అవసరమా? అని ప్రశ్నించుకోవాలి. ప్రతీ విషయాన్నీ విమర్శించే వారికి ప్రతీ విషయాన్ని నెగటివ్ కోణంలో చూడటం అలవాటై దేనివలనా వారికి సంతోషం కలగదు. చివరికి వారి వలన వారికి కూడా ఆనందం కలగదు.

మీ శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచుకోడానికి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తే, ఇతరులను విమర్శించడానికి, ఇతరుల విమర్శలను పట్టించుకోడానికి సమయం ఉండదు.

ప్రశంసలను, విమర్శలను సమానంగా చూడాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

63

# యువతకు భగవద్గీత చూపించిన దారి



### (1) జ్ఞానం సంపాదించటానికి కావలిసిన లక్షణాలు:

శ్లోకం: ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః।
ఏతత్క్షేత్రం సమాసేన సవికారముదా హృతమ్ ౹౹ 13-7 ౹౹
అమానిత్వమదమ్భిత్వమహింసా క్షాన్తిరార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ౹౹ 13-8 ౹౹

అహింస మరియు క్షమాగుణం కలిగివుండటం, మనో వాక్కులయందు సరళత్వం, భక్తిశ్రద్ధలతో గురు వులను సేవించడం, స్థిరమైన మనసు, మనసు మరియు ఇంద్రియాల నిగ్రహం,

ప్రాపంచిక సుఖములయందు ఆసక్తి లేకపోవడం, అహంకారం లేకపోవడం, జన్మ, మృత్యు, జరా (ముసలితనం) మరియు రోగాదులయందు దుఃఖదోషములను దర్శించుట

భార్య, పిల్లలు, ఇల్లు, సంపదలు వాటియందు ఆసక్తి లేకపోవడం, ఇష్టమైనవి ప్రాప్తించినా అయిష్టమైనవి ప్రాప్తించినా సమభావంతో

## క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

ఇన్ద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ।
జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్౹౹ 13-9 ౹౹
అసక్తిరనభిష్వఙ్గః పుత్రదారగృహాదిషు।
నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు౹౹ 13-10 ౹౹
మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ।
వివిక్తదేశసేవిత్వమరతిర్జనసంసది౹౹ 13-11 ౹౹


భావం: తానే గొప్పవాడిననే గర్వం లేక పోవడం, దాంబికం లేకపోవడం, ఉండటం

పరమాత్మనైన నాయందు దృఢమైన, నిశ్చలమైన భక్తిని కలిగియుండటం, ఏకాంతమైన పవిత్ర ప్రదేశంలో నివశించుట, విషయాసక్తులైన మనుష్యుల పట్ల ఆసక్తి లేకపోవడం

ఆధ్యాత్మికజ్ఞానము నందు నిత్యస్థితుడై ఉండుట, తత్వజ్ఞానమునకు ప్రతిపాద్యుడు భగవంతుడే అని తెలుసుకొనుట – ఇవన్నీ జ్ఞాన ప్రాప్తికి సాధనాలు.

### వివరణ

మహాభారతములోని ఆదిపర్వములోని కచుడు శుక్రాచార్యుని వద్ద మృతసంజీవనీ విద్య నేర్చుకున్న వృత్తాంతం చదివితే విద్య నేర్చుకోడానికి ఉత్తమ విద్యార్థి ఎటువంటి లక్షణాలు



కలిగివుండాలో తెలుస్తుంది. ఆ వృత్తాంతాన్ని ఒకసారి గుర్తుచేసుకుందాము.

ఇది క్షీరసాగర మథనానికి ముందు అంటే దేవతలకు అమృతం లభించకముందు జరిగిన కథ. ముల్లోకాల ఆధిపత్యం కోసం దేవదానవుల మధ్య తరచుగా యుద్ధాలు జరుగుతుండేవి. దానవుల గురువైన శుక్రాచార్యుడు యుద్ధంలో చనిపోయిన రాక్షసులను మృతసంజీవని విద్యతో మళ్ళీ బ్రతికించేవాడు. దేవతల గురువైన బృహస్పతికి మృతసంజీవని విద్య తెలియదు. దేవతలందరూ కలిసి బృహస్పతి పెద్ద కుమారుడైన కచుని వద్దకు వెళ్లి శుక్రాచార్యుడి వద్దకు వెళ్లి మృతసంజీవని విద్యను అభ్యసించి రమ్మని కోరారు.

కచుడు శుక్రాచార్యుని వద్దకు వెళ్ళి సాష్టాంగ ప్రణామము చేసి తాను దేవతల గురువైన బృహస్పతి కొడుకునని తనను శిష్యుడిగా స్వీకరించమని కోరాడు.

కచుని వినయానికి సంతోషించి శుక్రుడు "నాయనా! వినయవిధేయతలే విద్యార్జనకు ప్రథమ సోపానాలు. నీవంటి అర్హుడిని శిష్యుడిగా స్వీకరించడం నాకు ఆనందదాయకము" అని ఆశీర్వదించి కచుడిని తన శిష్య బృందములో చేర్చుకొన్నాడు.

కచుడు సూర్యోదయానికి ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానాది క్రియలు నిర్వహించి భక్తిశ్రద్ధలతోగురువును సేవిస్తూ, బ్రహ్మచర్య నిష్ఠను అవలంభిస్తూ, గురుపుత్రిక దేవయానిని నృత్యగీతాలతో ఆనందింపజేస్తూ విద్యనేర్చుకునేవాడు. అపురూపమైన సౌందర్యవతి అయిన దేవయాని కచునిపై మనసుపడింది. కాని కఠోర బ్రహ్మచర్యవ్రతుడైన కచుడు ఆమెను సోదరిగా భావించేవాడు. కచుని వినయం, సంస్కారం, విద్య నేర్చుకోవాలనే కుతూహలం అతనిని శుక్రాచార్యునికి ప్రియ శిష్యునిగా చేసాయి.

కచుడు బృహస్పతి కొడుకని తెలిసిన ఇతర రాక్షస శిష్యులు అడివిలో ఒంటరిగా ఉన్న కచుడిని చంపి, శరీరాన్ని ముక్కలుగా చేసి కుక్కలకు ఆహారంగా వేశారు. సాయంకాలం వరకు కచుడు రాకపోవడంతో దేవయాని దివ్యదృష్టితో కచుడి జాడ తెలుసు

# ఎడారిలో జలపాతం

సహరి ఒక అద్భుతం, నేత్రపర్వం, అందరి అభిమాన తెలుగువారి పుత్రిక! వార పత్రిక! హస్తభూషణం ఆ నాటి నానుడి మారి నేడు కన్నుల కలల విహారి!! శతసంచిక అంటే మాటలే కాదు ఎందరి అభిలాష, కరోనా పిడుగు అయినా తేరుకుని వారం వారం అలరిస్తున్న ఎడారిలో జలపాతం! నిజం సార్ ఇది ఎలాసాధ్యం మీకు తప్ప !!

శత సహస్రాలుగా సహరి అలరించాలని మీ అభిమాని, రచయిత



**-రావులపాటి వెంకటరామారావు**

**హైదరాబాదు**

కోమని తండ్రిని కోరింది. శుక్రాచార్యుడు దివ్యదృష్టితో జరిగిన విషయం తెలుసుకొని మృతసంజీవని విద్యతో కచుడిని బ్రతికించాడు.

మరొకనాడు దేవయాని కోసం పూలు తీసుకురాడానికి అడవికి వెళ్ళిన కచుడిని రాక్షస శిష్యులు ముద్దగా చేసి సముద్రంలో కలిపి వేశారు. దేవయాని కోరికపై శుక్రాచార్యుడు కచుడిని మళ్ళీ బ్రతికించాడు.

మరొకనాడు రాక్షస శిష్యులు కచుడిని చంపి కాల్చి బూడిద చేసి, ఆ బూడిదను మద్యంలో కలిపి శుక్రాచార్యుడికి ఇచ్చారు. విషయం తెలియని శుక్రాచార్యుడు ఆ మద్యాన్ని త్రాగాడు. మళ్ళీ దేవయాని కోరికపై శుక్రాచార్యుడు జరిగిన విషయం తెలుసుకుని తన పొట్టలో ఉన్న కచుడికి మృతసంజీవని విద్య ఉపదేశించాడు. కచుడు గురువు పొట్ట చీల్చుకుని బయటకు వచ్చి, గురువు నేర్పిన మృతసంజీవని విద్యతో గురువును తిరిగి బ్రతికించాడు.

విద్యాభ్యాసం పూర్తిచేసుకొని, గురువు అనుజ్ఞతో ఇంటికి వెళ్ళబోతున్న కచునితో దేవయాని తనను వివాహం చేసుకోమని కోరింది. గురుపుత్రిక సోదరితో సమానం, వివాహం చేసుకోవడం ధర్మం కాదని కచుడు నిరాకరించాడు. దేవయాని కోపంతో "నువ్వు నేర్చుకున్న మృతసంజీవని విద్య నీకు ఉపయోగపడదు" అని శపించింది.

కచుడు "నేర్చుకున్న విద్య ఎప్పుడూ నిరుపయోగం కాదు. నేను నేర్పినవారికి ఉపయోగపడుతుంది, ప్రయోజనం నెరవేరుతుంది." అని చెప్పి వెళ్ళిపోయాడు.

✦ ✦ ✦

తన వినయవిధేయతలతో, భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో కచుడు శత్రుపక్షం వారి గురువుని సైతం మెప్పించి మృతసంజీవని విద్య నేర్చుకున్నాడు. కాబట్టి విద్య / జ్ఞానం నేర్చుకోడానికి వినయవిధేయతలు, నేర్చుకోవాలనే ఉత్సాహం, క్రమశిక్షణ, గురువు పట్ల పూర్తి విశ్వాసం, భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలని భగద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండేపు ప్రసాద్

64

# యువతకు భగవద్గీత చూపించిన దారి



(1) మట్టి, బంగారములను సమానంగా చూసేవాడు నిజమైన జ్ఞాని:

**శ్లోకం: సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాఞ్చనః ।**


**తుల్యప్రియాప్రియో ధీరస్తుల్యనిన్దాత్మసంస్తుతిః ॥ 14-24 ॥**

భావం: సుఖదుఃఖాలను సమానంగా భావించేవాడు, మట్టి, రాయి, బంగారములను సమానంగా భావించేవాడు, ప్రియాప్రియములను సమానంగా చూసేవాడు, నిందాస్తుతులను సమానంగా భావించేవాడు నిజమైన జ్ఞాని.

వివరణ: నిజమైన జ్ఞాని సుఖదుఃఖాలను, మట్టి బంగారములను, నిందాస్తుతులను సమానంగా భావిస్తాడు. ఐహికసుఖాల మీద వైరాగ్యం పెంచుకున్న వారు మట్టి మరియు బంగారాలను ఒకేలా చూస్తారని తెలియజేసే ఒక కథ చదువుదాము.

భార్యాభర్తలు ఐహికసుఖాలమీద వైరాగ్యం పెంచుకొని తీర్థయాత్రలకు బయల్దేరారు. కొండమీద ఉన్న ఆలయానికి కాలిబాటలో

## గుణత్రయ విభాగ యోగము




వెళ్తున్నారు. ముందు భర్త నడుస్తున్నాడు. వెనుక భార్య నడుస్తోంది.

ముందుగా నడుస్తున్న భర్తకు నేలమీద ఒక వజ్రం మెరుస్తూ కనబడింది. తన భార్య వజ్రాన్ని చూస్తే కావాలని ఆశపడుతుందేమో అనుకొని ఆ వజ్రాన్ని కాలితో గట్టిగా మట్టిలోకి తొక్కేసాడు. భర్త వజ్రాన్ని మట్టిలోకి తొక్కేయడం గమనించిన భార్య "మీరింకా మట్టిని, మాణిక్యాన్ని వేరువేరుగా చూస్తున్నారు." అంది

భర్తకు తన లోపం తెలిసివచ్చింది.

✦ ✦ ✦

సుఖదుఃఖాలను, మట్టి బంగారములను, నిందాస్తుతులను సమానంగా భావించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.



-మొండెపు ప్రసాద్

65

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## తన – పర భేదాలు లేకుండా కర్తవ్యనిర్వహణ

**శ్లోకం: మానాపమానయోస్తుల్యస్తుల్యో మిత్రారిపక్షయోః ।**

**సర్వారమ్భపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥ 14-25 ॥**

భావం: మానావమానములయందు, మిత్రులయందు, శత్రువులయందు సమ భావంతో ప్రవర్తించేవాడు, తన, పర భేదాలు లేకుండా కర్తవ్యాలను నిర్వర్తించేవాడు త్రిగుణాతీతుడు

### వివరణ

కర్తవ్యాన్ని నిర్వర్తించేడప్పుడు తన – పర బేధాలు చూడకూడదు. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ చదువుదాము.

రామయ్య తన ఎద్దులతో పాటూ గ్రామాధికారి ఎద్దులను కూడా మేతకు ఊరికి చివర ఉన్న కొండవద్దకు తీసు కెళ్ళేవాడు. అలా తీసుకెళ్ళిన ఒకరోజు రామయ్య ఎద్దు గ్రామాధికారి ఎద్దు ఒకదానినొకటి డీకొని పోట్లాడుకున్నాయి. ఆ పోట్లాటలో రామయ్య ఎద్దు గ్రామాధి కారి ఎద్దును పొడిచి చంపేసింది. గ్రామాధి కారి ఎటువంటి శిక్ష విధిస్తాడో అని భయపడుతూ గ్రామాధికారి ఇంటికి వెళ్ళి చేతులు కట్టుకొని "అయ్యా! కొండవద్ద మీ ఎద్దు నా ఎద్దు ఒకదానినొకటి డీకొని పోట్లాడు కున్నాయి. ఆ పోట్లాటలో మీ ఎద్దు నా ఎద్దును పొడిచి చంపేసిందయ్యా" అని ఏడుస్తూ చెప్పాడు.

గ్రామాధికారి "బుద్ధీ, జ్ఞానం ఉన్న మను ష్యులే అర్థంలేని ఆవేశంతో ఒకరినొకరు కొట్టు కుంటున్నారు, చంపుకుంటున్నారు. పశువులు పోట్లాడుకుని చంపుకోవడంలో ఆశ్చర్య మేముంది? దాని ఆయుష్షు తీరింది చని పోయింది. బాధపడకు. వెళ్ళిరా" అన్నాడు.

తాను జరిగిన విషయం తప్పుగా చెప్పానని తెలుసుకున్న రామయ్య "అయ్యా! నేను కంగా రులో జరిగిన విషయం తిరగేసి చెప్పాను. నా ఎద్దు మీ ఎద్దును చంపిందయ్యా" అని విన



యంగా చెప్పాడు.

వెంటనే గ్రామాధికారి మండిపడుతూ "జ్ఞానంలేని పశువులు పోట్లాడుకుంటుంటే నువ్వు వాటిని విడదీసే ప్రయత్నం చెయ్యకుండా చోద్యం చూస్తూ నిలబడ్డావా? ఇది క్షమించరాని తప్పు. నీ నిర్లక్ష్యం వలనే నా ఎద్దు చని పోయింది. కాబట్టి నాకు నష్టపరిహారంగా ఐదువేలు చెల్లించు. ఎద్దు ప్రాణం నీ వలన పోయింది కాబట్టి నీకు పది కొరడా దెబ్బలు శిక్ష విధిస్తున్నాను." అని చెప్పాడు.

నేను, నాది, నావాళ్ళు అనే భావన మనిషి వివేకాన్ని, ఆలోచనను చంపేస్తుంది, స్వార్థాన్ని పెంచుతుంది.

ఫలితంగా నిజాయితీగా నిస్వా ర్థంగా నిర్ణయాలు తీసుకోవలసిన వాళ్ళు తనకు, తనవాళ్ళకు ప్రయోజనం కలిగించే అనైతిక నిర్ణయాలు తీసుకుంటారు. అందు వలనే తన – పర భేదాలు లేకుండా కర్తవ్యాలను నిర్వర్తించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

66

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## పురుషోత్తమ యోగము

### (1) పర్యావరణానికి హాని కలిగించకుండా జీవించడం:

శ్లోకం: సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతిర్జ్ఞానమపోహనశ్చ
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్॥
15-15 ॥

భావము: సమస్త ప్రాణుల హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడను నేనే. స్మృతి, జ్ఞానము మరియు సంశయనివారణము నా వలనే కలుగుచున్నాయి. వేదముల ద్వారా తెలుసుకోదగిన వాడను నేనే. వేదాంత కర్తను, వేదజ్ఞుడను కూడా నేనే.

వివరణ: నిజమైన భక్తికి గీటురాయి వేదాలు, పురాణాలు మరియు ఆధ్యాత్మిక గ్రంధాలు చదవటం / తెలియడం కాదు. మనలోని దైవత్వాన్ని అనుభవిస్తూ అందరిలోనూ ఉన్న దైవత్వాన్ని అనుభూతి చెందడం.

శ్రీహరి ఎక్కడున్నాడని హిరణ్యకశిపుడు అడిగినప్పుడు ప్రహ్లాదుడు

"ఇందుగలడందులేడని
సందేహము వలదు చక్రి సర్వోప గతుం
డెందెందు వెదకి జూచిన
అందందే గలడు దానవాగ్రణి వింటె" - అని చెప్పాడు.

కాబట్టి అన్ని ప్రాణులలో, విశ్వమంతా భగవంతుడు వ్యాపించి ఉన్నాడు. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ చదువుదాము.

తమిళనాడులో తిరుప్పండార్ అనే గొప్ప శివభక్తుడు ఒకనాటి రాత్రి శివాలయానికి వెళ్లి ఆలయంలోనే నిద్రపోయాడు. మరునాటి ఉదయం గుడి పూజారి వచ్చి తిరుప్పండార్ కాళ్ళు శివలింగం వైపు పెట్టుకొని నిద్రపోవడం చూసి అతని కాళ్ళను ప్రక్కకి త్రిప్పడానికి ప్రయత్నించాడు. కాని త్రిప్పలేకపోయాడు.

తిరుప్పండార్ కళ్ళు తెరిచి "నాయనా! నువ్వెవరు? నా కాలు ఎందుకు లాగుతున్నావు?" అని అడిగాడు.

పూజారి కోపంగా "దుర్మార్గుడా! నువ్వు శివలింగం వైపు కాళ్ళు పెట్టి పాపం చేసావు. తక్షణం పైకి లే" అని అరిచాడు.

తిరుప్పండార్ శాంతంగా "నాయనా! నాకు పైకి లేచే శక్తి లేదు. నువ్వే కాస్త నా కాళ్ళను భగవంతుడు లేనివైపు పెట్టు." అన్నాడు

పూజారి తిరుప్పండార్ కాళ్ళను కుడివైపుకు త్రిప్పి పెట్టాడు. వెంటనే అక్కడ ఒక శివలింగం వెలసింది. పూజారి ఆశ్చర్యంతో తిరుప్పండార్ కాళ్ళను ఎడమవైపు త్రిప్పి పెట్టాడు. అక్కడ కూడా ఒక శివలింగం వెలసింది. పూజారి

తిరుప్పండార్ కాళ్ళను ఎక్కడ పెడితే అక్కడ ఒక శివలింగం పుట్టుకొచ్చింది. పూజారికి ఏమి చెయ్యాలో తోచలేదు.

తిరుప్పండార్ పైకి లేచి పూజారితో "నాయనా! భగవంతుడు సర్వాంతర్యామి. ఆయనను ఒక ప్రదేశమునకో, ఒక దిక్కుకో, ఒక విగ్రహానికో పరిమితం చెయ్యకూడదు." అని బోధించాడు.

పూజారి తిరుప్పండార్ కు నమస్కారం చేసి క్షమించమని అడిగాడు.

✦ ✦ ✦

అన్ని ప్రాణులలో భగవంతుడు ఉన్నాడని తెలియజేసే మరో కథ చదువుదాము.

కాశీతీర్థమును రామేశ్వరం వద్ద సముద్రంలో కలపడం ఒక ప్రాచీన భారతీయ సాంప్రదాయం. ఏకనాథుడు తన శిష్యులతో కాశీ విశ్వేశ్వరుని దర్శించి బిందెలలో కాశీతీర్థము నింపుకొని రామేశ్వరం ప్రయాణం చేస్తున్నారు. దారిలో ఒక గాడిద నేలమీద పడి నోరు తెరచుకొని గిల గిలా కొట్టుకుంటూ కనబడింది. ఏకనాథుడు తనవద్ద ఉన్న బిందెలోని కాశీతీర్థాన్ని గాడిద నోటిలో పోశాడు. కొంతసేపటి తర్వాత గాడిద లేచి వెళ్ళిపోయింది.

శిష్యులు ఏకనాథుడితో "స్వామీ! రామేశ్వరంలో రామలింగస్వామికి అర్పించవలసిన పవిత్ర కాశీతీర్థాన్ని గాడిద నోట్లో ఎందుకు పోశారు?" అని అడిగారు.

ఏకనాథుడు "భగవంతుడు అన్ని జీవులలోనూ ఉంటాడని చదువుకున్నారు కదా! మీ దృష్టికి అది గాడిదలా కనిపించింది. నాకు ఆ జీవిలో రామలింగస్వామి కనిపించి దాహం తీర్చమని కోరారు." అని చెప్పాడు.

✦ ✦ ✦



మనలో ఆత్మస్వరూపంలో దేవుడున్నాడని తెలుసుకోవడం వలన దేవుడి గొప్పతనానికి తగని పనులు, చెడ్డపనులు చేయకుండా ధర్మబద్ధంగా జీవించగలుగుతాము.

కుటుంబసభ్యులలో, స్నేహితులలో, బంధువులలో, సమాజంలోని మనుష్యులందరిలో ఆత్మస్వరూపంలో దేవుడున్నాడనే భావనతో మెలగడం వలన ఎవ్వరినీ ద్వేషించకుండా అందరితో కలసిమెలసి ఆప్యాయతతో అనురాగంతో జీవించగలుగుతాము.

అలాగే చెట్లలో, జంతువులలో సమస్త జీవరాశిలో భగవంతుడు ఉన్నాడనే భావనతో జీవించడం వలన ప్రకృతికి, పర్యావరణానికి హాని కలిగించకుండా జీవించగలుగుతాము.

కాబట్టి మనలోని దైవత్వాన్ని అనుభవిస్తూ ప్రాణులన్నింటిలో ఆత్మస్వరూపంలో దేవుడు ఉన్నాడనే భావనతో జీవించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦

67

# యువతకు భగవద్గీత చూపించిన దారి



-మొండెపు ప్రసాద్



## దైవాసుర సంపద్విభాగ యోగము

### (1) మంచిగుణాలు:

శ్లోకం: శ్రీభగవానువాచ

అభయం సత్త్వసంశు
ద్ధిర్జ్ఞానయోగవ్యవస్థితిః।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప
ఆర్జవమ్ ॥ 16-1 ॥

అహింసా సత్యమక్రోధస్త్యాగః శాన్తిరపైశు
నమ్।
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం
హ్రీరచాపలమ్ ॥ 16-2 ॥

తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో
నాతిమానితా ।
భవన్తి సమ్పదం దైవీమభిజాతస్య భారత
॥ 16-3 ॥

భావం: నిర్భయత్వము,అంతఃకరణ శుద్ధి, ధ్యానయోగమునందు నిరంతర ధృఢస్థితి, ఇంద్రియనిగ్రహము, భగవంతుడిని పూజించుట, భగవంతుని గుణ కీర్తనలు చేయుట, స్వధర్మమును ఆచరించుటలోని కష్టములను ఓర్చుకొనుట, మరియు శరీరేంద్రియఅంతఃకరణముల సరళత్వము

అహింస, సత్యము, కోపము లేకపోవడం, త్యాగము, శాంతము, ఎవ్వరినీ నిందించకపోవడం, ప్రాపంచిన విషయాలపట్ల ఆసక్తి లేకపోవడం, చెడ్డపనులు చేయకపోవడం

తేజస్సు, క్షమ, ధైర్యమి, శౌచము, ఎవ్వరి పట్లా శత్రుభావం లేకపోవడం, తాను గొప్ప వాడిననే గర్వం లేకపోవడం - ఇవన్నీ దైవీ సంబంధమైన మంచిగుణాలు.

**వివరణ:** మనిషిని దైవత్వానికి దగ్గరగా తీసుకువెళ్ళేవి ఆవ్యక్తిలోని నిజాయితీ, సత్యం, శాంతము, దయ, సహనం, క్షమ వంటి మంచిగుణాలే. అందుకే వాటిని దైవసంబంధ గుణాలు అంటారు.

### నిజాయితీ

కొంతమంది అవినీతిపరులు తమ ప్రతీ అవినీతి సంపాదనలో నుండి కొంత భాగం అంటే ఐదు శాతమో పది శాతమో దేవుడి హుండీలలో వేస్తుంటారు. దేవుడిని లంచాలు తీసుకొనే ఉద్యోగస్తుల నుండి వాటాలు తీసుకొని వాళ్ళని కాపాడే ప్రమాదకర బాసులతో సమానంగా భావించి తాము సంపాదించే అవినీతి సొమ్ములో కొంత వాటాని దేవుడి హుండీలో వేస్తే దేవుడు తమ అవినీతిని పనులని చూసీచూడనట్లు ఊరుకుంటాడని భావించేవాళ్లకి దేవుడి మీద సదభిప్రాయం




వుందని ఎలా అనుకోగలం?

దేవుడు సర్వాంతర్యామి అని నమ్మే మనుషులు ఇతర వ్యక్తులకు తెలియకుండా, దొరకకుండా తప్పు పనులు, అవినీతి పనులు చెయ్యగలరేమో గాని, ఆ తప్పులను, అవినీతి పనులను దేవుడు గమనించడంలేదని ఎలా భావిస్తారు? దేవుడిని నమ్మే వ్యక్తులు తప్పులు, అవినీతి పనులు చెయ్యలేరని తెలియజేసే ఒక కథ చదువుదాము.

ప్రభుత్వ కార్యాలయం బిల్డింగు నిర్మించడానికి టెండర్ వేసిన ఒక కాంట్రాక్టర్ "ఈ పది లక్షల రూపాయిలు తీసుకొని కాంట్రాక్ట్ నాకే ఇవ్వండి" అని సంబంధిత అధికారిని అడిగాడు.

"టెండర్లను పరిశీలించి ఎవరు అత్యంత తక్కువ విలువ కోట్ (quote) చేస్తే వారికే టెండర్ ఖరారు చేస్తాము" చెప్పాడా అధికారి.

"ఈ పది లక్షలు తీసుకొని, తక్కువ విలువ కోట్ చేసిన టెండర్లో క్వాలిటీ బాగోలేదని రాసి నాకు టెండర్ ఇవ్వచ్చు. రూల్ ప్రకారం అది తప్పు కాదు. ఈ విషయం ఎవ్వరికీ తెలియదు." కాంట్రాక్టర్ నమ్మకంగా చెప్పాడు.

"కాని ముగ్గురికి మాత్రం తప్పకుండా తెలుస్తుంది. వారిలో ఇద్దరు సిగ్గుతో చస్తారు"

"ఎవరా ఇద్దరు?"

"నువ్వూ, నేను. డబ్బు మీద వ్యామోహంతో ఇప్పుడు చేసే తప్పుకి జీవిత చరమాంకంలో క్షోభను అనుభవించి సిగ్గుతో చస్తాము."

"మూడో వ్యక్తి ఎవరు?"

"దేవుడు. ఆయన మనం చేసిన తప్పుకి తగిన శిక్ష తప్పక విధిస్తాడు." వివరించాడు.

గాయత్రి కథ చెప్పడం ముగించింది. ✦



-మొండెపు ప్రసాద్

68

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## సత్యం

సత్యమే విజయం సాధిస్తుందని తెలియజేసే ఒక కథ చదువుదాము.

ఒక దొంగ అనుకోకుండా స్వామీజీ చెప్పిన భగవద్గీత ప్రవచనం విన్నాడు. స్వామీజీ వద్దకు వెళ్లి తనను శిష్యుడిగా స్వీకరించమని అడిగాడు. దొంగతనాలు మానేస్తే శిష్యుడిగా చేర్చుకుంటానని స్వామీజీ చెప్పారు.

"స్వామీ! దొంగతనం చెయ్యడం నా వృత్తి. నేను చదువుకోలేదు. నాకు మరో పని రాదు. దొంగతనాలు మానేస్తే నా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి?" దొంగ అడిగాడు.

స్వామీజీ పది సెకనులు ఆలోచించి "ఈరోజు నుండి ఎలాంటి పరిస్థితిలోనైనా సత్యమే పలుకుతానని ప్రతిజ్ఞ చేస్తే నిన్ను శిష్యుడిగా స్వీకరిస్తాను" అన్నారు.

దొంగ ఆవిధంగా ప్రతిజ్ఞ చేసి శిష్యుడిగా చేరాడు. కాని తన వృత్తి అయిన దొంగతనాలు మానలేదు.

ఒకరాత్రి దొంగతనం చెయ్యడానికి రాజుగారి కోటలోకి వెళ్ళాడు. మారు వేషంలో తిరుగుతున్న రాజు చూసి ఎవరు నువ్వని అడిగాడు. సత్యమే పలుకుతానని ప్రతిజ్ఞ చేసిన దొంగ తాను దొంగనని చెప్పాడు.

అతని నిజాయితీకి ఆశ్చర్యపోయిన రాజు నేను కూడా దొంగనే ఇద్దరం కలిసి దొంగతనం చేద్దాం పద అని దొంగని ఖజానా వద్దకి తీసుకెళ్లి "నేను గుమ్మం వద్ద ఉండి ఎవరైనా వస్తే నిన్ను హెచ్చరిస్తాను. నువ్వు లోపలికి వెళ్లి విలువైనవి దొంగిలించుకురా. ఇద్దరం చెరిసగం పంచుకుందాం" అన్నాడు

లోపలికి వెళ్ళిన దొంగకి ఒక పెట్టెలో ఐదు ఖరీదైన వజ్రాలు కనిపించాయి. ఐదు వజ్రాలను అమ్మకుండా ఇద్దరు పంచుకోవడం కష్టమని ఆలోచించి దొంగ నాలుగు వజ్రాలను దొంగిలించి ఐదో వజ్రాన్ని పెట్టెలోనే వదిలేశాడు. రాజుకి రెండు వజ్రాలను ఇచ్చాడు. వెళ్ళబోతున్న దొంగను నీ ఇల్లు ఎక్కడని రాజు అడిగాడు. సత్యమే పలుకుతానని ప్రతిజ్ఞ చేసిన దొంగ తన ఇంటి చిరునామా చెప్పి వెళ్ళిపోయాడు.

మరునాడు రాజభవనంలో దొంగతనం జరిగిందని అందరికీ తెలిసింది. సభలో రాజు కాపలాభటులు ఉండగా దొంగతనం ఎలా జరిగిందని అడిగాడు. ఎవ్వరూ సమాధానం ఇవ్వలేదు. ఖజానాలోనుండి ఏయే వస్తువులు దొంగిలించబడ్డాయో పరిశీలించి రమ్మని సేనా

పతిని పంపాడు. సేనాపతి వెళ్లి కొద్దిసేపటి తర్వాత ఖాళీ వజ్రాలపెట్టెతో వచ్చి "ప్రభూ ఈ పెట్టెలోని ఐదు వజ్రాలు దొంగిలించబడ్డాయి" అని చెప్పాడు.

సేనాపతి చేసిన మోసం రాజుకి అర్ధమయ్యింది. కాని ఏమీ తెలియనట్లు మరో ఇద్దరు భటులను పిలిచి దొంగ ఇంటి చిరునామా చెప్పి అతడిని తీసుకురమ్మని చెప్పాడు. భటులు దొంగను తీసుకొచ్చారు

రాజు ఎన్ని వజ్రాలు దొంగిలించావని దొంగను అడిగాడు. దొంగ నాలుగు వజ్రాలను దొంగిలించానని ఐదవ వజ్రాన్ని పెట్టెలోనే వదిలేసానని చెప్పాడు.

సేనాపతి నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది. "ప్రభూ! పెట్టెలో ఐదు వజ్రాలు కనిపిస్తే ఏ దొంగా నాలుగు మాత్రమే దొంగిలించి ఒక వజ్రాన్ని వదిలెయ్యడు. ఈదొంగ మాటలు నమ్మకండి" అన్నాడు

మంత్రి కూడా "ప్రభూ! ఏ దొంగా నిజం చెప్పడు. కాబట్టి ఇతని మాటలు నమ్మకండి" అని సలహా ఇచ్చాడు.

రాజు ఐదు వజ్రాలలో నాలుగు మాత్రమే ఎందుకు దొంగిలించావని దొంగను అడి గాడు. దొంగ రాత్రి జరిగిన విషయం చెప్పి ఇద్దరు దొంగలు పంచుకోడానికి వీలుగా ఉంటుందని నాలుగు వజ్రాలు మాత్రమే దొంగిలించానని చెప్పి తన జేబులో నుండి రెండు వజ్రాలను తీసి అక్కడున్న బల్లమీద పెట్టాడు.

"అయితే రెండో దొంగ ఎవరో చెప్పు" సేనాపతి గద్దించాడు



"అతనెవరో నాకు తెలియదు. నేనతని పేరు కూడా అడగలేదు" దొంగ వినయంగా చెప్పాడు.

"పేరు కూడా తెలియకుండానే కలిసి దొంగతనం చేసారా?" మళ్ళీ గద్దించాడు సేనాపతి

సభలోని అందరినీ ఆశ్చర్యపరుస్తూ రాజు "ఆ రెండో దొంగను నేనే" అని నిన్న రాత్రి జరిగిన విషయం వివరించాడు. తన జేబులోని రెండు వజ్రాలను తీసి బల్లమీద పెట్టి "సేనాపతి జేబులు వెతకండి" అని ఆజ్ఞాపించాడు. సేనా పతి జేబులో ఐదవ వజ్రం దొరికింది. రాజు సేనాపతిని ఉద్యోగం నుండి తొలగించి చేసిన మోసానికి శిక్ష విధించాడు. దొంగ అయినప్ప టికీ నిర్భయంగా సత్యాన్నే పలికిన దొంగను ప్రశంసించి అతనికి తన కొలువులో మంచి ఉద్యోగం ఇచ్చాడు.

దొంగ స్వామీజీ వద్దకు వెళ్లి "మీ ఉపదేశం వలనే నాకీ ఉద్యోగం వచ్చింది" అని కృత జ్ఞతలు తెలియజేసాడు.

స్వామీజీ "సత్యమేవ జయతే – దీనిని ఎప్పుడూ మరచిపోకు" అని చెప్పారు.

✦



-మొండెపు ప్రసాద్

69

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**మంచి ప్రవర్తనతో మంచి భవిష్యత్తు కలుగుతుందని తెలియజేసే కథ చదువుదాము.**

ప్రసిద్ధ హిందీ రచయిత ప్రేంచంద్ కొడుకులు ఇద్దరూ అలహాబాదులో చదువుకునేవారు. ఒకసారి ప్రేంచంద్ తన భార్యతో కలిసి అలహాబాద్ మీదుగా వేరే ఊరికి రైలులో ప్రయాణం చేయవలసివచ్చింది. అలహాబాద్ స్టేషన్లో కలుసుకోమని పిల్లలకి ముందుగానే ఉత్తరం రాసాడు.

అలహాబాద్ స్టేషన్లో రైలు ఆగింది. ప్రేంచంద్ అతని భార్య కంపార్ట్మెంట్ నుండి క్రిందకి దిగగానే పెద్దకొడుకు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి కుశలం అడిగాడు. చిన్నకొడుకు ఫ్యాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని తల్లిదండ్రులను ముక్తసరిగా పలుకరించాడు. రైలు బయల్దేరుతున్నప్పుడు పెద్దకొడుకు మరోసారి తల్లిదండ్రులకు వినయంగా నమస్కారం చేసాడు. చిన్న కొడుకు 'టాటా' చెప్పాడు.

రైలులో ప్రేంచంద్ విచారంగా

## మంచి ప్రవర్తన



ఉండటం గమనించి అతని భార్య కారణం అడిగింది. చిన్నకొడుకు నమస్కారం చెయ్యనందుకు విచారంగా ఉన్నానని ప్రేంచంద్ చెప్పాడు.

ప్రేంచంద్ భార్య "రైలు దగ్గర చాలామంది ఉన్నారు కదా! అందరిముందు నమస్కారం చెయ్యడానికి సిగ్గుపడి ఉంటాడు. అయినా మన కొడుకు మనకు నమస్కారం చెయ్యకపోతే మనకు వచ్చే నష్టం ఏమిటి?" అని చెప్పి ఊరడించడానికి ప్రయత్నించింది.

"వాడు నమస్కారం చెయ్యకపోవడం వలన మనకు నష్టమేమీ లేదు. నేను వాడి భవిష్యత్తు గురించి బాధపడుతున్నాను. నేటి ప్రవర్తన మీదే రేపటి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వినయ

విధేయతలు లేనివాడు గొప్పవాడు కాలేడు" ప్రేంచంద్ కారణం చెప్పాడు.

కొన్నాళ్ళ తర్వాత ప్రేంచంద్ అంచనాలు నిజమయ్యాయి. పెద్దకొడుకు అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తి పదవి చేపట్టి అందరి మన్ననలు పొందాడు. చిన్నకొడుకు కష్టపడి స్కూల్ ఫైనల్ ప్యాసయ్యి అదే కోర్టులో చిన్న ఉద్యోగంలో చేరాడు.

నేటి మన ప్రవర్తనను బట్టే రేపటి మన భవిష్యత్తు ఉంటుంది. మంచి ప్రవర్తన వలన మంచి భవిష్యత్తు లభిస్తుంది.

✦ ✦ ✦



## దయ

ధర్మరాజు దయాగుణాన్ని తెలియజేసే భార తంలోని ఒక సంఘటన గుర్తుచేసుకుందాము.

శ్రీకృష్ణుడి మరణం తర్వాత పాండవులు ద్రౌపదితో కలిసి మహాప్రస్థానం చేస్తున్నప్పుడు ధర్మరాజు తప్ప మిగిలినవాళ్ళందరూ ఒకొక్క రుగా క్రిందపడి మరణించారు. ఒక కుక్క మాత్రం ధర్మరాజుతో పాటూ స్వర్గము వరకు వెళ్ళింది. ఇంద్రాది దేవతలు కుక్కను స్వర్గంలోకి అనుమతించడానికి ఒప్పుకోలేదు. ధర్మరాజు "నా తమ్ముళ్ళు, ద్రౌపది నావెంట రాలేకపో యారు. కాని ఈ కుక్క నావెంట ఇంతవరకు వచ్చింది. ఈ కుక్కను స్వర్గంలోకి అనుమ తించకపోతే నేను కూడా స్వర్గంలోకి అడుగు పెట్టను" అని చెప్పాడు.

ఆ మాటలు వినిన వెంటనే కుక్క యమ ధర్మరాజుగా మారి "నిన్ను పరీక్షించడానికి అలా చేసాను. కురుక్షేత్రయుద్ధంలో ద్రోణాచార్యుని చంపడానికి 'అశ్వత్థామ హతః' అని ద్రోణుడికి స్పష్టంగా వినబడేటట్లు 'కుంజరః' అని వినపడ కుండా ఉండేలా పలికిన పాపానికి నువ్వు కొన్ని గడియలు నరకంలో గడపాలి. నాతో రా" అని ధర్మరాజును నరకానికి తీసుకెళ్ళాడు.

ధర్మరాజు నరకంలో అడుగుపెట్టగానే అక్కడంతా చల్లదనం ఆవరించి అక్కడ శిక్ష అనుభవిస్తున్న పాపులందరికీ చాలా ఆహ్లాదం కలిగింది. కొన్ని గడియల తర్వాత ధర్మరాజు నరకం వదిలి స్వర్గానికి బయల్దేరుతుండగా అక్కడివారందరూ ధర్మరాజును అక్కడే ఉ ండ మని ప్రార్థించారు. యమధర్మరాజు అనుమతితో ధర్మరాజు తాను సంపాదించిన పుణ్యఫలాన్ని నరకవాసులకు ధారపోసాడు. ఫలితంగా నరకవాసులందరూ పాపవిముక్తులయ్యారు.

✦



-మొండెపు ప్రసాద్

70

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## శీలం

**శీలం వలన ధర్మం, ధర్మం వలన సత్యం, సత్యం వలన సత్ప్రవర్తన, సత్ప్రవర్తన వలన బలం, బలం వలన ఐశ్వర్యము కలుగుతాయని తెలియజేసే కథ చదువుదాము.**

ఇంద్రప్రస్థంలో ధర్మరాజు చేసిన రాజసూయయాగం చూసి వచ్చిన దుర్యోధనుడు తన అసూయను తండ్రితో చెప్పాడు. ధృతరాష్ట్రుడు "నీకు ధర్మరాజు కంటే ఎక్కువ ఐశ్వర్యము ఉంది. కాని ధర్మరాజు గొప్ప శీలవంతుడు. అందువలనే అతడు నీకంటే ఎక్కువ కీర్తిప్రతిష్టలు పొందుతున్నాడు." అని వివరిస్తూ చెప్పిన ప్రహ్లాదుడి కథ ఒకసారి గుర్తు చేసుకుందాము.

రాక్షసరాజైన ప్రహ్లాదుడు ముల్లోకాలనూ ధర్మబద్ధంగా పరిపాలిస్తున్నాడు. పదవీచ్యుతుడైన ఇంద్రుడు తనకు త్రిలోకాధిపత్యం తిరిగి వచ్చే మార్గం చెప్పమని బృహస్పతిని అడిగాడు. బృహస్పతి భార్గవుడిని అడగమని చెప్పాడు. భార్గవుడు "ప్రహ్లాదుడికి అంతటి శక్తి ఎలా వచ్చిందో అతడినే అడిగి తెలుసుకుని ఏదైనా ఉపాయంతో ఆ శక్తిని అడిగి పుచ్చుకో" అని సలహా ఇచ్చాడు.

ఇంద్రుడు విప్రుడి వేషంలో వెళ్లి ప్రహ్లాదుడికి సేవలు చేసాడు. ప్రహ్లాదుడు ప్రసన్నుడై ఏమి కావాలో కోరుకోమన్నాడు. "మీకు త్రిలోకాధి పత్యం ఎలా వచ్చిందో తెలియజేయండి" అని విప్రుడి వేషంలో ఉన్న ఇంద్రుడు అడిగాడు.

"నేనెప్పుడూ రాజుననే గర్వంతో ప్రవర్తించను. ఎవ్వరినీ నొప్పించను. ఈర్ష్య, అసూయ ద్వేషం, పగ వంటి దుర్గుణాలను మనసులోకి రానివ్వను. ఎవరైనా ఏదైనా అడిగితే లేదనకుండా వారిని సంతోషపెడతాను. పురాకృత పుణ్యం వలన బ్రహ్మర్షులు మెచ్చుకొనే శీలం ఉంది. కాబట్టి నాకు ఇంత గొప్ప పదవి లభించింది" అని ప్రహ్లాదుడు చెప్పాడు.

"మీరు నిజంగా మహాత్ములు. మీ శీలాన్ని నాకివ్వండి" అని విప్రుడి వేషంలో ఉన్న ఇంద్రుడు అడిగాడు.

ప్రహ్లాదుడు ఒప్పుకున్నాడు. వెంటనే ప్రహ్లాదుడి శరీరంలోనుండి మహాతేజస్సుతో ఒక పురుషుడు బయటకు వచ్చాడు.

"నువ్వెవరు?" అని ప్రహ్లాదుడు అడిగాడు.

"నువ్వు దానం చేసిన శీలాన్ని" అని చెప్పి ఆ దివ్యపురుషుడు వెళ్ళిపోయాడు.

ప్రహ్లాదుడి శరీరంలోనుండి మహాతేజస్సుతో

మరో పురుషుడు బయటకు వచ్చాడు.

"నువ్వెవరు?" అని ప్రహ్లాదుడు అడిగాడు.

"నేను సత్యాన్ని. శీలాన్ని ఆశ్రయించి ఉంటాను. శీలంతో పాటూ నేను కూడా వెళ్తున్నాను" అని చెప్పి ఆ దివ్యపురుషుడు వెళ్ళి పోయాడు

ప్రహ్లాదుడి శరీరంలోనుండి మహాతేజస్సుతో మరో పురుషుడు బయటకు వచ్చాడు.

"నువ్వెవరు?" అని ప్రహ్లాదుడు అడిగాడు.

"నేను సత్ప్రవర్తనను. సత్యాన్ని ఆశ్రయించి ఉంటాను. సత్యంతో పాటూ నేను కూడా వెళ్తున్నాను." అని చెప్పి ఆ దివ్యపురుషుడు వెళ్ళి పోయాడు

ప్రహ్లాదుడి శరీరంలోనుండి మహాతేజస్సుతో మరో పురుషుడు బయటకు వచ్చాడు.

"నువ్వెవరు?" అని ప్రహ్లాదుడు అడిగాడు.

"నేను బలాన్ని. ఋజుప్రవర్తనను ఆశ్రయించి ఉంటాను. ఋజుప్రవర్తనతో పాటూ నేను కూడా వెళ్తున్నాను" అని చెప్పి ఆ దివ్య పురుషుడు వెళ్ళిపోయాడు

ప్రహ్లాదుడి శరీరంలోనుండి మహా తేజస్సుతో ఒక స్త్రీ బయటకు వచ్చింది.

"నువ్వెవరు?" అని ప్రహ్లాదుడు అడి గాడు.

"నేను లక్ష్మిని. బలం ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాను. బలంతో పాటూ నేను కూడా వెళ్తున్నాను." అని చెప్పింది.

"అమ్మా! ఇంతకూ నన్ను సేవించిన విప్రుడు ఎవరు?" అని ప్రహ్లాదుడు లక్ష్మిని అడిగాడు.

"అతను ఇంద్రుడు. నీ వైభవాన్ని తీసుకోడానికి పథకం వేసి విప్రుడి వేషంలో నీకు సేవలు చేసాడు. అతని మాయలో పడి



నువ్వు శీలాన్ని అతనికి దానం చేసావు. శీలం వలన ధర్మం, ధర్మం వలన సత్యం, సత్యం వలన సత్ప్రవర్తన, సత్ప్రవర్తన వలన బలం, బలం వలన ఐశ్వర్యము కలుగుతాయి. కాబట్టి సర్వసంపదలకూ శీలమే మూలం. నువ్వు శీలాన్ని పోగొట్టుకున్నావు. కాబట్టి నేను నీ దగ్గర ఉండలేను" అని చెప్పి లక్ష్మీదేవి వెళ్ళి పోయింది.

ఈకథ చెప్పి దృతరాష్ట్రుడు "కాబట్టి దుర్యో ధనా! శీలవంతుడవై వర్ధిల్లు" అని చెప్పాడు.

✦ ✦ ✦

మనిషిని దైవత్వానికి దగ్గరగా తీసుకువెళ్ళే నిజాయితీ, సత్యం, శాంతము, దయ, సహనం, క్షమ వంటి మంచిగుణాలను అలవరచు కోవాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

# యువతకు భగవద్గీత చూపించిన దారి



71

**శ్లోకం: దమ్భో దర్పోభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ।**

**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సమ్పదమా సురీమ్ ॥ 16-4 ॥**

భావం: కపటము, మొండితనము, దురభిమానము, కోపము, పరుషంగా మాట్లాడటం, అజ్ఞానము - ఇవన్నీ అసురసంబంధమైన దుర్గుణములు.

వివరణ: ఎంతటి ధనవంతులైనా, ఎంతటి శక్తిసామర్థ్యాలు కలవారైనా, ఎంతటి

## దుర్గుణాలు

అధికారం కలవారైనా, ఎంతటి పలుకబడి కలవారైనా ఏ యుగంలోనైనా, ఏ కాలంలోనైనా కపటము, మొండితనము, దురభిమానము, దురహంకారము, అసూయ వంటి దుర్గుణములు కలవారు శిక్షించబడ్డారు. హిరణ్యకశిపుడు, రావణుడు, దుర్యోధనుడు, కంసుడు, శిశుపాలుడు, నరకాసురుడు గొప్ప శక్తిసామర్థ్యాలు, వరాలు, మహిమలు కలవారు. కాని వారి దుర్గుణాల వలన భగవంతుడిచే శిక్షించబడ్డారు.

అసత్యం:

అసత్యం దాగదని సత్యమే గెలుస్తుందని తెలియజేసే ఒక కథ చదువుదాము.

ఉదయం ఇంటర్నల్ ఎగ్జామ్ ఉందని తెలిసి కూడా నలుగురు స్నేహితులు ఆరోజే రిలీజైన తమ అభిమాన హీరో సినిమా మార్నింగ్ షో చూసి కాలేజికి ఆలస్యంగా వెళ్ళారు. ప్రిన్సిపాల్ ఎందుకు ఆలస్యంగా వచ్చారని అడిగాడు. కారు టైరు పంచరయ్యిందని. కారులో స్పేర్ టైరు లేకపోవడం వలన పంచర్ వేయించుకుని వచ్చేసరికి ఆలస్యమయ్యిందని చెప్పారు. ఆ కారణం చెప్పినప్పుడు వాళ్ళ కళ్ళలో నిజాయితీ కనబడకపోవడంతో ప్రిన్సిపాల్ నమ్మలేదు. "మిమ్మల్ని మూడు సింపుల్ ప్రశ్నలు అడుగుతాను. మీరు సరైన సమాధానాలు వ్రాస్తే మీకు మీరు మిస్ అయిన ఎగ్జామ్‌లో ఫుల్ మార్క్స్ ఇస్తాను" అన్నాడు వాళ్ళు సంతోషంతో ఒప్పుకున్నారు.

ప్రిన్సిపాల్ వాళ్ళని ఒకొక్కరిని ఒకొక్క రూములో విడిగా కూర్చోబెట్టి మూడు ప్రశ్నలకు సమాధానాలు కాగితాల మీద వ్రాయమన్నాడు

(i) ఏ టైర్ పంచర్ అయ్యింది?

(ii) ఏ సెంటర్లో పంచర్ అయ్యింది?

(iii) పంచర్ ఏ రిపేర్ షాపులో వేయించారు?

నలుగురూ వేరువేరు సమాధానాలు వ్రాయ




డంతో నిజమేమిటో ప్రిన్సిపాల్‌కి అర్థమైపో యింది.

✦ ✦ ✦

## అబద్ధం

సరదాకి చెప్పిన చిన్న అబద్ధం కూడా ప్రమాదాలు తెచ్చిపెడుతుందని తెలియజేసే కథ చదువుదాము.

కిరాణా సామానులు తెమ్మని అమ్మ ఇచ్చిన ఐదువందల రూపాయిల నోటు తీసుకుని కిరాణాకొట్టుకి వెళ్తున్న శ్రీను సరదాగా చిన్న తమాషా చెయ్యాలనుకున్నాడు. తనవద్ద ఉన్న ఐదువందల నోటును క్రింద పడేసి “నాకు ఐదువందల నోటు దొరికింది” అని గట్టిగా అరిచాడు.

ఆ అరుపు వినిన అటుగా వెళ్తున్న ఒక యువకుడు “అది నాదే. జేబులోనుండి మొబైల్ తీసినప్పుడు పడిపోయింది. పది నిమిషాల నుండి వెతుకుతున్నాను. థేంక్స్” అని చెప్పి ఆ నోటు తీసుకోబోయాడు.

శ్రీను నోటు ఇవ్వకుండా “ఈ నోటు నాదే. మా అమ్మ కిరాణా సరుకులు తెమ్మని ఇచ్చింది. నేను తమాషా చేద్దామని క్రింద పడేసి, దొరికిం దని అరిచాను” అని చెప్పాడు.

నోటు దొరికిందని శ్రీను అరిచినప్పుడు విన్న ఇద్దరు వ్యక్తులు వచ్చి “నువ్వు ఐదువందల నోటు దొరికిందని అరవడం మేము విన్నాము. ఇప్పుడు డబ్బుల కోసం అబద్ధాలు చెప్తున్నావు.” అని శ్రీనుని మందలించి ఐదువందల నోటును ఆ యువకుడికి ఇప్పించారు.

నిత్యజీవితంలో మనం అనేక సందర్భాల్లో అవసరం కోసం కొన్నిసార్లు, అవసరం లేక పోయినా కొన్నిసార్లు ఎదుటివారి ముఖస్తుతి కోసమో, మన తప్పు కప్పిపుచ్చడానికో అబ ద్ధాలు చెప్తుంటాము. అబద్ధ చెప్పడం వలన తాత్కాలికంగా కొంత లాభం పొందవచ్చు. కాని ఆ అక్రమ లాభానికి ఎన్నోరెట్లు నష్టాన్ని ఏదో ఒక రోజు అనుభవించి తీరుతాము. సత్యాన్ని మించిన ధర్మం లేదు. కాబట్టి వీలైనంతవరకు సత్యాన్నే పలకండి.

✦



-మొండెపు ప్రసాద్

72

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## గర్వం

**జయవిజయులు విష్ణుమూర్తి యొక్క ద్వారపాలకులు. వారి అనుమతి లేకుండా ఎవ్వరూ విష్ణుమూర్తి వద్దకు వెళ్ళలేరు. ఆ పదవి వలన కొన్నాళ్ళకు వారికి గర్వం కలిగింది. ఒక నాడు విష్ణుమూర్తి భార్య అయిన లక్ష్మీదేవిని లోపలికి వెళ్ళకుండా అడ్డగించారు. మృదుస్వభావురాలైన లక్ష్మీదేవి వారి అహంకారాన్ని సహించింది.**

కాని వారు మితిమీరిన గర్వంతో శ్రీమహావిష్ణువు దర్శనార్థం వచ్చిన సనత్కుమారులను కూడా లోపలికి వెళ్ళనీయకుండా అడ్డగించారు. ఫలితంగా వారి శాపాలకు గురియై కృతయుగంలో హిరణ్యాక్షుడు - హిరణ్యకశ్యపుడు, త్రేతాయుగంలో రావణుడు - కుంభకర్ణుడు, ద్వాపరయుగంలో శిశుపాలుడు - దంతవక్త్రుడులుగా మూడుసార్లు రాక్షసజన్మలు ఎత్తవలసి వచ్చింది.

✦ ✦ ✦

అర్జునుడి గర్వభంగం గురించి తెలియజేసే ఒక కథ చదువుదాము.

యాత్రలు చేస్తూ రామేశ్వరం వెళ్ళిన అర్జునుడు రామేశ్వరం నుండి లంక వరకు శ్రీరాముడు నిర్మించిన వారధిని చూసి ఆశ్చర్యపోయాడు. కాని గొప్ప ధనుర్విద్యానిపుణుడైన శ్రీరాముడు రాళ్ళతో కాకుండా బాణాలతో వారధి నిర్మించవలసింది అనుకున్నాడు. సముద్రతీరాన కూర్చుని రామాయణం చదువుకుంటున్న పండితుడిని అదే సందేహం అడిగాడు. పండితుడు సమాధానం చెప్పలేదు.

అప్పుడొక కోతిపిల్ల వచ్చి "శ్రీరాముడు బాణాలతో వారధి నిర్మించివుంటే కోతులన్నీ దానిమీద నుండి నడిచివుంటే ఆ వారధి కూలిపోయివుండేది" అని చెప్పింది.

అర్జునుడు కోపంగా "నేను బాణాలతో వారధి నిర్మిస్తాను. నువ్వు దానిని పడగొట్టగలిగితే నేను అగ్నిలో దూకి ప్రాణాలు విడుస్తాను. నువ్వు పడగొట్టలేకపోతే మీ వానరజాతి అంతా ఎప్పటికీ నాకు బానిసలుగా ఉండాలి. సరేనా?" అన్నాడు.

కోతి సరే అంది. అర్జునుడు బాణాలతో వారధి నిర్మించాడు. కోతి పాదం మోపగానే అది విరిగిపోయింది. అర్జునుడు అగ్నిలో దూకడానికి తయారయ్యాడు. అంతలో ఒక బాలుడు "న్యాయం చెప్పే మధ్యవర్తి లేకుండా వేసుకున్న పందెం చెల్లదు. కాబట్టి నువ్వు అగ్నిలో దూకనవసరం లేదు. ఈసారి నేను మధ్యవర్తిగా ఉంటాను.

మరోసారి పందెం కాయండి” అన్నాడు.

అర్జునుడు మరోసారి వంతెన నిర్మించాడు. పిల్లకోతి వంతెన ఎక్కి నిలబడింది వంతెన చెక్కు చెదరలేదు. పిల్లకోతి తన శరీరాన్ని పర్వతమంత పెద్దగా పెంచింది. అయినా వంతెన చెక్కుచెదర లేదు.

బాలుడి రూపంలో వచ్చింది శ్రీరాముడే అని కోతి రూపంలో ఉన్న హనుమంతుడికి అర్ధ మయ్యింది. వెళ్లి “శ్రీరామా!” అంటూ బాలుడికి పాదాభివందనం చేసాడు. అర్జునుడు “శ్రీ కృష్ణా!” అంటూ బాలుడి పాదాలకు నమస్క రించాడు.

బాలుడు ఇద్దరినీ పైకి లేపి చిరునవ్వుతో “ఇకనుండి అర్జునుడి పతాకం మీద నీగుర్తు ఉంటుంది” అని పిల్లకోతి రూపంలో ఉన్న హనుమతుడితో చెప్పాడు.

✦ ✦ ✦

గర్వం పెరిగితే నాశనం తప్పదని తెలియ జేస్తూ భరద్వాజుడు తన కొడుక్కి చెప్పిన కథ ఒకసారి గుర్తుచేసుకుందాం.

బాలదిహి అనే ముని కొడుకు అకస్మాత్తుగా చనిపోయాడు. బాలదిహి చాలా బాధపడి మరణం లేని పుత్రుడిని పొందాలనే ఉద్దేశ్యంతో కఠోరమైన తపస్సు చేసాడు. దేవతలు ప్రత్యక్షమై “మరణం లేకుండా వరమివ్వడం కుదరదు. మనిషై పుట్టాక ఎప్పుడోకప్పుడు చనిపోవలసిందే. కాబట్టి నీ కొడుకు ఎన్నాళ్ళు జీవించాలో కోరుకో” అన్నారు. బాలదిహి ఆలోచించి ఎదురుగా ఉన్న కొండను చూపించి “ఆ కొండ



ఉన్నంతకాలం నా కొడుకు బ్రతికుండేడట్లు వరమివ్వండి” అని కోరాడు. దేవతలు అలాగే వరమిచ్చారు. దేవతల వరం వలన పుట్టిన కుమారుడికి మేధావి అని పేరుపెట్టాడు.

యుక్తవయసొచ్చాక మేధావికి తాను కొండలా కలకాలం మరణం లేకుండా బ్రతు కుతాననే గర్వం పెరిగింది. ఆ గర్వంతో పెద్దాచిన్నా తారతమ్యం లేకుండా అందరితో అసభ్యంగా, అగౌరవంగా ప్రవర్తిస్తూ అవ మానపరిచేవాడు. ఒకరోజు ధనుసాక్షరి అనే మహాత్ముడితో అసభ్యంగా ప్రవర్తించాడు. ధనుసాక్షరి కోపంతో “నువ్వు భస్మమైపోతా వని శపించాడు. కాని ఆ శాపం మేధావి మీద పనిచేయలేదు.

మేధావికి ఉన్న వరం గుర్తుచేసుకున్న ధనుసాక్షరి అడవిదున్నగా మారి కొండను గట్టిగా గ్రుద్ది బ్రద్దలుచేసాడు. కొండ బద్దలు కాగానే మేధావి తల ముక్కలై చనిపోయాడు.

✦

# యువతకు భగవద్గీత చూపించిన దారి

73


-మొండెపు ప్రసాద్

**స్నేహం గొప్పది. కాని అది రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. మంచి స్నేహం జీవితాన్ని నిలబెడితే, చెడు స్నేహం జీవితాన్ని నాశనం చేసేస్తుంది. చెడు స్నేహం యొక్క దుష్ఫలితాలను వివరించే ఒక కథను గుర్తు చేసుకుందాము.**

"కొన్ని కాకులు ప్రతీరోజూ పంటచేలలో పడి ధాన్యాన్ని తినడాన్ని చాలా రోజులుగా తిండి లేక బాధపడుతున్న ఒక పావురం గమనించింది. "నా యజమాని నాకు ఆహారం పెట్టడం లేదు కాని ఈ కాకులు మాత్రం యధేచ్ఛగా ధాన్యాన్ని దోచుకుంటున్నాయి. నేను ఈ కాకులతో స్నేహం చేస్తే వాటితో కలిసి పంటచేలలో పడి కడుపునిండా ధాన్యాన్ని తినచ్చు" అని అలోచించి పావురం కాకుల వద్దకు వెళ్లి "నన్ను కూడా మీ గుంపులోకి చేర్చుకోండి." అని అడిగింది."

అందుకు కాకులన్నీ సరే అన్నాయి. ఆ రోజు నుండి కాకులన్నీ పావురాన్ని తమతో తీసుకునివెళ్తూ కలిసి ధాన్యాన్ని తింటున్నాయి. అలా కొంతకాలం హాయిగా గడిచిపోయింది.

## చెడు స్నేహం



పావురం తన యజమానిని పూర్తిగా మరచిపోయింది.

రోజూలాగే కాకులు, పావురం కలిసి ఆరోజు ఒక పొలంలో ధాన్యం తినడానికి గుంపుగా వాలాయి. కాని, రైతు పొలం మీద పరచిన వలలో చిక్కుకొని పైకి ఎగరలేకపోయాయి. కాకులతో పాటు పావురం కూడా వలలో చిక్కుకొని రైతుకు ఆ రాత్రికి భోజనమయ్యింది."

చెడ్డ వారితో స్నేహం చెయ్యడం వలన చెడు గుణాలు అలవడతాయి దుష్ఫలితాలు కలుగుతాయి.

అందుకే గాంధీ గారు "ఆత్మకథ" (మొదటి



భాగం - ఆరవ అధ్యాయం - దుఖ:కరమైన ప్రకరణం -1)లో - "మిత్రులలో ఒకరిపై మరొకరి ప్రభావం తప్పక పడుతుంది. సామాన్యంగా మనిషి సుగుణాలకంటే దుర్గుణాలనే త్వరగా గ్రహిస్తాడు." అని చెప్పారు.

✦ ✦ ✦

చేసే పని ఎప్పటికీ, ఎవ్వరికీ తెలియదనే హామీ ఉంటే మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన క్యారెక్టర్. చేసేపని ఎవ్వరికీ తెలియదనే నమ్మకంతోనే చాలామంది తప్పుపనులు, అవినీతి పనులు చేస్తారు. కాని కొన్నిసార్లు అంచనాలు, నమ్మకాలు తారుమారై చేసిన తప్పులు, అవినీతి పనులు బయటపడతాయి.

అయితే ఎవ్వరికీ తెలియకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన తప్పులు కూడా చూసే సాక్షులు ఉంటారని భాగవతంలో - "మనలోని అంతరాత్మ, ధర్మం, భూమి, సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, దిక్కులు, ఇరు సంధ్యలు, అగ్ని, గాలి, జలం మనిషి చేసే పను లన్నింటికీ సాక్షులుగా ఉంటాయి" అని చెప్ప బడింది.

మనం చేసే ప్రతీ తప్పు పనినీ గమనించే వాళ్ళు ఉన్నారు కాబట్టి చేసిన తప్పుల ఫలితం తప్పకుండా అనుభవించవలసి వస్తుందని గుర్తు పెట్టుకుంటే తప్పులు చేయకుండా జీవించ గలుగుతాము.

మనిషిని దానవత్వానికి దగ్గరగా తీసుకు వెళ్ళే అసత్యం, అసూయ, గర్వము, మోసము, అవినీతి వంటి దుర్గుణాణాలకు దూరంగా ఉండాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

74

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**

**కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥ 16-21 ॥**

భావం: కామము, క్రోధము, లోభము నరకానికి ద్వారములు. ఇవి ఆత్మనాశనానికి కారణాలు. అందువలన ఈ మూడింటిని త్యజించాలి.

వివరణ: కోరికలు, కోపము, లోభముల వలన మనిషి నాశనమవుతాడు. కాబట్టి వీటిని విడిచిపెట్టాలి.

కోపము: కోపం అనే స్వయంకృతాపరాధం వలన మనిషి తన కుటుంబ సభ్యు లను, బంధువులను, స్నేహితులను, చివరికి తనను తానూ కూడా కోల్పోతాడు. ఎంతటి విద్యావంతుడైనా, ఎంతటి ఉన్నతస్థానంలో ఉన్నా, ఎంతటి తెలివైనవాడైనా కోపాన్ని అదుపులో ఉంచుకోలేకపోతే బంధువులను, స్నేహితులను దూరం చేసుకుంటాడు.

## కోరికలు, కోపము, లోభములను త్యజించాలి



కోపం వలన మనిషి విచక్షణాజ్ఞానాన్ని, వివేకాన్ని, తాత్కాలికంగా కోల్పోతాడు. ఫలితంగా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు. ఎదుటివారిని నొప్పించే విధంగా పరుషమైన మాటలు మాట్లాడతారు. అందుకే ఏ కోపమైనా చివరకు పశ్చాత్తాపంతోనే ముగుస్తుంది.

పరాజయం ఎదురైనప్పుడు కొంతమంది తమ కోపాన్ని ప్రదర్శించడం కోసం తమ కుటుంబసభ్యుల మీద, స్నేహితుల మీద గట్టిగా అరుస్తారు, చేతికందిన వస్తువులను విసురు



తారు, కాలికందిన వస్తువులను కాలితో తంతారు. అలా కోపాన్ని ప్రదర్శించడం వలన మీ పరాజయం విజయంగా మారదు, మీకు సానుభూతి చూపించాలనుకున్నవాళ్ళు కూడా మీ పిచ్చికోపాన్ని చూసి దూరంగా వెళ్ళిపోతారు. మీ వెనుక మీ పిచ్చి చేష్టలను గురించి చెప్పుకొని నవ్వుకుంటారు.

కోపం వలన మనిషి తన వివేకాన్ని, ఆలోచనను కోల్పోతాడు. తన పరాజయానికి కారణాలను విశ్లేషించుకోలేకపోతాడు. అందు వలన మరోసారి ప్రయత్నించినా విజయం సాధించలేకపోతాడు. కాని కోపాన్ని నియం త్రించుకుంటే ఆలోచన మీద నియంత్రణ కలిగి, పరాజయానికి కారణాలను విశ్లేషించుకొని, వాటిని అధిగమించడానికి ప్రణాళిక తయారుచేసుకుంటాడు. ఆ ప్రణాళిక ప్రకారం ప్రయత్నించి విజయం సాధిస్తాడు.

✦ ✦ ✦

సుందరకాండలో రావణుడి ఆజ్ఞ ప్రకారం రాక్షసులు హనుమంతుడి తోకకు నిప్పు పెట్టారు. తన తోకకు పెట్టిన నిప్పుతో లంకను ముట్టించి సముద్రతీరంలో నీటిలో తోకను తడుపుతూ మంటల్లో మండుతున్న లంకానగరాన్ని చూసిన హనుమంతుడికి ఆ మంటల వలన సీతాదేవికి హాని ఏమైనా కలుగుతుందేమోనని భయం కలిగింది. కోపంలో చేసిన పనికి తనమీద తనకే అసహ్యం వేసింది. “నేను ఈ కార్యం ఎందుకు చేసాను? కోపం కలిగితే వివేకంతో దానిని నియంత్రించు కోవాలి గాని



ఇటువంటి అఘాయిత్యం చెయ్యడం సమంజసం కాదు. కోపాన్ని నిగ్ర హించుకోగలవారే ధీమంతులు. కోపంలో చెయ్యని పాపం ఉండదు. కోపిష్టి గురుహత్య, సజ్జనహింస వంటి వనులు కూడా అనా యాసంగా, ఆలోచించకుండా చేసేస్తాడు. ఎవరితో ఏమి మాట్లాడాలో వారికి తెలి యదు. అందువలన ధీమంతులు పాము కుబుసం విడిచినట్లు కోపాన్ని విడిచి పెట్టాలి." అని ఆలోచించాడు.

✦ ✦ ✦

కోపం వలన కలిగే నష్టాలను వివరించే ఒక కథను గుర్తుచేసుకుందాము:

శ్రీహరి భక్తుడైన అంబరీషుడు ఏకాదశీ వ్రతం చేసి, ఉపవాసం ఉండి, మరునాడు ద్వాదశి ఘడియలు ముగిసేలోగా ఉపవాసదీక్ష విరమించి, ద్వాదశి పారణ చేయడానికి ముందుగా బ్రాహ్మణ సమారాధన చెయ్యబోతుండగా దుర్వాస మహర్షి వస్తాడు. అంబరీషుడు దుర్వాసుడికి అర్ఘ్య పాద్యాలు ఇచ్చి భోజనానికి కూర్చోమనగా ఆ మహర్షి నదీస్నానానికి వెళ్లి వస్తానని చెబుతాడు. స్నానార్థం నదికి వెళ్ళిన దుర్వాసుడు ఎంతకూ తిరిగి రాడు. ద్వాదశి ఘడియలు గడిచిపోతున్నాయని భావించి, ద్వాదశి ఘడియలు గడవక మునుపు దీక్ష విరమించడం కోసం భుజించకపోతే వ్రత భంగం జరుగుతుంది, భుజిస్తే అతిథిని భంగపరచినట్లు అవుతుంది కనుక అంబరీషుడు అక్కడ ఉన్న పెద్దల సలహా మేరకు, సమారాధన చేసి, తాను శ్రీహరి పాదతీర్థాన్ని సేవించి, దీక్షా విరమణ చేస్తాడు. అప్పుడు దుర్వాసుడు నదీస్నానం ముగించుకొని వచ్చి జరిగిన విషయం గ్రహించి, అతిథి కంటే ముందు తిన్నందుకు ఆగ్రహోదగ్రుడై, తన జటలలో ఒక దానిని నేలపై కొట్టి మహాకృత్యను సృష్టించి అంబరీషుని మీదకు దానిని విడిచి పెడతాడు. అంబరీషుడు విష్ణు భక్తుడు అవడం వల్ల శ్రీమహావిష్ణువు అంబరీషుడిని రక్షించడం కోసం సుదర్శన చక్రం విడిచి పెడతాడు. సుదర్శన చక్రం ఆ రాక్షసిని చంపి, దుర్వాసుడి మీదకు వెడుతుంది, బ్రహ్మ, శివుడు కూడా దుర్వాసుడిని ఆ చక్రం నుండి రక్షించలేమంటారు. దుర్వాసుడు చివరకు వైకుంఠం చేరి మహావిష్ణువును ప్రార్థిస్తాడు. మహావిష్ణువు తాను కూడా రక్షించలేనని అంబరీషుడినే శరణు వేడుకొమ్మని అంటాడు. మరో మార్గం లేక దుర్వాసుడు అంబరీషుడిని వేడుకొనగా సుదర్శన చక్రం శాంతిస్తుంది.

కోపం అవివేకముతో మొదలై పశ్చాత్తాపంతో ముగుస్తుంది. కాబట్టి వివేకవంతులు కోపాన్ని వదిలిపెట్టాలి.

✦



-మొండెపు
ప్రసాద్

75

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**దురాశ వలన నష్టం కలుగుతుందని తెలియ జేసే కథ చదువుదాము.**

ఎడారిలో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ప్రయాణీకులకు ఒయాసిస్సు కనబడింది. కడుపునిండా నీళ్ళు త్రాగి, తమవద్ద ఉన్న తోలుసంచిల నిండా నీళ్ళు నింపుకొని మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టారు.

అరగంట ప్రయాణం తర్వాత ధగధగ మెరిసే వజ్రాల గుట్టలు కనపడ్డాయి. జేబుల నిండా వజ్రాలు నింపుకున్నారు. కాని ఆశ తీరలేదు. అప్పుడే నీళ్ళు త్రాగి ఉండటం వలన కొంచెం కూడా దాహం వెయ్యటంలేదు. కొంత దూరం దాహం ఓర్చుకొని ప్రయాణం చేస్తే మరో ఒయాసిస్సు కనపడకపోతుందా అనే దురాశతో తోలుసంచిలలోని నీళ్ళు పారబోసి వాటిలో కూడా వజ్రాలు నింపుకొని ప్రయాణం మొదలు పెట్టారు.

కొంతదూరం వెళ్ళాక ఎడారిలోని ఎండ

## దురాశ / లోభము



తీవ్రతకు బాగా దాహం వేసింది. ఎంత దూరం వెళ్ళినా నీరు దొరకకపోవడంతో ఇద్దరూ ఎడారి లోనే చనిపోయారు.

✦ ✦ ✦✦ ✦ ✦

దురాశ దుఃఖానికే కాదు ఒకోసారి దుర్మర ణానికి కూడా కారణమవుతుందని తెలియజేసే పంచతంత్రంలోని కథ చదువుదాము.

అడవి గుండా వెళ్తున్న బాటసారికి చెరువు ఒడ్డున నిలబడిన పులి ఒక బంగారు కంకణం చూపించి దగ్గరకు వచ్చి తీసుకోమంది. బాట సారికి ఆశ కలిగింది. "నువ్వు క్రూర మృగా నివి. నిన్ను ఎలా నమ్మాలి?" అని అడిగాడు.

పులి "అయ్యా! నేను వయసులో ఉండగా చాలా జంతువులను, మనుష్యులను చంపి తిన్నాను. నేనిప్పుడు ముసలిదానినయ్యాను. ఒక పుణ్యాత్ముడు ఇకనుండైనా మంచిపనులు చేస్తూ జీవించమని బోధించాడు. అప్పటినుండి జంతు వులను, మనుష్యులను చంపడం మానేసి, మంచి పనులు చేస్తూ జీవిస్తున్నాను. నువ్వు పేదవాడివి కాబట్టి ఈ కంకణం నీకు దానం చెయ్యాలనుకుంటున్నాను. చెరువులో స్నానం చేసి వచ్చి ఈ కంకణం తీసుకో" అని చెప్పింది.

కంకణం మీద ఆశ బాటసారిలోని వివేకాన్ని చంపేసింది. పులి మాటలు నమ్మి స్నానం చెయ్య డానికి చెరువులోకి దిగాడు. దిగగానే చెరువు లోని ఊబిలో కూరుకుపోయాడు. ఊబిలోనుండి బయటకు రాలేకపోతున్న బాటసారిని పులి బయటకు లాగి చంపి తినేసింది.

✦ ✦ ✦

దురాశ వలన కలిగే నష్టం గురించి తెలియ



జేసే మరో కథ చదువుదాము.

ఒక బిక్షగాడు రోజంతా బిక్షాటన చేసి దొరికిన ఆహారం తిని గుడి మెట్ల మీద కంటి నిండా నిద్రపోయేవాడు. ఒకరోజు బిక్షా టనలో 95 రూపాయలు, కొంత బిర్యాని దొరికాయి. మొదటిసారి 95 రూపాయలు చూసిన బిక్షగాడికి మరో 5 రూపాయలు చేర్చి వంద రూపాయలు చెయ్యాలనే ఆలోచన వచ్చింది. తన వద్ద ఉన్న బిర్యాని తినకుండా గుడిమెట్ల మీద ఉన్న మరో బిక్షగాడికి 5 రూపాయలకు అమ్మి, ఆ 5 రూపాయలు చేర్చి 100 రూపాయలు చేసాడు. 100 రూపా యలను 1000 రూపాయలు చెయ్యాలని కోరిక కలిగింది. దొరికిన బిక్షలో కొంచెం మాత్రమే తిని ఎక్కువ భాగం వేరే బిక్షగాళ్ళకు అమ్మి డబ్బులు సంపాదించడం మొదలు పెట్టాడు. తిండి సరిగ్గా తినకపోవడం వలన కొన్నాళ్ళకు ఆరోగ్యం క్షీణించి చనిపోయాడు.

✦



-మొందెపు ప్రసాద్

76

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## లోభము వలన కలిగే నష్టం

**లోభము వలన కలిగే నష్టం గురించి తెలియజేసే పిసినారి పుల్లయ్య కథ చదువుదాము.**

పుల్లయ్య దేవుడి గుడిలో కొట్టడానికి కొబ్బరికాయ కొనడానికి డబ్బులు ఖర్చు చెయ్యడానికి కూడా వెనకాడేటంతటి పిసినారి. తనకి కామెర్లు వచ్చినప్పుడు తగ్గితే గుడిలో ఒక కొబ్బరికాయ కొడతానని మొక్కుకున్నాడు. కామెర్లు తగ్గడంతో మొక్కు తీర్చుకోడానికి గుడికి వెళ్ళాడు. గుడి మందు ఉన్న కొట్టుకి వెళ్ళి కొబ్బరికాయ రేటు ఎంతని అడిగాడు. షాపువాడు ఇరవైఐదు రూపాయిలని చెప్పాడు. పుల్లయ్య ఇరవై రూపాయిలకు ఇవ్వమని అడిగాడు. బజార్లోని షాపుల్లో ఇరవై రూపాయిలకి దొరుకుతుం దని షాపువాడు చెప్పాడు.

పుల్లయ్య వెంటనే బజారులోని షాపుకి వెళ్ళి కొబ్బరికాయ రేటు ఎంతని అడిగాడు. షాపువాడు ఇరవై రూపాయిలని చెప్పాడు. పుల్లయ్య పది రూపాయిలకు ఇవ్వమని అడిగాడు. ఊరి చివర ఉన్న హోల్సేల్ షాపుల్లో పది రూపాయిలకి దొరుకు తుందని షాపువాడు చెప్పాడు.

పుల్లయ్య వెంటనే ఊరి చివర ఉన్న హోల్సేల్ షాపుకి వెళ్ళి కొబ్బరికాయ రేటు ఎంతని అడిగాడు. షాపువాడు పది రూపాయిలని చెప్పాడు. పుల్లయ్య ఐదు రూపాయిలకు ఇవ్వమని అడిగాడు. నది అవతల ఉన్న కొబ్బరి తోటల దగ్గర ఐదు రూపాయిలకి దొరుకుతుందని షాపువాడు చెప్పాడు.

అక్కడి నుండి పుల్లయ్య నది అవతల ఉన్న కొబ్బరితోటల వద్దకు వెళ్ళాడు. పనివాళ్లతో కొబ్బరికాయలు దింపిస్తున్న యజమానిని కొబ్బరికాయ రేటు ఎంతని అడిగాడు. తోట యజమాని ఐదు రూపాయిలని చెప్పాడు.

పుల్లయ్య "దేవుడి గుడిలో కొట్టడానికి తీసుకెళ్తున్నాను. నది అవతల నుండి నడుచుకుంటూ వచ్చాను. ఒక రూపాయికే ఇవ్వచ్చుగా" అని అడిగాడు.

తోట యజమాని "ఆ ఊర్లో ఉండే పిసినారి పుల్లయ్య మీరేనా" అని అడిగాడు.

అవునన్నాడు పుల్లయ్య.

పుల్లయ్య పిసినారితనం గురించి తెలిసిన అతను "చెట్టు ఎక్కి కాయలు దించినందుకు పనివాళ్ళకి నేను కిరాయి ఇవ్వాలి కాబట్టి

దించిన కొబ్బరికాయ ఐదు రూపాయిలు. నువ్వు చెట్టు ఎక్కి కోసుకుంటే కొబ్బరికాయ ఒక రూపాయి" అని చెప్పాడు.

పుల్లయ్యకు చెట్టు ఎక్కడం రాదు. కాని నాలుగు రూపాయిలు మిగులుతాయనే ఆశతో కాళ్ళు చేతులు గీసుకుపోయినా భరిస్తూ ఎలాగోలా చెట్టు ఎక్కేశాడు. కొబ్బరికాయ కోస్తూ క్రిందికి చూశాడు. ఎప్పుడూ అంత ఎత్తు ఎక్కని పుల్లయ్యకి కళ్ళు గిర్రున తిరిగాయి. పట్టుతప్పి క్రిందపడ్డాడు. నెల రోజులు హాస్పిటల్లో ఉండి ట్రీట్మెంట్ తీసుకోవలసి వచ్చింది.


✦ ✦ ✦

## మోహము

మోహము వలన కలహం, నష్టం కలుగుతాయి. మోహము ఎంతో ఐకమత్యంగా ఉండే అన్నదమ్ముల మధ్య కూడా కలహం కలిగిస్తుందని తెలియజేస్తూ నారదుడు ధర్మరాజుకు చెప్పిన కథ గుర్తుచేసుకుందాము

సుందోపసుందులు హిరణ్యకశిపుడి వంశంలోని నికుంభుడనే రాజు కుమారులు. వారి కఠోరమైన తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. సుందోపసుందులు తమకు చావు లేకుండా వరమివ్వమని అడిగారు. బ్రహ్మ "చావులేకుండా వరమివ్వడం కుదరదు కాని మీకు ఎవరివల్లా చావు రాదు, మీవల్ల మీరే మరణిస్తారు." అని వరమిచ్చాడు.

వరగర్వంతో సుందోపసుందుల అధర్మ కార్యాలకు, హింసాకాండలకు అడ్డులేకుండా పోయింది. దేవతలు, గంధర్వులు సుందోపసుందుల ఆగడాలనుండి రక్షించమని బ్రహ్మను ప్రార్థించారు. బ్రహ్మ విశ్వకర్మను పిలిచి ఒక అతిలోక సుందరి బొమ్మను తయారు చేయిం చాడు. ఆ బొమ్మకు ప్రాణం పోసి తిలోత్తమ అని పేరుపెట్టి వెళ్లి సుందోపసుందుల మధ్య వైరం కలిగించి వారు ఒకరినొకరు చంపు కొనేలా చెయ్యమని ఆజ్ఞాపించాడు.



తిలోత్తమ సుందోపసుందుల వద్దకు వెళ్ళింది. అంతటి అందాలరాశిని చూడగానే సుందోపసుందులు మోహవశులై ఆమె నాదంటే నాదని వాదించుకున్నారు. వాదులాట దెబ్బలాటగా మారి ఒకొరినొకరు పొడుచుకుని చనిపోయారు.

✦ ✦ ✦

కోరికలు, కోపము, లోభముల వలన మనిషి నాశనమవుతాడు. కాబట్టి వీటిని విడిచిపెట్టాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

77

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## శ్రద్ధాత్రయవిభాగ యోగము

**(1) కర్తవ్యాలను శ్రద్ధతో నిర్వర్తించాలి**

**శ్లోకం: సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధామయోయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః ॥ 17-3 ॥**

భావం: వ్యక్తుల యొక్క శ్రద్ధ వారి అంతఃకరణమునకు అనుగుణంగా వుంటుంది. దానిని బట్టే వారి జీవనవిధానం వుంటుంది. కాబట్టి వ్యక్తుల జీవనవిధానములను బట్టి వారు ఎటువంటి శ్రద్ధ కలవారో తెలుసుకోవచ్చు.

వివరణ: కొంతమంది శ్రద్ధ పెట్టకుండా, యధాలాపంగా కర్తవ్యాలను నిర్వర్తిస్తారు. శ్రద్ధ / విశ్వాసం / నమ్మకం లేకుండా చెయ్యడం వలన పనులు ఆశించిన ఫలితాలనివ్వవు. రోగం తగ్గుతుందనే నమ్మకం లేకుండా డాక్టరు ఇచ్చిన మందులు వాడటం, ప్యాసవు తాననే నమ్మకం లేకుండా పరీక్షలు వ్రాయడం, పరిష్కారం దొరుకుతుందనే నమ్మకం లేకుండా సలహా పాటించడం, చదివే పాఠం మీద శ్రద్ధ పెట్టకుండా సినిమాల గురించి, పార్టీల గురించి ఆలోచిస్తూ చదవటం వంటివి ఇందుకు నిత్యజీవితంలో మనకు ఎదురయ్యే ఉదాహరణలు.

శుకమహర్షి ద్వారా భాగవతం విని ముక్తి పొందిన పరీక్షిత్తులా తాను కూడా భాగవతం విని ముక్తిని పొందాలని ఒక ధనవంతుడు భావించి భాగవత శ్రవణానికి ఏర్పాట్లు చేశాడు. ఒక విధ్వాంసుడు భాగవతం చెప్పడానికి అంగీకరించాడు. కాని ఇది కలియుగం. కలియుగంలో ధార్మిక కాండల వలన దక్కే పుణ్యం నాలుగోవంతుకు పడిపోతుంది. కాబట్టి భాగవతం నాలుగుసార్లు వినాలని, తనకు దక్షిణ, సంభావనాలు నాలుగుసార్లు ఇవ్వాలని షరతు పెట్టాడు. ధనవంతుడు అంగీకరించాడు. విధ్వాంసుడు నాలుగుసార్లు భాగవతప్రవచనం చెప్పాడు. ధనవంతుడు నాలుగు ప్రవచనాలకు సరిపడేలా దక్షిణ, సంభావనలు పండితుడికి ఇచ్చాడు. కాని ధనవంతుడికి ఆశించిన ఫలితం మాత్రం దక్కలేదు.

నాలుగుసార్లు భాగవతప్రవచనం వినినా తనకు ఫలితం ఎందుకు దక్కలేదని ధనవంతుడు ఒక సాధువును అడిగాడు. ఆ సాధువు చిరునవ్వుతో "నాయనా! మృత్యుముఖంలో ఉన్న పరీక్షిత్తు ప్రపంచం పట్ల పూర్తి వైరాగ్యభావంతో భాగవతాన్ని విన్నాడు. శుకమహర్షి ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా భాగవతపారాయణం చేశాడు." అని వివరించాడు.

✦ ✦ ✦

శ్రద్ధ/విశ్వాసం/నమ్మకం లేకుండా చేసే



పనులు సత్ఫలితాలను ఇవ్వవని తెలియజేసే కథ చదువుదాము.

ఒక ధనవంతుడి కొడుక్కి అంతుబట్టని జబ్బుచేసింది. ఎంతమంది డాక్టర్లకు చూపించినా తగ్గలేదు. ఒకరోజు ఉదయం ఒక సాధువు ధనవంతుడి ఇంటికొచ్చి "హనుమంతుడికి ఆకు పూజ చేయించండి, తగ్గిపోతుంది" అని సలహా చెప్పాడు.

ధనవంతుడు "నాకు నమ్మకం లేదు. అయినా మీసలహా కాదనడం ఇష్టంలేదు." అని చెప్పాడు. సాయంత్రం హనుమంతుడి గుడికి వెళ్లి ఆకుపూజ చేయించాడు.

వారం రోజులు గడిచాయి. కొడుకు జబ్బు ఎంతమాత్రం తగ్గలేదు. సాధువు మళ్ళీ ధనవంతుడి ఇంటికి వచ్చాడు. ఆకుపూజ చేయించినా కొడుకు జబ్బు కొంచెం కూడా తగ్గలేదని ధనవంతుడు సాధువుకు చెప్పాడు.

సాధువు నేను పూజ చేయిస్తానని చెప్పి ధన వంతుడి వద్దనుండి పూజాద్రవ్యాలకు కావలి సిన డబ్బులు తీసుకొని గుడికి వెళ్ళాడు. పూజ చేయించి వచ్చి గుడినుండి తెచ్చిన సింధూరం పిల్లవాడి నుదుట పెట్టాడు. కొంతసేపటికి పిల్లవాడు లేచి కూర్చున్నాడు.

ధనవంతుడు సాధువుకు కృతజ్ఞతలు చెప్పి "స్వామీ! మీరు చేసిన పూజ వలన నాకొడుకు జబ్బు తగ్గింది. కాని నేను చేసిన పూజ వలన ఎందుకు ప్రయోజనం కలగలేదు?" అని అడిగాడు.

"నీ పూజలో శ్రద్ధ, విశ్వాసము, నమ్మకము లేవు" సాధువు కారణం చెప్పాడు.

✦ ✦ ✦

కర్తవ్యాలను శ్రద్ధతో నిర్వర్తించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

78

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## తపస్సు చెయ్యడానికి అడవులకు వెళ్ళనవసరం లేదు

**శ్లోకం: అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**

**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 17-15 ॥**

భావము: ఇతరులకు బాధ కలగకుండా హితము చేకూరునట్లు ప్రియముగా సత్యాన్ని మాట్లాడటం, వేదశాస్త్రాలను పఠించడం, పరమేశ్వరుని నామాన్ని జపించటం వాచిక (నాలుకతో చేసే) తపస్సులు.

**శ్లోకం: మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।**

**భావసంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే ॥ 17-16 ॥**

భావము: మనస్సుయందు ప్రసన్నత, శాంతస్వభావము, భగవచ్చింతన, మనోనిగ్రహము, అంతఃకరణశుద్ధి – ఇవన్నీ మానసిక (మనసుతో చేసే) తపస్సులు.

**వివరణ:** దేవుడి అనుగ్రహము, మోక్షము పొందడానికి అడవులకు వెళ్లి తపస్సు చేయవలసిన అవసరంలేదు. మనసును నియంత్రణలో ఉంచుకొని, దైవ నామాన్ని స్మరిస్తూ, ఎల్లప్పుడూ సత్యమునే పలుకుతూ, ఇతరులకు బాధ కలిగించకుండా మాట్లాడుతూ, ఎవ్వరికీ హాని కలిగించకుండా, అవసరంలో ఉన్న వారికి చేయకలిగిన సహాయం చేస్తూ జీవిస్తే చాలు. ఈ విషయాన్ని తెలియజేసే కథ చదువుదాము.

ఒక రాజు తన నలుగురు కొడుకులను పిలిచి "ఎవరు అత్యంత గొప్ప ధర్మపరుడైన వ్యక్తిని తీసుకొస్తారో వారిని యువరాజుగా ప్రకటిస్తాను" అని చెప్పాడు.

నలుగురు కొడుకులు గొప్ప ధర్మపరుడుని వెతకడానికి తలోదిక్కుకి వెళ్ళారు. వారం రోజుల తర్వాత ఒకొక్క ధర్మపరుడుని వెంటబెట్టు కొని వచ్చారు.

పెద్దకొడుకు తనతో తీసుకొచ్చిన ధనవంతుడిని పరిచయం చేసి "వీరు ఎన్నో దేవాలయాలు, ధర్మసత్రాలు కట్టించారు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు." అని చెప్పాడు

రాజు "ఇతడు ధర్మాత్ముడే సందేహం లేదు" అన్నాడు

రెండవకొడుకు తనతో తీసుకొచ్చిన వ్యక్తిని పరిచయం చేసి "వీరు పుణ్యనదులన్నింటిలో స్నానాలు చేశారు, పుణ్యక్షేత్రాలన్నింటినీ దర్శించారు." అని చెప్పాడు.

రాజు "ఇతడు నిస్సందేహంగా ధర్మాత్ముడే" అన్నాడు

మూడవకొడుకు తనతో తీసుకొచ్చిన వ్యక్తిని పరిచయం చేసి "వీరు ఎన్నో వ్రతాలు, యజ్ఞాలు చేసారు. నిత్యం దైవ ప్రవచనాలు చెప్తుంటారు"



అని చెప్పాడు.

రాజు "ఇతడు కూడా ధర్మాత్ముడే" అన్నాడు

మూడవకొడుకు తనతో తీసుకొచ్చిన పేద రైతును పరిచయం చేసి "ఒక కుక్క కాలికి తగిలిన గాయం వలన నడవలేక కుంటుతోంది. ఈ రైతు ఆ కుక్క గాయాన్ని కడిగి, ఆకుమందు రాసి కట్టు కట్టాడు. ఆకలితో చెట్టు నీడన పడుకున్న బిక్షవాడికి అన్నం పెట్టాడు." అని చెప్పాడు.

మిగిలిన ముగ్గురు కొడుకులు "వాటిలో ధర్మకార్యం ఎక్కడుంది?' అన్నారు

రాజు ఆ రైతుని "మీరు ఏమి ధర్మకార్యాలు చేస్తుంటారు?" అని అడిగాడు.

రైతు చేతులుకట్టుకొని "ప్రభూ! వ్యవసాయం చేసుకొనే నాకు ధర్మకార్యాలు అంటే ఏమిటో తెలియదు. అవసరంలో ఉన్నవాళ్ళు నన్ను అడిగినా అడగకపోయినా వాళ్లకి నేను చేయగలిగిన సహాయం చేస్తాను. ఆకలితో ఉన్నవాళ్ళు ఎవరు కనిపించినా కడుపునిండా అన్నం పెడతాను." అని చెప్పాడు.

రాజు సింహాసనం దిగి సంతోషంతో ఆ రైతును కౌగిలించుకొని "ఇతనే అందరికంటే గొప్ప ధర్మాత్ముడు." అని ప్రకటించి "దేవాలయాలు, ధర్మసత్రాలు కట్టించడం, పూజలు, వ్రతాలు చేయడం, పుణ్యక్షేత్రాలు దర్శించటం మంచి ధర్మకార్యాలే. కాని అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడమే అత్యంత గొప్ప ధర్మకార్యం. అవసరంలో ఉన్నవారికి సహాయంచేసేవారికి భగవంతుడు తప్పక సహాయం చేస్తాడు." అని వివరించాడు.

✦ ✦ ✦

దేవుడి అనుగ్రహం పొందడానికి అడవులకు వెళ్లి తపస్సు చెయ్యనవసరం లేదు. మనసును నియంత్రణలో ఉంచుకొని, దైవ నామస్మరణ చేస్తూ, ఎల్లప్పుడూ సత్యమునే పలుకుతూ, ఎవ్వరికీ హాని చెయ్యకుండా అవసరంలో ఉన్నవారికి చేయగలిగిన సహాయం చేస్తూ జీవించేవారిని దేవుడు అనుగ్రహిస్తాడని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

79

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## ప్రతిఫలం, ప్రత్యుపకారం ఆశించకుండా దానం చెయ్యాలి

**శ్లోకం: దాతవ్యమితి యద్దానం దీయతే నుపకారిణే ।**

**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 17-20 ॥**

భావము: దానము చేయటం కర్తవ్యం అనే భావనతో పాత్రులైన వారికి ప్రత్యుపకారం ఆశించకుండా చేసే దానము సాత్వికదానము

**శ్లోకం: యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః ।**

**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 17-21 ॥**

భావము: సమయం వచ్చినప్పుడు ఇతడు నాకు ప్రత్యుపకారం చేస్తాడనే భావనతో, ఈలోకంలో గాని పరలోకంలో గాని అదృష్టం కలుగుతుందనే భావనతో, అయిష్టంగా చేసే దానము రాజస దానము.

**శ్లోకం: అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే ।**

**అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥ 17-22 ॥**

భావము: అయోగ్యులకు ఇష్టం లేకుండా ఇచ్చే దానము తామస దానము.

సాత్విక దానము వలన మంచి ఫలితము, రాజస దానము వలన మధ్య ఫలితము, తామస దానము వలన అనర్థాలు కలుగు తాయి.

### వివరణ

నిజమైన ఆధ్యాత్మికత అంటే మనకున్న దాంట్లో కొంత అవసరంలో ఉన్నవారికి దానం చెయ్యడం. మనకి అవసరంలేని వాటిని ఇత రులకు ఇవ్వడం మంచిదే కాని గొప్ప దానం మాత్రం కాదు. మనకు అవసరం ఉన్నవాటి నుండి కొంతభాగం అవసరంలో ఉన్న ఇత రులకు ఇవ్వడం గొప్ప దానం. మనకి అవసరం వచ్చినప్పుడు ఎంతోకొంత ప్రత్యుపకారం చేస్తారనే ఆశతో దానం చెయ్యడం గొప్ప దానం కాదు. ఎన్నటికీ ప్రత్యుపకారం చెయ్యలేనివారికి దానం చెయ్యడం అత్యుత్తమమైన దానం.

ఈ విషయాన్ని తెలియజేసే కథ చదువు దాము.

ముగ్గురు వ్యక్తులు స్వర్గద్వారాన్ని సమీపిం చారు. మొదటివ్యక్తి ద్వారపాలకునితో "నేను శాస్త్రాలన్నీ బాగా చదివాను. నాకు స్వర్గప్రవేశం కలిగించండి" అన్నాడు. ద్వారపాలకుడు "నువ్వు శాస్త్రాలను చదివావు గాని ఆ జ్ఞానాన్ని ఆచ



రణలో పెట్టలేదు. నీకు స్వర్గంలో ప్రవేశించే అర్హత లేదు" అని చెప్పాడు.

రెండవవ్యక్తి "నేను ఎన్నో యజ్ఞయాగాదులు చేసాను. తలుపు తెరువు" అన్నాడు. ద్వారపాలకుడు "నువ్వు యజ్ఞాలు నీ స్వార్థ ప్రయోజనాల కోసం చేసావు గాని సమాజశ్రేయస్సు కోసం కాదు. కాబట్టి నీకు కూడా స్వర్గంలో ప్రవేశించే అర్హత లేదు." అన్నాడు.

మూడవవ్యక్తి "నేను నాకున్న రెండెకరాల భూమిని సాగుచేసుకుంటూ, వచ్చేపోయే బాటసారులను ఆదరించి ఉన్నదాంట్లో వారికి కొంత పెట్టి, మిగిలినది నా కుటుంబసభ్యులు తినేవాళ్ళం." అని చెప్పాడు.

ద్వారపాలకుడు "ఉన్నదానిలో కొంత ఇతరులకు పెట్టి పరోపకారం, దానం చేస్తూ జీవించావు. కాబట్టి నీకు స్వర్గంలో ప్రవేశించే అర్హత ఉంది." అని చెప్పి తలుపులు తెరిచాడు.

✦ ✦ ✦

కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞం, కలియుగంలో దానం మోక్షానికి ముఖ్యమైన సాధనాలు. అన్నదానం యొక్క గొప్పతనం గురించి వరాహ పురాణంలో ఉన్న కథను గుర్తు చేసుకుందాము.

వశిష్టుడు శ్వేత మహారాజుతో "మహారాజా! నీ రాజ్యంలో ఎక్కడా ఆకలి దప్పికలు లేకుండా చూడు. అడిగినవాళ్లకు లేదనకుండా అన్నం పెట్టు. ఎవరి శక్తికి తగినట్లు వాళ్ళు అన్నదానం చేసేలా నీ రాజ్యంలోని ప్రజలను ప్రోత్సహించు. అన్నదానాన్ని మించిన దానం లేదు." అని

చెప్పాడు.

శ్వేతరాజుకు ఆ మాటలు నచ్చలేదు. మహారాజునైన నేను విలువైన వస్తువులు దానం చెయ్యకుండా అన్నం దానం చెయ్యడమేమిటని ఆలోచించి కోశాగారాన్ని తెరిపించి ప్రతీరోజూ బంగారం, వెండి, వజ్రాలు వంటి అనేక ఖరీదైన వస్తువులను దానం చేసాడు.

కొంతకాలానికి శ్వేతరాజు చనిపోయి స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ అతనికి స్వర్గ సుఖాలన్నీ అందుబాటులో ఉన్నాయి కాని ఆకలి తీర్చుకోడానికి అన్నము, దాహం తీర్చు కోడానికి నీళ్ళు మాత్రం అందుబాటులో లేవు.

స్వర్గంలో ఆకలిదప్పులతో అలమటిస్తున్న శ్వేతరాజుకు వశిష్టుడు కనపడ్డాడు. రాజు ఆయనకు నమస్కరించి ఆకలిదప్పుల నుండి కాపాడమని వేడుకున్నాడు.

వశిష్టుడు "రాజా! అన్నదానాన్ని మించిన దానం లేదని, నీరే ప్రాణాధారమని వాటిని దానం చెయ్యమని నేను చెప్పిన హితవును నువ్వు పట్టించుకోలేదు. వాటికంటే బంగారం, వెండి, వజ్రాలు గొప్పవని భావించి వాటిని దానం చేసావు. అన్నము మరియు నీరు దానం చెయ్యక పోవడం వలనే నీకీ గతి పట్టింది. దేవతలకు కూడా వరాలివ్వగల శక్తి అగస్త్యమునికి మాత్రమే ఉంది. ఆయన వచ్చి నీ ఆకలిదప్పులు తీరుస్తాడు." అని చెప్పి వెళ్ళిపోయాడు.

✦ ✦ ✦

విదర్భరాజ్యంలో క్షామం ఏర్పడింది. ప్రజలు ధాన్యం దొరక్క ఆకలితో మరణిస్తున్నారు. రామయ్య అనే రైతు వద్ద మాత్రం ఇరవై బస్తాల బియ్యం ఉన్నాయి. వాటితో అతని కుటుంబం సంవత్సరం పాటు ఆకలి తెలియకుండా హాయిగా జీవించవచ్చు. కాని రామయ్య కుటుంబం ఆ బియ్యాన్ని ఉపయోగించకోలేదు. కుటుంబం లోని వారంతా ఆకలిబాధతో మరణించారు.

అంత ధాన్యం ఉంచుకొని వారు ఆకలితో ఎందుకు మరణించారో తెలుసుకోవాలని చుట్టు ప్రక్కలవాళ్ళు రామయ్య ఇల్లంతా గాలించారు. వారికి రామయ్య రాసిన వీలునామా దొరికింది. దానిలో రామయ్య "ఎవరి వద్దా ధాన్యం లేని సమయంలో మేము కూడా మా వద్ద ఉన్న ధాన్యం మొత్తం తినేస్తే రాబోయే వర్షాకాలంలో విత్తనాలు ఉండవు. అందుకే మేము వాటిని ఉపయోగించుకోలేదు. మావద్ద ఉన్న ధాన్యాన్ని విత్తనాలుగా ఉపయోగిస్తే అనేక కుటుంబాల ఆహార కొరత తీరుతుంది" అని రాశాడు.

✦ ✦ ✦

నా దగ్గర ఉన్నది ఇతరులతో పంచుకుంటు న్నాననే ఆనందంతో దానం ఇవ్వాలి గాని గుర్తింపు ఆశించి కాదు. దానం ఇవ్వడానికి తగినంత డబ్బు లేనివాళ్ళు తమ ఆలోచనలను, సమయాన్ని దానం చెయ్య వచ్చు. దానం కేవలం మొక్కుబడి కోసం కాక మనసులో నుండి పుట్టిన కోరిక వలన చెయ్యాలి. దానం ఇచ్చిన తర్వాత మనసుకు ఒక అద్భుతమైన అనుభవం కల గాలి.

ప్రతిఫలం గాని, ప్రత్యుపకారం గాని ఆశించకుండా దానం చెయ్యాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

80

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।**
**అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ ॥ 17-28 ॥**

భావం: శ్రద్ధ (విశ్వాసం) లేకుండా చేసే హోమము, దానము, తపస్సు మరియు ఇతర శుభకర్మల వలన జీవించి ఉండగా గాని మరణించిన తర్వాత గాని ఎటువంటి ప్రయోజనమూ ఉండదు.

వివరణ:

## శ్రద్ధతో ప్రయత్నిస్తే విజయం

ఎవరైనా విజయం సాధించలేకపోతే వారికి విజయం సాధించగల శక్తిసామర్థ్యాలు లేవని అర్థం కాదు. వారికి విజయంపై కోరిక, విజయం సాధించడం కోసం చేసే ప్రయత్నంపై శ్రద్ధ బలంగా లేవని అర్థం. విజేతలకు, పరాజితులకు మధ్య ఉండే ముఖ్యమైన తేడా ఇదే. విజయం కోసం చేసే ప్రయత్నాల మీద శ్రద్ధ విజేతలకు బలంగా ఉంటే పరాజితులకు బలహీనంగా ఉంటుంది.

తల్లిదండ్రులకు టీచర్లకు చదివామని తెలియడం కోసం శ్రద్ధ పెట్టకుండా మొక్కుబడిగా పదిసార్లు చదివినా అర్థంకాని పాఠం పరీక్షల ముందు శ్రద్ధతో ఒక్కసారి చదవగానే అర్థం కావడం మన అందరికీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చి ఉంటుంది. సివిల్ సర్వీసెస్, ఐఐఎం క్యాట్, ఐఐటి ఎంట్రన్స్ వంటి కఠినమైన పరీక్షలలో ప్యాస్ అవ్వాలని అందరికీ ఉంటుంది. కాని ఎక్కువ మంది పూర్తి శ్రద్ధ పెట్టకుండా ప్రయత్నిస్తారు. ప్యాస్ అవ్వలేక నిరాశ చెందుతారు. కాని శ్రద్ధతో ప్రయత్నించేవాళ్ళు తప్పకుండా ప్యాస్ అవుతారు.

సిరాక్యూస్ రాజైన హెరో తను చేయించుకున్న కిరీటం స్వచ్ఛమైన బంగారంతో చేయబడిందో, కల్తీ బంగారంతో కల్తీ చేయబడిందో కనిపెట్టమని తన ఆస్థాన పండితులను అడిగాడు. ఆర్కిమెడిస్ ఆ సమస్యను వివిధ కోణాలలో విశ్లేషించాడు. ఎలాగైనా పరిష్కారం కనుక్కోవాలని శ్రద్ధతో నిరంతరం అదే ధ్యాసతో గడిపాడు. స్నానం చేస్తున్నప్పుడు కూడా ఆ సమస్య గురించే ఆలోచించాడు. అలా ఆలోచిస్తూ నిండుగా నీళ్ళున్న నీటి తొట్టిలోకి స్నానానికి దిగుతూ కాలుజారి నీటి తొట్టిలోకి పడ్డాడు. తొట్టిలోని నీరు కొంత బయటకు పొర్లింది. అలా పొర్లిన నీళ్ళను గమనించిన ఆర్కిమెడిస్ రాజుగారి కిరీటంలోని బంగారం స్వచ్ఛమైనదో కాదో నిరూపించడానికి కావలిసిన సాపేక్ష సాంద్రత సిద్ధాంతాన్ని కనిపెట్టాడు. పట్టరాని

ఆనందంతో "యురేకా" అంటూ కేకలు వేస్తూ రాజు వద్దకు వెళ్ళాడు. సమస్య పరిష్కారానికి ఆర్కిమెడిస్ శ్రద్ధతో ఆలోచించాడు, విజయం సాధించాడు.

✦ ✦ ✦

శ్రద్ధ / ఏకాగ్రత / మనసు లేని పూజ వలన ప్రయోజనం ఉండదని తెలియజేసే ఒక కథ చదువుదాము.


గ్రామాధికారి బ్రహ్మయ్య గొప్ప శివభక్తుడు. ప్రతీఉదయం గంటసేపు శివపూజ చేసిగాని ఏపనీ మొదలుపెట్టడు. కాని పూజ చేస్తున్నంత సేపూ "ఆపని అయ్యిందా? ఈపని అయ్యిందా?" అంటూ కుటుంబసభ్యులను మాటిమాటికి అడుగుతుండేవాడు.

ఒకరోజు ఉదయం బ్రహ్మయ్య పూజ చేసుకుంటూ కూతురుని "లావణ్యా! పెరట్లో పాలేరు కొబ్బరి కాయలు వలుస్తున్నాడో లేదో చూడమ్మా" అన్నాడు. లావణ్య చూసొచ్చి "వలుస్తున్నాడు నాన్నా" అని చెప్పింది. ఐదు నిమిషాల తర్వాత బ్రహ్మయ్య మళ్ళీ "లావణ్యా! వాడు పీచు సరిగ్గా తీయడు. సరిగ్గా తీయమని చెప్పమ్మా" అన్నాడు.

అంతలో ఒక వ్యక్తి వచ్చి బ్రహ్మయ్య కూతురిని "గ్రామాధికారి గారున్నారా?" అని అడిగాడు. లావణ్య "నాన్నగారు పెరట్లో కొబ్బరికాయలు ఒలిపిస్తున్నారు. పది నిమిషాలు కూర్చోండి. వస్తారు" అని చెప్పింది.

పూజ ముగించి వచ్చిన బ్రహ్మయ్యా కూతురుతో "నేను పూజగదిలో పూజ చేసుకుంటుంటే కొబ్బరికాయలు ఒలిపిస్తున్నానని అబద్ధం ఎందుకు చెప్పావు?" అని అడిగాడు.

"మీ శరీరం పూజ గదిలో ఉందిగాని మీ



మనసు మాత్రం పెరట్లో కొబ్బరికాయం ఒలిచే దగ్గర ఉంది నాన్నగారు. అందుకే అలా చెప్పాను" లావణ్య కారణం చెప్పింది.

పూజ, ప్రార్థన, జపం, భజన, ధ్యానం చేసేడప్పుడు మనసులోనికి వేరే ఆలోచనలు రానీయకుండా ధ్యాసంతా భగవంతుడి మీదే ఉండాలి.

✦ ✦ ✦

చదువులోనైనా, వృత్తిలో నైనా, ఉద్యోగంలో నైనా, భక్తిలోనైనా, మరే పనిలోనైనా శ్రద్ద పెట్టకుండా ప్రయత్నిస్తే విజయం రాదు. శ్రద్ధతో ప్రయత్నిస్తే ఏ పనిలోనైనా విజయం సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్



# యువతకు భగవద్గీత చూపించిన దారి



## మోక్షసన్న్యాస యోగము

### కష్టపడకుండా ఫలితం రాదు

శ్లోకం: దుఃఖమిత్యేవ యత్కర్మ కాయ క్లేశభయాత్త్యజేత్ ।
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్॥ 18-8 ॥

భావం: కర్మలన్నీ దుఃఖకారకములే అని భావించి శారీరక శ్రమకు భయపడి కర్తవ్య కర్మలను త్యాగం చేయడాన్ని రాజసత్యాగం అంటారు. కాని అటువంటి త్యాగం వలన ఎటువంటి ప్రయోజనమూ ఉండదు.

### వివరణ:

కష్టపడి పనిచేయడం ఇష్టంలేక సోమరి తనం వలన కొంతమంది తమ కర్తవ్యాలను నిర్వహించడం మానేస్తారు. సోమరితనం ఒంటరిగా రాదు. తనతో పాటూ అంతులేని నిరాశను కూడా తీసుకొస్తుంది. సోమరితనం, నిరాశ కలిసి మనిషికి ఎదుగుదల లేకుండా చేస్తాయి. అందుకే సోమరితనం అనే వ్యాధి సోకిన మనిషి ఎప్పటికీ బాగుపడడు.

శారీరక శ్రమకు భయపడి కొంతమంది లక్ష్యసాధనకు / కర్తవ్య నిర్వహణకు షార్ట్ కట్స్ (దగ్గరి దారులు / అడ్డదారులు) వెదుకుతారు. సంవత్సరమంతా చదవకుండా పరీక్షలకి వారం ముందు పుస్తకాలు తెరుస్తారు. సిలబస్ మొత్తం చదవడానికి సమయం సరిపోదని గ్రహించి పరీక్షల్లో కాపీలు కొట్టడానికి ప్రయ త్నాలు చేస్తారు. పరీక్షలలో కాపీ కొడుతూ పట్టు బడి డిబార్ అవుతారు.

విజయానికి అడ్డదారులు లేవనేది జగ మెరిగిన సత్యం. అయినా కొంతమంది కష్ట పడకుండా విజయాలు సాధించడానికి అడ్డ దారుల కోసం వెదుకుతారు. అడ్డదారులు మంచివి కావని తెలిసినా కష్టపడకుండా కర్త వ్యాలను నిర్వహించాలనే దురాశతో అడ్డదారు లలో ప్రయాణం చేస్తారు. అడ్డదారులు ఎప్పుడో ఒకప్పుడు నిట్టనిలువునా ముంచుతాయి. కాని అప్పటికే సమయం మించిపోతుంది.

పరిపాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ, సామా జిక చైతన్యం బలహీనంగా ఉన్నప్పుడు కొంత మంది అక్రమమార్గాలలో విజయం సాధించ వచ్చు. కాని అటువంటి విజయాలు తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే కలిగిస్తాయి. దీర్ఘ కాలిక ప్రయోజనాలను కలిగించవు. కాని అటు వంటివారిని చూసి అక్రమ మార్గాలను అనుస రించేవారు మొదటి ప్రయత్నంలోనో, రెండో

ప్రయత్నంలోనో కోలుకోలేని దెబ్బతింటారు.

ఈ విషయాన్ని తెలియజేసే ఒక ఉదాహరణ చదువుదాము.

ఆమధ్య జరిగిన ఎ.పి మెడికల్ పి.జి ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో కొంతమంది విద్యార్థులు పి.జి సీటు కోసం కష్టపడి చదవకుండా డబ్బులు చెల్లించి ప్రశ్నాపత్రాన్ని కొని మంచి ర్యాంకులు సాధించారు. కాని ఆ ఆనందం వారికి ఎంతోకాలం మిగలలేదు. స్కాం విషయం బయటకి పొక్కింది. ఆ ఎంట్రన్స్ పరీక్షను రద్దుచేసి మరోసారి ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. డబ్బులు పెట్టి ప్రశ్నాపత్రాన్ని కొని మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆ ర్యాంకులు మిగలలేదు. డబ్బులు వృధా అవ్వడమే కాక వారిలో కొంతమంది అరెస్టు కూడా చెయ్యబడ్డారు.


అందుకే గాంధీగారు "గమ్యము, గమనము రెండూ ఉత్తమమైనవై ఉండాలి" అన్నారు.

✦ ✦ ✦

దేవుడు ప్రయత్నించిన వారికే సహాయం చేస్తాడని తెలియజేసే రెండు కథ చదువుదాము.

ఒక విద్యార్థి స్వామీజీ వద్దకు వెళ్లి "స్వామీ! నేను ప్రతీ సంవత్సరం పరీక్షకు వెళ్లేముందు గుడికి వెళ్లి, శ్రద్ధగా పూజ చేసి వెళ్తున్నాను. అయినా మూడు సంవత్సరాలుగా పరీక్ష ఫెయిలవుతున్నాను. ఎంత శ్రద్ధగా పూజ చేసినా దేవుడు నా చిన్న కోరిక ఎందుకు తీర్చట్లేదు?" అని అడిగాడు.

స్వామీజీ చిన్నగా నవ్వి "నీకు బ్యాంకులో అకౌంటు ఉంది. కాని అకౌంటులో నువ్వు ఒక్క



రూపాయి కూడా డిపాజిట్ చెయ్యలేదు. బ్యాంకులో క్యాషియర్ నీ క్లోజ్ ఫ్రెండ్. నువ్వు నీ అకౌంట్లో నుండి ఇరవైవేలు ఇవ్వమని అడి గితే ఇస్తాడా?" అని అడిగాడు

"ఇవ్వడు."

"ఎందుకు?"

"నేను నా అకౌంటులో డబ్బు డిపాజిట్ చెయ్యలేదు కాబట్టి"

"క్యాషియర్ నీ స్నేహితుడైనా నువ్వు ఎంత డబ్బు డిపాజిట్ చేస్తే అంతే తిరిగి ఇస్తాడు. అలాగే దేవుడు కూడా నువ్వు ప్రయత్నం చేస్తేనే విజయం ఇస్తాడు. నీ కష్టానికి తగినంత ఫలితాన్ని మాత్రమే ఇస్తాడు." స్వామీజీ వివరించారు.

✦

82

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్

**కొండ అవతల ఉన్న పారుగూరికి వెళ్తున్న ముగ్గురు బాటసారులు కొండ మీద నుండి వేసిన బాటలో నడచి వెళ్తున్నారు. దాహం వేసి నీటి కోసం చుట్టుపక్కల చూశారు. కొండకి దిగువున ఒక సెలయేరు ప్రవహిస్తూ కనిపించింది.**

మొదటి బాటసారి "ఓ భగవంతుడా! దప్పికకు తాళలేకపోతున్నాను, ఎలాగైనా నా దాహం తీర్చు" అని గట్టిగా ప్రార్థించాడు. రెండవ బాటసారి "దేవుడా! మేఘాలను సృష్టించి నాపైన వర్షపు జల్లులు కురిపించి నా దప్పిక తీర్చు" అని గొంతెత్తి వేడుకున్నాడు.

## నిర్దుష్టమైన ప్రణాళిక ఉండాలి

మూడవ బాటసారి "దేవుడా నా ప్రయత్నానికి సహకరించు" అని ప్రార్థించి కొండ దిగి వెళ్ళి సెలయేటిలోని నీళ్ళు త్రాగి వచ్చాడు. మిగిలిన ఇద్దరు బాటసారులు ఇంకా దేవుడిని దాహం తీర్చమని ప్రార్థిస్తూనే ఉన్నారు.

✦ ✦ ✦

విజయాలు సాధించడానికి ఏమిచెయ్యాలో చాలామందికి తెలుసు. కాని విజయం సాధించడానికి తగిన మూల్యం చెల్లించాలనే విషయం చాలామందికి తెలియదు.

రోగం తగ్గాలంటే డాక్టరు రాసిన మందులు కొంటే చాలదు. కొన్న మందులు డాక్టరు చెప్పిన ప్రకారం వాడితేనే రోగం తగ్గుతుంది. అలాగే శాస్త్రాలను చదివితే సరిపోదు. చదివిన శాస్త్రాలను ఆచరణలో పెట్టాలి. అప్పుడే శాస్త్రాలు చదివిన ఫలితం లభిస్తుంది.

విజయాలు సాధించాలని, పేరు ప్రఖ్యాతులు పొందాలని అందరూ కోరుకుంటారు. కాని ఎక్కువమంది ఆ కోరికలను నిజం చేసుకోలేక పోతారు. కోరికలను నిజం చేసుకోడానికి ఆరాటం వుంటే సరిపోదు. ఒక నిర్దుష్టమైన ప్రణాళిక ఉండాలి, ఆ ప్రణాళిక ప్రకారం క్రమం తప్పకుండా సాధనచెయ్యాలి.

తాను మృగరాజునని కదలకుండా గుహలో కూర్చుంటే ఇతర జంతువులు తమంతట తాము



వచ్చి సింహం నోట్లో పడవు. తన శక్తిసామర్థ్యాలతో వేటాడితేనే సింహానికైనా ఆహారం దొరుకుతుంది. అలాగే కష్టపడి పనిచేస్తేనే ఎంతటి శక్తిమంతులకైనా విజయం లభిస్తుంది.

కష్టపడి పనిచెయ్యవలసి వస్తుందని భయపడి కర్తవ్యాలను నిర్వహించడం మానేయకుండా, కష్టపడి ప్రయత్నిస్తే గొప్ప విజయాలను సాధించవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

83

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## నేనే చేస్తున్నాను అనే భావన లేకుండా

**శ్లోకం: యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**

**హత్వాపి స ఇమాఉల్లోకాన్న హన్తి న నిబధ్యతే ॥ 18-17 ॥**

భావం: ఇదంతా నేనే చేస్తున్నాను అనే భావన లేకుండా కర్తవ్యకర్మలను చేసే వ్యక్తి లోకములన్నింటినీ హతమార్చినా వానికి పాపము అంటదు.

**శ్లోకం: సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**

**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 18-66 ॥**

భావము: సమస్త కర్తవ్యకర్మలను నాకు సమర్పించి నన్ను శరణుజొచ్చుము. నేను నిన్ను అన్ని పాపములనుండి విముక్తుడిని చేస్తాను. నీవు శోకించవద్దు.

శ్లోకం: సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।

మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥ 18-56 ॥

భావం: సమస్త కర్మలయందు కర్తృత్వ భావము విడిచి నన్నే ఆశ్రయించిన కర్మయోగి కర్మలను నిరంతరం చేస్తూనే నా అనుగ్రహము వలన శాశ్వతమైన పరమపదమును పొందును.

వివరణ: కర్తవ్యాలను దేవుని ఆజ్ఞగా భావించి నిర్వర్తించాలని, అలా నిర్వహించడం వలన కర్తవ్యాలను తన - పర బేధాలు లేకుండా, నిజాయితీగా, తప్పులు, మోసాలు జరగడానికి అవకాశాలు లేకుండా నిర్వహిస్తామని ఇంతకు ముందు తెలుసుకున్నాము. అలా కర్తవ్యాలను నిర్వహించినప్పుడు వాటి ఫలితాలను కూడా భగవంతుడికీ అర్పించాలి. కాని కొంతమంది కీర్తి తెచ్చిన కర్మలకు కారణం నేనే అని అపకీర్తి తెచ్చిన కర్మలకు కారణం దేవుడని చెప్తారు. అది సరికాదని తెలియజేసే కథ చదువుదాము.

భీమయ్య తన ఇంటిముందున్న ఖాళీ

స్థలంలో పూలమొక్కలు, ఆకు కూరలు, కూర గాయలు పెంచాడు. ఒకనాడు ఎదురింటిలో ఉండే ధర్మయ్య పెంచుకుంటున్న మేక భీమయ్య తోటలోకి వెళ్లి మొక్కలను తింటోంది. అది గమనించిన భీమయ్య పిచ్చి కోపంతో దుడ్డు కర్రతో మేకను ఆపకుండా కొట్టాడు. ఆ దెబ్బలకు మేక చనిపోయింది.


విషయం తెలుసుకున్న ధర్మయ్య భీమయ్యతో "మేక తోటలోకి వచ్చి మొక్కలు తింటే, కర్రతో ఒక దెబ్బ వేసి దానిని తరమాలి గాని ఇలా చచ్చేలా కొడతారా? మేకను తరిమేసి నీకెంత నష్టం జరిగిందో చెబితే నష్టపరిహారం చెల్లించే వాడిని. ఇలా మూగజంతువును కొట్టి చంపడం అన్యాయం" అన్నాడు.

భీమయ్య "నేను చంపడమేమిటి? దాని ఆయుష్షు తీరి చనిపోయింది. దాని ఆయుష్షు తీరికపోతే నేను ఎంత కొట్టినా చనిపోదు" అని జవాబిచ్చాడు.

బిక్ష కోసం వచ్చిన ఒక సాధువు వారిద్దరి మాటలు విన్నాడు. "ఈ తోట చాలా అందంగా ఉంది, ఎవరు పెంచారు?" అని అడిగాడు.

భీమయ్య ముందుకు వచ్చి "నేనే ఎంతో కష్టపడి పెంచాను" అన్నాడు

సాధువు చిన్నగా నవ్వి "మేక చనిపోడానికి కారణం భగవంతుడైతే ఈతోట ఇంత అందంగా



పెరగడానికి కారణం కూడా భగవంతుడే కావాలి. ఈతోట పెరగడానికి కారణం నువ్వ యితే మేక చనిపోడానికి కారణం కూడా నువ్వే కావాలి. కీర్తి తెచ్చిన కర్మలకు కారణం నేనే అని అపకీర్తి తెచ్చిన కర్మలకు కారణం దేవుడని భావించకూడదు" అని బోధించాడు.

కర్తవ్యాలను భగవంతుడి ఆజ్ఞాలుగా భావించి నిర్వహించాలి, వాటి ఫలితాలను కూడా భగవంతుడికే అర్పించాలని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

84

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## పని వాయిదా వేయద్దు

**శ్లోకం: అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోలసః ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥ 18-28 ॥**

భావం: అసమర్థుడు, జ్ఞానము సంస్కారము లేనివాడు, వినయవిధేయతలు లేనివాడు, మోసాలు చేసేవాడు, ఇతరుల పనులకు ఆటంకాలు కలిగించేవాడు, కర్తవ్యాన్ని నిర్వహించని సోమరి, చేయవలసిన పనులను దీర్ఘకాలం వాయిదాలు వేసేవాడు - ఇటువంటి లక్షణాలు కలవాడిని తామసుడు అంటారు.

### వివరణ

సోమరితనం, వాయిదా వేయడం అనే రెండు లక్షణాలు సోదరుల వంటివి. ఒకటి ఉన్నవారికి రెండోది కూడా బోనస్‌గా ఉంటుంది. సోమరితనం ఉన్నవాళ్ళు చేయవలసిన పనులు వాయిదా వేస్తారు. పనులు వాయిదా వేసినవారు చెయ్యవలసిన పనిలేక సోమరితనంగా కూర్చుంటారు.

వాయిదా వేయడం అనేది సోమరితనానికి ప్రతీక. వాయిదా వేయడం సోమరితనానికి దారి తీస్తుంది. పనులను వాయిదా వేసేవాళ్ళు నిత్య జీవితంలో ఏ పని చేయాలన్నా దానిని వాయిదా వేస్తూ ఉంటారు. తినాలన్నా, పడుకోవాలన్నా, త్రాగాలన్నా ఇలా ప్రతీదానిని వాయిదా వేస్తూనే ఉంటారు. ప్రతీ పనినీ వాయిదా వేయడం వలన చేయ్యవలసిన పనులు పేరుకుపోయి ఎంత గట్టిగా ప్రయత్నించినా చెయ్యలేని క్లిష్ట పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి వారు జీవితంలో ఏమీ సాధించలేరు, చాలా నష్టపోతారు.

బద్ధకస్తులు ప్రమాదం జరుగుతుందని తెలిసినా కూడా పని తొందరగా చేయడానికి ప్రయత్నించరు. ఫలితంగా ప్రమాదాలలో చిక్కుకుంటారు. అటువంటి నలుగురు బద్ధకస్తుల గురించి తెలుసుకుందాము.

నలుగురు బద్ధకస్తులు వనభోజనానికి దగ్గరలో ఉన్న అడవిలోకి వెళ్ళాలని అనుకున్నారు. అడవిలో వంట చేసుకోడానికి కావలిసిన సరుకులు ఎవరు ఏమి తీసుకురావాలో నిర్ణయించుకున్నారు.

"నేను పప్పు తీసుకువస్తాను" అన్నాడు మొదటివాడు.

"నేను బియ్యం!" అన్నాడు రెండోవాడు.

"నేను వంటకు కావలసిన కూరలు" అన్నాడు మూడోవాడు.

"నేను వంట చేస్తాను" అన్నాడు నాలుగోవాడు.

అనుకున్నట్లే వాళ్ళు నలుగురు అడవిలోకి వెళ్ళారు. నాలుగోవాడు వంట చేస్తుండగా ఉప్పు తేలేదని గమనించి "ఉప్పులేని భోజనం ఎలా తింటాము? ఎవరైనా వెళ్లి ఉప్పు తీసుకు రండి" అన్నాడు. నలుగురూ బద్ధకస్తులు కావడంతో ఉప్పు తేడానికి ఎవ్వరూ ఒప్పుకోలేదు. మొదటి బద్ధకస్తుడు మనలో ఎవరైతే ముందు మాట్లాడతారో, వాళ్లు వెళ్ళి ఉప్పు తేవాలని సమస్యకి ఒక పరిష్కారం చెప్పాడు

మధ్యాహ్నం అయ్యింది. అయినా ఎవ్వరూ మాట్లాడలేదు. అంతలో ఒక కుక్క వచ్చి వండిన వంటలను తినబోయింది. నలుగురు బద్ధకస్తులు నోటితో శబ్దం చెయ్యకుండా చేతులతో కుక్కను అదిలించారు. కాని కుక్క భయపడకుండా వంటలను తినడం ప్రారంభించింది. అయినా బద్ధకస్తులు మాట్లాడలేదు. ఒక బద్ధకస్తుడు ప్రక్కనే ఉన్న రాయి తీసి కుక్క మీదకు విసిరాడు. కుక్క పారిపోయింది.

సాయంత్రం అయ్యింది. అయినా వాళ్ళు ఒక్క మాట కూడా మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నారు. అటుగా వెళ్తున్న పోలీసు కానిస్టేబులుకి వాళ్ళమీద అనుమానం వచ్చి మీరెవరు? ఇక్కడ ఎందుకు ఉన్నారు? ఏమి చేస్తున్నారు? అని అడిగాడు. వాళ్ళు సమాధానం ఇవ్వలేదు. పోలీసు అనుమానం మరింత బలపడింది. వాళ్ళని పోలీసు స్టేషనుకి రమ్మన్నాడు. అయినా వాళ్ళు మాట్లాడకుండా కానిస్టేబుల్ వెంట పోలీసు స్టేషనుకి వెళ్ళారు.



పోలీసు స్టేషన్లో ఎస్సై అడిగినా వాళ్ళు నోరు విప్పలేదు. పోలీసుల అనుమానం మరింత బలపడింది. వాళ్ళతో మాట్లాడించడానికి లాటీతో కొట్టబోయారు. తన మీద పడబోయే లాటీదెబ్బకు భయపడి మొదటి బద్ధకస్తుడు "కొట్టద్దు సార్" అని బ్రతిమాలాడు. వెంటనే మిగిలిన ముగ్గురూ "నువ్వు మొదట మాట్లాడావు. కాబట్టి ఉప్పు నువ్వే తేవాలి" అన్నారు.

ఉప్పు తేవడం ఏమిటో అర్థంకాక ఎస్సై విషయం ఏమిటని అడిగాడు. నలుగురు బద్ధకస్తులు జరిగిన విషయం చెప్పారు.

✦



85

# యువతకు భగవద్గీత చూపించిన దారి

-మొండెపు ప్రసాద్



## పని వాయిదా వేయద్దు

**బద్ధకం అతి నెమ్మదిగా నడుస్తుంది. కొద్ది సమయంలోనే పేదరికం / అపజయం దానిని దాటివేస్తుంది. ఫలితంగా అపజయాలు, ఆస్తులు అమ్ముకొని జీవించే దుర్భర పరిస్థితులు వస్తాయి. ఈ విషయాన్ని తెలియజేసే సోమరిపోతు దంపతుల కథ తెలుసుకుందాము.**

సోమయ్య అతని భార్య ఇద్దరూ సోమరిపోతులు. తినడం తప్ప మరోపని చేసేవారు కాదు. సంపాదన లేక ఆస్తులు అమ్ముకుని తినేవారు. కొన్నాళ్ళ తర్వాత అమ్ముకోడానికి నివాసం ఉంటున్న ఇల్లు తప్ప మరేమీ మిగల లేదు. అయినా ఏదైనా పనిచేసి డబ్బులు సంపాదించడానికి ప్రయత్నించకుండా రాజు వద్దకు వెళ్లి ధనసహాయం కోరాడు. రాజు రెండు ఆవులను ఇచ్చి పాలవ్యాపారం చేసుకొని బ్రతకమన్నాడు. ధనం ఇస్తాడని ఆశిస్తే ఆవుని ఇచ్చాడని నిరాశతో సోమయ్య “రాజా! నావద్ద ఆవుకి మేత కొనడానికి సరిపడే డబ్బులు కూడా లేవు” అని చెప్పాడు. రాజు పది క్షణాలు ఆలోచించి “అవుకు కావలసిన మేత నేను రోజూ పంపుతాను” అని చెప్పాడు. పనిచెయ్యడం ఇష్టంలేని సోమయ్య “నాకు పాలు పితకడం రాదు. పాలు పితికడానికి పనివాడిని పెట్టుకొనే స్తోమత లేదు రాజా” అని చెప్పాడు. రాజు అర నిమిషం పాటు ఆలోచించి “ఆవును మేపడానికి, పాలు పితకడానికి, పితికిన పాలు అమ్మడానికి ఒక పనివాడిని నేను పంపిస్తాను.” అన్నాడు. పనిచెయ్యకుండా డబ్బులు వస్తాయనే ఆనందంతో సోమయ్య రాజుకు కృతజ్ఞతలు చెప్పి ఆవును తీసుకొని వెళ్ళిపోయాడు.

మరునాడు ఉదయం రాజు పంపిన పనివాడు వచ్చి ఆవుకు మేత వేసి, పాలు పితికి, పితికిన పాలు తీసుకెళ్ళి అమ్మి, అమ్మగా వచ్చిన డబ్బులు తీసుకొచ్చి సోమయ్యకు ఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ డబ్బులతో సోమయ్య కావలసిన సరకులు కొనుక్కొచ్చాడు. వాటితో సోమయ్య భార్య వంట చేసింది. వంట పూర్తయ్యేసరికి ఇద్దరు పేదవారు వచ్చి “మమ్మల్ని రాజుగారు



పంపారు. బద్ధకం వలన మీరు భోజనం కూడా చెయ్యలేరని, మీ బదులు భోజనం తిని మీకు సహాయం చెయ్యమని చెప్పారు" అని చెప్పారు.

సోమయ్యకు, అతని భార్యకు జ్ఞానోదయ మయ్యింది. అప్పటినుండి బద్ధకాన్ని వదిలేసి కష్టపడటం అలవాటు చేసుకొన్నారు.

✦ ✦ ✦

సోమరులు పనిచేసే రోజు ఎప్పటికీ రేపే. కొంతమంది రేపటినుండి మార్నింగ్ వాక్/ యోగా/ఎక్సర్సైజులు మొదలుపెట్టి బరువు తగ్గాలని అనుకుంటారు. కాని వారు మార్నింగ్ వాక్/యోగా/ఎక్సర్సైజులు మొదలుపెట్టే 'రేపు' ఎప్పటికీ రాదు, వాళ్ళు ఎప్పటికీ బరువు తగ్గరు.

✦ ✦ ✦

ఇతరులవల్ల ఏ పనైనా ఆలస్యం జరిగితే మనం ఎంతో అసహనానికి గురవుతాము, చికాకు పడతాం, కోపం తెచ్చుకుంటాము. పాలు సమయానికి రాకపోయినా, న్యూస్ పేపర్ రావడం ఆలశ్యమైనా, సిటీ బస్ టైముకి రాక పోయినా, నెంబర్ డయల్ చేసిన వెంటనే ఫోన్ కలవకపోయినా భరించలేము. మనం చెయ్య వలసిన పనులు వాయిదావేసి సమయానికి చెయ్యకపోతే ఇతరులు కూడా అదేవిధంగా మనల్ని అసహ్యించుకుంటారు. కాబట్టి వాయిదా వేయకుండా ఎప్పుడు చెయ్యవలసిన పనులు అప్పుడే చెయ్యాలి.

సోమరితనాన్ని వదిలి, వాయిదాలు వేయ కుండా ఎప్పటిపనులు అప్పుడు చెయ్యాలని



-మొండెపు ప్రసాద్

86

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## స్వాభావిక కర్మల ద్వారా పూజ

**శ్లోకం: స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**

**స్వకర్మనిరతః సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు ॥ 18-45 ॥**

భావం: తమతమ స్వాభావిక కర్మల యందు తత్పరులైనవారు భగవత్ప్రాప్తిని పొందుతారు. స్వాభావిక కర్మలయందు తత్పరులైనవారు పరమసిద్ధిని ఎట్లు పొందుతారో వివరిస్తాను వినుము.

**శ్లోకం: యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**

**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః ॥ 18-46 ॥**

భావం: ప్రాణులన్నింటినీ పుట్టించిన పరమేశ్వరుడు జగత్తు అంతా మరియు ప్రాణులన్నింటిలో వ్యాపించి వున్నాడనే భావముతో తన స్వాభావిక కర్మల ద్వారా పరమేశ్వరుని పూజించే వ్యక్తి పరమసిద్ధిని పొందుతాడు.


**వివరణ :** భగవంతుడిని ఆరాధించడానికి కర్తవ్యాలు, బాధ్యతలు, వృత్తి, వ్యాపారాలు అడ్డుకావు.

కర్తవ్యాలను, బాధ్యతలను, వృత్తి లేక వ్యాపారాలను దైవంగా భావించి పనిచేస్తే భగవంతుడిని పూజించినట్లే. ఈ విషయాన్ని తెలియజేసే ఒక కథ గుర్తుచేసుకుందాము.

కౌశిక మహర్షి చెట్టుక్రింద తపస్సు చేసుకుంటుండగా ఒక పక్షి ఆయన తల మీద రెట్ట వేసింది. కౌశికుడు తల పైకెత్తి తీక్షణంగా చూసాడు. ఆ చూపులోని తీక్షణత తట్టుకోలేక చెట్టుమీద వున్న కొంగ క్రిందపడి చచ్చిపోయింది.

తర్వాత కౌశికుడు ఎప్పటిలాగే గ్రామంలోకి బిక్షాటనకి బయల్దేరాడు. ఒక ఇంటి గుమ్మం ముందు నిలబడి "భవతీ బిక్షాందేహి" అని కేక వేసాడు. బిక్షం వెయ్యడానికి ఎవ్వరూ బయటకి రాలేదు. ఇంటి ఇల్లాలు పనిలో వుండి వుంటుంది. పని పూర్తయిన తర్వాత బిక్షం వేస్తుందని భావించి గుమ్మంలోనే నిలబడి వున్నాడు.

అంతలో ఆ ఇల్లాలి భర్త బయటినుండి "ఆకలి ఆకలి" అంటూ ఇంటికి వచ్చాడు. ఆ



ఇల్లాలు భర్తకు కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు ఇచ్చి, ఆకు వేసి భోజనం పెట్టింది.

గుమ్మం బయట కౌశికుడు అలాగే నిలబడి వున్నాడు.

భర్త భోజనం చెయ్యడం అయ్యిన తర్వాత ఆ ఇల్లాలు కౌశికుడుకి బిక్ష వేయడానికి బయటకు వచ్చి "మిమ్మల్ని చాలాసేపు నిలబెట్టినందుకు క్షమించండి." అని చెప్పింది.

కౌశికుడు కోపంగా "ఎన్నో ఇళ్ళకు వెళ్ళవలసిన నన్ను నిర్లక్ష్యంగా చాలాసేపు నిలబెట్టావు" అన్నాడు.

"మన్నించండి స్వామి. నాభర్తకు ఉపచారాలు చేయడం వలన ఆలశ్యమయ్యింది." అని క్షమాపణ కోరింది.

"భర్తకు సేవలు చేయడం ధర్మమే. కాని ఆ కారణంతో నన్ను అవమానించడం క్షమించరాని నేరం" కోపంగా అన్నాడు.

ఆ ఇల్లాలు "నేను కావాలని ఆలశ్యం చేయలేదు. నాభర్త సేవలో ఉండటం వలన ఆలశ్యమయ్యింది. మీ కోపం నామీద పని చేయదు. మీ చూపులకు క్రిందపడి చావడానికి నేను కొంగను కాను." అంది.

కొంగ గురించి ఆమెకి ఎలా తెలిసిందని కౌశికుడు ఆశ్చర్యపోయి అదే విషయం ఆమెను అడిగాడు.

"స్వామీ! మనిషికి కోపాన్ని మించిన శత్రువు లేదు. కోపమే అన్ని అనర్థాలకూ మూల కారణం. మీరు మిథిలానగరం వెళ్లి ధర్మవ్యాధుని కలవండి. అతను మీకు తగిన మార్గాన్ని చూప గలడు." అని సలహా చెప్పింది.

ఆమె సలహా ప్రకారం కౌశికుడు మిథిలా నగరం వెళ్లి కసాయి దుకాణంలో మాంసం అమ్ముతున్న ధర్మవ్యాధుడిని చూసి ముక్కు మూసుకొని దూరంగా నిలబడ్డాడు. ధర్మ వ్యాధుడే కౌశికుని దగ్గరకు వెళ్లి "మహాత్మా! మహా పతివ్రత అయిన ఆ ఇల్లాలు మిమ్మలిని పంపి వుంటుంది, రండి" అని సాదరంగా ఆహ్వానించాడు.

ఆ ఇల్లాలు తనను పంపిందని ఇతనికెలా తెలుసని కౌశికుడు ఆశ్చర్యపోయాడు. అతడ్ని మరింత ఆశ్చర్యానికి గురిచేస్తూ ధర్మవ్యాధుడు "స్వామీ! మీరు వచ్చిన పని నాకు తెలుసు, దయచేయండి" అంటూ తన ఇంటికి తీసుకెళ్ళి అర్ఘ్యం ఇచ్చాడు. వెంటనే లోపలికి వెళ్లి వృద్ధులైన తన తల్లిదండ్రులకు సపర్యలు చేసాడు. తల్లిదండ్రులకు సేవలు చెయ్యడం పూర్తయ్యాక మళ్ళీ కౌశికుడి వద్దకు వచ్చికూర్చొని కుశల ప్రశ్నలు అడిగాడు.

మాటల మధ్యలో ధర్మవ్యాధుడు "మునీంద్రా! ధర్మం తప్పకుండా చేసే ఏ పనైనా దైవోపాసనే అవుతుంది. బ్రతకడం కోసం ఏదోఒక వృత్తి చేసుకోవడం జీవనధర్మం. తల్లిదండ్రులను పూజించడం, భార్యను ప్రేమగా చూసుకోవడం, తీరిక వేళలో సజ్జనుల సాంగత్యం, అవసరంలో ఉన్నవారికి చేయగలిగిన సహాయం చేయడం – వీటిని మించిన ధర్మం లేదు. అన్ని ప్రాణు లలో, అన్ని వస్తువులలో భగవంతుడు వున్నాడు. భగవంతుడిని నమ్మిన వాళ్ళు ఎప్పటికీ చెడిపోరు. కసాయి దుకాణంలో నైనా, కల్లు దుకాణంలో నైనా చేసేపని ధర్మం తప్పకుండా చేస్తే ముక్తిని పొందవచ్చు." అని వినయంగా చెప్పాడు.

కౌశికుడికి జ్ఞానోదయమయ్యింది. ఇంత కాలంగా తాను నిర్లక్ష్యం చేసిన తల్లిదండ్రుల పట్ల తన బాధ్యత గుర్తించి వెంటనే ఇంటికి బయల్దేరాడు.

✦✦✦

కాబట్టి వేదాంత తత్వజ్ఞానంతో, అధ్యయనాలతో, తీర్థయాత్రలతో, తపస్సుతో పొందే మోక్షాన్ని కర్తవ్యాలను, బాధ్యతలను, వృత్తి లేక వ్యాపారాలను దైవంగా భావించి నిర్వహించడం ద్వారా కూడా పొందవచ్చని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

87

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## కర్తవ్య నిర్వహణలో భాగంగా చేసే పనుల వలన పాపం అంటదు

**శ్లోకం: శ్రేయాన్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।**

**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 18-47 ॥**

భావం: చక్కగా ఆచరించబడిన పర ధర్మము కంటే గుణరహితమైనదైనా స్వధర్మ ఆచరణే మంచిది. స్వధర్మాన్ని నిర్వర్తించే వారికి ఎటువంటి పాపమూ అంటదు.

వివరణ: అర్జునుడు తాను యుద్ధం చేయననటానికి చెప్పిన కారణాలలో "యుద్ధంలో కౌరవులను చంపడం వలన పాపం కలుగుతుంది" అనేది ఒకటి. అందు వలనే శ్రీకృష్ణుడు కర్తవ్య నిర్వహణలో భాగంగా చేసే పనుల వలన ఎటువంటి పాపాలూ అంటుకోవని అర్జునుడికి బోధించాడు.

మనం మన కర్తవ్యాలను నిర్వహించడం వలన కొన్నిసార్లు కొంతమందికి నష్టం కలగచ్చు. సైనికుడు తన దేశసరిహద్దులను కాపాడడంలో భాగంగా శత్రుసైనికులను చంపవలసి వస్తుంది. శాంతిభద్రతలను కాపాడడంలో భాగంగా పోలీసులు ఉగ్రవాదులను చంపవలసివస్తుంది. ఆదాయపుపన్ను అధికారులు పన్నులు చెల్లించడం ఎగ్గొట్టినవాళ్ళని, నల్లదనం సంపాదించినవాళ్ళని కోర్టుల ద్వారా జైళ్ళకు పంపవలసి వస్తుంది. తమ కర్తవ్యాలను నిర్వహించడంలో భాగంగా చేసే పనుల వలన తమకు పాపాలు అంటుకుంటాయేమో అని ఆ అధికారులు భావిస్తే వారు తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించలేరు. ఫలితంగా దేశంలో అవినీతి, నల్లధనం, ఉగ్రవాదం, అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయి ప్రజలు కష్టాల పాలవుతారు. అందుకే భగవద్గీత కర్తవ్య నిర్వహణలో భాగంగా చేసే పనుల వలన ఎటువంటి పాపాలూ అంటుకోవని తెలియజేసింది.

రామాయణం - బాలకాండలో స్త్రీ అయిన తాటకిని చంపడం ధర్మమేనా అని శ్రీరాముడు సందేహించినప్పుడు విశ్వామిత్రుడు - రామా! తాటకి స్త్రీ అని సందేహించకు. పూర్వం అగస్త్య మహర్షి శపించినందువలన కోపముతో, పగతో అగస్త్యుడు తిరిగిన ప్రాంతంలో మనుష్యులు లేకుండా చేస్తోంది. ప్రజల మరియు గోవుల క్షేమం కోసం తాటకిని సంహరించు. నువ్వు తప్ప ముల్లోకములలో మరెవ్వరునూ ఆ రాక్షసిని



చంపలేరు. ధర్మరక్షణ, ప్రజల రక్షణ రాజు కర్తవ్యం. ప్రజల క్షేమం కోసం, దుష్ట శిక్షణ కోసం, ధర్మరక్షణ కోసం ఎవరినైనా చంపవచ్చు. పూర్వము విరోచనుడి కూతురు మంధర భూదే విని చంపదానికి పూనుకొనగా ఇంద్రుడు ఆమెను చంపాడు. భృగుమహర్షి భార్య, శుక్రాచార్యుని తల్లి అయిన 'ఉశన' ఇంద్రాది దేవతలను సంహరించడానికి వ్రతము చేపట్టగా విష్ణువు ఆమెను చంపాడు. కాబట్టి స్త్రీ అని సందేహించ కుండా దుష్టురాలైన తాటకిని సంహరించు." అని చెప్పాడు.

శ్రీరాముడు "అయోధ్యలో నాన్నగారు వశి ష్టుడు మొదలైన గురువుల ఎదుట విశ్వా మిత్రుడు చెప్పినట్లు చెయ్యమని ఆజ్ఞా పించారు. నాన్నగారి ఆజ్ఞ పాటించడం నా కర్తవ్యం. అందువలన విశ్వామిత్రుడి ఆజ్ఞ ప్రకారం తాటకిని చంపుతాను" అని ఆలో చించి తాటకిని సంహరించాడు.

కాబట్టి కర్తవ్య నిర్వహణలో భాగంగా చేసే పనుల వలన కొంతమందికి నష్టం జరగటం వలన పాపం అంటుకుంటుందేమో అనే సంశయాలను ప్రక్కన పెట్టి ధైర్యంగా, నిజాయితీగా కర్తవ్యాలను నిర్వహించమని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-మొండెపు ప్రసాద్

88

# యువతకు భగవద్గీత చూపించిన దారి



శ్లోకం: ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥ 18-63 ॥

భావం: ఈవిధంగా పరమ గోప్యమైన జ్ఞానాన్ని నీకు చెప్పాను. ఈ జ్ఞానమును సమగ్రంగా పరిశీలించి నీకు నచ్చిన నిర్ణయం తీసుకో.

## వివరణ

అర్జునుడుకి భగవద్గీతను సమగ్రంగా బోధించిన తర్వాత శ్రీకృష్ణుడు "నీ అనుమానాలన్నీ తీర్చాను, ఇంక లేచి యుద్ధం చెయ్యి" అనలేదు. "నేను చెప్పిన విషయాలను సమగ్రంగా పరిశీలించి, ఆలోచించి నీకు నచ్చిన నిర్ణయం తీసుకో" అన్నాడు. అర్జునుడు శ్రీకృష్ణుడి మాట ఎన్నడూ కాదనడు. ఆ విషయం శ్రీకృష్ణుడికి కూడా తెలుసు. అయినా శ్రీకృష్ణుడు అర్జునుడి తరపున నిర్ణయం తీసుకోలేదు. అర్జునుడికి విషయాన్ని సమగ్రంగా వివరించి "నీకు నచ్చిన నిర్ణయం తీసుకో" అన్నాడు.

అలాగే ఎవరైనా మిమ్మల్ని ఏ విషయంలోనైనా సలహా అడిగినప్పుడు సలహా మాత్రమే ఇవ్వండి, వారి తరపున నిర్ణయం తీసుకోకండి. ఇతరుల తరపున నిర్ణయాలు తీసుకుంటే కలిగే నష్టాల గురించి కొన్ని ఉదాహరణలు చదువుదాము.

## వివరించండి – నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛనివ్వండి

బైపిసి చదివిన రాజుకి నీట్ పరిక్షలో మంచి ర్యాంకు రాకపోవడం వలన ఎం.బి.బి.ఎస్ సీటు రీలేదు. లాంగ్ టెర్మ్ కోచింగు తీసుకొని మరో సారి రాసినా సీటు రాకపోవడంతో బి.ఎస్.సిలో చేరాడు. అవకాశం దొరికినప్పుడల్లా నేను ఇంజనీరింగ్ చదువుతానంటే వినకుండా బైపీసీలో జాయిన్ చేసి నా జీవితం నాశనం చేసారని తన పరాజయానికి తల్లిదండ్రులని బాధ్యులు చేస్తూ మాట్లాడతాడు.

వేణు కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివి ఒక మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వర్కింగ్ అవర్స్ (పనిచేసే సమయం) పెరగటం వలన, పనిలోని ఒత్తిడి వలన రాత్రి డిన్నర్ సమయానికి ఆఫీసు నుండి ఇంటికి నీరసంగా వస్తాడు. అవకాశం దొరికినప్పుడల్లా "నేను మెడిసిన్ చదువుతానంటే మెడిసిన్ సీటు తెచ్చుకోవడం కష్టం, ఇంజనీరింగ్ సీటు తెచ్చుకోవడం ఈజీ అని ఇంజనీరింగ్ చదివించారు. గంటలు గంటలు కంప్యూటర్ డబ్బా ముందు కూర్చుని అదేపనిగా పనిచెయ్యాలంటే విసుగొస్తోంది. నా ఇష్ట ప్రకారం మెడిసిన్ చదివించి ఉంటే నా జీవితం హాయిగా ఉండేది." అంటూ తన ఉద్యోగంలోని కష్టాలకు తల్లిదండ్రులని బాధ్యులు చేస్తూ మాట్లాడతాడు.

బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తున్న మోనిక తన కొలీగుని పెళ్ళిచేసుకోవాలని అనుకుంది. కాని

తల్లిదండ్రులు ఆమె జీవితం బాగుండాలని ఆమెని గ్రూప్ వన్ ఆఫీసరుకి ఇచ్చి పెళ్లి చేసారు. మోనిక కొడుకు ఇప్పుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇప్పటికీ అవకాశం దొరికి నప్పుడల్లా మోనిక "కొలీగుని పెళ్ళిచేసుకొని ఉంటే నా జీవితంలో ఫ్రీడం, ఆనందం ఉండేవి. ఇప్పుడు నాకు డబ్బు మాత్రమే ఉంది, సంతోషం లేదు. ఆయన బిజీ షెడ్యూల్ వలన సరదా అంటే ఏమిటో తెలియకుండానే నా జీవితం అయిపోతోంది." అంటూ తన జీవితంలోని వెలితికి తల్లిదండ్రులను బాధ్యులు చేస్తూ మాట్లాడుతుంది.

ఇవి మనలో చాలామంది ఇళ్ళలో జరిగే విషయాలే. పైన చెప్పిన మూడు ఉదాహరణలలో తల్లిదండ్రులు పిల్లల జీవితాలు బాగుండాలనే అభిప్రాయంతో, అప్పుడున్న పరిస్థితులను బట్టి మంచి నిర్ణయాలు తీసుకున్నారు. కాని సొంత పిల్లలే ఆ నిర్ణయాలు తీసుకున్నందుకు తల్లిదండ్రులను తప్పుపట్టారు.

✦ ✦ ✦

శ్రీను సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష వ్రాయబోతున్నాడు. పరీక్షకు రెండు రోజుల ముందు శ్రీనుకు ప్రిలిమినరీ పరీక్షలో విజయం సాధించడానికి తన ప్రేపరేషన్ సరి పోదని అనిపించింది. ఏమిచెయ్యాలో పాలు పోక చాలా పోటీ పరీక్షలు రాసిన అనుభవ మున్న బంధువు వాసుని సలహా అడిగాడు. "సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష చాలా కష్టంగా ఉంటుంది. ప్యాస్ అవ్వగలననే నమ్మకం లేకుండా వ్రాస్తే సెలెక్ట్ కాలేవు. అనవసరంగా ఒక చాన్స్ వేస్ట్ అవుతుంది. కాబట్టి ఈ సంవత్సరం వ్రాయకు. ఇంకా బాగా ప్రిపేర్ అయ్యి వచ్చే సంవత్సరం వ్రాయి." అని సలహా ఇచ్చాడు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు



వచ్చాక శ్రీను వాసు వద్దకు వెళ్లి "పరీక్ష చాలా ఈజీగా ఉంది. నాకంటే చెత్తగా చదివే నా ఫ్రెండ్స్ కూడా సెలక్ట్ అయ్యారు. నేను కూడా రాసి ఉండాల్సింది." అన్నాడు.

ఇప్పుడు సలహా మార్చితే ఏమవుతుందో చూద్దాం.

వాసు "కష్టమైన పరీక్ష మొదటిసారి వ్రాస్తున్నప్పుడు ప్యాస్ అవ్వలేనేమో అని భయం కలగడం సహజం. ధైర్యంగా వెళ్లి వ్రాయి." అని సలహా ఇచ్చాడు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు వచ్చాక శ్రీను వాసు వద్దకు వెళ్లి "నేను ప్యాస్ అవ్వలేదు. ప్రిపరేషన్ సరిపోలేదని అనుకున్న నా ఫ్రెండ్స్ పరీక్ష వ్రాయకుండా ఛాన్స్ మిగుల్చుకున్నారు. నాకు ఒక చాన్స్ వేస్ట్ అయ్యింది." అన్నాడు.

✦ ✦ ✦

కాబట్టి ఎవరైనా సలహా అడిగితే, మీరు సలహా ఇవ్వాలనుకుంటే pros and cons (లాభనష్టాలు) వివరించండి. విషయం వారికి పూర్తిగా అర్థమయ్యేలా వివ రించండి. కాని నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛను మాత్రం వారికే వదిలిపెట్టండి అని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

89

# యువతకు భగవద్గీత చూపించిన దారి



**శ్లోకం: అర్జున ఉవాచ ।**

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**

**స్థితోస్మి గతసన్దేహః కరిష్యే వచనం తవ ॥ 18-73 ॥**


భావం: అచ్యుతా! నీ అనుగ్రహము వలన నా మోహము తొలగిపోయింది. సందేహాలు తీరిపోయాయి. కాబట్టి నీ ఆజ్ఞను శిరసా వహిస్తాను.

వివరణ:

సంశయం, అనుమానం, భయం మనల్ని నిర్వీర్యం చేసే జబ్బులు. అవి మన బలహీనతలను, చేతగానితనాన్ని ఎత్తిచూపుతాయి. మన శక్తిసామర్థ్యాలను మనకు తెలియ నీయకుండా చేస్తాయి.

దోమలు, ఈగలు, పురుగులు, సూక్ష్మ జీవులు మురికి ప్రదేశాలలో పెరిగినట్లుగానే సంశయాలు, అనుమానాలు, భయాలు కూడా

## సంశయం తీరితే నిర్ణయం సులభం



అజ్ఞానంతో నిండి ఉన్న మనసులలోనే పెరుగుతాయి.

ఏదైనా ఒక విషయం గురించి గాని, అనేక విషయాల గురించి గాని, వాటి పర్యవసానాల గురించి గాని, చేయబోతున్న పనుల వలన సంభవించే పరిణామాల గురించి గాని తెలియనితనమే సంశయాలను, అనుమానా లను, భయాలను కలుగజేస్తుంది. విషయ అవగాహన



లేని చోటే సంశయం, అనుమానం, భయం ఉంటాయి. విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే సంశయం, అనుమానం తీరిపోయి భయం మీనుండి పారిపోతుంది. ఎక్కడ విషయ అవగాహన ఉంటుందో అక్కడ సంశయం, అనుమానం, భయం ఉండవు. మనం భయపడుతున్న దాని గురించి పూర్తి వివరాలు తెలుసుకొని సంశయాలు, అనుమానాలు తీర్చుకోవడమే భయాన్ని జయించడానికి ఉత్తమమైన మార్గం. ఆ తర్వాత మీకు అదంటే భయం ఉండదు.

చేస్తున్న పనిలో విజయం సాధించలేనేమో, ఆటంకాలు ఎదురౌతాయేమో అనే సంశయం కలిగితే మనిషి అడుగు ముందుకు వేయలేడు, వెనుకకూ పోలేడు. చేస్తున్న పని చెయ్యడు, క్రొత్తపని మొదలుపెట్టడు. ఫలితంగా విలువైన సమయం వృధా అవుతుంది. కాబట్టి సంశయం కలిగినప్పుడు ఆ రంగంలోని నిపుణులను అడిగి గాని, ఆ సబ్జెక్టు గురించి పుస్తకాలు చదివి గాని, ఇంటర్నెట్లో వెతికి గాని సంశయం తీర్చుకోవాలి. సంశయాలు, అనుమానాలు తీరితే భయపడకుండా సరైన నిర్ణయం తీసుకొని, ధైర్యంగా ముందుకు వెళ్ళి విజయం సాధించగలుగుతాము.

ఏవిషయం గురించి అయినా సంశయాలు, అనుమానాలు, భయాలు కలిగినప్పుడు దాని గురించి పూర్తి వివరాలు తెలుసుకొని సంశయాలు, అనుమానాలు తీర్చుకుంటే సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతామని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు. ✦



-మొండెపు ప్రసాద్

90

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడ

**శ్లోకం: యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతి ర్మతిర్మమ ॥ 18-78 ॥**

భావము: దృతరాష్ట్ర మహారాజా! యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు, గాండీవ ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడ ఉంటే అక్కడ సర్వవిజయములు, సకలైశ్వర్యములు, సుస్థిరమైన నీతి ఉంటాయని నా నిశ్చితాభిప్రాయము.

వివరణ: శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడ సర్వవిజయాలు, సకలైశ్వర్యాలు ఉంటాయనడంలో సందేహం లేదు. కాని ధర్మం, సత్యం, న్యాయం ఎక్కడ ఉంటే శ్రీకృష్ణుడు అక్కడ ఉంటాడు.

పాండవులు ధర్మం వైపు ఉన్నారు. ధర్మమే తమను రక్షిస్తుందని నమ్మారు. అదెలాగో తెలుసుకుందాము

ధర్మరాజు పంపిన ద్రుపద పురోహితుడి రాయభారానికి బదులుగా దృతరాష్ట్రుడు సంజయుడిని రాయభారిగా పంపాడు. సంజయుడు చెప్పిన దృతరాష్ట్రుడి రాయభారాన్ని వినిన తర్వాత శ్రీకృష్ణుడు "పాండవుల రాజ్యభాగం వారికి ఇచ్చి దృతరాష్ట్రుడు పాండవులను కూడా తన కొడుకులతో సమానంగా చూడటం న్యాయం. వారికి సమ్మతం అయినా కాకపోయినా చెప్పడం మా ధర్మం కాబట్టి నేను మీ ప్రభువు వద్దకు వచ్చి మాట్లాడతాను. నామాటలు వింటే నాలుగు కాలాల పాటు సుఖంగా వుంటారు. వినకపోతే వారి లోభానికి వారే బలవుతారు." అన్నాడు.

తర్వాత సంజయుడు "ధర్మరాజా! ఈ సమస్యను పరిష్కరించడానికి వాసుదేవుడు స్వయంగా పూనుకున్నాడు. అంతకన్నా కావలిసినది ఏముంది? నేను వచ్చిన పని సఫలమయ్యిందని భావించి సెలవు తీసుకుంటాను. నేను అనుచితంగా మాట్లాడలేదు కదా?" అన్నాడు.

"ఇటువంటి పనులు నిర్వహించడానికి నువ్వు, విదురుడు తగినవారు" అని చెప్పి ధర్మరాజు హస్తినాపురంలో వున్న పెద్దలకు, పిన్నలకు, రాజలోకానికి, పరివారానికి తగిన

బహుమతులు ఇచ్చి అతడిని సగౌరవంగా సాగనంపుతూ దృతరాష్ట్రుడు కొలువు తీరి వుండగా దృతరాష్ట్రుడికి, భీష్మునికి, దుర్యోధనుడికి చెప్పమని కొన్ని మాటలు ఈ క్రింది విధంగా చెప్పాడు.

"కొలువులో వున్నవాళ్ళు అందరూ వినేటట్లు దుర్యోధనుడితో - అత్యంత బలశాలులైన పాండవులను మోసంతో బలహీనుల వలె రాజ్యము నుండి బయటకి గెంటివేసినా, చాలా కాలం అడవులలో కొండలలో బాధలకు గురి చేసినా, పాంచాలిని నిండు కొలువులో అవమానించినా ధర్మరాజు సహించాడు కాబట్టే కురుకుమారులు బ్రతికి వున్నారు. ఇది నిజం. ఇప్పుడు యుద్ధాన్ని కోరి వారిని రణరంగానికి బలిచేయద్దు. ఇతరుల సొమ్ముకు ఆశపడద్దు. మా రాజ్యభాగం మాకిచ్చి కలిసి బ్రతకటం మంచిది. మేము యుద్ధాన్ని కోరకుండా సంధి కోరడం తనకే మంచిది. తన మనసులోని దురాశను, దురాలోచనలను తప్పని చెప్పే ప్రయత్నం అక్కడ ఎవ్వరూ చెయ్యరు. అందుకే నేను బుద్ధి చెప్పవలసి వచ్చింది. తన వద్ద వున్నంతమంది మహావీరులు మరెక్కడా లేరన్న మాట నిజం. కాని మావైపు ధర్మం వుంది. అఖిల లోక సేవితుడైన శ్రీకృష్ణుడు మాకు రక్షగా వున్నాడు. కాబట్టి మమ్మల్ని గెలవటం తనకు సాధ్యం కాదని చెప్పు."

రాయభారం ముగించి వెనక్కి వెళ్ళిన సంజయుడు కౌరవసభలో తన రాయభార విశేషాలు చెప్తూ "అర్జునుడు, సంజయా! ఇంత వరకు మాకు అన్యాయాలు చేసిన కౌరవులకు



దేవతలు సాయపడినా కూడా మేమే విజయం సాధించాలి. అలాకాక వారు విజయం సాధిస్తే లోకంలో ధర్మానికి స్థానం లేదని తెలుసుకుం టాము. వాసుదేవుని సహాయంతో మేము యుద్ధానికి వస్తున్నాము. ఎదుట ఎవరున్నా మాకు భయం లేదు." అన్నాడని వివరించాడు.

ఆవిధంగా ధర్మానికి రూపమైన ధర్మరాజు సారధ్యంలో పాండవులు ధర్మాన్ని ఆచరించారు, రక్షించారు. అందుకే దేవదేవుడైన శ్రీకృష్ణుడు పాండవ పక్షాన నిలబడి దుష్ట శిక్షణ, ధర్మ రక్షణ చేయించి యుద్ధంలో పాండవులను గెలిపిం చాడు. కాబట్టి ధర్మం వైపు ఉంటే విజయం తధ్యం అని, అధర్మం వైపు ఉంటే పరాజయం మరియు శిక్ష తప్పదని భగవద్గీత నుండి మనం నేర్చుకోవచ్చు.

✦



-ముండెపు ప్రసాద్

91

# యువతకు భగవద్గీత చూపించిన దారి



## ముగింపు

**యోగవాసిష్టము (55:35) లో చెప్పినట్లు వింధ్య పర్వతం పగిలిపోయే అంతటి ప్రళయ వాయువు వీచినా ధైర్యవంతులు తమ కర్తవ్యాలను వదిలివేయరు. కాబట్టి కర్తవ్య నిర్వహణలో ఎన్ని కష్టాలు కలిగినా, అంతులేని అవరోధాలు అడ్డు వచ్చినా, ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా ధైర్యంతో, నిజాయితీతో కర్తవ్యాలను నిర్వహించాలి.**

మనసుంటే సమయం దొరుకుతుంది.

మనలో చాలా మంది, నాకు భగవద్గీత చదవాలని వుంది, కాని సమయం దొరకడం లేదు. ఉదయం లేవగానే మార్నింగ్ వాక్, ఆ తర్వాత స్నానం చేసి టిఫిన్ తినేసరికి ఆఫీసుకు బయల్దేరాల్సిన సమయం అవుతుంది. ఆఫీసుకు వెళ్తే మళ్ళీ ఇంటికొచ్చేసరికి రాత్రి అవుతుంది. ఆదివారాలు ఇంటి పనులతో బిజీబీ చదవాలని వున్నా సమయం దొరకడంలేదు అంటుంటారు.

కాని ప్రతీరోజూ ఫ్రెండ్స్ అందరికీ వాట్సప్‌లో, ఫేస్ బుక్‌లో గుడ్ మార్నింగ్ మెసేజ్‌లు పంపడానికి, తనకు వచ్చిన మెసేజ్‌లు చదవడానికి, వీడియోలు చూడడానికి సమయం దొరుకుతున్నప్పుడు, చదవాలనుకున్న భగవద్గీత పుస్తకంలో రోజుకి రెండు మూడు పేజీలు చదవడానికి సమయం ఎందుకు దొరకదు? రోజుకి రెండు మూడు పేజీలు చొప్పున చదివినా కొన్నాళ్ళకి పుస్తకం చదవడం పూర్తవుతుంది కదా!

భగవద్గీత చదవాలనే కోరిక బలంగా ఉంటే చదవడానికి సమయం తప్పకుండా దొరుకుతుందని గాంధీగారు ‘ఆత్మకథ’ (నాలుగవ భాగం - అధ్యాయం 5 - నిరీక్షణకు ఫలితం)లో తన సొంత అనుభవంతో ఈక్రింది విధంగా తెలియజేశారు:

“గీతాధ్యయనం చేయాలనే కోరిక కలిగింది. ప్రతీరోజూ ఒకటి రెండు శ్లోకాలు కంఠస్థం చేయాలని నిర్ణయించుకున్నాను. ఉదయం ముఖం కడుక్కొనేటప్పుడు, స్నానం చేసేటప్పుడు గీతా శ్లోకాలు కంఠస్థం చేయసాగాను. దంతధావనమునకు 15 నిముషాలు, స్నానానికి 20 నిముషాలు పట్టేది. దంతధావనం ఆంగ్లేయుల పద్ధతిలో నిలబడి చేసేవాడిని. ఎదురుగా ఉన్న గోడ మీద గీతా శ్లోకాలు వ్రాసి అంటించి, సమయం దొరికినప్పుడల్లా వాటిని బట్టీ వేయసాగాను.

అలా బట్టీ వేసిన సంస్కృత శ్లోకాలు స్నానం చేసేసరికి నోటికి వచ్చేసేవి. ఆ సమయంలోనే మొదటి నుండి అప్పటివరకూ బట్టీ పట్టిన శ్లోకాలను తిరిగి స్మరణం చేసుకొని నెమరువేసు కొనేవాడిని. ఆ విధంగా 13 అధ్యాయాలు కంటస్థం చేసిన సంగతి నాకు గుర్తుంది."

## మీలోని శక్తిసామర్థ్యాలను గుర్తించండి

"కరెంటు మన ఇంట్లో మాత్రమే లేదు. పక్కింట్లో, ఎదురింట్లో ఉంది. ఫ్యూజ్ కొట్టేసి ఉంటుంది చూడండి." భార్య భర్తతో చెప్పింది.

"చీకట్లో ఫ్యూజ్ వెయ్యడం కుదరదు. టార్చిలైటు తీసుకురా" భర్త మోహన్ చెప్పాడు.

"మనింట్లో టార్చిలైటు లేదు. పక్కింటికి వెళ్లి తీసుకురండి" భార్య చెప్పింది.

మోహన్ పక్కింటికి వెళ్లి టార్చిలైటు ఇవ్వమని అడిగాడు. మోహన్ షర్టు పోకెట్లో ఉన్న మొబైల్ ఫోనుని చూసిన పక్కింటాయన "మీ పోకేట్లో ఉన్న మొబైల్ ఫోన్లో టార్చిలైటు ఉండగా టార్చిలైటు కోసం వేరేచోట ఎందుకు వెతుకుతున్నారు?" అన్నాడు.

మనలో చాలామంది ఆ దంపతులలాగే మనలో ఉన్న శక్తిసామర్థ్యాలను, మన వద్ద ఉన్న పనిముట్లను గుర్తించకుండా మనవద్ద ఇతరుల వద్ద ఉన్న వనరులు ఏవో లేవని భావించి వాటిని సమకూర్చుకోడానికి ప్రయ త్నిస్తుంటారు.

మీరు ఆ దంపతులలా కాకుండా మీలోని శక్తిసామర్థ్యాలను గుర్తించి వాటిని సమర్థ వంతంగా ఉపయోగించి విజయాలు సాధిం చండి.




చదివి తెలుసుకున్నది ఆచరణలో పెట్టండి:

మనలో చాలామందికి విజయాలు సాధించడానికి ఏమి చెయ్యాలో తెలుసుకాని అలా చెయ్యము. విజయసూత్రాలు తెలిసినా వాటిని ఆచరణలో పెట్టకపోతే విజయం సాధించలేము. అలాగే భగవద్గీతలో చెప్పిన విషయాలను ఆచరించకుండా ఎన్నిసార్లు చదివినా భగవద్గీతలో చెప్పిన విషయాల పట్ల అవగాహన మాత్రమే కలుగుతుంది గాని ఫలితం లభించదు.

మీ చేతిలోని భగవద్గీత పుస్తకాన్ని శ్రీకృష్ణుడిగా భావించండి. మిమ్మల్ని అర్జు నుడుగా ఊహించుకొని భగవద్గీత పుస్తకాన్ని చదవండి. మీ వ్యక్తిత్వాలను వికసింప చేసుకోండి. అద్భుతమైన విజయాలు సాధిం చండి.

(అయిపోయింది)